బాబా

... పని పూనిన మనిషి

కె. బాలాజి

సునయన క్రియేషన్స్

40, జె.సి. ఇండస్ట్రియల్ లే అవుట్,

కనకపుర రోడ్,

బెంగుళూరు-560062.

BABA

...pani poonina manishi (Telugu)

Author	:	**K. Balaji**
©	:	Publishers
First Edition	:	February, 2011
Copies	:	**Sunayana Creations** 40, J. C. Industrial Layout Kanakapura Road Bengaluru - 560062
Cover Design	:	
DTP	:	Padma M
Page Setting	:	Fontline Graphics
Printing	:	
Price	:	**Rs. 180**

అంకితం

చిన్నస్వామిరాజుగారి జీవితానికి
దారి చూపిన వాళ్ళ పెద్దన్న
సదా స్మరణీయుడు, దైవ స్వరూపుడైన
స్వర్గీయ అక్కలరాజు కుప్పరాజుగారి
దివ్య స్మృతికి.......

నా మాట

ఏ వ్యక్తి జీవితంలో అయినా 80వ పుట్టిన రోజు చాలా ప్రత్యేకమైంది. ఆ వ్యక్తి సుదీర్ఘ జీవిత రహదారిలో అది ఒక ముఖ్యమైన మైలురాయి అని చెప్పొచ్చు. ఒక వ్యక్తి జీవితంలో అట్టడుగుస్థాయి నుంచి పైకొచ్చి, విజయపు శిఖరాల్ని చేరుకొని గణనీయమైన సంపదను సృష్టించాడు అనుకోండి... అలాంటి వ్యక్తికి 80 ఏళ్ళు వస్తే ఎలా వుంటుంది? చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటుంది.

ఈ పుస్తకం చిన్నస్వామిరాజు గారి గురించి చెబుతుంది. బెంగుళూరులో ఏట్రియా గ్రూపుకు చాలా పాపులారిటీ వుంది. ఆ గ్రూపు అధిపతే చిన్నస్వామిరాజు గారు. ఈ ఫిబ్రవరి (2011) ఆరవ తేదీకి ఆయన 81వ సం॥లోకి అడుగుపెడుతున్నారు.

సరిగ్గా ఇలాంటి సందర్భంలోనే ఆయన జీవితం గురించి అనేక అంశాల్ని వెలికి తీసే పుస్తకాన్ని తీసుకు రావాల్సిన అవసరం వుందని నా అభిప్రాయం. అందుకనే ఈ పుస్తకం తీసుకొని రావాలని నేను, నా మిత్రుడు, బిజినెస్ పార్టనర్ రాయుడు కలసి చిన్నస్వామిరాజుగారిని ఒప్పించాము. ఆయన సహకారంతో ఈ పుస్తకాన్ని తెస్తున్నాము. ఈ పుస్తకంలో ఆయన సాధించిన విజయాలతో పాటు, చవిచూసిన ఫెయిల్యూర్స్ కూడా వుంటాయి. ఆయన శ్రేయోభిలాషులతో పాటు విమర్శకుల గళాలకు కూడా చోటు వుంది.

చాలా మంది తమ జీవితాల్ని జీరో పాయింట్ దగ్గర మొదలు పెడతారు. అయితే అందులో కొద్దిమంది మాత్రమే విజయం సాధిస్తారు. నా దృష్టిలో విజయం అంటే అర్థం, వాళ్ళు సృష్టించిన సంపద పరిమాణం, సంపాదించిన పేరు ప్రఖ్యాతులు, వాళ్ళు చేపట్టిన సామాజిక సేవాకార్యక్రమాలు.

జీవితంలో విజయం సాధించలేకపోయిన వారి గురించి తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యమే. అలాంటి వారి జీవితాల్లోంచి నేర్చుకోవాల్సింది చాలా వుంటుంది. అయితే, ప్రజల్లో సక్సెస్ స్టోరీలకు వుండే క్రేజ్, ఫెయిల్యూర్ స్టోరీలకు వుండదు. కానీ నా దృష్టిలో మాత్రం ఫెయిల్యూర్ స్టోరీలు మనకు చాలా బాగా ఉపయోగపడుతాయి.

చిన్నస్వామిరాజు గారి గురించి ఇలా రాసే అవకాశం దొరకడం చాలా ఆనందంగా వుంది నాకు. కానీ, ఆయన గురించి మొక్కుబడిగా నాలుగు పొగడ్తలు రాయటం నాకు ఇష్టం లేదు. "శ్రీ రాజుగారు చాలా అసాధారణమైన వ్యక్తి. అత్యంత సమర్థుడు. ఉన్నత సంస్కారి. ఇలాంటి వ్యక్తి గురించి రాస్తున్నందుకు నాకు ఎనలేని ఆనందం"– ఇలా చెప్పదలచుకోలేదు నేను.

ఇవాళ వున్న పరిస్థితులలో, అంత సుదీర్ఘ జీవితంలో ఎవరూ అందరికీ మంచివారు కాలేరు. ఏ వ్యక్తికయినా కేవలం అభిమానులు మాత్రమే వుండరు. వ్యతిరేకులు కూడా వుంటారు. దేవుడ్నయినా, ఆయన వల్ల లాభం లేకుండా ఎవరూ పొగడరు.

చిన్నస్వామిరాజు గారు కూడా అందరిలాగే ఒక సాధారణ వ్యక్తి. ఆయనలో కొన్ని పరిమితులు, పాజిటివ్ అంశాలు, ఎమోషన్లు– అన్నీ వున్నాయి. ఈ పుస్తకంలో ఆయన హీరో కాదు. కేవలం ప్రధాన పాత్ర మాత్రమే. ఆయన తన జీవితాన్ని క్రింది స్థాయిలో మొదలుపెట్టారు. ఆ క్రమంలో చాలా ఎదురు దెబ్బలు తిన్నారు. ఆయన దారిలో ఎన్నో అడ్డంకులు. చదువుకొనే అవకాశం లేదు. అవసరమైన వనరులేవీ ఆయనకు అందుబాటులో లేవు. తనని తాను ప్రమోట్ చేసుకొనే తెలివితేటలు లేవు. జీవితంలో ఒంటరిగానే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. తాను సాధించాల్సిన దాని గురించి ఆయనకు స్పష్టత లేదు. భవిష్యత్తుకు సంబంధించిన ప్రణాళికలుగానీ, లక్ష్యాలు గానీ లేవు. ఆయనది కేవలం వునికి కోసం జరిపిన పోరాటం. ఆయన ఏ దారినీ వెతుక్కుంటూ పోలేదు. ఎదురైన దారిలో నడుచుకుంటూ పోయారు. ఏది అందితే దాన్ని పట్టుకొన్నాడు. ఆయనలో కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఆశావాదం, కష్టించి పనిచేసే గుణం, ఎటువంటి వ్యాపారన్నయినా అర్థం చేసుకోగల నేర్పు, పట్టువీడని తత్వం. ఇవాళ్టి వ్యక్తిత్వ వికాస భాషలో చెప్పాలంటే, విజయానికి కావాల్సిన వ్యూహం ఆయన దగ్గర లేదు. ముందస్తు ప్రణాళిక లేదు. అయితే, ఆయన ఏ పని మొదలు పెట్టినా, దాన్ని గూర్చి క్షుణ్ణంగా తెలుసుకొంటారు. సాధ్యమైతే ఆ పనిని మెరుగ్గా చేయడానికి కృషి చేస్తారు. ఆయన ఒక్కో మెట్టే ఎక్కుతారు. ఒకేసారి పైకి ఎదిగిపోవాలని ఆయనకు లేదు. అందుకనే తన జీవితంలో పెద్ద గెంతులేవీ లేవు. ఏ వ్యాపారాన్నయినా స్వంత అనుభవం ద్వారానే నేర్చుకుంటారు. ఆయన ఇప్పటి వరకు ఒక పుస్తకం కూడా చదవలేదు. ఈ ప్రపంచమే ఆయన బడి. జీవితంలో ఎదురయిన ప్రతి సంఘటనా, సందర్భమూ ఆయనకు ఒక పాఠం.

గతకాలపు అనుభవాల వల్ల, ఆయన ప్రతి అడుగూ చాలా జాగ్రత్తగా వేస్తారు. గుడ్లను పొదగక ముందే పిల్లల్ని లెక్కపెట్టే రకం కాదు ఆయన. ఆయన జీవితాన్ని మలచిన తొలి సంవత్సరాల

గురించి నాకు తెలియదు. అయితే ఆయనతో విలువైన సమయం గడిపాను కాబట్టి, ఆయన ఒక సమగ్రమైన వ్యాపారవేత్త అని చెప్పగలను. ఏ కొత్త వ్యాపారం మొదలు పెట్టినా, అందులో ఆయన ఫెయిల్ కాడని చెప్పగలను. ఎందుకంటే, ఆయన ఒక వ్యాపారాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకోకుండా, అందులో ప్రత్యక్ష అనుభవం సంపాదించకుండా ఆ వ్యాపారాన్ని మొదలుపెట్టరు. ఆయనలో స్పష్టంగా కనిపించే మరో లక్షణం ఏమిటంటే వ్యాపారంలోకి తన పర్సనల్ ఎమోషన్స్‌ను తీసుకురారు. ఆయన వ్యక్తిగత జీవితంలో ఆయనకు ఎమోషన్స్ వున్నాయి. అయితే వాటిని వ్యాపారంలో కలపరు. వ్యాపారంలో ఎవరైనా లాభాన్నే ఆశిస్తారు. ఆయనా అంతే. లాభం లేకుండా ఏ వ్యాపారంలోనూ దిగరు.

సూటిగా చెప్పాలంటే పైకి ఆయన ఒక కొబ్బరి కాయలా కఠినంగా కనిపిస్తారు. కానీ, లోపల మాత్రం లేత కొబ్బరిలా సున్నితంగా వుంటారు. అయితే, అదంతా వ్యాపారానికి బయట మాత్రమే. వ్యాపారానికీ– ఎమోషన్స్‌కూ మధ్య వున్న సంబంధాన్ని ఆయన బాగా అర్థం చేసుకొన్నారు.

ఆయనలో నేను గమనించిన మరో అంశం ఏమిటంటే, ఎవరైనా ఆయనతో కూర్చుని సరదాగా కబుర్లు చెబుతుంటే ఆయనకు చాలా ఇష్టం. అలాంటి వాళ్ళతో గడపడానికి ఆయన ఇష్టపడతారు. వాళ్ళతో బాగా రిలాక్స్ అవుతారు. అయితే, ఆ సాన్నిహిత్యాన్ని ఎవరైనా తప్పుగా అర్థం చేసుకొని, తమ స్వంత ప్రయోజనాల కోసం వాడుకోవాలని ప్రయత్నిస్తే మాత్రం అది బెడిసి కొడుతుంది.

ఎదుటి వాళ్ళను అర్థం చేసుకోవడంలో ఆయనకు చాలా టాలెంట్ వుంది. ఒక వ్యక్తి జీవితంలో సాధించిన విజయాల్ని బట్టి, పనిలో సామర్థ్యాన్ని బట్టి మాత్రమే ఆ వ్యక్తికి ఆయన మర్యాద ఇస్తారు. ఆయనతో వ్యక్తిగతంగా చాలా క్లోజ్‌గా వున్న చాలా మంది, ఆయన నుంచి తమ వ్యాపారాలకు సహాయాన్ని పొందలేకపోయారు. అలాంటి వారు చాలా మంది తెలుసు నాకు.

ఆయనను విమర్శనాత్మకంగా చూసినపుడు కొన్ని విషయాలు చెప్పాలి. ఆయన ఒక సింగిల్ మ్యాన్ ఆర్మీ. వేరే వాళ్ళకు బాధ్యతల్ని అప్పచెప్పడానికి ఇష్టపడరు. అతి జాగ్రత్త పరులు. నిర్ణయాలు తీసుకోవడానికి చాలా సమయం తీసుకుంటారు.

ఆయన్లో వున్న మంచి లక్షణం ఏమిటంటే, ఇచ్చిన మాటకు కట్టుబడి వుండటం. ఆయన ఒకసారి మాట ఇస్తే, ఇక దాన్నుంచి వెనక్కి వెళ్లరు. 80 ఏళ్ళ వయసులో కూడా ఆయన ఎటువంటి కొత్త బిజినెస్‌నయినా మొదలుపెట్టి, దాన్ని సమర్థవంతంగా నిర్వహించగలరు.

సుమారు 70 ఏళ్ళ క్రితం ఎద్దులబండి తోలడంతో ప్రారంభించి, అనేక విజయ శిఖరాల్ని అధిరోహించేందుకు ఆయన చేసిన ప్రయాణం అందరికీ ఆసక్తిదాయకంగా వుంటుంది.

జీవితంలో విజయం సాధించాలనుకొనేవాళ్ళకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని నా నమ్మకం. చిన్నస్వామిరాజు గారి జీవిత అనుభవాల నుంచి వాళ్ళు ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. వాళ్ళకు ఆయన జీవితం ఒక ఇన్స్పిరేషన్ అవుతుంది.

చిన్నస్వామిరాజు గారు నూరేళ్ళు అద్భుతమైన జీవితం గడపాలనీ, తన శక్తి సామార్థ్యాలతో అనేక మందికి ప్రేరణగా నిలవాలని నేను దేవుడ్ని ప్రార్థిస్తున్నాను.

నాగేష్ వంగల

చిత్రా ఎలక్ట్రానిక్స్

ఒక మాట.....

మిత్రులు రాయుడు, నాగేష్ చిన్నస్వామిరాజు గురించి పుస్తకం రాయమని, డాక్యుమెంటరీ ఫిలిం తీయమని నన్ను అడిగారు. అప్పటికే ఆయన్ను గూర్చి అనేక కథలు విని వున్నాను.

ఈ ప్రాజెక్టుకు అవసరమైన సమాచార సేకరణ కోసం చిన్న స్వామిరాజును అనేక సార్లు కలిశాను. సుమారు 20 గంటల పాటు ఆయన తన జీవితాన్ని గురించి చెప్పిన అనేక విషయాల్ని రికార్డు చేశాను. ఆయనతో మాట్లాడుతున్న కొద్దీ ఆయన పట్ల నాకు ఆసక్తి పెరిగింది.

ఆయనతో పరిచయం నాకు ఒక మంచి అనుభవాన్ని ఇచ్చింది. ఆయన జ్ఞాపకాల్లోకి ఆయనతో పాటు నేనూ కలసి ప్రయాణించడం ఒక ఉద్వేగపూరిత అనుభవం నాకు.

ఒక వ్యక్తి ఇంత సుదీర్ఘకాలం పాటు పనిచేసుకుంటూ పోగలడా? ఒక వ్యక్తిలో ఇంత క్రమశిక్షణ ఎలా సాధ్యం? ఇంత స్వీయ నియంత్రణ ఎలా సాధించాడు? బయటి ప్రభావాలకు దూరంగా ఎలా వున్నాడు?– ఇవన్నీ నన్ను ఎప్పటికీ ఆశ్చర్య పరుస్తూనే వుంటాయి.

సంపాదించిన ఆస్తి, పేరు ప్రఖ్యాతులకు సంబంధం లేకుండా, కేవలం ఒక వ్యక్తిగా ఆయన నా జ్ఞాపకాలలో, నా లోపలి జీవితం లోపల నిలిచిపోతాడు.

ఈ ప్రాజెక్టు కోసం నేనూ, నా టీమ్ సుమారు 3 నెలలు పని చేశాము. చిన్నస్వామిరాజుకు పరిచయం వున్న దాదాపు 100 మందికి పైగా వ్యక్తుల్ని కలసి ఇంటర్వ్యూలు చేశాము.

ఈ పుస్తక రచన, డాక్యుమెంటరీ ఫిలిం దర్శకత్వం ఒక మంచి అనుభవం నాకు. ఇందుకు రాయుడు, నాగేష్‌లకు కృతజ్ఞతలు.

ఈ పుస్తక రచన గురించి ఒక విషయం చెప్పాలి. ఇది సంప్రదాయ పద్ధతిలో రాసిన జీవిత చరిత్ర కాదు. ఇందులోని 'నడచి వచ్చిన జీవితం' ఛాప్టర్ మాత్రమే ఆయన జీవిత చరిత్ర 'ఇది నా కథ'లో–ఇందిరమ్మ చెప్పిన కథనాన్ని యథాతథంగా వుంచాను. మిగిలిన ఛాప్టర్లన్నీ ఆయన జీవితంలోని వివిధ విషయాలకు సంబంధించి నా విశ్లేషణలు. ఆయన జీవిత చరిత్రతో పాటు ఇవి కూడా పాఠకులకు వుపయోగపడుతాయని ఆశిస్తున్నాను.

ఈ ప్రాజెక్టుకు ఎంతో మంది నాకు సహాయపడ్డారు. అందరికీ నా కృతజ్ఞతలు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుకు కో–ఆర్డినేటర్‌గా వ్యవహరించిన కౌషిక్ రాజు అందించిన సహాయ సహకారాలు ఎనలేనివి. అతనికి నా కృతజ్ఞతలు.

బాలాజి

విషయ సూచిక

నా మాట – నాగేష్.. v

ఒక మాట – బాలాజి ix

ప్రారంభ దృశ్యాలు

1. దృశ్యం – 1.. 13
2. దృశ్యం – 2.. 14

నడచి వచ్చిన జీవితం

1. చిత్తూరు జిల్లా రాజులు ఎక్కడి నుంచి వచ్చారు? 16
2. మనుషుల్ని ఖాళీ చేసిన వూరు 18
3. చెల్లెలి ఆహ్వానం – ప్లేగు విస్ఫోటనం 21
4. వీరభద్రప్ప సత్రంలో రామక్క పాల వ్యాపారం 25
5. జీవితమే బడి – పనే చదువు 28
6. గ్లోబల్ హ్యాట్స్‌లో పని వాడు – తిరుమలరాజపురంలో పనిమంతుడు.............. 33
7. జీవితం సీరియస్‌గా మొదలైంది.. 39
8. వొక పెళ్ళి – వొక ప్రేమ – మరో పెళ్ళి 49
9. కంపెనీ స్థాపన 53
10. ఆయన బావి విశాలమైంది 60
11. రెండవ ఇన్నింగ్స్: చిన్నస్వామి స్టేడియం 68
12. 'ఎమర్జెన్సీ' లేకపోతే హోటల్ చాళుక్య లేదు 72
13. సన్ అండ్ 'సన్‌రే'.. 78
14. ఏట్రియా హోటల్ 80
15. 'పవర్'లోకి ప్రవేశం... 84

సమాజం నుంచి సమాజానికి

1. రాజు జీవితం రాజులకే అంకితం 89

2. కాంట్రాక్టర్ల 'పితామహ' 94

3. విద్యలేనివాడి విద్యాసేవ 99

అనుబంధం

1. కబ్బన్ పార్క్ గ్యాంగ్ 104

2. ఇది నా కథ 108

3. తండ్రి Vs కొడుకు 122

4. 'ఆయనే మా హీరో' – ఆ ఆరుగురు 134

5. ఇంటర్వ్యూ విత్ చిన్నస్వామిరాజు 141

1. Index of photos

తిరుమలరాజపురంలో చిన్నస్వామిరాజు పూర్వీకుల ఇల్లు 19

అక్కల రాజు 24

యువకుడిగా చిన్నస్వామి 43

సుందర్ – రేవతి 54

సోదర త్రయం – చిన్నస్వామిరాజు, కుప్పరాజు, నారాయణరాజు 59

'హైదరాబాద్ ఇయర్స్'లో చిన్నస్వామి 61

హైదరాబాద్‌లో రేవతి భరతనాట్యం ఆరంగేట్రం సందర్భంగా 63

చిన్నస్వామి స్టేడియం 69

'ఏట్రియా హైడ్రో పవర్ స్టేషన్', షింషా 86

షష్టిపూర్తి టూర్‌లో భాగంగా 92

బిఏఐ సన్మానసభలో చిన్నస్వామిరాజు 97

3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మతో.... 100

తెలుగు విజ్ఞాన సమితి సభలో రెబల్‌స్టార్స్ కృష్ణంరాజు, అంబరీష్‌లతో.............. 101

ఇద్దరు ముఖ్యమంత్రులు రామకృష్ణహెగ్డే, ఎన్టీఆర్‌లతో 103

యువ వృద్ధులు - కబ్బన్‌పార్క్ గ్యాంగ్ 106
తాజ్‌మహల్ ముందు చిన్నస్వామి-ఇందిర 110
కుటుంబ చిత్రం -1 123
కుటుంబ చిత్రం - 2 126
మనవడా? మజాకా? 135

2. Index of sniffets

సైరన్ మ్రోగితే చాలు బంకర్ల వైపు జనం పరుగులు 31
కుస్తీమే సవాల్ 37
1948 కరువు - రేషన్ బియ్యం స్మగుల్డ్ బై రాజు&కో 42
రాజు డ్రైవింగ్ స్కూల్ 44
కలరా కలవరం - శవాల రవాణా 47
బాబాలాంటి భర్తకావాలి 51
ఆయనకు ప్రేమ వ్యక్తం చేయడం తెలియదు 52
రౌడీలకు రౌడి 56
కట్టడమే కాదు - కూల్చడంలోనూ కింగే మన రాజు 76
'చెక్ బౌన్సా?' - అంటే ఏమిటి? 82
అమ్మో! ఆయనా? - పని రాక్షసుడు 87
మరువలేని రాజుగారి పికప్ 102
విజిటింగ్ కార్డ్ లేకుండా వాకింగ్‌కు వెళ్ళను 107
బాబా - నేములో ఏముంది? 136
ఆయన మా తాతయ్య కాదు 139

3. చిన్నస్వామిరాజు జీవితంలో ముఖ్య సంఘటనలు 153
4. వంశవృక్షం - 155

ప్రారంభ దృశ్యాలు

దృశ్యం – 1

కాలం: జనవరి 1997 **స్థలం:** చెన్నై

సందర్భం: బిల్డర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ కాన్ఫరెన్స్

హాజరయిన ప్రముఖులు

దేవేగౌడ – ప్రధానమంత్రి

కృష్ణకాంత్ – ఆంధ్రప్రదేశ్ గవర్నర్,

యాక్టింగ్ గవర్నర్, తమిళనాడు

మరికొందరు తమిళనాడు రాష్ట్ర మంత్రులు.

ఎల్ అండ్ టి, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, బ్రహ్మదత్ కంపెనీ, గామన్ ఇండియా వంటి జాతీయ, బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు ఈ సభకు హాజరయ్యారు.

ఈ బిల్డర్స్ అసోయేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడు చిన్నస్వామిరాజు.

సరిగ్గా 70 ఏళ్ళ క్రితం కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లో ఒక మేస్త్రీకి అసిస్టెంట్‌గా జీవితాన్ని ప్రారంభించిన చిన్నస్వామిరాజు జాతీయ స్థాయిలోని బిల్డింగ్ రంగంలో అనేక దిగ్గజాలు సభ్యులుగా వున్న అసోషియేషన్‌కు ప్రెసిడెంట్ ఎలా అయ్యాడు?

దృశ్యం: 2

కాలం: ఫిబ్రవరి 13, 2010 **స్థలం:** భోపాల్, మధ్యప్రదేశ్

సందర్భం: The Second All India Kshatriya Sammelan

హాజరయిన ప్రముఖులు

రమణసింగ్	–	ముఖ్యమంత్రి, చత్తీస్ ఘర్
శివరాజ్‌సింగ్ చౌహాన్	–	ముఖ్యమంత్రి, మధ్యప్రదేశ్
నిఖిల్‌కుమార్	–	గవర్నర్, నాగాలాండ్
రామేశ్వర్ ఠాకూర్	–	గవర్నర్, మధ్యప్రదేశ్
వీరభద్రసింగ్	–	కేంద్రమంత్రి, ఉక్కు పరిశ్రమ
అర్జున్ సింగ్	–	మాజీ కేంద్రమంత్రి
దిగ్విజయ్ సింగ్	–	జనరల్ సెక్రెటరీ ఏ.ఐ.సి.సి.
రాజనాథ్ సింగ్	–	మాజీ జాతీయ అధ్యక్షుడు, బిజెపి
కప్తాన్ సింగ్ సోలంకి	–	ఎమ్.పి., రాజ్యసభ, బిజెపి.

ఇటువంటి హేమాహేమీలు అనేక మంది పాల్గొన్న సమావేశానికి అధ్యక్షత వహించింది చిన్నస్వామిరాజు.

వేదిక మీద వున్నవారంతా ఆయన్ను గౌరవంతో 'చిన్నస్వామిరాజు సర్' అని సంబోధిస్తున్నారు.

సభకు హాజరయిన కొంతమందికి ఆయన ఎవరో తెలియదు. జాతీయ స్థాయిలో

ఎందరో ప్రముఖులున్న ఈ సమాఖ్యకు ఈయన ఛైర్మన్ ఎలా అయ్యాడు? ఏ ఆద్మీ కౌన్ హై? 'Who is this man?'

అప్పుడు, ఆ ప్రశ్నలడిగిన వాళ్ళకు, అప్పటికే ఆయన్ను గురించి తెలిసిన వాళ్ళు అనేక కథలు చెప్పారు. ఆ కథలు విన్న వాళ్ళు ఆశ్చర్యపోయారు. ఆయన మీద ఆరాధన కల్గింది. ఆయన్ను పరిచయం చేసుకొన్నారు. కలసి ఫోటోలు దిగారు.

జాతీయ మీడియాకు మిగిలిన అందరూ తెలుసు. కానీ, చిన్నస్వామిరాజు ఎవరో తెలియదు.

పై రెండు దృశ్యాల్లో ఆయన ప్రముఖులలో ప్రముఖంగా వున్నాడు. అయితే ఆయనకు పాపులారిటీ వుంది కానీ, పబ్లిసిటీ లేదు. అందువల్లే ఆయన చాలామంది దృష్టిలో అనామకంగా, నిగూఢంగా వుండిపోయాడు.

మీడియా విచారణలో ఆయన గురించి అనేక మంది అనేక విషయాలు చెప్పారు. అవి ఏవంటే:

ఆయన వొక బిల్డరు, ఒక హోటలియర్, ఒక 'పవర్' మ్యాన్, వొక విద్యావేత్త, ఒక క్షత్రియ కమ్యూనిటీ లీడర్, ఒక సామాజిక సేవకుడు.

చిన్నస్వామిరాజు ఇవన్నీ ఎలా అయ్యాడు? ఇవన్నీ కాకముందు ఇతనెవ్వరు? ఎక్కడ పుట్టాడు? ఎక్కడ పెరిగాడు? ఏం చదువుకొన్నాడు? ఏం చేశాడు?

ఆయన ప్రయాణం ఎప్పుడు, ఎక్కడ మొదలైంది? నడుచుకొంటూ వచ్చాడా? పరిగెత్తాడా? గెంతాడా?

కష్టజీవా? మాయగాడా? వ్యవస్థను వాడుకొన్నాడా? తను వ్యవస్థకు ఉపయోగపడ్డాడా?

70 ఏళ్ళ క్రితం ఎద్దుల బండి తోలడంతో మొదలైన ఆయన ప్రస్థానం ఈ స్థాయికి ఎలా చేరింది?

ఈ ప్రశ్నలకి జవాబుల్ని అన్వేషించే ప్రయత్నమే ఈ పుస్తకం.

నడచి వచ్చిన జీవితం

1. చిత్తూరు రాజులు ఎక్కడి నుంచి వచ్చారు?

చిత్తూరు రాజులు ఎక్కడి నుంచి వచ్చారో తెలుసుకొనే ముందు ఆంధ్రరాజుల గురించి క్లుప్తంగా చెప్పుకొందాం.

ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు క్షత్రియకులాన్ని 'రాజులు' అని పిలుస్తారు. రాజు, రాజా, వర్మ అనేవి వ్యక్తుల పేర్ల చివర వుంటాయి. ఒరిస్సాలో డియో అని పేరు చివర పెట్టుకుంటారు. డియో అంటే దేవుడు లేదా ప్రభువు అని అర్థం. మన వర్మ అంటే కవచము లేదా రక్షణ అని అర్థం.

తూర్పు చాళుక్యులు, చాళుక్య-చోళులు, విష్ణుకుండిన, గజపతి, చాగి, పరిచ్ఛేద మరియు కోట వంశాలకు చెందిన క్షత్రియుల వారసులే ఈ తెలుగు రాజులు.

రాజులు ఎక్కువగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో, విశాఖపట్టణం, విజయనగరం జిల్లాల్లో వున్నారు. గుంటూరు, రాయలసీమ జిల్లాల్లో కూడా వీళ్ళు నివసిస్తున్నారు. తమిళనాడులోని ఉత్తర ఆర్కాట్ జిల్లాలో, రాజపాళయంలో, కర్నాటకలోని బళ్ళారిలో, ఒరిస్సాలోని గంజాం జిల్లాలో రాజులు నివసిస్తున్నారు. విదేశాలలో కూడా గణనీయ సంఖ్యలో రాజులు వున్నారు.

రాజుల మూలాలు

ఆర్యావర్తం (ఉత్తర భారతదేశం) నుంచి క్షత్రియులు దక్షిణ భారతానికి వలస వచ్చారని పురాణాలు చెబుతున్నాయి. అంతర్గత కలహాలు, విదేశీ దాడులు, కరువు మొదలైన కారణాల మూలంగా వాళ్ళు వలస వచ్చారు.

ఇక్ష్వాక క్షత్రియులు దక్షిణ భారతానికి వలస వెళ్ళారని వాయుపురాణం, బౌద్ధ, జైన వాఙ్మయాలు చెబుతున్నాయి.

దక్షిణ భారత రాజులకు ఉత్తర భారత రాజులతో సంబంధ బాంధవ్యాలున్నట్టు చరిత్రలో దాఖలాలున్నాయి.

విజయనగరం, సాలూర్, కురపమ్ రాజులు రాజపుటానా రాజకుటుంబీకులతో వియ్యమొందారు.

1794లో పద్మనాభం (నేటి విశాఖ జిల్లా) యుద్ధంలో రాజపుట్‌లు విజయరామరాజు శవానికి కాపలా కాశారని అంటారు.

తెలుగు రాజులు ప్రధానంగా రెండు రకాల వంశాలకు చెందిన వారు

1. **సూర్యవంశం (Sun Dynasty):** ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, పరిచ్ఛేద, కోట వంశం, చోళ- చాళుక్యులు, తూర్పు గంగా వంశం, గజపతులు.
2. **చంద్రవంశం (Lunar Dynasty):** తూర్పు చాళుక్యులు, కల చూరులు (చేది - హయ హయ), సాళువ, ఆరవీడు వంశాలు.

చిత్తూరు రాజులు

నిజానికి చిత్తూరు రాజులు చిత్తూరు వాళ్ళు కాదు. వీళ్ళు ఒకప్పుడు కోస్తా రాజులే. క్రీ.శ.9,10వ శతాబ్దాలలో తంజావూరు సామ్రాజ్యంలో జరిగిన యుద్ధాలలో పాల్గొనడానికి విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి వచ్చిన రాజులు, యుద్ధం ముగిసిన తర్వాత తిరిగి వాళ్ళ స్వంత వూర్లకు వెళుతూ, దారిలో అక్కడక్కడా ఆగిపోయారనీ, వాళ్ళే తర్వాతి కాలంలో 'చిత్తూరు రాజులు'గా పిలవబడ్డారనీ కొంతమంది స్థానిక చరిత్రకారుల అభిప్రాయం.

ముఖ్యంగా క్రీ.శ.947-948లో మూడవ కృష్ణ రాజ అనే రాష్ట్ర కూట రాజు చోళ రాజ్యం మీద దండెత్తాడు. అప్పుడు తక్కోలం (నేటి అరక్కోణానికి సమీపాన)లో జరిగిన యుద్ధంలో చోళ రాజు రాజాదిత్య చనిపోయాడు. ఈ యుద్ధంలో చోళ రాజుల తరపున పాల్గొనేందుకు ఆంధ్ర రాజులు వచ్చారని చరిత్రకారులు చెబుతారు.

ఈ యుద్ధం ముగిసాక, తమ తమ వూర్లకు వెళుతున్న రాజులు చిత్తూరు జిల్లాలో అక్కడక్కడ నివాసాలు ఏర్పరచుకొన్నారు. భూమి లభ్యత, నీటి వసతి, రక్షణ వంటి అంశాలకు ప్రాముఖ్యత నిచ్చిన వీళ్ళు, వాటికి అనువైన ప్రదేశాల్ని ఎంచుకొని అక్కడ నివాసాల్ని ఏర్పరచుకొన్నారు.

రాజపాళయం రాజులు అక్కడ నివాసాలు ఏర్పరచుకోవడానికి ఒక కథ చెబుతారు.

యుద్ధానంతరం ఆంధ్ర ప్రాంతానికి తిరిగి వెళుతున్న రాజులు ఒక ప్రదేశంలో కుందేలు కుక్కను తరుముతున్న దృశ్యం చూశారు. అది ఆ గడ్డ ప్రభావమని, అటువంటి వీరగడ్డ తమ నివాసానికి అనువైనదని వాళ్ళు అక్కడ నివాసం ఏర్పరచుకొన్నారు.

ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్ళేందుకు అనేక కారణాలతో పాటు యుద్ధాలు కూడా ఒక కారణం. యుద్ధాల మూలంగా ప్రజలు నిర్వాసితులు కావడం చరిత్ర పొడవునా కనిపిస్తుంది.

చిత్తూరు రాజులు కూడా అలా యుద్ధాల వల్ల నిర్వాసితులై ఆ ప్రాంతంలో సెటిల్ అయిన వారే.

అలా రాజులు నివసించే గ్రామాల్లో తిరుమలరాజపురం ఒకటి.

2. మనుషుల్ని ఖాళీ చేసిన వూరు

అది 1895వ సంవత్సరం. మదరాసు రాష్ట్రం చెంగలపట్టు జిల్లా తిరుమలరాజపురం. చిత్తూరుకూ షోలింగర్‌కూ మధ్య వుంటుంది. దాన్నే పాళ్యం అని కూడా పిలుస్తారు.

తిరుమలరాజపురంలో అప్పుడు దాదాపు 60 రాజుల (క్షత్రియ) కుటుంబాలు నివసిస్తూ వుండేవి. దాదాపు అందరూ దగ్గరి బంధువులే. వ్యవసాయమే వారి ప్రధాన జీవనాధారం.

వారి జీవితాల్లో ఆనందమైనా, విషాదమైనా భూమి చుట్టూ తిరగాల్సిందే. గ్రామాలలో ఎంతమంది నివసిస్తూ వున్నా, వారిలో కొంతమంది మాత్రమే ఆధిపత్యం చెలాయిస్తుంటారు.

అలాగే తిరుమలరాజపురంలో కూడా కొన్ని కుటుంబాలు గ్రామం మీద ఆధిపత్యం చెలాయిస్తూ వుండేవి.

ఆ వూరిలో అప్పుడు ఏం జరిగిందో చెప్పడానికి ఖచ్చితమైన చారిత్రక ఆధారాలు ఏవీ లేవు. తరాల నుంచి వొక కథ మౌఖిక రూపంలో వునికిలో వుంది. ఆ కథనే చెప్పుకోవాలి మనం. ఇది సత్యమా? కాదా? అని నిర్ధారించి చెప్పడం వీలుకాదు.

ఇదీ ఆ కథ. ఆ గ్రామంలో ఒక ఆస్తి తగాదా వుంది. ఆ వ్యవసాయ భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను ఒక కుటుంబం తారుమారు చేసి, ఆస్తిని కాజేయాలని చూసింది.

అప్పుడు పంచాయితీ జరిగింది. ఆ కేసులో ప్రధాన సాక్షులు చోళరాజు కుప్పరాజు కుటుంబం. వాళ్ళను సాక్ష్యం చెప్పమన్నారు. కానీ వాళ్ళు సాక్ష్యం చెప్పడానికి నిరాకరించారు. వాళ్ళు నిరాకరించడానికి కారణాలు ఏమిటో తెలియదు.

పంచాయితీ పెద్దలు కుప్పరాజుకు దాయాదులు. వాళ్ళు సాక్ష్యం చెప్పలేదు కాబట్టి, దానికి శిక్షగా కుప్పరాజు కుటుంబాన్ని గ్రామం నుంచి బహిష్కరించారు.



తిరుమలరాజ పురంలో చిన్నస్వామిరాజు పూర్వీకుల ఇల్లు

అప్పటికి కుప్పరాజు చనిపోయి చాలా కాలమైంది. ఆయన భార్య లక్ష్మమ్మ. ఇద్దరు కొడుకులు, కూతుర్లు ముగ్గురు.

కుప్పరాజు కుటుంబానికి చెందిన భూముల్ని, ఇంటిని కూడా దాయాదులే అడుమానం (తనఖా) పెట్టుకున్నారు.

నమ్ముకొన్న నేలతల్లిని, కన్నవూరిని వదిలి లక్ష్మమ్మ బిడ్డలతో బెంగుళూరుకు బయలుదేరింది. బెంగుళూరులో వాళ్ళ పెద్ద కూతురు వుంది (పేరు తెలీదు). ఆమె ఆశ్రయం పొందాలని వాళ్ళు బయలుదేరారు.

వీళ్ళు బిడ్డల్ని తీసుకొని బయలుదేరారు కదా పాపం అని దయగల తల్లి ఒకావిడ వాళ్ళకు అన్నం వండి పెట్టబోగా, దాయాదులు, పంచాయితీ పెద్దలు పెట్టనివ్వలేదు.

కరుడుగట్టిన వైషమ్యాలు ఒకోసారి మామూలు మనుషుల్ని కూడా క్రూరమైన వాళ్ళని చేస్తాయి అనడానికి ఇది ఉదాహరణ.

వూరంతా నిశ్శబ్దంగా చూస్తుండగా లక్ష్మమ్మ కుటుంబం బయలు దేరింది. తరాలుగా బతుకుతున్న గ్రామాన్ని హఠాత్తుగా వదిలేసి వచ్చేయడం అంత సులభమేమీ కాదు. అప్పటి వరకు పీల్చిన గాలి,

తాగిన నీళ్ళు, తిరిగిన నేల, కలసిమెలసి పెరిగిన నోరులేని ఆవులు, ఎనుములు–వీటన్నిటిని శాశ్వతంగా వదిలేసి వెళ్ళిపోవడమంటే మాటలు కాదు. ఇక తోటి మనుషులతో వున్న అనుబంధాన్ని గూర్చి చెప్పనక్కరలేదు.

వేర్లు తెగిన చెట్టులా వుంది వాళ్ళ మనస్థితి. కానీ వేరే మార్గం లేదు.

బహిష్కరణకు గురైన కుటుంబం పక్క గ్రామంలోనో, దగ్గర్లో మరోచోటనో బతకొచ్చు. కానీ వ్యవసాయ కుటుంబాలు దేన్నయినా భరిస్తాయి కానీ అవమాన భారాన్ని భరించలేవు. వాళ్ళు మానమర్యాదలకు ఇచ్చే ప్రాముఖ్యత ఇంక దేనికీ ఇవ్వరు.

అందుకనే లక్ష్మమ్మ కుటుంబం భారమైన మనస్సుతో, అవమాన భారంతో, వున్న వూరినే కాకుండా, ఆ ప్రాంతాన్నే వదిలి బయలుదేరింది.

ఆ కాలంలో రవాణాసాధనాలు చాలా తక్కువ. ఎక్కువగా కాలినడకనే వెళ్ళాలి. అలాగే బయలుదేరారు వీళ్ళు కూడా.

అలా నడిచి నడిచి వాలాజాపేట రైల్వేస్టేషన్లో బెంగుళూరుకు ట్రెయిన్ ఎక్కారు. చరిత్రలో వెనక్కి తిరిగి చూసుకొంటే అనేక విచిత్రాలు కనిపిస్తాయి. వీళ్ళని బహిష్కరించిన ఆ దాయాదులు అప్పుడు ఒక విషయాన్ని వూహించలేదు. అదేమిటంటే....

తాము ఎవరినైతే గ్రామం నుంచి బహిష్కరించామో, తర్వాత వాళ్ల దగ్గరే తాము ఆశ్రయం పొందాల్సి వస్తుంది అని. దాయాదులే కాదు మొత్తం గ్రామమే లక్ష్మమ్మ కుటుంబపు ఆశ్రయం పొందాల్సిన పరిస్థితి వచ్చింది.

3. చెల్లెలి ఆహ్వానం - ప్లేగు విస్ఫోటనం

బెంగుళూరు వచ్చిన అమ్మగారి కుటుంబాన్ని కూతురు సాదరంగా ఆహ్వానించింది. అప్పుడు వాళ్ళు ఆ పట్టణంలో తాయప్పనహళ్ళిలో నివసిస్తున్నారు. అది ఇప్పటి జయనగర్‌లో వుంది.

చిత్తూరు జిల్లా నుంచి రాజులు (క్షత్రియులు) బెంగుళూరుకు రావటం 19వ శతాబ్దపు చివరలో, 20వ శతాబ్ధపు మొదట్లో ఎక్కువగా జరిగింది.

మారెప్పనహళ్ళి, తాయప్పన హళ్ళి, సౌత్‌ఎండ్ సర్కిల్, కోదండరామాపురం, జయనగర్, మల్లేశ్వరం ప్రాంతాల్లో దాదాపు 5 చ.కి.మీ. వైశాల్యంలో చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన రాజులు స్థిరపడ్డారు.

లక్ష్మమ్మ కుటుంబం కూడా తమ కమ్యూనిటీలోకి కొత్తగా వచ్చి చేరింది.

అప్పటికి బెంగుళూరు చాలా చిన్నపట్టణం. రెండు విడి విడి మునిసిపాలిటీలుగా వుండేది. 1537లో కెంపేగౌడ నిర్మించిన 'పేటె' (చిక్‌పేటె, అక్కిపేటె, దొడ్డపెటే వగైరా) ఒక మునిసిపాలిటీ. ఇందులో కన్నడిగులు ఎక్కువగా నివసించేవారు.

పేటెలో ఒక్కో ఏరియాలో ఒక్కోరకం సరుకును అమ్మేవారు. అరల్‌పేటెలో దూది, అక్కిపేటెలో బియ్యం– అలా ఒకో రకం సరుకు కోసం ఆయా ప్రత్యేక పేటెలు వుండేవి.

పేటె మునిసిపాలిటీ పరిధిలోనే తెలుగు వాళ్ళు కూడా నివసించేవారు.

19వ శతాబ్దంలో బ్రిటిష్ వాళ్ళు కంటోన్మెంట్ ఏరియాను నిర్మించారు. ఈ నూతన సెటిల్మెంటు 1807లో ప్రారంభమయింది. దాన్ని 'సివిల్ అండ్ మిలిటరీ స్టేషన్ ఆఫ్ బేంగళూర్' అని పిలిచేవారు.

దేశంలోని ఇతర కంటోన్మెంట్‌లన్నీ ఈస్ట్ ఇండియా కంపెనీ క్రింద వుంటే, బెంగుళూరు కంటోన్మెంటు మాత్రం నేరుగా ఇంపీరియల్ క్రౌన్ క్రిందనే వుండేది.

కంటోన్మెంటులో భవన నిర్మాణాలకోసం బ్రిటిష్ వాళ్ళు, మదరాసు రాష్ట్రం ఆర్కాట్ జిల్లాల

నుంచి తమిళుల్ని తీసుకొచ్చారు. వారితో పాటు షాపులు, ఇతర పట్టణ సర్వీసులకోసం ముస్లింలు వుండేవాళ్ళు.

'విదేశీ సరిహద్దులు గల బ్రిటిష్ ప్రాంతం'గా కంటోన్మెంటును బ్రిటిష్ వాళ్ళు అభివర్ణించే వారు. ఈ ప్రాంతంలోకి 'పేటె' వాసులకు ప్రవేశం వుండేది కాదు. 'పేటె' నుంచి సరుకుల్ని కూడా అనుమతించే వాళ్ళు కాదు. అందుకని 'పేటె' నుంచి అనేక రకాల సరుకులు కంటోన్మెంటులోకి అక్రమంగా రవాణా అయ్యేవి.

ఎమ్.జి. రోడ్, బ్రిగేడ్ రోడ్, మర్గోసా రోడ్, కమర్షియల్ స్ట్రీట్, రిచ్‌మండ్ టౌన్, ఫ్రేజర్‌టౌన్ వంటి కంటోన్మెంట్ ప్రాంతాల్లో మిలిటరీ బిల్డింగులు, బజార్లు, ఆఫీసులు, ఇళ్ళు, పెరేడ్ గ్రౌండ్లు మొదలైన కట్టడాలు వుండేవి.

1949 వరకు కూడా ఈ రెండు మునిసిపాలిటీలు విడి విడిగానే పని చేస్తుండేవి. 1949లో ఈ రెంటినీ కలిపి 'బెంగుళూరు సిటీ కార్పొరేషన్'ను ఏర్పరిచారు.

'పేటె'లో పట్టణ నివాసాలను విడిచిపెడితే మిగతా ప్రాంతాలన్నీ వ్యవసాయ భూములు.

లక్ష్మమ్మ పెద్దకూతురుది కూడా వ్యవసాయ కుటుంబమే. అలా లక్ష్మమ్మ పెద్ద కొడుకు సుబ్బరాజు, చిన్న కొడుకు అక్కలరాజు కూడా తమ సోదరి కుటుంబంతో కలసి వ్యవసాయం మొదలు పెట్టారు.

అలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. లక్ష్మమ్మ కుటుంబం క్రమంగా బెంగుళూరులో స్థిరపడింది.

అయితే వాళ్ళ జీవితాల్ని హఠాత్తుగా విరుచుకుపడిన 'ప్లేగు' అతలాకుతలం చేసింది.

1898లో బుబోనిక్ ప్లేగు బెంగుళూరు నగరం మీద విరుచుక పడింది. ఇది ఎలా వచ్చిందనేందుకు కూడా ఒక కథ వుంది.

ఒక రైల్వే ఆఫీసర్ దగ్గర పనిచేస్తున్న బట్లర్ ఒకడు హుబ్లీ నుంచి ట్రెయిన్లో బెంగుళూరు వచ్చాడు. అతను తనతో పాటు ప్లేగును తీసుకొచ్చాడు. అతను ఆగస్టు 15, 1898న బెంగుళూరులో చనిపోయాడు. అతను చనిపోయిన 'గూడ్స్ అండ్ షెడ్' ప్రాంతంలో మరి కొంతమంది చనిపోయారు.

'పేటె'లో మాత్రమే 5,000 మంది ప్లేగు సోకి చనిపోయారు. కంటోన్మెంటు, ఇతర పట్టణ శివారు ప్రాంతాలు కలపుకుని మరో 9 వేల మంది చనిపోయారు. ఒక్క చన్నపట్టణలోనే 710 మరణాలు సంభవించాయి.

దొమ్మసంద్ర, యలహంక, యశ్వంతపూర్, రామోహళ్ళి, అనేకల్ ప్రాంతాలు ప్లేగుకు గురైన ఇతర ప్రాంతాలు.

ప్లేగుకు భయపడి దాదాపు 35,000 మంది బెంగుళూరు పట్టణాన్ని వదిలిపెట్టి ఇతర ప్రాంతాలకు పారిపోయారు.

బిన్నీమిల్లులో రాత్రికి రాత్రే కార్మికుల సంఖ్య 950 నుంచి 230కి పడిపోయింది.

బెంగుళూరులో 25% జనాభా తగ్గిపోయి, 1898 సెప్టెంబర్ నాటికి 90,000 మంది మాత్రమే పట్టణంలో మిగిలారు.

వ్యాపారం కూడా తీవ్రస్థాయిలో దెబ్బతిన్నది. పేటె మునిసిపాలిటీకి దాదాపు 40వేల రూపాయలు నష్టమొచ్చిందని అంచనా.

అయితే ప్లేగు వల్ల బెంగుళూరు నగరం వేగంగా అభివృద్ధి చెందింది. ప్లేగు సహాయక చర్యల అమలు కోసం టెలిఫోన్ లైన్లు వేశారు. పారిశుద్ధ పనులు మొదలుపెట్టారు. డ్రైయినేజ్ సిస్టం అభివృద్ధి అయింది. నూతనంగా రోడ్లు, భవనాలు, కాలనీలు అభివృద్ధి అయ్యాయి. 1905లో పట్టణంలోకి ఎలక్ట్రిసిటీ వచ్చింది.

ముఖ్యంగా పట్టణ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున జనం శివారు ప్రాంతాలకు తరలి వెళ్ళడంతో ఆ ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందాయి. అలా ప్లేగు తర్వాత అభివృద్ధి అయిన కాలనీల్లో చెప్పుకోదగినవి బసవనగుడి, మల్లేశ్వరంలు.

చరిత్రకారులు ఈ ప్లేగును 1656లో లండన్‌లో సంభవించిన 'మహా అగ్ని ప్రమాదం' (Great London Fire)తో పోలుస్తారు. ఆ అగ్నిప్రమాదం తర్వాతే లండన్ నగరం కూడా అభివృద్ధి చెందింది.

ప్లేగు తర్వాత ఆధునీకరణ జరిగి, అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు అయి, పట్టణం వేగంగా అభివృద్ధి అయినప్పటికీ, ప్రజల జీవితాల్లో ప్లేగు విషాదమే మిగిల్చింది.

ప్లేగు వల్ల అలా విషాదానికి గురైన కుటుంబాల్లో మన లక్ష్మమ్మ కుటుంబం ఒకటి. గ్రామం నుంచి బహిష్కృతులై పొట్టచేత పట్టుకొని పట్టణానికి వచ్చిన అమ్మకూ, అన్నదమ్ములకూ ఆశ్రయమిచ్చిన దయగల ఆడపడుచును ప్లేగు నిర్దయగా కబళించివేసింది.

హఠాత్తుగా సంభవించిన విషాదంతో షాక్‌తిన్న లక్ష్మమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం రాత్రికి రాత్రే తాయప్పనహళ్ళి నుంచి శివారు ప్రాంతానికి పంపేసింది.

పేటె ప్రాంతంలో ఖాళీ అయిన 8 వేల ఇళ్ళల్లో లక్ష్మమ్మ వాళ్ళది కూడా ఒకటి. తక్షణ ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం వాళ్ళను ఖాళీ చేసింది. ఎలుకల్ని చంపిన వారికి బహుమతి కూడా ప్రకటించింది ప్రభుత్వం.

లక్ష్మమ్మ కుటుంబం అనేక ఇతర కుటుంబాలతో పాటు తాయప్పనహళ్ళిని విడిచి మల్లేశ్వరం వచ్చింది.



అక్కల రాజు

మల్లేశ్వరం 10వ క్రాస్‌లో గరుడాచలం అనే తమిళ బ్రాహ్మణుడు వుండేవాడు. ఆయన సివిల్ ఇంజనీరు. వాళ్ళింట్లో పనిమనిషిగా చేరాడు అక్కలరాజు.

మొత్తం కుటుంబం గరుడాచలం ఇంటి ఆవరణలోనే కాపురం పెట్టారు. అలా వాళ్ళింట్లో చాలా ఏళ్ళు పని చేశాడు అక్కలరాజు.

అక్కలరాజుకు సుబ్బమ్మతో పెళ్ళికూడా గరుడాచలంగారి ఆశ్రయంలో వున్నప్పుడే జరిగింది.

గరుడాచలం అక్కల రాజును బాగా చూసుకొనేవాడు. నెలకు 5రూ॥ జీతం ఇవ్వడంతో పాటు మొత్తం కుటుంబానికి ఆశ్రయమిచ్చాడు. అక్కల రాజు కూడా గరుడాచలానికి నమ్మిన బంటులా వుండేవాడు. కష్టించి పని చేసేవాడు. ఉద్యోగరీత్యా గరుడాచలం ఎక్కడికి వెళ్ళినా అక్కలరాజును వెంటతీసుకెళ్ళేవాడు.

గరుడాచలం ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా, ఏ వ్రతమో, పండుగో జరిగినా అక్కలరాజు కుటుంబానికి కూడా పండుగలానే వుండేది. ఇంటిల్లిపాదికీ వారం రోజులపాటు మంచి భోజనం దొరికేది.

తిరుమలరాజపురం గ్రామానికి సమీప గ్రామాల్లోని కొంతమంది రెడ్లు కూడా మల్లేశ్వరం ప్రాంతంలో నివసిస్తూ వున్నారు. వాళ్ళందరితో కూడా అక్కలరాజు కుటుంబం సన్నిహితంగా వుండేది.

అయితే సుబ్బరాజుకు మాత్రం మనసంతా వ్యవసాయం మీదే వుంది.

4. వీరభద్రప్ప సత్రంలో రామక్క పాల వ్యాపారం

మల్లేశ్వరం 8వ క్రాస్‌కు, శేషాద్రిపురం మెయినరోడ్‌కూ మధ్య వున్న పైప్‌లైన్ రోడ్‌లో కనెక్టడ్ ల్యాండ్ 2 ఎకరాలు వుంది. అది వీరభద్రప్ప సత్రంకి చెందినది. అక్కలరాజుకు సుబ్బరాజుకు సత్రం వారితో పరిచయాలు వున్నాయి. సుబ్బరాజు వీరభద్రప్ప వాళ్ళను తనకు కొంత భూమి కావాలని అడిగాడు వ్యవసాయం చేయడం కోసం.

అప్పటికి బెంగుళూరులో అనేక చోట్ల వ్యవసాయం చేస్తున్నారు. వీరభద్రప్ప వాళ్ళు కూడా వ్యవసాయం చేసేవాళ్ళు. సుబ్బరాజుకు వాళ్ళు రెండెకరాలు సేద్యపు నేల యిచ్చారు. ఒక బావి కూడా తవ్వించి ఇచ్చారు.

అప్పట్లో బావి తవ్వినపుడు కూలి డబ్బుకు బదులు సవరం బంగారం యిచ్చేవారట.

అలా వాళ్ళు పైప్‌లైన్ రోడ్డులో వ్యవసాయం మొదలుపెట్టారు.

అక్కలరాజు చెల్లెలు రామక్కను బెంగుళూరులోనే ఒక యువకుడికి ఇచ్చి పెళ్ళి చేశారు. అయితే పెళ్ళయిన 3 నెలలకే భర్త చనిపోవడంతో ఆమె మళ్ళీ అమ్మగారింటికి రాక తప్పలేదు.

అన్నలు వ్యవసాయం చేస్తుంటే, రామక్క ఆవుల్ని, ఎనుముల్ని పెట్టుకొని పాల వ్యాపారం మొదలుపెట్టింది. పాలు పిండి చుట్టుపక్కల వున్న ఇళ్ళకు వెళ్ళి పాలు పోసేది. ముఖ్యంగా శేషాద్రిపురంలో ఇళ్ళకు పాలు పోసేది. అప్పట్లో శేరు పాలు 4 అణాలు. శేరుకు 4 పావులు.

✦ ✦ ✦

అక్కలరాజు, సుబ్బమ్మ దంపతులకు 1931 ఫిబ్రవరి 6న చిన్నస్వామిరాజు పుట్టాడు. అప్పటికే వారికి ముగ్గురు పిల్లలు. కుప్పరాజు, నారాయణ రాజు, మంగమ్మ.

కుప్పరాజుకు ముందు మరో ఇద్దరు పిల్లలు పుట్టి చనిపోయారు. అందువల్ల తర్వాత పుట్టిన పిల్లవాడిని చెత్తకుప్పలో పొర్లించి, వాడికి 'కుప్పరాజు' అని పేరు పెట్టారు. చిత్తూరు జిల్లాలో ఈ ఆచారం ఒకప్పుడు విస్తృతంగా అమలులో వుండేది. ఇతర ప్రాంతాల్లో కూడా ఈ ఆచారం వుంది.

కన్న తల్లిదండ్రులు అక్కలరాజు, సుబ్బమ్మ అయినప్పటికీ, వాళ్ళను సాకింది, పోషించింది మాత్రం అత్త రామక్కే.

అక్కలరాజుకు వచ్చే 5–6రూ॥ల జీతం అంత పెద్ద కుటుంబ పోషణకు సరిపోయేది కాదు. అందువల్ల రామక్కే కుటుంబ భారాన్ని తన భుజాల మీద వేసుకొంది.

ఆమెకు పిల్లలంటే చాలా ఇష్టం. ఇప్పటికీ చిన్నస్వామిరాజు ప్రేమతో గుర్తు చేసుకొనే సంఘటన ఏమిటంటే–, చిన్నస్వామి రాజుకి ఒకసారి ఆరోగ్యం బాగాలేదు. బహుశా జ్వరం వంటిది వచ్చి మంచం ఎక్కాడు. రామక్క ఎప్పుడూ అతని తల దగ్గర కూర్చుని త్వరగా కోలుకుంటావని ధైర్యం చెప్పేది. రాజుకు అర్థంకాని ఏవో మంత్రాలు చదివేది. దేవుడికి మొక్కుకుని, తాయెత్తులు తెచ్చి రాజు మెడలో కట్టేది.

ఆమె పక్కనుంటే చాలా ధైర్యంగా వుండేది. ఇది కేవలం ఒక రాజు విషయంలోనే కాదు పిల్లలందరినీ ఆమె అంతే ప్రేమగా చూసుకొనేది.

ఆమె కుటుంబాన్ని ఎంత ప్రేమగా చూసుకొనేదో, అంత అజమాయిషీ కూడా చేసేది. ఆమెలో నాయకత్వ లక్షణాలు చాలా ఎక్కువ. నిజానికి చిన్నస్వామిరాజు–కుప్పరాజు వ్యాపార సామ్రాజ్యానికి ఒక రకంగా రామక్కే కారణం.

కుప్పరాజు శేషాద్రిపురంలో అరుణాచల మొదలియార్ అనే కాంట్రాక్టర్ దగ్గర రైటర్‌గా చేరాడు. ఆయన దగ్గర లెక్కలు రాయడం వగైరా పనులు చేసేవాడు.

కుప్పరాజు నిజాయితీ, కష్టపడేగుణం, చురుకుదనం చూసిన అరుణాచల మొదలియార్ తన కొత్త కాంట్రాక్టులో అతనికి భాగస్వామ్యం ఇవ్వజూపాడు. అయితే దానికి కావాల్సిన పెట్టుబడిని అక్కలరాజు సమకూర్చలేకపోయాడు.

అప్పుడు రామక్కే 5,000రూ॥లను కుప్పరాజుకు ఇచ్చింది. అలా కుప్పరాజు వ్యాపారానికి ఆమే మూలం అని చెప్పవచ్చు. 1940లలో 5,000రూ॥లు అంటే చాలా పెద్ద మొత్తం.

ఇప్పటికీ చిన్నస్వామిరాజు రామక్క జ్ఞాపకాల్ని తలుచుకుంటూ వుంటాడు. 'మేము ఈ స్టేజిలో వుండటానికి ఆమే కారణం. ఆమె లేకపోతే మా అన్న కాంట్రాక్టు పనికి వెళ్ళివుండేవాడు కాదు. **ఆయన కాంట్రాక్టు ఫీల్డ్‌కు వెళ్ళడం మా జీవితాల్లో గొప్ప మలుపు**'– అంటాడు చిన్నస్వామిరాజు.

వొక్కోసారి ఒక చిన్న చర్య కూడా చరిత్రను పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తుంది. అలాగే **ఆమె ఇచ్చిన 5,000 పెట్టుబడి అనేక తరాల జీవితాల్ని మార్చివేసింది.**

రామక్క నాయకత్వ లక్షణాలు, దూరదృష్టి, కఠోర శ్రమ– ఇవన్నీ చిన్నస్వామిరాజును ప్రభావితం చేశాయి. చిన్న వయస్సులోనే ఆమె వ్యక్తిత్వం అతని మీద బలమైన ముద్రవేసింది.

అయితే రామక్క చివరి దినాల్లో తాము ఆమెను చూసుకోవాల్సినంత బాగా చూసుకోలేదని పశ్చాత్తాపం వ్యక్తపరుస్తాడు చిన్నస్వామిరాజు.

కొత్తవాళ్ళు కోడళ్ళుగా రావటం, తాము కాంట్రాక్టు పనుల్లో పూర్తిస్థాయిలో నిమగ్నమైపోవడం మూలంగా ఆమె కాస్త నిర్లక్ష్యానికి గురైందని ఆయన అన్నాడు.

తన వ్యాపారం నిలిచిపోవడం, కుటుంబం మీద పెత్తనం పోవడం, ఆరోగ్యం దెబ్బ తినడం వంటి కారణాల వల్ల చివరి దినాల్లో రామక్క మానసికంగా కూడా అస్వస్థతకు గురైంది.

'ఒక మనిషి జీవితంలో ముసలితనం అతిపెద్ద ఆశ్చర్యం'– అంటాడు టాల్‌స్టాయ్. రామక్క విషయంలో కూడా ఇది వర్తిస్తుంది.

చిన్న వయసులోనే భర్తను కోల్పోయి, తన జీవితాన్ని కుటుంబానికి అంకితం చేసి, ఉమ్మడి కుటుంబాన్ని పోషించడంతో పాటు, తమ ప్రాంత గ్రామాల నుంచి బెంగుళూరు నగరానికి వచ్చిన ఎంతోమందికి ఆసరా అందించిన రామక్క బెంగుళూరు రాజుల చరిత్రలో ఒక ముఖ్యమైన వ్యక్తి.

1940లలో స్త్రీలకు సమాజంలో ఇప్పుడున్నంత స్వేచ్ఛ లేదు. ఇక రాజుల కమ్యూనిటీలో అయితే చెప్పనవసరం లేదు. స్త్రీల స్థానం వంటిల్లే. అయినా, ఆ పరిస్థితులన్నిటినీ అధిగమించి, పురుషులకన్నా ఎక్కువగా ఆమె బయటి ప్రపంచంలో విజయం సాధించింది. 65 ఏళ్ళ వయసులో ఆమె చనిపోయింది.

సామాన్యురాలైన ఒక అసమాన్య మహిళ రామక్క.

5. జీవితమే బడి - పనే చదువు

'విద్యలేని వాడు వింత పశువు'– అంటారు. అయితే ఈ సామెత విలువ విద్యకు మనం ఇచ్చుకొనే నిర్వచనాన్ని బట్టి వుంటుంది.

స్కూలుకెళ్ళడం, అక్షరాలు నేర్చుకోవడం, పుస్తకాలు చదవడం– దీన్నే 'విద్య' అనుకోవటం– ఆధునిక సమాజం తన అవసరాల కోసం ఇచ్చిన నిర్వచనం తప్ప మరేమీ కాదు.

విద్య అంటే ఉత్పత్తి, సేవారంగాల్లో నైపుణ్యం సాధించడం, జీవన నైపుణ్యాల్లో వికాసం పొందడం, స్వీయ వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగలగడం. తననూ, తన చుట్టూ వున్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం.

పై అర్థంలో చిన్నస్వామి రాజు గొప్ప విద్యావంతుడు. అయితే అతను స్కూలు నుంచి జీవితంలోకి, చదువు నుంచి పనిలోకి ఎలా వచ్చాడో చూద్దాం.

చదువు విషయంలో చిన్నస్వామిరాజుకీ, తన అన్న కుప్పరాజుకీ పోలిక వుంది.

అక్కలరాజు బహుశా తను పనిచేస్తున్న గరుడాచలం ప్రభావం వల్ల కావచ్చు, తన పిల్లల్ని చదివించాలనుకొన్నాడు.

అప్పట్లో మల్లేశ్వరంలో తమిళులు ఎక్కువ మంది నివసిస్తుండే వాళ్ళు. ముఖ్యంగా తమిళ బ్రాహ్మణులు. అందుకే మల్లేశ్వరంను 'మైలాపూర్ ఆఫ్ బెంగళూర్' అని పిలిచేవారు. గరుడాచలం కూడా తమిళ బ్రాహ్మణుడు. బ్రాహ్మణులు తరతరాలుగా విద్యావంతులు అనే విషయం అందరికీ తెలిసిందే. అందువల్ల గరుడాచలంను, అతను కలిసే ఇతర బ్రాహ్మణ విద్యావేత్తలను చూసినపుడు అక్కలరాజుకు కూడా తన పిల్లల్ని చదివించాలనే కోరిక కలగడం సహజమే కదా.

అలా అక్కలరాజు తన ముద్దుల పెద్దకొడుకు కుప్పరాజును శేషాద్రిపురం ప్రభుత్వ ప్రైమరీ స్కూల్లో చేర్పించాడు. అయితే ఆయన నాలుగవ తరగతి వరకే చదివాడు. మిడిల్ స్కూల్‌కు ఫీజులు కట్టే స్తోమతలేని అక్కలరాజు కొడుకుని స్కూలు నుంచి మాన్పించక తప్పలేదు.

అయితే ప్రైవేటు ట్యూషన్సుకు వెళ్ళి విద్యను కొనసాగించాడు కుప్పరాజు.

సరిగ్గా చిన్నస్వామిరాజు విషయంలోనూ ఇదే జరిగింది. 1936లో అన్న చదివిన స్కూల్లోనే చేరాడు రాజు. అప్పటికే, అంటే 1935లోనే బెంగళూరు స్కూళ్ళల్లో కన్నడ మీడియంను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అందువల్ల రాజును కన్నడ మీడియంలోనే చేర్చాడు అక్కలరాజు.

రాజు కూడా అన్నలాగే 4వ తరగతి వరకే చదివాడు. అప్పుడు బెంగళూరులో 1919 నుంచే ఆడపిల్లలకు ప్రత్యేక పాఠశాలలు వున్నాయి.

స్కూలు రోజులకు సంబంధించి రాజుకు ఎక్కువ జ్ఞాపకాలు లేవు. అప్పుడు ఫీజు రూపాయో, 2 రూపాయలో వుండేవి. తరగతి గదిలో పీటల మీద కూర్చునే వాళ్ళు. పలకా బలపం వుండేవి. ఎక్కాలు బాగా నేర్చుకునేవాడు రాజు.

స్కూల్లో టీచర్లు శ్రద్ధగా పాఠాలు చెప్పేవారు. శాస్త్రి టీచర్ అందరికన్నా స్ట్రిక్టు. ఏ మాత్రం క్రమశిక్షణ వుల్లంఘించినా కొట్టేవాడు.

ఉల్లిపాయ తిని వెళ్తే బ్రాహ్మణ టీచర్లు కొట్టేవారు. రాగి సంగటి తిని వెళ్ళినా అంతే. పళ్ళికిలించమనే వాళ్ళు. పళ్ళల్లో అతుక్కొనే సంగటిని చూసి వాళ్ళు సంగటి తిన్నారని గుర్తుపట్టేసేవాళ్ళు.

స్కూల్లో ఎక్కువగా పేదపిల్లలే వుండేవాళ్ళు. దళితుల పిల్లలు ఎవరూ వున్నట్టు గుర్తులేదు రాజుకు.

అప్పుడు ఎక్కువగా బిల్లాకోడి, గోలీలు ఆడేవాళ్ళు. జామ చెట్లమీద కోతి కొమ్మచ్చి కూడా ఆడటం ఆయనకు గుర్తుంది.

ఆ రెండణాలే ఆయన్ని స్కూలు మానిపించింది

స్కూలుకు పోతున్నప్పుడే, అక్కలరాజు తన వెంట ఎద్దుల బండిలో కొడుకుని తీసుకెళ్ళేవాడు తండ్రికి సహాయంగా తట్టల్లో ఇసుక నింపేవాడు చిన్నస్వామిరాజు.

రాజు 4వ తరగతి చదివాడు. తర్వాత మిడిల్ స్కూలుకు వెళ్ళాలి. కానీ అక్కలరాజు కొడుకుని స్కూలు మానిపించాడు.

అక్కలరాజు ఎందుకు స్కూలు మానిపించాడు? రెండు కారణాలు.

1. మిడిల్ స్కూల్‌కు ఫీజు 5 రూపాయలు కట్టే స్తోమత లేదు.
2. స్కూలుకు వెళితే ఏమిటి లాభం? తన వెంట వస్తే తనకు ఎద్దులబండి రవాణాలో, పొలం పనిలో చేదోడు వాదోడుగా వుంటాడు.

మరి చిన్నస్వామిరాజు స్వయంగా ఎందుకు స్కూలు మానేశాడు? అప్పుడు వాళ్ళ నాన్న ఎద్దుల బండిలో బండలు తోలేవాడు. 24 రాళ్ళు వేస్తే, ఒక రాయి ఉచితంగా ఇచ్చేవాడు ఆ రాళ్ళ వ్యాపారి. ఆ రాయిని అంగట్లో అమ్ముకొంటే రాజుకు రెండణాలు వచ్చేవి. ఒక్కోసారి రాళ్ళ వ్యాపారికి తెలియకుండా ఇంకో రాయిని దొంగిలించేవాడు రాజు.

ఆ రెండణాల కోసం స్కూలుకు నిలచిపోయాడు రాజు.

ఆ రెండణాలు తన జీవితాన్ని పెద్ద మలుపు తిప్పుతుందని అప్పుడు వూహించలేదు ఆ పిల్లవాడు.

బడి నుంచి ఎద్దుల బండిలోకి.....

అప్పట్లో అక్కలరాజు కన్‌స్ట్రక్షన్ సైట్లకు ఇసుక, జల్లి, ఇటుకలు ఎక్కువగా తోలేవాడు.

ప్లేగు తర్వాత మల్లేశ్వరం, ఇతర చుట్టు పక్కల ప్రాంతాల్లో నిర్మాణ కార్యక్రమాలు పెరిగాయి. ఫలితంగా అక్కలరాజు ఎద్దులబండికి కూడా గిరాకీ పెరిగింది.

పెద్దకొడుకు కుప్పరాజు కూడా పనిలో చేరాడు. రెండవ కొడుకు నారాయణరాజు అంత చురుకైనవాడు కాదు. చిన్నతనంలో ఆయనకి నోరు కూడా సరిగా తిరిగేది కాకపోవడంతో స్కూలుకు కూడా పంపలేదు.

అందువల్ల చిన్నకొడుకు చిన్నస్వామినే తన వెంట ఎద్దులబండిలో తీసుకెళ్ళేవాడు అక్కలరాజు.

అలా 10సం॥ల రాజు బడి నుంచి జీవితం ఒడిలోకి, చదువు నుంచి పనిలోకి వచ్చాడు.

నాన్నతో పాటు ఎద్దుల బండిలో వెళ్ళటం, ఎన్ని లోడ్లు ఇసుక తోలారు? లేదా జల్లి తోలారు? వంటి వివరాలు రాసుకోవడం మొదలుపెట్టాడు.

మరో వైపు వ్యవసాయంలో కూడా తన శ్రమను అందించేవాడు. అప్పటికి అక్కలరాజు యశ్వంతపురంలో కొంతభూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. రాగులు ప్రధాన పంట.

రాజు పైప్‌లైన్ రోడ్డు నుంచి రోజూ మధ్యాహ్నం 5 కి.మీ. నడిచి యశ్వంతపురంకు భోజనం తీసుకెళ్ళేవాడు.

పొద్దున్నే లింగయ్య కొట్టులో ఇడ్లీ తినటం ఇష్టం అప్పుడు రాజుకు. అణాకు ఒక ఇడ్లీ. ఎపుడైనా నాన్న తన వెంట తీసుకెళ్ళి మసాల దోసె, లేదా స్వీట్ కొనిచ్చేవాడు.

అప్పుడు జీవితం చాలా సింపుల్‌గా వుండేది. ఇవాళ వున్న సంక్లిష్టత లేదు. పనిచేయటం, తినటం– అంతే.

సైరన్ మ్రోగితే చాలు బంకర్ల వైపు జనం పరుగులు

ఉదయం ఏడుగంటలు. డిసెంబర్ చలికాలపు చలి. పిల్లలూ, పెద్దలూ అందరూ చలినెగళ్ళు వేసుకొని చలికాచుకుంటున్నారు. ఒకరి మీద ఒకరు సరదాగా జోకులు వేసుకుంటూ నవ్వుకొంటున్నారు. వాళ్ళల్లో చిన్నస్వామిరాజు కూడా వున్నాడు.

అంతలో... హఠాత్తుగా సైరన్ మ్రోగింది. బిన్నీ మిల్లులో వున్న పొడవాటి గోడ మీద వున్న సైరన్ మోగింది. అంతే. అంతవరకు బద్ధకంగా నెగడు వెచ్చదనంలో కంబళ్ళు కప్పుకొని కూర్చున్న వాళ్ళంతా తలో దిక్కుకు పరుగులు తీశారు.

వాళ్ళే కాదు గాడిదల మీద సరుకులు తీసుకెళుతున్న వాళ్ళు, కూరగాయలు అమ్ముతున్న వాళ్ళు... పాలు పోస్తున్న వాళ్ళు, సైకిల్ మీద వెళుతున్న కుర్రాళ్ళు.. ఇలా అందరూ సైరన్ మ్రోత చెవులకు సోకగానే పరుగులు తీశారు. ఒక్కసారిగా రోడ్లన్నీ నిర్మానుష్యమయిపోయాయి. స్కూళ్ళ ముందు ఓపెన్ గ్రౌండ్లలో వున్న అందరూ వెళ్ళి బంకర్లలో దూరారు. క్రింద చిన్న సొరంగంలా తవ్వి దాని మీద కర్రలు పేర్చి, వాటి మీద ఇసుకబస్తాలు నింపారు. ఆ సొరంగంలో దూరుతున్నారు పిల్లలూ.... పెద్దలూ.. ఆడ... మొగ.. అందరూ.

*పై దృశ్యాలు **1942**సం॥ నాటి చిన్నస్వామిరాజు జీవితంలోనివి. ఆ నాటి జీవితం నిరంతరం భయం... భయం.. ఎప్పుడు బాంబులు పడుతాయో తెలియదు. సైరన్ మోగిన కాసేపటికి ఆకాశం నుంచి యుద్ధ విమానాలు వెళ్ళేవి. ప్రజలంతా ప్రాణాల్ని బంకర్ల కింద దాచుకొనేవాళ్ళు.*

కాసేపయ్యాక మెల్లగా బయటికి వచ్చేవాళ్ళు.

చిన్నస్వామిరాజు అలాంటి యుద్ధవాతావరణంలో పెరిగాడు. భయం అంటే ఏమిటో చూశాడు. అనుభవించాడు.

మన దేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొంతమంది నేతల నాయకత్వంలో ప్రజలు పోరాడారు. ఆ చరిత్ర మనకు తెలుసు. అయితే సాధారణ ప్రజల దైనందిన జీవితం గురించిన చరిత్ర చాలా తక్కువ తెలుసు మనకు.

చిన్నస్వామిరాజుది అలాంటి సాధారణ జీవితం. ఇతర అసంఖ్యాక ప్రజలవలె ఆయన కూడా చాలా చిన్న వయసులోనే కష్టపడటం మొదలు పెట్టాడు.

అయితే కేవలం శ్రమ చేయడం ద్వారానే జీవితంలో విజయం సాధించ లేరు అందరూ.

శ్రమ చేసి కూలినో, జీతమో ప్రతిఫలంగా తీసుకొని, దానికి సరుకులు కొని తననూ, తన కుటుంబాన్ని పోషించడం వేరు.

'శ్రమ + ఫలితం = జీవించడం' – ఇది ఒక వృత్తం. అయితే ఈ వృత్తం నుంచి బయటికొచ్చి, విజయ శిఖరాల వైపు ప్రయాణం చేయడం అందరికీ సాధ్యమయ్యే పని కాదు.

'బాల్యంలో ఏదో ఒక ప్రత్యేక క్షణం వుంటుంది. ఆ క్షణంలో తలుపు తెరచుకొంటుంది. భవిష్యత్తు బాల్యంలోనికి అడుగు పెడుతుంది' అంటాడు దీపక్ చోప్రా.

చిన్నస్వామి రాజు బాల్యంలో కూడా అలాంటి ప్రత్యేక క్షణం వుంది. అది స్కూలుకు నిలిచిపోయిన క్షణం. అప్పుడే, ఆ క్షణంలో భవిష్యత్తు లోనికి ప్రవేశించింది.

అటువంటి భవిష్యత్తులోకి ఒక్కో మెట్టే నిర్మించుకొని, ఆ మెట్లు ఎక్కుతూ నిరంతరం సాగిన విజయ ప్రయాణం గూర్చి తెలుసుకోవాలంటే ముందుగా వాళ్ళన్న కుప్పరాజు ప్రారంభించిన ప్రయాణంతో మొదలు పెట్టాలి.

6. గ్లోబల్ హ్యాట్స్‌లో పనివాడు
తిరుమల రాజపురంలో పనిమంతుడు

కాంట్రాక్టు పనులు ప్రారంభించిన కుప్పరాజు అరుణాచల మొదలియార్ కాంట్రాక్టు కంపెనీలో చిన్న భాగస్వామి. అయితే సిన్సియారిటీ, హార్డ్‌వర్క్ తప్ప మరో ధ్యాస లేకపోవడం వల్ల కుప్పరాజు మెల్లగా ఎదగడం మొదలు పెట్టాడు.

1942 నాటికి కుప్పరాజు ఆర్థికంగా కొంత నిలదొక్కుకున్నాడు. తమ ఉమ్మడి కుటుంబాన్ని పోషిస్తున్న రామక్కకు చేదోడు వాదోడుగా నిలిచాడు.

అప్పటికే ఆయన స్వంతంగా కాంట్రాక్టు పనులు ప్రారంభించాడు. అరుణాచల మొదలియార్ చనిపోయాక, ఆయన గతంలో తనకు చేసిన సహాయానికి కృతజ్ఞతగా ఆయన కొడుకు ఆర్థికంగా ఇబ్బందుల్లో వుంటే, తన వ్యాపారంలో భాగస్వామ్యం ఇచ్చి అతన్ని ఆదుకున్నాడు కుప్పరాజు.

కుప్పరాజు చేసిన ఈ మంచిపని తమ వున్నతికి ఎంతో మేలు చేసిందని ఇప్పటికీ సెంటిమెంటల్‌గా ఫీలవుతాడు చిన్నస్వామిరాజు.

తన కాంట్రాక్టు పనుల్ని విస్తరించడంలో భాగంగా కుప్పరాజు కంటోన్మెంట్ ఏరియాలోకి ప్రవేశించాడు. ముఖ్యంగా మిలిటరీ వాళ్ళ బిల్డింగులు, బ్యారెక్స్ కట్టించడం వంటి పనులు మొదలు పెట్టాడు. అందువల్ల ఆయనకు కంటోన్మెంట్ ఏరియాలో పరిచయాలు పెరిగాయి.

కంటోన్మెంట్‌లో పరిచయాల వల్ల, అక్కడ వున్నత స్థానాల్లో వున్న అనేకమంది ముస్లింలతో కుప్పరాజుకు పరిచయాలు ఏర్పడ్డాయి.

నజీర్ అహ్మద్ కూడా అలా పరిచయమయిన వాడే. నజీర్ & బ్రదర్స్‌కు కమర్షియల్ స్ట్రీట్‌లో 'గ్లోబల్ హ్యాట్స్' అని ఒక షాపు వుండేది. అప్పుడు కమర్షియల్ స్ట్రీట్‌లో ఎక్కువ షాప్‌లు ముస్లింలవే.

నజీర్ తన షాప్‌లో పార్టనర్‌గా చేరమని కుప్పరాజును ఆహ్వానించాడు. కుప్పరాజు తన చెల్లెలు మంగమ్మ భర్తను తన తరపున షాప్ చూసుకోమని పెట్టాడు.

12 యేళ్ళ చిన్నస్వామి రాజును కూడా పనివాడిగా షాప్‌లో పెట్టాడు 23 యేళ్ళ యువ కాంట్రాక్టర్ కుప్పరాజు.

తెల్ల దొరలకు పగలు టోపీలు

రాత్రి వుల్లి బాంబులు

ఆ షాప్‌లో రెండేళ్ళు పని చేశాడు చిన్నస్వామి. ఆ రెండేళ్ళల్లో తనకు ఇప్పటి వరకు పరిచయంకాని మరో ప్రపంచాన్ని చూశాడు రాజు.

ఆ షాప్‌కు ఎక్కువగా బ్రిటిష్ వాళ్ళు, ఇటాలియన్స్ వచ్చేవాళ్ళు. సేల్స్‌బాయ్స్ ఆ టోపీలను అమ్మేతీరును రాజు గమనించేవాడు. అమ్మడమంటే, నీకు అనుకూలంగా ఎదుటివాళ్ళను ఒప్పించడమే.

జీవితంలో తర్వాత ఎదుటి వాళ్ళను తనకు అనుకూలంగా ఒప్పించే కళ (persuasive art)లో రాజు ఎంతో నైపుణ్యం సంపాదించాడు. ఎవర్ని ఎలా ఒప్పించాలో ఆయనకు బాగా తెలుసు. బహుశా దీనికి బీజాలు ఆయనకు ఈ షాప్‌లోనే పడి వుండచ్చు.

అమ్మటం-కొనటం అనే మార్కెట్ ప్రాథమిక సూత్రాలు అర్థం కావడానికి ఈ అనుభవం రాజుకు ఉపయోగపడింది.

కష్టించి పని చేయటంతో పాటు షాప్‌కు వచ్చే వివిధ వ్యక్తుల్ని ఆసక్తిగా గమనించేవాడు. వాళ్ల మాటతీరును, హావభావాల్ని పరిశీలించేవాడు.

ఏ పాఠశాల ఇవ్వని అనుభవాన్ని రాజుకు ఈ షాపు ఇచ్చింది. తనలోపలికి ప్రవేశించిన భవిష్యత్తుకు అనుగుణంగా తయారవుతున్నాడు రాజు.

అలా పగలు తెల్లదొరలకు టోపీలు అమ్మిన రాజు రాత్రుళ్ళు ఏం చేసేవాడంటే.....

అప్పుడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెంగుళూరులో ఉద్యమాలు నడుస్తుండేవి.

వీధుల్లో జనం గుంపులుగా చేరి ఆందోళనలు చేసేవాళ్ళు. బ్రిటిష్ పోలీసులు, సైనికులు గుర్రాల మీద, ట్రక్కుల్లో వచ్చి జనం మీద పడి చావకొట్టే వాళ్ళు. బలవంతంగా ట్రక్కుల్లో వేసుకొని వెళ్ళేవాళ్ళు. అప్పుడు ప్రజలు రోడ్లమీద రాగులు చల్లేవారు. గుర్రాలు జారిపడిపోయేవి. ఆ గందరగోళంలో ప్రజలు సైనికుల బారినుంచి తప్పించుకునేవాళ్ళు.

మల్లేశ్వరంలో కూడా ఈ ఆందోళనా దృశ్యాలు తరచుగా కన్పించేవి.

కొంతమంది లీడర్ల ఆధ్వర్యంలో జరిగే ఆందోళనల్లో చిన్నస్వామిరాజు కూడా పాల్గొనేవాడు.

అప్పుడు గుంపుల్ని చెదరగొట్టేందుకు బ్రిటిష్ సిపాయిలు టియర్ గ్యాస్ వదిలేవాళ్ళు.

రాజువాళ్ళ గుంపు మల్లేశ్వరంలోని కాంగ్రెస్ వాది గణేషయ్యకి చెందిన గణేష్ హోటల్లో దూరే వాళ్ళు. లోపలి నుండి ఉల్లిగడ్డల్ని బ్రిటిష్ వాళ్ళ మీదికి విసిరే వాళ్ళు. రోడ్డు మీద వున్న జనం ఆ వుల్లిగడ్డల్ని పిండేవాళ్ళు.

టియర్‌గ్యాస్‌కు ఉల్లిరసం విరుగుడుగా పనిచేస్తుంది.

పట్టణం నుంచి పల్లెకు

చిన్నస్వామిరాజు పెదనాన్న సుబ్బరాజు పైప్‌లైన్ రోడ్డులో వ్యవసాయం చేస్తున్నాడని చెప్పుకొన్నాం కదా.

ఆయన బెంగుళూరులో వ్యవసాయం చేస్తూవున్నా ఆయన మనసంతా తమ స్వంత వూరు తిరుమలరాజపురంలోనే వుంది.

వ్యవసాయంలో చాలా కష్టపడేవాడు ఆయన. ఎలాగైనా తమ ఆస్తిని అడుమానం నుంచి విడిపించాలి. స్వంతవూరిలో మళ్ళీ వ్యవసాయం చేయాలి. తమని బహిష్కరించిన వాళ్ళ ముందే సగర్వంగా తలెత్తుకొని తిరగాలి. అది ఆయన ఆశయం.

చివరికి ఆయన కోరిక నెరవేరింది. బెంగుళూరులో చేసిన వ్యవసాయం నుంచి పొదుపు చేసిన డబ్బుతో, తమ గ్రామంలో తమ పొలాన్ని, ఇంటిని అడుమానం నుంచి విడిపించాడు. అప్పట్లో అడుమానం ఖరీదు 50రూ॥ల వరకు వుండొచ్చంటాడు రాజు.

అలా వెళ్ళిన సుబ్బరాజుతో పాటు తన రెండో కొడుకు నారాయణరాజును పంపించాడు అక్కలరాజు. అయితే నారాయణరాజు అక్కడ ఎక్కువ కాలం వుండలేదు.

సుబ్బరాజుకు పిల్లలు లేరు. అందువల్ల తమ్ముడు పిల్లలంటే చాలా ఇష్టం. ఆయన చిన్నస్వామిని పంపించమని తమ్ముడ్ని అడిగాడు.

అక్కలరాజు చిన్నస్వామిని తిరుమలరాజపురం పంపాడు. అలా 1944లో రాజు తన స్వంత గ్రామానికొచ్చాడు.

మూడుకార్ల సేద్యం – ఊరికి మొనగాడు

పద్నాలుగేళ్ళ రాజు పెదనాన్నతో కలసి వ్యవసాయంలో దిగాడు. వీళ్ళ పెదనాన్నకు, ఆయన దాయాదులకు ఉమ్మడిగా ఒక బావి వుండేది. వంతులవారిగా పొలాలకు నీళ్ళు పారించేవాళ్ళు.

ఒకరు పొలాలకు నీళ్ళు పారించాక బావిలో నీళ్ళు అయిపోయేవి. చాలా సేపటి వరకు

వూరేవి కావు. వూర్లో అందరి బావుల్లో ఇదే పరిస్థితి. అందుకనే సంవత్సరానికి రెండుకార్ల సేద్యమే వుండేది వూర్లో. అంటే రెండు పంటల్ని మాత్రమే పండించేవారు.

పరిస్థితిని గమనించిన రాజులో పట్టుదల పెరిగింది. వొక అర్ధరాత్రి ఎద్దుల్ని తీసుకొని బావి దగ్గరికి వెళ్ళాడు. బావి నిండుగా వున్నాయి నీళ్ళు. ఆనందంగా ఎద్దుల్ని కట్టి కపలి తోలడం మొదలు పెట్టాడు. తెల్లవారుఝాము వరకు అలుపు సొలుపు లేకుండా కపలి తోలుతూనే వున్నాడు. పెదనాన్న సుబ్బరాజు వరిమడికి నీళ్ళు కడుతూనే వున్నాడు.

అలా రాత్రి సేద్యం మొదలు పెట్టిన రాజు, ఆ యేడు వూర్లో అందరూ రెండు కార్లు పండిస్తే, తను మాత్రం మూడు కార్లు పండించాడు. జొన్నలు, రాగులు, కందులు, సజ్జలు ఆయన పండించిన పంటలు.

అయితే ఇలా పంటలు పండిచడం అంత సాఫీగా ఏమీ సాగలేదు. రాత్రంతా రాజు కపలి తోలడం వల్ల వుదయానికంతా బావిలో నీళ్ళు అయిపోయేవి. దాయాదులు గొడవలకు దిగేవాళ్ళు.

అయినా రాజు లెక్క చేయలేదు. అందరికన్నా ఎక్కువ కష్టపడటం అందరికన్నా ఎక్కువ ఫలితం సాధించడం రాజుకు చిన్నప్పటి నుంచే అలవాటు అయిందని చెప్పడానికి ఈ 'రాత్రిసేద్యం' వొక ఉదాహరణ.

వూరిలో అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు రాజు. వూరి పిల్లలతో కలసి గుడిలో భజనలు చేయడం, గరుడస్తంభం తీసుకొని ఇంటింటికీ వెళ్ళడం చేసేవాడు.

అప్పట్లో గ్రామాల్లో పద్యనాటకాలు ఎక్కువ. దాదాపు 12 కిలోమీటర్లు నడిచి వెళ్ళేవాడు నాటకాలు చూసేందుకు. మధ్యలో కొండ ఎక్కి దిగాల్సి వచ్చేది. అయినా లెక్క చేయకుండా తోటి పిల్లలతో కలసి నాటకాలకు వెళ్ళేవాడు.

అప్పట్లో భారతం నాటకం దాదాపు 20 రోజులు నడిచేది. వీలు దొరికినపుడంతా దాన్ని చూసేందుకు వెళ్ళిపోయేవాడు. భీముడన్నా, దుర్యోధనుడన్నా రాజుకు చాలా ఇష్టం. వాళ్ళ గదాయుద్ధాన్ని చూడటం మహా సరదా.

భక్త ప్రహ్లాద కూడా రాజుకు ఇష్టమైన నాటకం. దొంగతనంగా నాటకానికి వెళ్ళినందుకు పెద్దమ్మ చెవులు మెలేసేది. కార్తిక పండొగొస్తే రాజుకు చాలా ఆనందం. కాల్చిన కట్టెలు పట్టుకొని యువకులంతా వెళ్ళేవాళ్ళు. గ్రామాల మధ్య పోటీ వుండేది. ఆ యువకులతో పాటు చిన్నస్వామిరాజు కూడా పోటీపడేవాడు.

అలా పెదనాన్నతో పాటు రెండు సంవత్సరాలు గ్రామంలో వున్నాడు రాజు.

కుస్తీమే సవాల్

చిన్నప్పటి నుంచే చిన్నస్వామిరాజుకు కుస్తీ అంటే ఇష్టం. దీనికి కారణం రాజు వాళ్ళ మేనత్త రామక్క వాళ్ళ బావకొడుకు వెంకటేష్.

వెంకటేష్ కుస్తీ వీరుడు. అతన్ని చూసి ప్రేరణ పొందిన చిన్నస్వామిరాజుకూడా కుస్తీ నేర్చుకోవడానికి ప్రయత్నించాడు. వెంకటేష్‌తో పాటు గరడీమనె (వ్యాయామశాల)కి వెళ్ళి బస్కీలు తీసేవాడు.

అప్పట్లో బెంగుళూరులో కుస్తీ పోటీలు చాలా పాపులర్. మైసూరు పాలకులు కుస్తీ కళను బాగా ప్రోత్సహించేవారు.

బెంగళూరుకు సమీపంలోని 'అనేకల్'లో ప్రతి సంతరోజూ కుస్తీ పోటీలు జరిగేవి. దీన్ని 'సంత కుస్తీ' అని పిలిచేవారు.

బెంగుళూరులో 1945 ప్రాంతంలో నంజప్ప సర్కల్ గరడి, లాల్‌బాగ్ వెస్ట్‌గేట్ గరడి, శివాజినగర్‌లోని దిల్‌షేర్ గరడి, మల్లేశ్వరం గరడి చాలా పాపులర్ కుస్తీ పోటీల్ని నిర్వహించేవి.

కుస్తీని 'అఖడ' అని కూడా పిలుస్తారు. కుస్తీ మన దేశానికి క్రీ.శ. 5వ శతాబ్దంలో వచ్చింది. దీన్ని పర్షియా నుంచి మొఘలులు తీసుకొచ్చారని చెబుతారు. పహల్వాన్ పర్షియన్ పదం. 'కుస్తీ' వుర్దు నుంచి వచ్చిన పేరు.

అప్పుడు బెంగుళూరులో రెండు రకాల 'కుస్తీ' పద్ధతుల్ని ప్రాక్టీసు చేసే వారు. మొదటిది **'Free - Style Kusti'.** ఇది రెజిలింగ్‌కు సంబంధించి దేశీయ వైరైటీ. అంతర్జాతీయంగా గుర్తించబడిన 4 రూపాల కుస్తీలలో ఒకటి.

రెండవది Greco - Roman కుస్తీ. ఇది మధ్యదరా సముద్ర ప్రాంతపు పురాతన నాగరికతా కాలం నుంచీ వస్తూ వుంది.

చిన్నస్వామిరాజు కుస్తీ నేర్చుకున్నప్పటికీ, ఆయనెప్పుడూ కుస్తీ పోటీల్లో పాల్గొన లేదు. వెంకటేష్ పాల్గొనేవాడు. 'అప్పట్లో కుస్తీ పోటీల్లో పాల్గొనే వాళ్ళకు చెవులు పట్టుకుని లాగే వాళ్ళు– అవి గట్టి పడేందుకు' అని చెబుతాడు రాజు.

చిన్నస్వామిరాజుకు ఎన్ని పనులున్నా, ప్రతి ఆదివారం బెంగుళూరులో జరిగే కుస్తీ పోటీలకు మాత్రం తప్పకుండా హాజరయిపోయేవాడు. మహా మహా మల్లయోధులు కుస్తీపట్లు పడుతుంటే ఇతర యువకులతో పాటు కేరింతలు కొడుతూ చూసేవాడు రాజు.

బెంగుళూరులోనే కాదు. మదరాసులో జరిగే కుస్తీ పోటీలకు కూడా వెళ్ళేవాడు.

కింగ్‌కాంగ్, దారాసింగ్ వంటి పాపులర్ రెజిలింగ్ జెయింట్లు పాల్గొన్న రెజిలింగ్ పోటీలకు కూడా వెళ్ళాడు. ఆ జ్ఞాపకాల్ని ఇప్పటికీ ఆనందంగా నెమరు వేసుకుంటాడు ఆయన.

టీవీ ఛానల్సు వచ్చాక, వాటిల్లో WWF పోటీల్ని చూడటం ఆయనకు ఒక హాబీగా మారింది.

బహుశా ఆయనలోని ఫైటింగ్ స్పిరిట్‌ను అవి సజీవంగా వుంచుతాయి.

1946లో అక్కల రాజు కూతురి పెళ్ళి చేశాడు. అక్క పెళ్ళికి పెదనాన్నతో కూడా బెంగుళూరు వచ్చిన రాజు, పెళ్ళయ్యాక తిరిగి వూరికి వెళుతున్న పెదనాన్నకు కన్పించకుండా తప్పించుకొన్నాడు. ఇది ఆయన జీవితంలో మరో ముఖ్యమైన మలుపుకు దారి తీసింది.

బెంగుళూరులో వున్న ఆకర్షణ కావచ్చు, లేదా నగరపు తరహా పని పట్ల రాజుకు వున్న ఇష్టం కావచ్చు, ఏదైతేనేం అతను తీసుకొన్న ఆ నిర్ణయం రాజు జీవితంలో ఒక ముఖ్యమైనదిగా చెప్పవచ్చు.

అయినా రాజు మీద పెదనాన్న ప్రభావం బాగానే వుంది. పెదనాన్నకీ– అక్కలరాజుకీ మధ్య వున్న అన్యోన్య సంబంధం రాజు మీద ప్రభావం చూపిందని చెప్పవచ్చు. కుప్పరాజు– చిన్నస్వామిరాజు మధ్య కూడా అలాంటి సంబంధమే వుండేది.

అక్కల రాజు కూతుర్లకి సుబ్బరాజే కన్యాదానం చేసి పెళ్ళి చేశాడు. ముగ్గురు కొడుకులకూ ఉపనయనం చేశాడు.

రామక్క తర్వాత అక్కలరాజు పిల్లల్ని అంత ప్రేమగా చూసుకొంది సుబ్బరాజే.

'చాలా సార్లు 'పెదనాన్నకు ఆరోగ్యం బాగాలేదు' అని తిరుమల రాజపురం నుంచి కబురొచ్చేది. మేము అన్నదమ్ములం బెంగుళూరు నుంచి రాత్రికి రాత్రే వూరికి వెళ్ళేవాళ్ళం. మమ్మల్ని చూడగానే ఆయనకు బాగయిపోయేది' – అని ఆనందంగా తలుచుకొంటాడు ఇప్పటికీ చిన్నసామిరాజు.

7. జీవితం సీరియస్‌గా మొదలైంది

రుమలరాజపురం నుంచి పెదనాన్నతో పాటు 1946లో బెంగుళూరు వచ్చిన చిన్నస్వామిరాజు జీవితపు బరువు బాధ్యతలను మొత్తం తలకెత్తుకున్నాడు.

అప్పటి వరకు శ్రమ చేస్తూ వున్నా, మధ్య మధ్యలో ఆటలూ, పాటలూ వుండేవి. బాల్యం ఛాయలు పూర్తిగా పోలేదు.

1946 నాటికి కుప్పరాజుకు మరిన్ని కాంట్రాక్టు పనులు వచ్చాయి. నమ్మకంగా పని చేసే మనుషులు అవసరం అయ్యారు. కుటుంబ సంబంధాలూ, తమ కమ్యూనిటీ సంబంధాలు దృఢంగా వున్నపుడు ఎవరైనా తమ కుటుంబ సభ్యుల్నీ, కమ్యూనిటీ సభ్యుల్నీ పనులకు ఉపయోగిస్తారు. కుప్పరాజు కూడా అదే చేశాడు.

తనకు అప్పటికే పెళ్ళయింది. తన బావమరిది చామరాజుది కూడా అటూ ఇటూగా చిన్నస్వామిరాజు వయసే. ఇద్దర్నీ తన పనుల్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు నియమించాడు కుప్పరాజు. మరో తమ్ముడు నారాయణరాజును కూడా తన క్రిందనే వుంచుకొన్నాడు.

దాదాపు ఒకేసారి కాంట్రాక్టు రంగంలో పనిచేయడం ప్రారంభించిన చామరాజు, చిన్నస్వామిరాజు– ఇద్దరూ ఆ రంగంలో తర్వాత కథానాయకులయ్యారు.

అప్పటికే కాంట్రాక్టు పనులతో పరిచయం వుంది చిన్నస్వామికి. నాన్నతో పాటు ఎద్దులబండి తోలేటప్పుడు అనేక రకాల కాంట్రాక్టు పనుల్ని పరిశీలించే అవకాశం కలిగింది. మల్లేశ్వరం 18వ క్రాస్‌లోని గంధపుకోట ఫ్యాక్టరీ నిర్మాణాన్ని బాగా పరిశీలించేవాడు రాజు. దానికి అవసరమైన మన్నుతోలేవాడు అక్కలరాజు.

మల్లేశ్వరంలో పేవ్‌మెంట్లు వేసే కాంట్రాక్టును తీసుకున్నాడు కుప్పరాజు. ఆ పనుల దగ్గర చిన్నస్వామిని వుంచి, తగిన గైడెన్స్ యిచ్చేవాడు.

1947లో బెంగుళూరుకు సమీపంలోని బిడదిలో నెల్లిగుడ్డ చెరువు తవ్వకం మొదలైంది. మట్టి తవ్వకానికి సంబంధించి 30 మందికి కాంట్రాక్టు ఇచ్చారు. అందులో కుప్పరాజు ఒకడు.

కుప్పరాజు చిన్నస్వామిరాజునూ, చామరాజునూ బిడదికి పంపాడు. బిడదిలో మన్ను తొవ్వేందుకు చిత్తూరు జిల్లా కుప్పం నుంచి దాదాపు 300 మందిని తీసుకొచ్చారు. ఆ తర్వాత వాళ్ళు కుప్పరాజు కుటుంబంతో నిలిచిపోయి దాదాపు 40 యేళ్ళ పాటు పనిచేశారు. మట్టి పని చేయడంలో వాళ్ళ నైపుణ్యం చాలా గొప్పది.

అలా చిన్నస్వామిరాజు కుప్పరాజు దగ్గర ఉద్యోగంలో చేరాడు. చెరువు దగ్గర వీళ్ళకొక తాత్కాలిక షెడ్డు వుండేది. కట్టెలపొయ్యి మీద వంతులవారీగా ఇద్దరూ వంట చేసుకొనేవాళ్ళు.

రెండు జతల బట్టలు మాత్రమే వుండేవి. రోజూ పని నుంచి రాగానే బట్టలు వుతుక్కోవడం, వంట, తిని నిద్రపోవడం– మళ్ళీ ఉదయం 5 గంటలకు లేచి పనికి సిద్ధమవటం.

జీవితం ఎంత సింపుల్ కదా అప్పుడు.

అప్పటి వరకు పని చేయటం మాత్రమే తెలిసిన చిన్నస్వామిరాజు మొదటిసారిగా ఇతరులతో పని చేయించడం మొదలు పెట్టాడు.

తను ఒక్కడు పనిచేయడం వేరు. ఇతరులతో పని చేయించడం వేరు. దాన్నే హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అంటారు. ఆశించిన లేదా ఉద్దేశిత లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన మానవ వనరుల నిర్వహణ.

ఆధునిక మేనేజ్‌మెంట్ నిర్వహణకు ప్రధాన వనరులు నాలుగు. మానవ వనరులు, ఆర్థిక వనరులు, సాంకేతిక వనరులు మరియు సహజ వనరులు.

పై నాలుగింటిలో మానవ వనరుల నిర్వహణ చాలా ప్రధానమైనది. బిడది చెరువు తవ్వకంలో చిన్నస్వామిరాజు సుమారు 2సం॥లు పని చేశాడు. మానవ వనరుల నిర్వహణలో ఇది ఆయనకు తొలి ఆన్‌హ్యాండ్ ట్రెయినింగ్ అని చెప్పవచ్చు.

1949 ప్రాంతంలో బిడది నుంచి బెంగుళూరు వచ్చిన చిన్నస్వామిరాజును కుప్పరాజు బెంగుళూరులో రోడ్డు నిర్మాణ పనుల్లో సూపర్‌వైజర్‌గా వుంచాడు.

అప్పుడు బెంగుళూరులో సిటీ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ బోర్డు (CITB) వుండేది. అది 1945లో ఏర్పడింది. అది ప్రధానంగా రెసిడెన్సియల్ సైట్లను నిర్మించడం, ఇండస్ట్రియల్ సబర్బ్‌లను నిర్మించడం, రోడ్లను నిర్మించడం, వున్న రోడ్లను వెడల్పు చేయడం చేసేది. బి.వి.కె అయ్యంగార్ రోడ్‌ను వేసింది ఈ బోర్డే.

అలాగే బోర్డు ఆధ్వర్యంలో జయనగర్, రాజాజీనగర్, ఇందిరానగర్, పేలస్ అప్పర్ ఆర్చర్డ్, కోరమంగల వంటి కాలనీలు అద్భుతంగా, ప్రణాళిక ప్రకారం విస్తరించాయి.

స్వాంత్రంత్యం తర్వాత బెంగుళూరు శరవేగంగా అభివృద్ధి చెందింది. ఆ అభివృద్ధిలో ఎంతోమందితో పాటు కుప్పరాజు కూడా తన వంతు పాత్ర నిర్వహించాడు.

CITB చేపట్టిన రోడ్డు నిర్మాణ పనుల్లో కొన్నిటికి కుప్పరాజు కాంట్రాక్టర్. ఆ తర్వాత మోరీలు వేశారు. బిడది చెరువు మట్టి పనిలో వచ్చిన డబ్బుతో కుప్పరాజు మిలిటరీ వాళ్ళ వేలంలో లారీ కొన్నాడు. దాని ఖరీదు 2,000రూ॥లు. అప్పట్లో కుప్పరాజు కుటుంబం స్వంత లారీతో బెట్టల్సూర్ నుంచి బండలు తోలేవాళ్ళు. అప్పట్లో అలా బండలు తోలింది కుప్పరాజు వాళ్ళొక్కరే. ఇప్పుడు బెట్టల్సూర్ నుంచి రోజుకు 2000 లారీల్లో బండల్ని తోలుతారు బెంగుళూరుకు.

బెంగుళూర్లో కాంట్రాక్టు పనులకు సంబంధించి మొదట లారీ కొన్నది కుప్పరాజే. మొదట లారీలో మట్టి తోలింది కూడా వీళ్ళే. అప్పటి వరకు గాడిదల మీద, ఎద్దుల బళ్ళ మీద మన్నుతోలేవారు.

లారీ కొన్న రెండు నెలల్లోపలే లారీ డ్రైవింగ్ నేర్చుకున్నాడు చిన్నస్వామిరాజు. చామరాజు సైట్ ఇంఛార్జ్‌గా వుండేవాడు. లారీ బాధ్యత చిన్నస్వామిరాజుదే.

లారీకి ఆయనే డ్రైవర్, క్లీనర్ & మెకానిక్. రాత్రింబగళ్ళు తోలేవాళ్ళు. రాత్రి లారీతో పాటు గుట్టళ్ళి షెడ్డు దగ్గర పడుకునేవాడు రాజు. మళ్ళీ తెల్లవారుఝాము 3 గంటలకు బయలుదేరేవాడు.

అప్పట్లో పనితప్ప వేరే ధ్యాస లేదు. రాజు చేస్తున్న పనికి జీతం వగైరా ఏమీ లేదు. అవసరమైతే అన్న కుప్పరాజును అడగటం, ఆయన ఇచ్చిన డబ్బుల్తో తిండి కొనుక్కోవడం అంతే.

అక్వాడక్ట్ కథ

బిడదిలో మట్టిపని చేసేటపుడు వీళ్ళ పనిని సబ్ ఇంజనీర్ దొరస్వామయ్య సూపర్‌వైజ్ చేసేవాడు. వీళ్ళు పని చేసే పద్ధతి ఆయనకు నచ్చింది. కాంట్రాక్టు పనుల్లో వేగం, నాణ్యత– ఈ రెండూ చాలా ముఖ్యం. ఆ రెంటిలోను చిన్నస్వామిరాజు బాగా చేసేవాడు.

అప్పట్లో 'పని చేసి అభివృద్ధి కావాలని వుండేది కాదు. పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలనే వుండేది మాకు'– అంటాడు చిన్నస్వామిరాజు.

అలా వీళ్ళ పని పట్ల సంతృప్తి చెందిన దొరస్వామయ్య మండ్యలో అక్వాడక్ట్ (కాలువ) నిర్మాణం పనిని అప్పగించాడు.

కృష్ణరాజసాగర్ నుంచి వస్తున్న కాలువను 32కి.మీ. దారి మళ్ళించి వ్యవసాయ భూముల

1948 కరువు – రేషన్ బియ్యం స్మగుల్డ్ బై రాజు&కో

భారతదేశంలో కరువుకు చాలా పెద్ద చరిత్రే వుంది.

11వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు మన దేశంలో 11 అతిపెద్ద కరువులు వచ్చాయి.

18,19,20 శతాబ్దాలలో వచ్చిన చాలీసా కరువు, దోజీబారా కరువు, బెంగాల్ కరువు, మహాకరువు, మదరాసు ప్రెసిడెన్సీ కరువులలో సుమారు 4 కోట్ల మంది జనం చనిపోయారు.

20వ శతాబ్దంలో 1943లో బెంగాల్‌లో వచ్చిన కరువు అతి పెద్దది, చాలా భయంకరమైంది. ఈ కరువులో ఆకలి, రోగాల బారిన పడి 35 లక్షల మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

1947 ప్రాంతంలో మైసూరు రాష్ట్రంలో కరువు వచ్చింది. అప్పుడు కరువు కోడ్ (Famine Code)ను ప్రభుత్వం అమలు చేసి కరువులేని ప్రాంతాల్లో అమలులో వున్న రేషన్‌ను ఉపసంహరించి, కరువు ప్రాంతాల్లో రేషన్‌ను అమలు చేసింది.

ఈ కరువు కాలంలో చిన్నస్వామిరాజు, చామరాజు నెల్లిగడ్డ చెరువు మట్టిపని చేస్తున్నారు.

అప్పుడు బెంగుళూరులో తిండిగింజల కొరత ఏర్పడింది. కుప్పరాజుగారి కుటుంబానికి కూడా ఆహారధాన్యాల కరువు వచ్చింది.

అయితే నెల్లిగుడ్డలో కూలివాళ్ళకు రేషన్ ఇచ్చేవాళ్ళు. ఆ రేషన్ ధాన్యాన్ని స్థానికంగానే వినియోగించాలి. వేరే ప్రాంతాలకు తీసుకెళ్లడాన్ని నిషేధించింది ప్రభుత్వం.

అందువల్ల చిన్నస్వామిరాజు వాళ్ళ రేషన్‌లో ఇచ్చే ధాన్యాన్ని స్మగుల్ చేసి ట్రెయిన్‌లో బెంగుళూరుకు తీసుకొచ్చేవాళ్ళు.

గుడ్డ సంచిలో బియ్యం పోసి, దాని మీద బట్టలు పెట్టి, మొత్తం బట్టలున్నట్టు మాయ చేసి, ఆ బ్యాగులను సీటు కింద దాచేవాళ్ళు ట్రెయిన్‌లో.

ప్రతిసారీ 10 – 20 శేర్లు (కిలోలు) తెచ్చేవారు. జొన్నపిండితో గంజి చేసేవాళ్ళు.


ఆ కరువు 4–5సం॥లు వుండింది. ఎక్కువ భాగం ఈ రేషన్ స్మగుల్డ్ ధాన్యం మీదే బతికారు రాజువాళ్ళు.

చాలాసార్లు మనుషుల జీవితాల్ని, వారు నివసించిన ఆయా కాలాలు ప్రభావితం చేస్తాయి.

ఈ కరువు కాలంలో ఆహార ధాన్యాల విలువ ఏమిటో చిన్నస్వామిరాజుకు ప్రత్యక్ష అనుభంలోకి వచ్చింది.

ఈ కరువు జ్ఞాపకాలు ఇప్పటికీ ఆయనలో సజీవంగా వున్నాయి.

చరిత్ర వర్తమానంలోకి ప్రవహిస్తుంది. చిన్నస్వామిరాజు గతం కూడా ఆయన వెంట నడుస్తూనే వుంది. తన విలువైన జీవితం పట్ల వినమ్రుడై వుండేందుకు ఈ కరువు గతం ఆయనకు ఉపయోగపడుతూనే వుంది.



యువకుడిగా చిన్నస్వామి

వినియోగం కోసం తీసుకెళ్ళాలి. అది చాలా కష్టమైన పని కావడంతో ఎవరూ ముందుకు రావడం లేదు.

కుప్పరాజు బ్రదర్స్ అయితే సమర్థవంతంగా నిర్వహిస్తారని దొరస్వామయ్య వీళ్ళకు అప్పగించాడు.

అప్పట్లో కాలువ పనులకి ఒక క్యూబిక్ ఫీట్‌కి 3 లేదా 4 రూపాయలు. చాలా కష్టపడాల్సి వచ్చింది ఆ కాలువ తవ్వకానికి. అయితే ప్రకృతి అనుకూలించింది వీళ్ళకు. కృష్ణరాజసాగర్ ఎండిపోవడంతో 3 నెలల్లో కాలువ పని పూర్తయింది.

అయితే కాలువ తవ్వడం సాఫీగా జరగలేదు. కాలువకు అడ్డంగా ఒక గుట్ట వుంది. దాని మధ్యలో వెళ్ళాలి కాలువ. అందువల్లే 90 అడుగుల లోతు తవ్వాల్సి వచ్చింది. అప్పట్లో క్రేన్లు, జె.సీ.బీలు, ఎర్త్ డిగ్గర్లు లేవు. మనుషులే మన్ను తీశారు. అప్పటి శ్రామికుల శ్రమబలం అది.

లారీలు, మెటీరియల్సు సమయానికి ఆర్గనైజ్ చేయగలిగారు. మంచి కూలీల్ని సమీకరించగలిగారు. అప్పటికే చిన్నస్వామిరాజుకూ, చామరాజుకూ మన్ను తవ్వించడంలో, ఇతర కాంట్రాక్టు పనుల్లో తగినంత అనుభవం వుండటం వల్ల, ఇద్దరూ తమ శక్తి సామర్థ్యాల్ని పూర్తిస్థాయిలో వినియోగించి పని మీద కేంద్రీకరించారు. వీళ్ళకు ప్రకృతి కూడా సహాయపడింది.

రాజు డ్రైవింగ్ స్కూల్

(ఎద్దులబండి, సైకిల్, లారీ, బైకులు, కార్లు)

చిన్నస్వామిరాజుకు చిన్నప్పటి నుంచీ డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం.

ఎద్దులబండితో మొదలైంది ఆ ఇష్టం.

పెడల్ లేని సైకిల్ - బ్రేకుల్లేని లారీ

రాజుకు చిన్నప్పుడు సైకిల్ వుండేది. దాన్ని ఆపి ఎక్కడం అలవాటు లేదు. పోతూ పోతూ ఎగిరి ఎక్కటం ఇష్టం.

ఆ సైకిల్‌కు తరచుగా పెడల్స్ వుండేవి కావు. అలాగే తొక్కేవాడు.

అందుకనే ఇప్పటికీ ఆయన అంటుంటాడు 'పెడల్ లేని సైకిల్ తొక్కాను' అని.

బెంగుళూరులో మొదట లారీ కొంది రాజూ కుటుంబమే. మిలిటరీ ఆక్షన్‌లో 2 వేల రూపాయలకు కొన్నారు. లారీకొన్న 2 నెలలకు డ్రైవింగ్ నేర్చుకున్నాడు రాజు.

ఆ లారీకి సరిగా బ్రేకులు పనిచేసేవి కావు. బ్రేకులు లేకపోయినా గేర్ మీదనే లారీని నడిపే వాడు ఆయన.

ఒకసారి మైసూరు నుంచి బెంగళూరుకు బ్రేకుల్లేని లారీని నడిపాడు. చిన్న ప్రమాదం కూడా జరగలేదు. అప్పుడింత ట్రాఫిక్ కూడా లేదు.

బెంగుళూరులో రాజు కమ్యూనిటీలో రామకృష్ణమరాజు తర్వాత డ్రైవింగ్ నేర్చుకున్నది చిన్నస్వామి రాజే.

లారీ డ్రైవ్ చేయడమే కాదు దాని క్లీనర్ కూడా రాజే. మెకానిక్ కూడా.

*లారీ టైర్ పంచర్ అయితే, ఏర్ పంపుతో వెయ్యిసార్లు కొడితే **50** పౌండ్లు గాలి ఎక్కేది. టైర్లో **80** పౌండ్లు వుండాలి. అంటే **1600** సార్లు గాలి కొట్టాలన్నమాట. మనం సరదాగా 'గాలికొడుతున్నాడురా' అంటాం. కానీ గాలి కొట్టడం కూడా ఎంత కష్టమో అప్పుడు.*

అప్పట్లో లారీ ఇంజను కూడా చాలా పెద్ద సైజులో వుండేది. దాన్ని ఒకడే దింపి రిపేర్ చేసి తిరిగి ఫిట్ చేసేవాడు రాజు.

బైక్‌ల మీద ఫీట్లు

*చిన్నస్వామిరాజుకి బైక్‌లంటే మోజు. **16**వ యేట నుంచే బైక్స్ నడిపేవాడు.*

*ఆయన మొదటవాడిన బైక్ బి.ఎస్.ఏ. తర్వాత **AGS, Matchless,Royal Enfield** వంటి కంపెనీ బైక్స్‌ను వాడారు.*

బైక్స్‌ను ప్యాలస్ గ్రౌండ్స్‌లోకి తీసుకెళ్ళి వాటి మీద రకరకాల విన్యాసాలు చేసేవాడు.

ఆయన బైక్ శబ్దం వినబడితే చాలు – వాళ్ళింట్లో అందరూ సైలెంట్ అయ్యేవాళ్ళు.

కార్లల్లో లాంగ్ డ్రైవ్‌లు

ఆయనకు కార్లంటే కూడా చాలా ఇష్టం. మార్కెట్‌లోకి ఏ కొత్త కారు వచ్చినా ఆయన దాన్ని కొని నడపాల్సిందే.

ఫియట్, చెవర్లెట్, బెంజ్, అంబాసిడర్ – ఇలా అప్పట్లో వున్న అన్ని కార్లనూ ఆయన నడిపారు.

ఈయనా, చామరాజు ప్రతి శనివారం కారు తీసుకొని తిరుపతికి వెళ్ళేవాళ్ళు. బెంగుళూర్ నుంచి హైదరాబాద్‌కు కూడా కారులోనే వెళ్ళడం ఇష్టం ఆయనకి.

మనుమళ్ళు పెద్దవాళ్ళయ్యేదాకా కూడా ఆయన ప్రతి కొత్త మోడల్ కారునూ వాడేవాడు.

మనుమళ్ళు పెద్దవాళ్ళయ్యాక తన కార్లమోజు వాళ్ళకు అంటుకుంటుందని అర్థం చేసుకొని కార్లను కొనడం ఆపేశాడు.

***80** యేళ్ళ వయసులో ఇప్పటికీ చాలాసార్లు తన కారును ఆయనే డ్రైవ్ చేస్తారు.*

ఫలితంగా ఎవరూ చేయడానికి ముందుకు రాని పనిని ఈ ఇద్దరు యువరాజులు 3 నెలల్లో దిగ్విజయంగా పూర్తి చేసి అందరి దగ్గరా అభినందనల్ని అందుకున్నారు.

తక్కువ సమయంలో సాంకేతిక వనరులు, మానవ వనరులు, సహజ వనరుల్ని ఎలా సమీకరించి పనిచేయాలో ఈ కాలువ నిర్మాణంలో చిన్నస్వామిరాజు తెలుసుకొన్నాడు. అనుకోని అడ్డంకులు ఎదురైతే వాటిని ఎదుర్కొనే నైపుణాన్నీ, వ్యవహార దక్షతనూ ఈ కాలువ నిర్మాణంలో ఇద్దరు రాజులు సాధించారు.

తమపని తాము సిన్సియర్‌గా చేసుకుంటూపోతే, అదృష్టం దానంతట అదే తమను వెతుక్కుంటూ వస్తుందని రాజు అప్పుడు తెలుసుకొన్నాడు.

వొక విజయంతో తృప్తిపడేవాడు సవాళ్ళ నుంచి పారిపోయి ఆ విజయాన్ని తలచుకొంటూ విశ్రమిస్తాడు. **ఒక విజయం ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని సవాళ్ళను ఎదుర్కొనే వాడే విజయపరంపరవైపు నిరంతరం ప్రయాణిస్తాడు**. చిన్నస్వామిరాజు అలాంటి వాడే. ఆయనసలు దాన్ని విజయంగా చూడడు. అనుకొన్న కాలంలో, మాట ఇచ్చిన వ్యవధిలో పనిని తగినంత నాణ్యతతో పూర్తి చేయగలిగామా లేదా అన్నదే చూస్తాడు.

'నేను జీవితంలో దేన్నీ వెతుక్కుంటూ వెళ్ళలేదు. నాకు వచ్చిన పనిని నిబద్ధతతో చేసుకుంటూ పోయాను. అన్నీ అవే నా దగ్గరకు వచ్చాయి'- అంటారు ఆయన.

నుగు ప్రాజెక్టు – కలరా

కుప్పరాజుకు నుగు ప్రాజెక్టు నిర్మాణంలో పీస్ వర్క్ వచ్చింది. అక్కడికి చిన్నస్వామి రాజునూ, నారాయణరాజునూ పంపాడు. కబినీ డ్యాం అది. దానికి అప్పట్లో సిమెంటు లేదు. ఇసుకబట్టీ కాల్చి దాన్ని సున్నంతో మిక్స్ చేసేవాళ్ళు. ఈ మిశ్రమాన్నే 'సిమెంట్'గా వాడేవాళ్ళు. కాల్చిన ఇటుకను సాంకేతిక పరిభాషలో artificial pozzolans అంటారు. దీన్ని hydrated non-hydranlic lime తో మిక్స్ చేస్తే 'pozzolanic reaction' జరిగి 'సిమెంట్'లా ఆ మిశ్రమం పని చేస్తుంది.

నుగు ప్రాజెక్టు దాదాపు రెండు సంవత్సరాలు నడిచింది. అప్పుడే కలరా దాడి చేసింది. ఇక్కడ కలరాకు గురైన వాళ్ళని హాస్పిటల్‌కి చేర్చడం ద్వారా చిన్నస్వామిరాజు మొదటిసారి 'సామాజిక సేవ'లోకి ప్రవేశించాడని చెప్పవచ్చు.

1950 నుంచి 1954 వరకు చామరాజు కావేరీ నది మీద బన్నూరు బ్రిడ్జి నిర్మాణం చూసుకొనేవాడు. అప్పట్లో అదే వీళ్ళకు పెద్ద కాంట్రాక్టు. దాదాపు 5 లక్షల విలువైన పని అది.

ఆ కాంట్రాక్టును కుప్పరాజు తన బావమరిది అయిన చామరాజు స్వంతానికి వదిలేశాడు.

కలరా కలవరం – శవాల రవాణా

నుగు ప్రాజెక్టు నిర్మాణం కాలంలో చిన్నస్వామిరాజు, నారాయణరాజు అనేక అనుభవాల్ని ఎదుర్కొన్నారు. అలాంటి వాటిల్లో కలరా ఒకటి. కలరా మహమ్మారిలా విజృంభించి జనం మీద పడింది. దాని బారిన పడి జనం పిట్టల్లా రాలిపోతున్నారు.

అప్పటికి సరైన వైద్య సౌకర్యాలు లేవు. కలరాను ఎదుర్కొనే పద్ధతులు లేవు.

ఎక్కడ చూసినా శవాలు. నంజనగూడు నుంచి డ్యాం వరకు దారిపొడవునా కలరా సోకిన జనం పడివున్న దృశ్యాలు. తమ బంధువులు కలరాసోకి చనిపోతే, ఆ శవాల్ని వదిలిపెట్టి పారిపోతున్నారు. 'పోయినవారిని గురించి బాధ పడుతూ అక్కడే వుంటే మన ప్రాణాలు పోయేట్టున్నాయి'– అని శవాల బంధువులు ఆ ప్రాంతానికి దూరంగా వెళ్ళిపోతున్నారు.

కొంతమంది కలరా సోకి, త్వరగా చనిపోక, అలా అని బ్రతకనూ లేక ఎక్కడి వాళ్ళు అక్కడే మూలుగుతూ చావుకోసం ఎదురు చూస్తున్నారు.

ఆ సమయంలో చిన్నస్వామిరాజు, నారాయణరాజు రాళ్ళు తోలేవారు లారీలో. వాళ్ళే డ్రైవరూ, క్లీనరూ.

సహాయక చర్యల్లో తమకు సహకారం అందించాల్సిందిగా ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

ఆ విజ్ఞప్తికి స్పందించిన రాజు సోదరులు కలరా సోకిన వాళ్ళను తమ లారీలో తీసుకొని వెళ్ళి హుబ్బళ్ళి పట్టణంలో వున్న ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చేవాళ్ళు.

శవాల్ని తీసుకెళ్ళి వాళ్ళ బంధువులకు అప్పగించే వాళ్ళు. బంధువులు లేని అనాధ శవాల్ని కూలీల సహాయంతో ఆనకట్ట దగ్గర పాతి పెట్టేవాళ్ళు.

ఈ కలరా జ్ఞాపకాలు ఇప్పటికీ చిన్నస్వామిరాజులో సజీవంగా వున్నాయి.

అప్పట్లో అక్కలరాజు దీన్ని వ్యతిరేకించాడు. అంతపెద్ద పని వస్తే మనం చేయకుండా చామరాజుకు వదిలివేయటమేమిటి అని. కానీ చామరాజు సమర్థతను గుర్తించే కుప్పరాజు ఆ పనిని ఆయనకు అప్పగించాడు.

1951 నుంచి 54 వరకు అనంతపురం జిల్లా అమ్మసంద్ర–గుదిబండ మధ్యలో అక్వాడక్ట్ పనికి ఇంచార్జ్‌గా వున్నాడు చిన్నస్వామిరాజు. కుప్పరాజు సుబ్బారెడ్డి అనే మిత్రుడితో కలసి సంయుక్తంగా చేపట్టిన కాంట్రాక్టు పని అది.

మొదటిసారిగా ఒక పెద్ద ప్రాజెక్టును ఒకడే సమర్ధవంతంగా నిర్వహించాడు చిన్నస్వామిరాజు. **కేవలం 20 ఏళ్ళ వయసులోనే చామరాజు, చిన్నస్వామిరాజు పెద్ద ప్రాజెక్టుల్ని ఒంటరిగా పూర్తి చేయగల సమర్థులయ్యారంటే, వాళ్ళిద్దరూ ఎంత ప్రతిభావంతులో అర్థమవుతుంది.**

1954లో బెంగుళూరికి వచ్చాడు చిన్నస్వామిరాజు. బీఇఎల్‌లో క్వార్టర్లు కట్టే పనిని సూపర్‌వైజ్ చేశాడు. అది కూడా కుప్పరాజు, సుబ్బారెడ్డిల సంయుక్త ప్రాజెక్టే.

ఇప్పటి వరకు మట్టిపని, కాలువల నిర్మాణం, రోడ్డు పని, డ్యాముల పని చేసిన చిన్నస్వామిరాజు మొదటిసారిగా ఇళ్ళ నిర్మాణంలోకి వచ్చాడు.

ప్రతి నిర్మాణానికీ కొన్ని ప్రత్యేకతలుంటాయి. ప్రధానంగా ఆయా నిర్మాణాలను ఉపయోగించే ప్రయోజనాన్ని బట్టి ఆ నిర్మాణాలు నిర్మించబడుతాయి.

ప్రతి నిర్మాణం కూడా వర్తమాన అవసరాల్ని బట్టే కాక, భవిష్యత్తు అవసరాలకు కూడా తగినట్టు వుండాలి.

ఇవన్నీ అర్థం చేసుకోవడానికి వివిధ రకాల నిర్మాణాల వ్యవహారాల్ని పర్యవేక్షించడం చాలా బాగా ఉపయోగపడింది చిన్నస్వామిరాజుకు.

1954లోనే పెళ్ళి కుదిరింది రాజుకు.

8. వొక పెళ్ళి - వొక ప్రేమ - మరో పెళ్ళి

ప్రిల్, 1954లో చిన్నస్వామికి మొదటిసారి పెళ్ళి జరిగింది.

ఆమె పేరు కూడా వాళ్ల అమ్మపేరే. సుబ్బమ్మ.

ఇది పెద్దలు కుదిర్చిన పెళ్ళి. సుబ్బమ్మ వాళ్ళది కూడా తిరుమలరాజపురం. సుబ్బమ్మ వాళ్ళు రాజుకు బంధువులవుతారు.

పెళ్ళి జరిగిన కొంత కాలానికే హెచ్.ఎమ్.టిలో క్యాంటిన్ బిల్డింగుల నిర్మాణ పర్యవేక్షణలోకి వెళ్ళిపోయాడు రాజు.

సుబ్బమ్మ గర్భవతి అయింది. అప్పుడు తిరుమలరాజపురంలో అమ్మగారింట్లో వుండేది. ప్రసవ సమయం వచ్చేసరికి ఆమెకు గర్భస్రావం అయింది. వార్త తెలిసి బెంగుళూరు నుంచి చిన్నస్వామిరాజు వెళ్ళాడు. ఆమెను రాణిపేట హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. కానీ ప్రయోజనం లేకపోయింది. 8 రోజుల తర్వాత సుబ్బమ్మ చనిపోయింది.

చిన్నస్వామి చాలా బాధపడ్డాడు. కానీ ఆమెకు అంతే ఆయుస్సు వుందని మనస్సును సరిపెట్టుకున్నాడు.

తన పనిలో పడిపోయాడు. పూర్తిస్థాయిలో పనికి అంకితం అయ్యాడు.

✦ ✦ ✦

వొక సంవత్సరం గడిచింది.

ఒకమ్మాయిని చూశాడు. ఇష్టం కలిగింది. ఆమెను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. అయితే తాను ఇష్టపడుతున్నట్టు ఆ అమ్మాయికి చెప్పలేదు. అది ఒన్‌వే ట్రాఫిక్ లాంటిదన్నమాట.

అలా కొంతకాలం గడిచింది. ఆ అమ్మాయికి పెళ్ళయిపోయింది. 'నా నక్షత్రం (రేవతీ నక్షత్రం) ప్రకారం నా జీవితంలో భార్య తప్ప ఇంకో స్త్రీకి ఆస్కారం లేదు' అంటాడు ఆయన.

1956లో మళ్ళీ పెళ్ళయింది చిన్నస్వామిరాజుకి. భార్య పేరు ఇందిర. ఇప్పుడంతా 'ఇందిరమ్మ' అని పిలుస్తారు.

ఇందిర పెద్దన్న వెంకట్రాజు చిన్నస్వామికి మిత్రుడు. ఇందిర వాళ్ళ పూర్వీకులు కూడా ఒకప్పుడు చిత్తూరు జిల్లా నుంచి వచ్చి బెంగుళూరులో సెటిల్ అయినవాళ్ళే.

ఇందిర, చిన్నస్వామిరాజు బంధువులు కూడా అవుతారు. వెంకట్రాజుతోపాటు అనేక సార్లు వాళ్ళింటికి వెళ్ళేవాడు చిన్నస్వామి.

అప్పుడు ఇందిర చిన్నపిల్ల. 6వ తరగతి చదువుతూ వుంది.

ఆ సంబంధాన్ని పెద్దలు కుదిర్చారు. చిన్నస్వామిరాజు కూడా అభ్యంతరం చెప్పలేదు. అప్పుడు బాల్య వివాహాలు సర్వసాధారణం.

చిన్నస్వామిరాజు అన్ని విషయాల్లోను కర్మ సిద్ధాంతాన్ని చాలా బలంగా నమ్ముతాడు. మన జీవితానికి సంబంధించి ప్రతిదీ ముందే నిర్ణయింపబడి వుంటుందనీ, మన తలరాతను ఒకసారి రాసేశాక, ఇక రాసిన ఆ దేవుడు కూడా దాన్ని మార్చలేడని ఆయన అంటాడు.

పెళ్ళి విషయంలోనూ అంతే. "ఒకసారి పెళ్ళి చేసుకొన్నాక, నీ జీవితం ఇక ఆమెతోనే. 'నా పెళ్ళాం బాగా లేదు. వేరే వాడి పెళ్ళాం బాగుంది'– అనుకొంటూ పోతే జీవితంలో తృప్తి వుండదు". అంటాడాయన.

'దేవుడు ఈ జీవితాన్ని నాకిచ్చాడు. దీన్ని బాగా జీవించడం ఎలా?' అని మాత్రమే ఆయన ఆలోచిస్తాడు.

✦ ✦ ✦

పెళ్ళి ప్రస్తావన వచ్చింది కాబట్టి స్త్రీలకు సంబంధించి ఆయన దృక్పథమేమిటో చూద్దాం.

తమ కమ్యూనిటీలో సంప్రదాయబద్ధంగా స్త్రీల స్థానం వంటిల్లే. ఇంటి పనికే వాళ్ళు పరిమితం.

'యుద్ధకులం'గా పేరు పొందిన క్షత్రియుల్లో ఒకప్పుడు ఘోషా పద్ధతి వుండేది. తన చిన్నప్పుడు కూడా తమ కులం స్త్రీలు ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళేవారు కాదని, వాళ్ళతో మగవాళ్ళు తప్పని సరిగా వుండాల్సిందే అని చిన్నస్వామి అంటాడు.

అలా వాళ్ళ కుల సంప్రదాయం ప్రకారం, మిగతా మగవాళ్ళు స్త్రీల పట్ల ఎలాంటి దృక్పథాన్ని కలిగి వున్నారో చిన్నస్వామిరాజు కూడా అంతే.

ఆయన పెళ్ళి కూడా వాళ్ళ కుల సంప్రదాయాల ప్రకారమే జరిగింది.

పెళ్ళిలో వాళ్ళు ఘోషా వేసేవాళ్ళు స్త్రీలకి. ఇందిరకు కూడా అలా ఘోషా వేశారు.

బాబాలాంటి భర్తకావాలి

–శృతి, మనవరాలు

ఇవాళ్టి ప్రేమ చాలా చిత్రమైంది. క్యాండిల్ లైట్ డిన్నర్లు, గంటల తరబడి ఫోన్లో కబుర్లు, డైమండ్స్, గోల్డెన్ గిఫ్ట్‌లు – ఇలా వుంటుంది మన కాలపు ప్రేమ.

కానీ బాబా ప్రేమ వేరు. మా అమ్మమ్మను ఆయన ప్రేమించే తీరే వేరు. ఆమె కొద్దిగా నలతగా కనిపించినా ఆయన ఎంతో కేర్ తీసుకొంటారు తెలుసా? ఆమెకు హెల్త్ ప్రాబ్లమ్ వస్తే మొదట వుండేది ఆయనే.

వొకసారి చైనా వెళ్ళాం బాబాతో కలసి. అమ్మమ్మ బెంగుళూరులోనే వుండిపోయింది. ఆయన ప్రతిరోజూ ఆమెకు ఫోన్ చేసేవాడు. ఎలా వుందో కనుక్కొనేవాడు. 'సో స్వీట్ కదా' అనిపించింది నాకు.

ఇంకోసారి దక్షిణ కెనరా జిల్లాలోని మురుదేశ్వర్ టెంపుల్‌కి వెళ్ళాం. అప్పుడు అమ్మమ్మ కూడా వచ్చిందిలే. ఆయన ఆ సభలో స్టేజి మీద స్పీచ్ ఇవ్వబోతూ ముందుగా 'నాకు ఇది చాలా స్పెషల్ ఈవెంట్. చాలా కాలం తర్వాత నా భార్య నాతో ప్రయాణం చేసి వచ్చింది' అన్నాడు. ఎంత స్వీట్ కదా ఆయన అలా ప్రకటించడం?

ఆయన ప్రేమ నిజమైంది. ఆయన ఇవాళ్టి అబ్బాయిల లాగా పైకి ప్రకటించకపోవచ్చు.

ఆయన నూటికి నూరు శాతం ఫ్యామిలీ మ్యాన్. మొదట ఫ్యామిలీ. తర్వాతనే ఏదైనా. కుటుంబంలోని స్త్రీల పట్ల వొక మహారాజులా కేర్ తీసుకొంటాడు.

ఆయనలో వొక స్టయిల్ వుంది. వొక టేస్ట్ వుంది. ఆయన ఏ పని చేసినా అందులో రాయల్ క్వాలిటీ వుంటుంది. వండరఫుల్ పర్సనాలిటీ ఆయన.

నేను చాలాసార్లు ఏమనుకుంటానో తెలుసా?

నాకు ఆయన లాంటి భర్త దొరికితే ఎంత బాగుణ్ణు !

వాళ్ళది వుమ్మడికుటుంబం. పైగా నిరంతరం పనిమీదే వుండే రాజు, భార్యతో ఎక్కువ గడిపేవాడు కాదు.

తన వ్యాపార విషయాలు కూడా ఆమెకు తెలిపేవాడు కాదు. 'బయటి విషయాలు ఇంట్లో చెప్పడం వల్ల ఉపయోగం లేదు. వాళ్ళు కంగారు పడతారు. అనవసరంగా వాళ్ళను టెన్షన్ పెట్టినట్టు అవుతుంది. పైగా వాళ్ళకు విషయాలు పూర్తిగా తెలియక మనకు తప్పుడు సలహాలు ఇస్తారు'– అంటాడు ఆయన.

అయితే మెలమెల్లగా కాలంతో పాటు స్త్రీల విషయంలో ఆయన మారుతూ వచ్చారు. తన కూతురు 'రేవతి' చదువు విషయంలో ఆయన వ్యతిరేకించలేదు.

ఆయనకు ప్రేమ వ్యక్తం చేయడం తెలియదు

– ఇందిర

మా ఆయనకి పని ముఖ్యం.

పిల్లలు, పెళ్ళాం, సంసారం– అట్లా ఎక్కువ లేదు. ఆయన నాతో ఎక్కువ టైమ్ స్పెండ్ చేసేవారు కాదు. కానీ కొరతగా వుండేది కాదు. ఇదే ప్రపంచమేమో అనుకొన్నాను.

మనిషి జోరు కదా– దేనికి అలుగుతాడో, దేనికి కోపమొస్తుందో తెలిసేది కాదు నాకు.

ఆయన విషయాలు, సమస్యలు ఏవీ తెలిసేవి కాదు. మా ఇద్దరిదీ ఏముందో.. అంతే. ఎన్ని సమస్యలున్నా బయట పడేవాళ్ళు కాదు. చాలా గుట్టు మనిషి. కొన్ని విషయాలు ఆడోళ్ళతో మాట్లాడకూడదన్నట్టుగా వుండిపోతాడు.

ఏజ్ సరిగ్గా వుంటేనే తెలుస్తుంది. ఆయన ఏజ్ పెద్దది. నా ఏజ్ చిన్నది. ఇదే ప్రపంచం అనుకొన్నాను. ఇప్పుడిప్పుడు ఇంక తెలిసినా ప్రయోజనం లేదుకదా– అయిపోయినంక.

నా మీద ప్రేమ, ఇష్టం వున్నాయి ఆయనకి. కానీ వాటిని ఆయన బయట పెట్టుకోలేరు– చూపించుకోలేరు. మొత్తం కుటుంబంలో పులిలాగ వుండేవాళ్ళు కదా– నా దగ్గరా అంతే.

కొందరు మొగుళ్ళు ప్రేమను బయటపెట్టుకుంటారు. తెలుస్తుంది పెళ్ళానికి. ఈయన్ది ఒకే గంభీరమే.

ఇక మనవరాలు శృతి విషయానికి వచ్చేసరికి ఆయనది పూర్తిగా ఆధునిక దృక్పథం. ఆ అమ్మాయి ఎలాంటి చదువు చదవాలి? ఎలాంటి డ్రస్సులు వేసుకోవాలి? ఎలా ప్రవర్తించాలి? మొదలైన విషయాల్లో ఆమె నిర్ణయాన్నే ఆయన గౌరవించాడు. ఎక్కడా జోక్యం చేసుకోలేదు.

'నా కాలేజీ చదువయిపోయాక పై చదువులు చదవమని బాబా (తాతయ్య) నన్ను ప్రోత్సహించాడు. నిజానికి మా కమ్యూనిటీలో అప్పుడు పై చదువులకు వెళ్ళే అమ్మాయిలు చాలా తక్కువ'– అంటుంది శృతి.

ఆయన ప్రెసిడెంట్‌గా వున్న ' విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'కి కూడా ఒక మహిళే ప్రిన్సిపాల్. ఇందిర. ఆమె కూడా చిన్నస్వామిరాజు గైడెన్స్ దొరకడం తన అదృష్టమని చెబుతుంది. 'నన్నొక స్త్రీగా చూడరు. వొక మనిషిగా చూస్తారు. ఎలాంటి టెన్షన్స్‌లోనయినా కూల్‌గా గైడెన్స్ ఇస్తారు. ఏ మాత్రం నెగటివ్ ధోరణి లేదు ఆయన్లో'– అంటుంది ఆమె.

ఆయన కూతురు రేవతి కూడా 'నేను మా నాన్న కూతుర్ని కావడం గర్వపడాల్సిన విషయం' అని చెబుతుంది. 'ఇతరులున్నపుడు వుండే ఆయన గాంభీర్యమంతా నా దగ్గర కరిగిపోయేది' అంటుంది రేవతి. ఆమె వాళ్ళ నాన్న పెట్.

అలా ఆయన స్త్రీల విషయంలో 'రిజిడ్' గా లేదు. కాలంతో పాటు మారుతూ వచ్చాడు.

౨. కంపెనీ స్థాపన

లో Seth Walchand Hirachand బెంగుళూరులో హిందుస్థాన్ ఏర్‌క్రాఫ్ట్స్ లిమిటెడ్ (HAL) అనే కంపెనీని స్థాపించాడు.

అప్పట్లో మైసూరు ప్రభుత్వం ఈ కంపెనీకి 700 ఎకరాల్ని ఉచితంగా ఇచ్చింది. 20 లక్షల విలువైన షేర్లను కొన్నది.

రెండవ ప్రపంచయుద్ధకాలంలో బాంబరు విమానాలు, ట్రాన్స్‌ఫోర్ట్ విమానాలు, వాటి ఇంజన్లు ఈ HAL లో ఆగి తగిన పరీక్షలు, రిపేర్లు చేయించుకొనేవి.

తర్వాత HAL లో ఏర్‌క్రాఫ్ట్‌ను తయారు చేయడం కూడా మొదలు పెట్టారు. కుప్పరాజు వాళ్ళ అభివృద్ధి HAL తో చాలాకాలం ముడిపడి వుంది.

1956లో HAL లో ఒక రోడ్డు పని వచ్చింది చామరాజుకు. అప్పట్లో చాలా పెద్ద పని అది. 8 లక్షల విలువ.

చామరాజు కుప్పరాజును కలిశాడు. అందరూ కలసి ఒక కంపెనీని మొదలు పెడదామనుకొన్నారు.

ఆ రోడ్డు టెండర్ చామరాజు పేరు మీద వుంది కాబట్టి కంపెనీ పేరు 'చామరాజు అండ్ కంపెనీ' అని పెట్టారు.

ఆ విధంగా చిన్నస్వామిరాజు వాళ్ళ ఉమ్మడి కుటుంబంలో మొదటిసారిగా కంపెనీ మొదలైంది. ఈ కంపెనీలో చామరాజుకు ఒక భాగం, కుప్పరాజుకు ఒక భాగం, చిన్నస్వామిరాజుకూ, వాళ్ళ చిన్న అన్న నారాయణ రాజుకూ రెండు భాగాలు.

పని విభజన కూడా మొదలైంది. కుప్పరాజు అడ్మినిస్ట్రేషన్ చూసుకుంటాడు. చామరాజు ప్రభుత్వ విభాగాలతో సంబంధంలో వుండి, కోఆర్డినేట్ చేస్తాడు. చిన్నస్వామిరాజు, నారాయణరాజు ఫీల్డ్ ఇంచార్జులుగా వుంటారు.

అలా HAL లో రోడ్డు పనిలో దిగారు సోదరులు.



సుందర్ – రేవతి

ఆ తర్వాత HAL లోనే క్వార్టర్ల నిర్మాణం పని వచ్చింది. ఆ పనికి కూడా ఫీల్డ్ ఇంచార్జ్ చిన్నస్వామిరాజే. సుమారు 1000 క్వార్టర్లు కట్టారు.

ఈ సమయంలోనే ఒకేసారి అనేక పనులు వచ్చాయి. అందువల్ల ఎవరికి వారు విడివిడిగా ఆయా పనులను చేపట్టారు. ముగ్గురు సోదరులు, వీళ్ళ బావమరిది చామరాజు, వీళ్ళ సమీప బంధువుల్ని, వీళ్ళ ప్రాంతపు వాళ్ళనూ, వీళ్ళ కమ్యూనిటీ వాళ్ళకు కూడా ఆయా వ్యక్తుల పరిజ్ఞానం, అనుభవం, సామర్థ్యాన్ని బట్టి ఆయా పనులు అప్పగించారు.

వీళ్ళ దగ్గర పనిచేసిన అనేకమంది తర్వాత స్వతంత్ర కాంట్రాక్టర్లుగా ఎదిగారు. అందులో చాలా మంది ఉన్నత స్థాయిలకు వెళ్ళారు.

1958లో హెబ్బాళ్‌లో వెటర్నరీ కాలేజి నిర్మాణం పనులు వచ్చాయి. అది చామరాజు & కంపెనీ పేరు మీదే. ఈ కాలేజీ నిర్మాణానికి చిన్నస్వామి రాజు, వాళ్ళ పెద్దన్న కుప్పరాజు ఇంచార్జులు.

అదే సమయంలో HAL లో చామరాజు & నారాయణరాజులు ఇంచార్జులు. కొంతకాలం వరకు ఇలాంటి పని విభజన వుంది.

అయితే అందరూ ప్రతి ఆదివారం కంపెనీ ఆఫీసుకు వెళ్ళి ఆయా పనులకు సంబంధించి అకౌంట్స్ సబ్‌మిట్ చేసేవారు. ఆయా పనులకు సంబంధించి వారాంతపు సమీక్ష జరిగేది.

ఈ సమీక్ష అందరికీ ఉపయోగపడేది. ఒకరు ఇంచార్జ్‌గా వున్న సైట్లలోని లోటుపాట్లు ఇతరులకు తెలిసేవి. అలాగే తమ పనిలో లోపాలు తమకు తెలిసేవి.

1961లో రాజాజీనగర్‌లో ఇఎస్‌ఐ హాస్పిటల్ వర్క్ వచ్చింది. దానికి కూడా ఇంచార్జ్ చిన్నస్వామిరాజు & కుప్పరాజు.

1961లోనే మల్లేశ్వరంలో జూలీ ఫిల్టర్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పని వచ్చింది. దీని సామర్థ్యం 15 మిలియన్ లీటర్లు. అప్పట్లో ఇదే మొత్తం బెంగుళూరుకు నీటిని సరఫరా చేసేది.

అదే సమయంలో HAL లో రన్‌వేను విస్తృతపరచే పని వచ్చింది.

HAL లోనే హేంగర్ నిర్మాణ పని వచ్చింది. ఇది ఏషియాలోనే 12వ అతిపెద్దది. పై రెండు పనులకు చామరాజు & నారాయణరాజు ఇంచార్జ్‌లు.

1962లో ఇండో–చైనా వార్ వచ్చింది. వార్ కూడా రాజూ బ్రదర్లకు ఉపయోగపడింది. టాయ్‌లెట్లు, బాత్‌రూంలు కట్టే కాంట్రాక్టు వచ్చింది.

వేగంగా పని చేయడానికి అలవాటు పడ్డ రాజు సోదరులకు ఇది ఒక ఛాలెంజ్. కొత్తగా రిక్రూట్ అయిన ఆర్మీ జవాన్లు రోజూ దిగుతున్నారు. బెంగుళూరులో వాళ్ళకు టెంట్లు వేస్తున్నారు.

రౌడీలకు రౌడీ

1947లో బెంగుళూరులోని గుట్టహళ్ళిలో దత్తాత్రేయ దేవస్థానం దగ్గర కుప్పరాజు వాళ్ళు ఒక సైట్‌లో సగ భాగం కొని, ఇల్లు కట్టుకుని కాపురం పెట్టారు.

ఇంకొక సగ భాగంలో లారీ ఇంజన్ల మెకానిక్ మలయాళీ నాయర్ వుండేవాడు.

కొంత కాలం తర్వాత మెకానిక్ వున్న సైట్‌ను కూడా కుప్పరాజు వాళ్ళు కొన్నారు. అయితే నాయర్ ఖాళీ చేయడం లేదు. చివరికి కుప్పరాజు వాళ్ళు కోర్టుకు వెళ్ళారు. 1954 నుంచి రెండేళ్ళ పాటు కేసు నడిచింది.

1956లో కోర్టు కుప్పరాజు వాళ్ళకు అనుకూలంగా ఎవిక్షన్ ఆర్డర్ ఇచ్చింది.

అయితే నాయర్ స్టే ఆర్డర్‌కు రడీ అవుతున్నట్టు చిన్నస్వామి రాజుకు తెలిసింది. కోర్టు నుంచి ఎవిక్షన్ ఆర్డర్ పట్టుకొని అమీనా వచ్చేసరికి ఆ సైట్ ఖాళీగా వుంటే, అది ఖాళీగా వుందని, నాయర్ అనుభవంలో లేదని అమీనా రాసుకొని వెళ్ళిపోతాడు. అప్పుడు కోర్టు స్టే ఇవ్వదు.

26 ఏళ్ళ చిన్నస్వామి రాజు గాలి కన్నా వేగంగా కదిలాడు. కోదండరామాపురంలో వున్న మిత్రుడు దొరస్వామిరెడ్డి రాజుకు జతకలిశాడు.

ఇద్దరూ కలసి యశ్వంత్‌పురం వెళ్ళారు. రాజు తన స్నేహితుల్ని కలిశాడు. బండపని, మట్టిపని చేసే కూలీల్ని కదిలించాడు. అతి తక్కువ సమయంలో మిడతల దండులా 200 మందిని సమీకరించాడు రాజు.

ఈ సైన్యానికి రాజు సైన్యాధ్యక్షుడు. అతని నాయకత్వంలో దండు కదిలింది. ఆ నాయర్ సైట్ మీద వానరసైన్యంలా పడింది. ఆ సైట్లో ఒక లారీ, చాలా లారీ ఇంజన్లు వున్నాయి. ఇతర మోటారు వాహన సామాగ్రి వుంది.

లారీ ఇంజన్లనూ, ఇతర సామగ్రిని రోడ్డుకు అటువైపు దూరంగా వున్న ఖాళీ స్థలంలో పడేసారు.

అంతా నిమిషాల్లో జరిగిపోయింది. ఒక బ్యాచ్ లారీ ఇంజన్లను ఎత్తుకుపోయి పడేసి వచ్చేసరికి సైట్లో ఏమీ మిగల్లేదు. మామూలుగా అయితే ఒక్కో ఇంజను మోయడానికే చాలా సమయం పట్టేది. చాలా కష్టపడాల్సి వచ్చేది. అప్పట్లో లారీ ఇంజన్లు చాలా పెద్దవి. కానీ ఆ వూపులో ఎలా పని చేశారంటే..... తర్వాత వాళ్ళకే ఆశ్చర్యం వేసింది– అంత వేగంగా ఎలా పనిచేశామా అని.

అమీనా వచ్చి సైట్ ఖాళీగా వుందని రాసుకొని వెళ్ళిపోయాడు. కోర్టు స్టే ఇవ్వలేదు. ఇంత వరకు అంతా బాగానే వుంది.

అసలు కథ ఇప్పుడే మొదలైంది.

మలయాళీ మెకానిక్ తక్కువ వాడు కాదు. అతనికి శ్రీరామాపురం రౌడీలతో దోస్తీ వుంది. అప్పట్లో శ్రీరామాపురం రౌడీలంటే అందరికీ హడల్.

ఇంకేముంది? పెద్ద సంఖ్యలో రౌడీలు వచ్చారు రాజు ఇంటి మీదికి. 'నరుకుతాం. చంపుతాం.. అంతు చూస్తాం' అంటూ దాడి చేసిన రౌడీలు అక్కడి దృశ్యం చూసి నిశ్శబ్దంగా తిరుగు ముఖం పట్టారు.

రాజు ఇంటి ముందు లారీలు నిలిపి వున్నాయి. ఆ లారీల నిండా కట్టెలు పట్టుకొని వున్న జనం. ఆ దృశ్యం చూసి రాజు వాళ్ళ మీదికి దాడికి దిగే దమ్ములేక తోకలు ముడిచారు శ్రీరామాపురం రౌడీలు. అంత వరకు టెన్షన్ పడుతూ ఇంట్లో దాక్కుని వున్న రాజు & ఫ్యామిలీ నవ్వుకొన్నారు వాళ్ళు పారిపోవడం చూసి.

నిజానికి ఆ లారీల్లో జనం లేరు. కేవలం కట్టెలు మాత్రమే నిలబెట్టబడి వున్నాయి. బయటి నుంచి చూసే వాళ్ళకు జనం వున్న భ్రాంతి కలుగుతుంది. ఇదంతా రాజుగారి చాణక్యం. ఆయన వేసిన ఎత్తుగడ ఫలించింది.

శ్రీరామాపురం రౌడీలు 10-15 సార్లు వచ్చారు. అయితే రాజు మిత్రులు 15-20 మంది ఎప్పుడూ రాజు ఇంటి ముందు వుండేవారు. వాళ్ళను చూసి రౌడీలకు ముందుకు అడుగు వేసే ధైర్యం లేకుండా వెనుదిరిగేవారు.

ఈ ఎపిసోడ్ మొత్తం 15-20 రోజులు సాగింది. ఈ సంఘటన బెంగుళూరు నగరమంతా వ్యాపించింది. న్యూస్ పేపర్లలో కూడా ఈ వార్త ప్రచురితమైంది.

రాజుకు అప్పటి కాలంలో చాలా ముఖ్యమైన సంఘటన ఇది.

వాళ్ళకి కావాల్సిన కాంక్రీట్ స్ట్రక్చర్లు టాయ్‌లెట్లు మరియు కిచెన్‌లు. వాటిని చాలా వేగంగా నిర్మించాలి. ఎమ్.ఇ.జిలో వుంది ఈ పని.

ముగ్గురు సోదరులూ, చామరాజు అందరూ ఈ పని మీదనే దృష్టి పెట్టారు. ఒకరు కొనుగోళ్ళు చేసేవారు. మరొకరు డ్రాయింగ్స్‌ను ఫాలోఅప్ చేసేవారు. ఇంకొకరు మెటీరియల్ కో-ఆర్డినేట్ చేసేవారు. కూలీల్ని పెట్టి పనిచేయించేది ఇంకొకరు.

వనరుల సమీకరణ, టీమ్‌వర్క్, ఆర్గనైజేషన్, ప్లానింగ్- ఈ అన్నిటి ఉత్తమ కలయిక జరిగింది ఈ పనిలో.

కుటుంబం, కమ్యూనిటీ ఐక్యంగా వున్నపుడు చాలా సాధించవచ్చు అని చెప్పడానికి రాజుగారి కుటుంబం ఒక ఉదాహరణ. కలసికట్టుగా పనిచేయడం వల్లే 1950-1966 మధ్యలో విపరీతంగా పనులు వచ్చాయి. వాటన్నిటినీ చాలా సమర్థవంతంగా నిర్వహించుకుంటూ వచ్చారు.

వీళ్ళు చేపట్టిన అన్ని నిర్మాణాల్లో కామన్ థీమ్ సివిల్ వర్క్. దాదాపు అన్నీ ప్రభుత్వ పనులే అప్పుడు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికల్ని ప్రారంభించి దేశాన్ని అన్ని

రంగాల్లో అభివృద్ధి చేయడం మొదలు పెట్టింది. ఆ అభివృద్ధిలో దేశవ్యాప్తంగా లక్షల మంది పాల్గొన్నారు. కాంట్రాక్టర్లు, బిల్డర్లు, బ్యాంకర్లు వంటి అనేక నూతన వర్గాలు పుట్టుకొచ్చాయి. దేశాభివృద్ధిలో భాగంగా నయా ధనిక వర్గం పుట్టుకొచ్చింది.

అలాగే బెంగుళూరు, కర్ణాటకలో జరిగిన అభివృద్ధిలో కూడా అనేక మందితోపాటు కుప్పరాజు కుటుంబం పాల్గొని ఆ క్రమంలో తాము కూడా అభివృద్ధి చెందింది.

1964లో కుణగల్ దగ్గర అక్వాడక్ట్ వర్క్ వచ్చింది. కుణగల్ డ్యామ్‌కు మిగులు నీటిని వ్యవసాయ పనుల కోసం దారి మళ్ళించే కాలువ పని అది. శరావతి జలవిద్యుత్ ప్రాజెక్టు నుంచి విద్యుత్‌ను తీసుకొని స్థానికంగా పంపిణీ చేసేందుకు రిసీవింగ్ స్టేషన్, పీణ్యాలో కట్టే పని వచ్చింది.

1965 ప్రాంతంలో మిలిటరీ వాళ్ళకు క్వార్టర్లు కట్టడం మొదలు పెట్టారు. ఇది దొమ్మలూరు దగ్గర.

అప్పటికి చిన్నస్వామిరాజు ఇతర సోదరులతో కలసి ఏక కాలంలో రెండు పనులను పర్యవేక్షించడం చేసేవాడు.

Human Multi-tasking అనేది మేనేజ్‌మెంట్ నైపుణ్యాల్లో ఒకటి. ఏక కాలంలో అనేక పనులను చేయడం. ఈ పీరియడ్లో చిన్నస్వామిరాజుకు ఈ బహుళ-పనుల నిర్వహణలో ఆన్ హ్యాండ్స్ ట్రెయినింగ్ లభించింది.

ఇదే సమయంలో చామరాజు తన స్నేహితుడైన ఇంజనీర్‌తో కలసి 'బాలాజీ ఇంజనీరింగ్ వర్క్స్' అని స్వంత కంపెనీ మొదలు పెట్టాడు. బి.ఇ.ఎల్‌లో స్వంతంగా పనులు మొదలు పెట్టాడు.

చామరాజుకు ఫీల్డ్ వర్క్‌లో ఎంత పట్టు వుందో, ప్రభుత్వంతో వ్యవహరించడంలోనూ అంత సామర్థ్యం వుంది. ఆయనకు ప్రభుత్వ రంగంలోని అన్ని విభాగాలతో సత్సంబంధాలు వున్నాయి. అందువల్ల ఆయన స్వంతంత్రంగా చాలా వేగంగా ముందుకు పోయేందుకు గ్రౌండ్‌ను సిద్ధం చేసుకొన్నాడు. అందులో భాగంగానే స్వంత కంపెనీ పెట్టాడు.

చామరాజు కంపెనీ పెట్టడంతో కుప్పరాజు సోదరుల్లో కూడా పోటీ తత్వం వచ్చింది. వీళ్ళు 'రాజు & కంపెనీ' అని ఒక కంపెనీ పెట్టారు. ఇందులో కుప్పరాజు, నారాయణరాజు & చిన్నస్వామిరాజు మాత్రమే భాగస్వాములు. అయితే 'రాజు & కంపెనీ'ని పూర్తి స్వతంత్ర కంపెనీగా చేయ లేదు వీళ్ళు. చామరాజు & కంపెనీ నుంచి సబ్‌కాంట్రాక్టులు తీసుకొని చేయడానికి మాత్రమే 'రాజు & కంపెనీ'ని ఉపయోగించారు.

కుప్పరాజు ఫ్రెండ్ నారాయణ్‌సింగ్‌కు ఐరన్ ఓర్ బిజినెస్ వుండేది. ఒకప్పుడు అతను ప్రఖ్యాత ఐరన్ ఓర్ ఎగుమతిదారుడు. అయితే అతని బిజినెస్‌లో నష్టం రావడం వల్ల కంపెనీని మూసేశాడు.



సోదర త్రయం - చిన్నస్వామిరాజు, కుప్పరాజు, నారాయణరాజు

అతని అభ్యర్థన మేరకు వాళ్ల మైన్స్ నుంచి ఐరన్ ఓర్‌ను చిక్కనాయకనహళ్ళి నుంచి బాణాపూర్ రైల్వేస్టేషన్ వరకు లారీల్లో తోలడం మొదలుపెట్టారు కుప్పరాజు బ్రదర్స్.

ఇలా రోజుకు 100 టన్నులకు పైగా తోలేవారు.

ఆ తర్వాత 1966లో ఐరన్ ఓర్‌ను మంగళూరు సముద్ర పోర్టుకు తీసుకెళ్ళేవారు. అక్కడ సముద్రంలో ఒడ్డుకు ఒక కి.మీ దూరంలో వున్న షిప్‌లోకి బోట్ల ద్వారా ఐరన్ ఓర్‌ను చేర్చేవారు. అవి జపాన్‌కు ఎగుమతి అయ్యేవి. జపాన్ వాళ్ళు ఐరన్ ఓర్‌ను షిప్‌లోనే శుద్ధి చేసి తీసుకెళ్ళేవారు.

ఈ ఐరన్ ఓర్ యాక్టివిటీని చిన్నస్వామిరాజు పర్యవేక్షించాడు. తను చేసే కాంట్రాక్టు పనులకి ఇది కొంత భిన్నమైన యాక్టివిటీ.

1966 నాటికి చిన్నస్వామి రాజుకు 36 యేళ్ళు. కాంట్రాక్టులకు సంబంధించి కావచ్చు, సివిల్ వర్క్ కావచ్చు, లేదా పైన చెప్పిన ఐరన్‌ఓర్ రవాణా కావచ్చు- ఇలా అనేక వాటిల్లో తగిన అనుభవం, ఆచరణాత్మక జ్ఞానం లభించాయి ఆయనకు.

అయితే అప్పటి వరకు ఆయన వాళ్ళ అన్న కుప్పరాజుగారి జనరల్ గైడెన్స్‌తో నడుస్తున్నాడు. ఆయన ప్రపంచం మరింత విశాలం కావాలంటే ఆయన కొంత స్వతంత్రుడు కావాల్సి వుంది.

అవకాశం ఆయనకు హైదరాబాద్ నుంచి ఆహ్వానం పలికింది.

10. ఆయన బావి విశాలమైంది

యన పేరు బ్రిగేడియర్ నాయుడు. ఆయన DRDO (Defence Research and Development Organisation) లో ఆఫీసరు. DRDO తరపున హైదరాబాద్‌లో 1963 ప్రాంతంలో Defence Metallurgical Research Laboratory (DMRL) నిర్మించాలనుకొన్నారు. ఆధునిక యుద్ధానికి అవసరమైన ఆయుధాల్ని తయారు చేయడానికి అవసరమైన సంక్లిష్ట లోహాల్ని, ఇతర పరికరాల్ని తయారు చేయడానికి ఉద్దేశించబడిన సంస్థ అది.

మొత్తం 6 బిల్డింగులు కట్టాలి. టైమ్ ఎక్కువ లేదు. వేగంగా పనిచేయగల కాంట్రాక్టర్స్ ఎవరున్నారు?

వెంటనే ఆయనకు గుర్తుకొచ్చిన కంపెనీ పేరు: చామరాజు & కంపెనీ. ఇచ్చిన పనిని ఇచ్చిన గడువుకన్నా ముందుగానే పూర్తి చేయడంలో, నాణ్యత విషయంలో వాళ్ళకు చాలా పేరుంది.

కుప్పరాజు వాళ్ళకు బ్రిగేడియర్ నాయుడు నుంచి పిలుపు వచ్చింది. అర్జంటుగా హైదరాబాద్‌కు రమ్మని.

కుప్పరాజు, చామరాజు హైదరాబాద్ వెళ్ళారు. నాయుడిని కలిశారు. టెండర్ ఫాంను సబ్‌మిట్ చేయడం వగైరా ఫార్మాలిటీస్‌ను పూర్తి చేశారు.

30 రోజులకి ఒక బిల్డింగ్ కట్టాలి. 60 రోజులకి ఒకటి. 90 రోజులకి ఒకటి. ఇలా మొత్తం 6 బిల్డింగుల్ని 15 నెలల్లో కట్టాలి– మెకానికల్ టెస్టింగ్ ల్యాబ్, కెమికల్ టెస్టింగ్ ల్యాబ్ వగైరాలు. వాటితో పాటు ఉద్యోగులకు క్వార్టర్లు, విద్యుత్ సరఫరాకు సబ్‌స్టేషన్ కూడా నిర్మించాలి.

DMRL వంటివి ఇండస్ట్రియల్ కన్‌స్ట్రక్షన్ క్రిందికి వస్తాయి. ఇలాంటివి నిర్మించాలంటే ప్లానింగ్, డిజైన్ మరియు నిర్మాణంలో నైపుణ్యం వుండాలి. ముఖ్యంగా డిఫెన్సు ల్యాబ్ అవసరాల్ని అర్థం చేసుకొని వాటికి అనుగుణంగా నిర్మించాలి. డిఫెన్సు వాళ్ళ తరపున ఇంజనీర్లు వుంటారు. వాళ్ళతో కలసి పనిచేయాలంటే అందుకు తగిన స్కిల్స్ వుండాలి.



'హైదరాబాద్ ఇయర్స్'లో చిన్నస్వామి

చిన్నస్వామిరాజును హైదరాబాద్‌కు పంపాలని నిర్ణయించారు కుప్పరాజు, చామరాజు. డిఫెన్సు వాళ్ళకు సంబంధించి అనేక సంక్లిష్ట నిర్మాణాల్ని నిర్మించడంలో, డిఫెన్సు ఇంజనీర్లతో కలిసి పనిచేయడంలో తగినంత అనుభవం వుంది చిన్నస్వామిరాజుకు.

చిన్నస్వామిరాజు హైదరాబాద్ బయలుదేరాడు. మొత్తం కుటుంబాన్ని అక్కడికి మార్చాడు.

ఇది వొక కొత్త ఛాలెంజ్ చిన్నస్వామిరాజుకు. ఇప్పటి వరకు కర్నాటక, బెంగుళూరులోనే ప్రధానంగా పని చేశాడు. అన్నీ తెలిసినవి. పైగా కుప్పరాజు, చామరాజు వాళ్ళ సహాయ సహకారాలు వున్నాయి. తెలిసిన ప్రాంతం కాబట్టి ఆర్గనైజ్ చేయడం సులభం కూడా.

కానీ హైదరాబాద్ ఆయనకు కొత్త. అన్నీ కొత్తగా వెతుక్కోవాలి. పైగా టైమ్ ప్రెజర్ వుంది.

డిఎమ్ఆర్ఎల్ కు సంబంధించిన ఒక డైరెక్టర్ తమన్కర్ ఫ్రాన్స్‌లో వున్నాడు. అతను మిషనరీ షిప్‌మెంట్‌ను అక్కడ నుంచి పంపేశాడు. కానీ స్టాక్ చేయడానికి ఇక్కడ బిల్డింగ్ లేదు. వెంటనే 30 రోజుల్లో ఆ మెటీరియల్‌ను నిల్వ వుంచడానికి బిల్డింగ్ కట్టాలి.

ఇది ఒక ఒత్తిడి పరిస్థితి. హాలివుడ్ స్క్రీన్‌ప్లే గురువులలో ఒకడు, 'స్టోరి' పుస్తక రచయిత రాబర్ట్ మెకీ క్యారక్టర్ గురించి చాలా ముఖ్యమైన విషయం చెబుతాడు. అది ఏమంటే మామూలు సాధారణ పరిస్థితుల్లో ఒక మనిషి క్యారెక్టర్ తెలియదు. ఒక మనిషి ఒత్తిడి పరిస్థితిల్లో ఎలా ప్రవర్తిస్తాడో తెలిపేదే క్యారెక్టర్.

సరిగ్గా అలాంటి ఒత్తిడి పరిస్థితిలోనే చిన్నస్వామిరాజు డి.ఎమ్.ఆర్.ఎల్ నిర్మాణాన్ని మొదలు పెట్టాడు.

తనకున్న అనుభవంతో అతను చేసిన మొదటి పని ఏమిటంటే ముందస్తు ప్రణాళిక వేసుకొని నిర్మాణ సామాగ్రినీ, బార్‌బెండర్లనూ, కార్పెంటర్లనూ, ఇతర స్కిల్డ్ లేబర్‌ను బెంగుళూరు నుంచే తీసుకెళ్ళాడు. అంటే మొత్తం పరిస్థితిని తన అధీనంలో పెట్టుకున్నాడు.

ఒక సైన్యాధిపతి సైన్యానికి సంబంధించి అన్ని శాఖల్నీ తన అధీనంలోకి తెచ్చుకోకపోతే యుద్ధ వ్యూహాన్ని సక్రమంగా అమలు పరచలేడు. అలాగే ఒక ప్రాజెక్టును అమలు చేయాలన్నా, దానికి సంబంధించిన అన్ని అంశాలూ మన అధీనంలోకి తెచ్చుకోవాలి.

యుద్ధకళ గురించి సమగ్రంగా తెలిసిన సైన్యాధ్యక్షుడు ఎలా ఆర్గనైజ్ చేస్తాడో సరిగ్గా అలాగే చేశాడు చిన్నస్వామిరాజు.

ప్రధాన లాజిస్టిక్స్‌ను తన వెంట తీసుకెళ్ళిన రాజు వెంటనే భూమి పూజ చేసి పని ప్రారంభించాడు.

అంతే– వాళ్ళు ఇచ్చిన గడువు 15 నెలలు. ఆయన డి.ఎమ్.ఆర్.ఎల్ ను పూర్తి చేసింది కేవలం 12 నెలల్లోనే. మొత్తం 6 బిల్డింగులు పూర్తి అయ్యాయి.

డి.ఎమ్.ఆర్.ఎల్ భవనాల్ని అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించాడు.

డి.ఎమ్.ఆర్.ఎల్ భవన నిర్మాణంలో చిన్నస్వామిరాజు పనితనం చూసిన ఇంజనీర్లు ఇండో నిప్పాన్ బేరింగ్ కంపెనీ బిల్డింగ్ నిర్మాణానికి ఆయన పేరును రెకమండ్ చేశారు.

1969 లో ఇండో–నిప్పాన్ బిల్డింగు పనులు ప్రారంభమయ్యాయి. దానికి ఇచ్చిన గడువు 12 నెలలు.



హైదరాబాద్‌లో రేవతి భరతనాట్యం ఆరంగేట్రం సందర్భంగా

దీని నిర్మాణ కాలంలోనే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలైంది. దానికి నాయకత్వం వహించింది మర్రి చెన్నారెడ్డి. ఎక్కడ చూసినా పెద్ద ఎత్తున ఆందోళనలు.

అప్పటికి చిన్నస్వామిరాజుకు రెండు లారీలు వుండేవి. అందులో ఒక లారీని ఆందోళన కారులు తగులపెట్టారు.

ఒకసారి చిన్నస్వామిరాజు కారులో వెళుతుంటే, అబిడ్స్‌లో ఆందోళనకారులు కారు ఆపారు. చిన్నస్వామిరాజును బలవంతంగా కారులోంచి దించారు. ఆయన్ని దూషించడం, షర్టు పట్టుకొని లాగడం వంటివి చేశారు. ఆయన కారు అద్దాలు పగుల గొట్టారు.

అప్పటి నుంచి రాజు రేడియోలో వార్తలు విని, **ఎక్కడయితే అల్లర్లు జరిగాయో, ఎక్కడయితే బళ్ళు దగ్ధం చేశారో, ఆ రోడ్డులోనే లారీని తీసుకెళ్ళేవాడు. ఎందుకంటే అప్పటికే ఆ రోడ్డులో అల్లర్లు జరిగాయి కాబట్టి అక్కడ పోలీసు ప్రొటక్షన్ వుంటుంది కదా.**

అలా, ఆందోళనలు, అల్లర్లు జరుగుతున్న సమయంలో కూడా పని ఆపకుండా, నిర్ణీత వ్యవధిలోనే ఇండోనిప్పాన్ బిల్డింగ్‌ను పూర్తిచేయగలిగాడు ఆయన.

ఆయన హైదరాబాద్‌లో వున్న సమయంలోనే కర్నాటకలోని దావణగెరెలో ప్రభుత్వ ఆసుపత్రి బిల్డింగ్ కాంట్రాక్టు వచ్చింది.

అప్పుడు మరొక కంపెనీ పెట్టారు. దాని పేరు 'బెంగుళూరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ'. ఈ కంపెనీలో కుప్పరాజు బ్రదర్స్‌తో పాటు, చిన్నస్వామిరాజు వాళ్ళ బావ కూడా భాగస్వామి.

1969లో దావణగెరె హాస్పిటల్ భవనాల నిర్మాణం మొదలైంది. 600 పడకల ఆసుపత్రి అది. ఈ భవన నిర్మాణానికి కూడా ఇంచార్జ్ చిన్నస్వామిరాజే.

ఆయన హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు ప్రతి వారం వచ్చేవాడు. ఎక్కువగా బస్సులోనే ప్రయాణం. అప్పట్లో ట్రెయిన్ జర్నీ హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు 26 గంటలు. బస్ ప్రయాణం 13 గంటలు. మరీ అర్జంట్ అయితే ఫ్లయిట్లో వచ్చేవాడు. అప్పుడు హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు బస్సు ఛార్జీ 34రూ॥లు. ఫ్లయిట్ ఫేర్ 107రూ॥లు.

హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు వచ్చి అక్కడి నుంచి దావణగెరె వెళ్ళడం, అక్కడ ఒకటి రెండు రోజులు వుండటం మళ్ళీ హైదరాబాద్ వెళ్ళటం– ఇదీ ఆయన కార్యక్రమం అప్పుడు.

బళ్ళారిలో ఒక హాస్పిటల్ కట్టే పని వచ్చింది. మరి కొంత కాలానికి బీజాపూర్‌లో కూడా హాస్పిటల్ పని వచ్చింది.

అప్పట్లో బీజాపూర్ హాస్పిటల్ వర్క్ చేయడానికి ఏ కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదు. ఎందుకంటే అది ఒక మూల వుండేది. ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం తక్కువ. మెటీరియల్ దొరకదు. పైగా స్కిల్డ్ లేబర్ కొరత కూడా బాగానే వుండేది. అందుకని ఎవరూ ముందుకు రాకపోతే అప్పటి కర్నాటక వైద్య, ఆరోగ్య శాఖామంత్రి వై.రామకృష్ణ కుప్పరాజును రిక్వెస్ట్ చేశాడు. ఆ హాస్పిటల్‌ను నిర్మించి ఇవ్వమని. అలా ఆ పని మొదలైంది. ఆ వర్క్‌కు ఇంచార్జ్‌గా వున్నది చిన్నస్వామిరాజు బావమరిది, కుప్పరాజు అల్లుడు మాధవరాజు.

చిన్నస్వామిరాజు మాత్రం హైదరాబాద్‌లో కాంట్రాక్టు పనులు చేస్తూనే దావణగెరె, బళ్ళారి హాస్పిటల్ పనుల్ని సూపర్‌వైజ్ చేసేవాడు. హైదరాబాద్ నుంచి ఫ్లయిట్లో బెంగుళూరు వచ్చేవాడు. అక్కడి నుంచి దావణగెరెకు బస్సు జర్నీ. అక్కడ ఆ వారం పనుల్ని సమీక్షించి, తగిన గైడెన్స్ ఇచ్చి, అక్కడి నుంచి బస్సులో బళ్ళారి వెళ్ళేవాడు. రాత్రుళ్ళు ప్రయాణం, పగలంతా పని. రాత్రంతా ప్రయాణం చేసినా, పగలు విశ్రాంతికి సమయం వుండేది కాదు. ప్రయాణాల్లోనే నిద్రపోవాల్సి వచ్చేది. ఇప్పటికీ అదే అలవాటు ఆయనకి. రాత్రుళ్ళు జర్నీ చేయడాన్నే ఇష్టపడుతాడు.

1970ల నాటికి తెలంగాణా ఉద్యమ ఉధృతి వల్ల హైదరాబాద్‌లో ఆందోళనలు ఎక్కువవడం,

మరోవైపు కర్నాటకలో కాంట్రాక్టు పనులు ఎక్కువ కావడంతో కుప్పరాజుకు చిన్నస్వామిరాజు అవసరం పడటడం మూలంగా కుప్పరాజు చిన్నస్వామిరాజును బెంగుళూరు వచ్చేయమన్నాడు.

1970ల నాటికి చిన్నస్వామిరాజు బెంగుళూరుకు షిఫ్ట్ అయ్యాడు. ముందుగా రెంట్‌కు ఇల్లు తీసుకొన్నాడు.

నిజానికి హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో స్వంత ఇల్లు కూడా కట్టుకున్నారు. గృహప్రవేశం అయిన నెలలోపే బెంగుళూరుకు షిఫ్ట్ అవడంతో ఆ ఇల్లు అమ్మేశారు.

'హైదరాబాద్ ఇయర్స్'గా చెప్పుకొనే ఆ నాలుగు సంవత్సరాలు చిన్నస్వామిరాజు జీవితంలో చాలా ముఖ్యమైనవి. హైదరాబాద్ వెళ్ళడం ఆయన జీవితంలో ఒక ప్రధాన టర్నింగ్ పాయింట్‌గా చెప్పవచ్చు.

రెండు రకాలుగా 'హైదరాబాద్ ఇయర్స్' ఆయన జీవితాన్ని, ఆయన ప్రపంచాన్ని విశాలం చేశాయి.

ఒకటి: ఆర్థిక స్వాతంత్రం వచ్చింది. బెంగుళూరులో వున్నంత వరకు ఆయన కుప్పరాజు నీడలోనే వున్నాడు. కుప్పరాజు యజమాని అయితే చిన్నస్వామి పనివాడు. పని చేయడం, ఖర్చులకు అడిగి తీసుకోవడం– ఇంతే వుండేది.

బెంగుళూరులో వున్నంత కాలం ఆయనకు చెక్‌పవర్ కూడా లేదు. కుప్పరాజుకూ, ఆయన బావమరిది చామరాజుకు మాత్రమే చెక్ పవర్ వుండేది. **పది రూపాయలు కావాలన్నా వోచర్ రాసి తీసుకోవాల్సిందే. ఇప్పటికీ చిన్నస్వామిరాజుకు అదే అలవాటు.**

హైదరాబాద్‌కి వెళ్ళడంతో కుప్పరాజు నీడ నుంచి బయటికి వచ్చాడు. ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది. అది ఇచ్చే సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తక్కువ కాదు కదా. ఆ విధంగా చిన్నస్వామికి లభించిన ఆర్థిక స్వాతంత్ర్యం ఆయన్ని శక్తివంతుడిగా చేసింది.

రెండవ అంశం: తమ రాజు కమ్యూనిటీతో, ప్రభుత్వ అధికార్లతో, రాజకీయనాయకులతో ఆయనకు వచ్చిన పరిచయాలు.

ఆంధ్ర ప్రాంత రాజులకు – అంటే ఉభయ గోదావరి జిల్లాలు, విజయనగరం, విశాఖపట్టణం, హైదరాబాద్ ప్రాంత రాజులకూ – బెంగుళూరు రాజులకూ సంబంధ బాంధవ్యాలు చాలా తక్కువ. 'ఆంధ్ర రాజులు కొత్త రాజులురా – మన రాజులు కాదు' అనేవాడు అక్కలరాజు కొడుకులతో. ఆంధ్ర రాజులు తక్కువ స్థాయి రాజులని బెంగుళూరు రాజుల అభిప్రాయం. ప్రతి కమ్యూనిటీలోనూ ఇలాంటి అభిప్రాయాలు వుంటాయి.

అయితే 'హైదరాబాద్ ఇయర్స్'లో చిన్నస్వామిరాజుకు హైదరాబాద్‌లో నివసిస్తున్న రాజుల కుటుంబాలతో పరిచయాలు వచ్చాయి.

బెంగుళూరులో వున్నపుడే ఆయనకు ఆంధ్రరాజులైన రాజన్‌రాజు, పి.వి రాజులతో పరిచయాలు వచ్చాయి. వీళ్ళ ద్వారా హైద్రరాబాద్‌లోని రాజులతో పరిచయాలు వచ్చాయి.

పి.వి. రాజు కోరిక మేరకు హైదరాబాద్‌లోని నల్లకుంటలో వున్న క్షత్రియ సేవాసమితి బిల్డింగ్‌కు రూఫ్ మార్చి ఇచ్చాడు చిన్నస్వామి. అలా ఆ సమితిలో పరిచయాలు పెరిగాయి.

అప్పటికి హైదరాబాద్‌లో 200 కుటుంబాల రాజులు నివసించే వారనీ, వారి సంఖ్య ఇప్పుడు 40 వేలకు చేరిందంటాడు చిన్నస్వామి.

ఆ 200 కుటుంబాలతోనూ చిన్నస్వామిరాజుకు పరిచయాలు ఏర్పడ్డాయి. వాళ్ళల్లో రాష్ట్రమంత్రులు, హైకోర్టు జడ్జిలు, సివిల్ సర్వెంట్లు, ఇతర ప్రముఖులు అనేక మంది వున్నారు. వాళ్ళందరితో పరిచయాల మూలంగా ఇప్పటి వరకు తనకు పరిచితం కాని ఒక ప్రపంచాన్ని దగ్గరగా చూసే అవకాశం ఆయనకు దొరికింది.

పరిచయాలు రావడం ఒక ఎత్తు. అయితే వాటిని పదిలపరచుకొంటూ కొనసాగించడం చాలా కష్టం. చిన్నస్వామిరాజు ఆ సంబంధాల్ని ఎప్పుడూ వదులుకోలేదు. హైదరాబాద్‌ను వదిలిపెట్టాక అవి మరింత దృఢతరమైనాయి. మరింత విస్తృతస్థాయిలో సంబంధాలు మెరుగుపడ్డాయి.

హైదరాబాద్‌లో ఏర్పడిన ఈ పునాదే ఆయన తర్వాత కాలంలో రాష్ట్రస్థాయిలోనూ, దేశస్థాయిలోనూ క్షత్రియుల్ని సమైక్యం చేసే దిశగా కదలేందుకూ, అఖిల భారతస్థాయిలో క్షత్రియ కమ్యూనిటికి నాయకత్వం వహించేందుకు కారణమయ్యింది.

అప్పటి వరకు సివిల్ కాంట్రాక్టు రంగానికి మాత్రమే పరిమితమైన ఆయన ప్రపంచం ఈ కమ్యూనిటీ పరిచయాల వల్ల విశాలమైంది. ఆయన వ్యక్తిత్వం బహు ముఖాలుగా విస్తరించడానికి ఈ పరిచయాలు కారణమయ్యాయి.

మరోవైపు ఆయనకు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డితో పాటు అనేకమంది ఉన్నతస్థాయి రాజకీయనాయకులతో, ఉన్నతస్థాయి గవర్నమెంటు క్యాడర్‌తో పరిచయాలు వచ్చాయి.

బెంగుళూరులో వున్నంత వరకు ఈ స్థాయి పరిచయాలు ఆయనకు వుండేవి కావు. వాటినంతా కుప్పరాజు, చామరాజే చూసుకొనేవారు. అప్పట్లో కర్నాటక రాష్ట్రంలో వున్న నలుగురైదుగురు క్లాస్ వన్ కాంట్రాక్టర్లలో రాజు బ్రదర్లు ఒకరు. అందువల్ల వీళ్ళకు కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రులు మొదలుకొని అనేక స్థాయిల్లో ప్రభుత్వ ప్రముఖులతో పరిచయాలు వున్నాయి.

అయితే ఈ పరిచయాల వ్యవహారాలన్నీ కుప్పరాజు, చామరాజు చూసుకోవడం వల్ల చిన్నస్వామిరాజు ఫీల్డ్ వర్క్‌కు మాత్రమే పరిమితమై వుండేవాడు.

హైదరాబాద్ ఇయర్స్ మూలంగా వచ్చిన ఆర్థిక స్వాతంత్రంతో పాటు సంఘంలో ఉన్నత స్థాయి పరిచయాలు ఆయన వ్యక్తిత్వాన్ని వికసింప చేశాయి.

'నా ప్రపంచం విశాలం అయింది హైదరాబాద్‌లోనే'- అంటాడు చిన్నస్వామిరాజు. తన కమ్యూనిటీకి ఏమైనా సహాయం చేయాలని కూడా తాను హైదరాబాద్ ఇయర్స్‌లోనే అనుకొన్నానంటాడు ఆయన.

'నూతన ప్రదేశాలు, నూతన పరిచయాలు చాలామంది జీవితాల్లో మార్పును తీసుకొస్తాయి' అంటాడు ఎమర్సన్. అది చిన్న స్వామిరాజు జీవితంలో నిజం అయింది.

హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు తిరిగి వెళ్ళాక ఆయన జీవితంలో నిర్ణయాత్మక, గుణాత్మక అభివృద్ధి ప్రారంభమయింది.

11. రెండవ ఇన్నింగ్స్ : చిన్నస్వామి స్టేడియమ్

దరాబాద్‌లో వున్నపుడే చిన్నస్వామిరాజు బెంగుళూరులో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి టెండర్ ఫాం తెప్పించి, దాన్ని తన ఫ్రెండ్స్ ద్వారా సబ్‌మిట్ చేశారు. అది కూడా బెంగుళూరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ పేరు మీదే సబ్‌మిట్ అయింది.

కర్నాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ తరపున కాంట్రాక్టు బెంగుళూరు కన్‌స్ట్రక్షన్ కంపెనీకి వచ్చింది. 1970లో పని మొదలైంది. ముందుగా అడ్మిస్ట్రేటివ్ ఆఫీసు కట్టే వర్క్ వచ్చింది. దాని విలువ అప్పట్లో 4 లక్షలు. అప్పట్లో కర్నాటక ప్రభుత్వం దీని నిర్మాణ బాధ్యతల్ని చేపట్టింది.

అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ పూర్తయిన తర్వాత మిగతా స్టేడియం నిర్మాణ బాధ్యతల్ని కూడా ప్రభుత్వం మరియు క్రికెట్ అసోషియేషన్ చిన్నస్వామిరాజుకే అప్పగించాయి.

స్టేడియం హార్ట్ ఆఫ్ ది సిటీలో వుండటం, ఒక వైపు కబ్బన్ పార్కు, మరో వైపు ఎమ్.జి.రోడ్డు వుండటం వల్ల దీని నిర్మాణ సమయంలో కానీ, తర్వాత కానీ చిన్నస్వామికి మరింత ప్రచారం లభించింది.

50వేల సీట్ల సామర్థ్యం కలిగిన ఈ స్టేడియంను మొదట కర్నాటక స్టేట్ క్రికెటర్స్ అసోషియేషన్ స్టేడియమ్ అని పిలిచేవారు. ఆ తర్వాత ఎమ్. చిన్నస్వామి స్టేడియమ్ అని పేరు పెట్టారు.

చాలామంది చిన్నస్వామి అంటే చిన్నస్వామిరాజే అని ఇప్పటికీ నమ్ముతారు. ఆయన కట్టించాడు కాబట్టి ఆయన పేరు మీదే వుంది అనుకొంటారు. కానీ ఎమ్.చిన్నస్వామి వేరు.

మంగళం చిన్నస్వామి అయ్యంగార్ ఆయన పూర్తి పేరు. కర్నాటక స్టేట్ క్రికెట్ అసోషియేషన్ వ్యవస్థాపకులలో ఒకడు. ఆయన వృత్తి రీత్యా లాయర్. స్టేడియం నిర్మాణానికి ప్రధానంగా చొరవ తీసుకొన్నది ఆయనే. వివిధ పదవులలో కర్నాటక క్రికెట్ అసోషియేషన్‌కు సేవలందించాడు.

స్టేడియంకు తన పేరు పెట్టడం ఆయనకు ఇష్టం లేదంటారు. ఆయన చిరకాల అనారోగ్యం తర్వాత 1991లో చనిపోయాడు.



చిన్నస్వామి స్టేడియం

ఈ స్టేడియంలో క్రికెట్ మ్యాచెస్‌తో పాటు అనేక సాంస్కృతిక కార్యకలాపాలు కూడా నిర్వహిస్తుంటారు. 1996 మిస్ వరల్డ్ పోటీలు కూడా ఈ స్టేడియంలోనే జరిగాయి.

చిన్నస్వామి స్టేడియమ్ నిర్మాణ సమయంలో ఒక చిన్న ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో చిన్నస్వామిరాజు గాయపడ్డాడని కూడా పుకార్లు వచ్చాయి.

నిజానికి ప్రమాదం జరిగిన సమయంలో చిన్నస్వామిరాజు అక్కడ లేడు. ఆ రోజు స్టెయిర్ కేస్ వేశారు. కాంక్రీట్ వేసి, కూలీలంతా బయటికొచ్చారు. ఆ పనికి ఇంచార్జ్‌గా వున్న నారాయణరాజు అనే అబ్బాయి ఒక సారి పైకెక్కి అంతా చెక్ చేసి క్రిందికి వచ్చాడు. అతను బయటికొచ్చిన 5ని॥లకు అది కూలిపోయింది.

నిమిషాల్లో వార్త బయటికి వచ్చేసింది. పత్రికల వాళ్ళు, పోలీసులు, క్రికెట్ అసోషియేషన్ సభ్యులు, ప్రభుత్వ అధికార్లు, మంత్రులు అందరూ వచ్చేసారు. అనేక పుకార్లు షికార్లు చేశాయి.

ఆ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ఇద్దరు కూలీల్ని హాస్పిటల్‌లో చేర్చారు. చిన్నస్వామిరాజు కూడా వార్త తెలిసిన వెంటనే హుటాహుటిగా బయలుదేరి స్టేడియం చేరుకున్నాడు.

పోలీసులు చిన్నస్వామిరాజును స్టేషన్‌కు వచ్చి స్టేట్‌మెంట్ ఇచ్చి వెళ్ళమన్నారు. ఆయన స్టేషన్‌కు వెళ్ళాడు. వెళ్ళాక తెలిసింది. ఆయనపై పోలీసులు కేసు పెట్టారని. ఆయన్ని అరెస్టు చేశారు. అయితే వెంటనే బెయిల్ కూడా దొరికింది.

చివరికి ఏమీ కాలేదు. అంతా సమసిపోయింది. నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగాయి.

చివరికి సక్సెస్‌ఫుల్‌గా స్టేడియం పూర్తయింది. 1972-73లో మొదట ఫస్ట్ క్లాస్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. 1974 నాటికి టెస్ట్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. 1974లో నవంబర్ 22-27 వరకు ఇండియా Vs ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్ జరిగింది. 1982 సెప్టెంబర్ 6న జరిగిన వన్‌డే మ్యాచ్‌లో శ్రీలంక పైన ఇండియా 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

చిన్నస్వామి స్టేడియంను నిర్మించింది చిన్నస్వామిరాజే అయినా ఆయనెప్పుడూ అరగంట సేపు కూడా క్రికెట్ చూడలేదు. 'అంత ఆసక్తి, టైమూ లేదు' అంటాడు ఆయన.

అలా హైదరాబాద్ నుంచి బెంగుళూరుకు రావడంతోనే ఒక ప్రిస్టేజియస్ నిర్మాణంతో ఆయన తిరిగి తన కాంట్రాక్టర్ జీవితాన్ని బెంగుళూరులో ప్రారంభించాడు.

రెండవ ఇన్నింగ్స్‌లో ఓపెనింగ్ బ్యాట్స్‌మ్యాన్‌లా ఆయన దూకుడుగా ఆడటం మొదలు పెట్టాడు.

చిన్నస్వామి స్టేడియం వర్క్ జరుగుతున్నపుడే ఇంతకు ముందు మొదలైన హాస్పిటల్ పనుల్ని కూడా ఆయన పర్యవేక్షించేవాడు. మల్టి-టాస్కింగ్‌లో మరింత అనుభవం, సమర్థత వచ్చాయి ఆయనకి.

1972లో బళ్లారి, బెంగుళూరు, మైసూరులలో సిమెంట్ పైప్స్‌ను తయారు చేసే ఫ్యాక్టరీలను కొన్నారు.

అప్పుడు మైసూరు ఫ్యాక్టరీలో కార్మికుల సమ్మెవల్ల ఫ్యాక్టరీ మూసేసి వున్నారు. కార్మికులతో మాట్లాడి దాన్ని ఓపెన్ చేయించేందుకు చిన్నస్వామిరాజును పంపారు.

చిన్నస్వామిరాజు మైసూరు వెళ్ళి కార్మిక నాయకుల్ని కలిశాడు. 'ఫ్యాక్టరీ మూతపడటం వల్ల ఎవరికీ లాభం లేదు. అందరూ నష్టపోతారు. ముందుగా దాన్ని పునఃప్రారంభిద్దాం. అప్పుడు మీ సమస్యలేమిటో చెప్పండి. ఇద్దరం కూర్చుని, చర్చించుకొని, ఇద్దరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుక్కొందాం' అని కార్మిక నాయకుల్ని ఒప్పించాడు.

ఆయన మాటలు, ప్రవర్తన వాళ్ల మీద ప్రభావం చూపాయి. ఫ్యాక్టరీ తెరచుకొంది. పని ప్రారంభమైంది. చర్చలు ప్రారంభమయ్యాయి. ఉత్పత్తి-సంబంధిత టార్గెట్లు ఫిక్స్ చేయబడ్డాయి. వాళ్ళ

సమస్యల్ని గురించి చర్చించిన తర్వాత ఇద్దరికీ ఇబ్బందిలేని పద్ధతిలో పరిష్కారం దొరికింది. చిన్న స్థాయి కార్మికులతో కూడా యజమాని నేరుగా సంబంధంలో వుండాలని నమ్ముతాడు చిన్నస్వామిరాజు. అందువల్ల ఇద్దరి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ రాదని, అందువల్ల చాలా సమస్యలు పరిష్కారం అవుతాయని అంటాడు ఆయన.

అన్ని వూర్లలోని పైపుల ఫ్యాక్టరీలు ఇప్పటికీ నడుస్తున్నాయి. ఇటీవల బెంగుళూరు ఫ్యాక్టరీలో మళ్ళీ కార్మిక నాయకులతో సమస్యలు వచ్చాయి. అప్పుడు కూడా చిన్నస్వామిరాజే వెళ్ళి వాళ్ళతో మాట్లాడి సమస్యను పరిష్కరించాడు.

1974లో నీలసంద్రలో బిడిఏ రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణపు కాంట్రాక్టు వచ్చింది. ఇందిరానగర్‌లో బిడిఏ వాళ్ళదే కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం కూడా వీళ్ళకే వచ్చింది.

1973లోనే 'ఏ.ఎస్.కుప్పరాజు బ్రదర్స్ ట్రస్ట్' పెట్టారు. ఇందులో రాజు సోదరులు, ఇతరులు భాగస్వాములు. పై రెండు పనుల్ని ఈ ట్రస్ట్ పేరు మీదే చేశారు. బెంగుళూరు కన్‌స్ట్రక్షన్ కంపెనీ దాన్ని సబ్‌కాంట్రాక్టుకు తీసుకొని చేసింది.

చిన్నస్వామిరాజు వాళ్ళు చేసిన చివరి ప్రభుత్వ నిర్మాణ కార్యక్రమం ఇందిరానగర్‌లో బిడిఏ కాంప్లెక్స్ నిర్మాణమే. ఆ తర్వాత ఆయన ఏ ప్రభుత్వ కన్‌స్ట్రక్షన్ చేయలేదు.

దీనికి కారణం ఆయన హోటల్ ఇండస్ట్రీలోకి ప్రవేశించడమే. అయితే ఆయన ఒక ప్రణాళిక ప్రకారం కన్‌స్ట్రక్షన్‌ను ఆపేసి హోటల్ రంగంలోకి ప్రవేశించలేదు.

అది యాక్సిడెంటల్‌గా జరిగింది.

12. 'ఎమర్జెన్సీ' లేకపోతే హోటల్ చాళుక్య లేదు

లో 'ఏ.ఎస్.కుప్పరాజు బ్రదర్స్ ట్రస్ట్' తరపున రేస్ కోర్సు రోడ్డులో ఒక కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మించేందుకు సిద్ధమయ్యాడు చిన్నస్వామిరాజు.

1975లో భూమి పూజ చేసి పని మొదలుపెట్టారు. రెండు అంతస్థుల స్ట్రక్చర్ పూర్తి అయింది.

ఇంతలో దేశంలో 1975, జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధి 'సలహా' మేరకు రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలి అహ్మద్ 'ఎమర్జెన్సీ'ని ప్రకటించాడు. ఈ నిర్ణయంతో దేశం అల్లకల్లోలమైంది.

అయితే ఎమర్జెన్సీ ఒక రకంగా చిన్నస్వామిరాజుకు మేలే చేసింది. అంతకు ముందు 1962లో ఇండో–చైనా వార్ కూడా రాజు బ్రదర్లకు ఉపయోగపడింది.

ఎమర్జెన్సీ కాలంలో 'నిత్యావసర సరుకుల సరఫరా' మీద ఆంక్షలు విధించారు. అందులో భాగంగా కమర్షియల్ భవనాలకు సిమెంటు వాడకాన్ని ప్రభుత్వం నిషేధించింది.

చిన్నస్వామిరాజు కడుతున్న కమర్షియల్ కాంప్లెక్స్ పరిస్థితి కూడా అగమ్యగోచరమైంది. సిమెంటు వాడకూడదంటే, దాన్ని పూర్తి చేయడం ఎలా? ఆలోచనలో పడ్డాడు చిన్నస్వామిరాజు.

హోటల్ భవన నిర్మాణాలకు సిమెంటు వాడకాన్ని ప్రభుత్వం అనుమతిస్తూ వుందనే సమాచారం తెలిసింది. ఇక రెండో ఆలోచన లేకుండా ఆ కమర్షియల్ కాంప్లెక్సును హోటల్‌గా మార్చేయాలని నిర్ణయించాడు రాజు.

అలా 'హోటల్ చాళుక్య' ప్రారంభమయింది. ఎమర్జెన్సీ రాకపోయి వుంటే, వచ్చినా కమర్షియల్ భవనాలకు సిమెంట్ వాడకాన్ని నిషేధించకపోయి వుంటే హోటల్ కట్టాలనే ఆలోచన చిన్నస్వామిరాజు మైండ్‌లోకి వచ్చేది కాదు. చాళుక్య హోటల్ వుండేది కాదు.

'నేను నా జీవితంలో దేని వెంటా పడలేదు. అన్నీ నా దగ్గరకే వచ్చాయి. వచ్చిన అవకాశాన్ని grab చేసుకొన్నాను'– అంటాడు ఆయన. హోటల్ కూడా అంతే. ఎమర్జెన్సీ రూపంలో తన దగ్గరకు వచ్చిన అవకాశాన్ని ఆయన గట్టిగా పట్టుకొన్నాడు.

నిర్మాణ రంగం నుండి ఆతిథ్య పరిశ్రమ (Hotel Industry) లోకి అనుకోకుండా వెళ్ళినా, అది ఆయన జీవితంలో ఒక గుణాత్మక గెంతు (quantum jump) అని చెప్పవచ్చు.

అప్పటికే ప్రభుత్వరంగపు కాంట్రాక్టు పనులు ఆపేసిన వాళ్ళు ప్రయివేటు రంగంలో కాంట్రాక్టు పనులు మొదలు పెట్టారు. దాని నుంచి హోటల్ ఇండస్ట్రీలోకి వెళ్ళడంతో ఆయన జీవితం పూర్తిగా మారిపోయింది.

'చిన్నస్వామిరాజుగారికి కన్సర్వేటివ్ అవుట్‌లుక్ వుంది. దాని వల్ల ఆయన కాంట్రాక్టు ఫీల్డ్‌లో సక్సెస్ అవడం చాలా కష్టమయ్యేది. ఆయన హోటల్ ఫీల్డ్‌లోకి వెళ్ళడం అనేది ఆయన జీవితంలో గొప్ప మలుపు. సరైన టైములో ఆయన తన వ్యాపారాల్ని విభిన్న మార్గంలోకి తీసుకెళ్ళారు కాబట్టే ఇవాళ ఆయన విజేతగా నిలిచారు.' - అంటాడు శేఖర్‌రాజు. ఆయన కుప్పరాజు అల్లుడు. చిన్నస్వామిరాజును సన్నిహితంగా గమనిస్తున్న వ్యక్తి.

'నాకు పనికి విలువ ఇవ్వడం తెలుసు. నేను పని చేయడానికి వేరే వాళ్ళకు లంచం ఇవ్వడం నచ్చదు. ఒకప్పుడు ఇంత లంచ గొండితనం లేదు. 1970ల నాటికి కరప్షన్ చాలా రెట్లు పెరిగిపోయింది. అంతంత లంచాలు ఇస్తే మేము కాంట్రాక్టు పనుల్లో అవసరమైన నాణ్యతను తీసుకొని రాలేము. నాణ్యత లేని పనులు చెయ్యడం నాకు ఇష్టం లేదు. అందుకే కాంట్రాక్టు పనులు ఆపేశాము. మా అదృష్టం బాగుండి అనుకోకుండా హోటల్ ఇండస్ట్రీ వైపు వెళ్ళాము'- అంటాడు చిన్నస్వామిరాజు.

తాను కట్టిన హోటల్‌కు తమ క్షత్రియ వంశస్థులైన చాళుక్య రాజవంశానికి గుర్తుగా 'హోటల్ చాళుక్య' అని పేరు పెట్టాడు. చాళుక్య రాజవంశ చిహ్నమైన 'ఏనుగే' హోటల్ చాళుక్య చిహ్నం కూడా.

1977లో అప్పటి కర్నాటక ముఖ్యమంత్రి దేవరాజు అరసు, మంత్రులు బసవలింగప్ప, అజీజ్‌సేట్, హుచ్చ మాస్తీగౌడలు హాజరై చాళుక్యను ప్రారంభించారు.

విధానసౌధకు సమీపంలో, రేస్‌కోర్సు రోడ్డులో వున్న హోటల్ చాళుక్య బెంగుళూరులోనే ఒక ల్యాండ్ మార్క్‌గా మారింది.

హోటల్‌కు బ్రేక్ ఈవెన్ రావడానికి 2సం॥లు పడుతుందని అప్పట్లో అంచనా వేశారు. కానీ హోటల్ ప్రారంభమయిన 6 నెలలకే బ్రేక్ ఈవెన్ వచ్చింది.

సుబ్బమ్మ సత్రం - అక్కలరాజు అన్నం అమ్మడా?

అక్కలరాజు వాళ్ళ వూరి నుంచి బెంగుళూరుకు ఎవరు వచ్చినా వీళ్ళింట్లోనే దిగేవారు. టెంకాయ కీతులతో వేసిన పెద్ద షెడ్లు వుండేవి. అక్కడే పడుకొనేవారు అతిథులు. వచ్చినవాళ్ళకు అలుపు

సొలుపు లేకుండా వండిపెడుతుండేది సుబ్బమ్మ. పొయ్యి మీద ఎసురు పెట్టి విసుర్రాయి మీద రాగులు విసిరేది. ఆమె చేసిన సంగటి అద్భుతంగా వుండేది. చేతికి అంటుకోకుండా మెత్తగా కడుపులోకి జారిపోయేది.

అలా ఎవరు వీళ్ళింటికి వచ్చినా వాళ్ళకు సంగటో, అన్నమో దొరికేది కాబట్టి, వీళ్ళింటికి 'సత్రం వాళ్ళు' అనే పేరొచ్చింది. అదే తర్వాతి కాలంలో 'సుబ్బమ్మ సత్రం' అయ్యింది.

చాలాసార్లు భోజనం వేళకు అతిథులు వస్తే వున్న వంట వాళ్ళకి పెట్టి ఆమె పస్తులు పడుకొనేది. 'పదిమందికీ ఆమె పెట్టిన అన్నం పుణ్యమే మేము ఈ రోజు ఈ స్థితిలో వుండేందుకు కారణం' అంటాడు చిన్నస్వామిరాజు.

అయితే అక్కలరాజు మాత్రం భోజనాలకు వచ్చేవాళ్ళను చూసి విసుక్కునే వాడు. 'అబ్బ..... సరిగ్గా వేళకు హాజరయిపోతారు కదా– మెక్కడానికి'– అని దెప్పి పొడిచేవాడు.

అలాంటి గొప్పవాడు 1977లో ఏం చేశాడో తెలుసా? చిన్నస్వామిరాజు, కుప్పరాజు హోటల్ చాళుక్య కట్టినపుడు, రెస్టారెంట్ పెట్టాలనుకొంటే, అక్కలరాజు అడ్డు పడ్డాడు. 'చూడబ్బా, వూరి నుంచి ఎవరొచ్చినా మా ఇంట్లోనే వుంటావుండ్రి. అన్నం వేస్తిమి. 'సత్రం అక్కలరాజు' అని పేరొచ్చింది. అందువల్ల మనం అన్నం మాత్రం అమ్మకూడదబ్బా'– అని కండిషన్ పెట్టేశాడు.

తండ్రి మాటను కాదనకూడదని చాళుక్యలో రెస్టారెంట్‌ను ప్రారంభించే ప్రయత్నాన్ని విరమించుకొన్నారు చిన్నస్వామిరాజు సోదరులు.

1980లో 102 ఏళ్ళ అక్కలరాజు చనిపోయాడు. 1983లో మాత్రమే రెస్టారెంట్ స్టార్ట్ చేశారు రాజు బ్రదర్స్. **ఒక రకంగా చూస్తే చిన్నస్వామిరాజు ప్రారంభించిన ఆతిథ్య పరిశ్రమ (Hotel Industry)కు నేపథ్యం సుబ్బమ్మ ప్రారంభించిన ఆతిథ్యంలోనే వుంది.**

తన దగ్గర పనిచేసిన బంగార్రాజుకు చాళుక్యలో తెలుగు రెస్టారెంట్ 'ఆలంపూర్'ను నడిపే అవకాశం ఇచ్చారు. **బంగార్రాజు రిసెప్షన్‌బాయ్‌గా చేరి తర్వాత హోటల్ మేనేజరై, తర్వాత అదే హోటల్‌లో రెస్టారెంట్ ఓనర్ అయ్యాడు.**

'నాలాగే ఎంతో మంది అసమర్థుల్ని సమర్థులుగా, జీతగాళ్ళను యజమానులుగా మార్చి వేశారు చిన్నస్వామిరాజుగారు' అంటాడు గౌరవంగా బంగారు రాజు.

'కనిష్క'

చాళుక్య హోటెల్ తర్వాత చిన్నస్వామిరాజు వ్యాపార కార్యకలాపాల్లో స్తబ్దత కనిపిస్తుంది. '77లో చాళుక్య ప్రారంభమయ్యాక ఆయన ప్రధానంగా చాళుక్యను అభివృద్ధి చేయడం మీదే కేంద్రీకరించినట్టు

కన్పిస్తుంది. 1977 నుంచి 1983లో 'హోటల్ కనిష్క' ప్రారంభమయ్యేదాకా– 6సం॥లు ఆయన బెంగుళూరు నగరంలో, పరిసర ప్రాంతాల్లో ఆస్తులు కొనడం మీద డబ్బు ఇన్వెస్ట్ చేశాడు.

'ఆయనకు ల్యాండ్ కొనటం అంటే చాలా ఇష్టం. చాలామంది ల్యాండ్ కొనాలంటే, దాని చుట్టు పక్కల ఏవేవి వున్నాయి? దానికి అప్రోచ్ రోడ్డు వుందా– మొదలైనవన్నీ చూస్తారు. ఆయన మాత్రం అక్కడికి నడిచి వెళ్ళొచ్చా లేదా చూస్తాడు. ఎప్పుడు ల్యాండ్ కొనాలన్నా, ఆయన స్వయంగా ఆ ల్యాండ్‌లో తిరుగుతారు. అటూ ఇటూ నడుస్తాడు. ఆయన చేతిలో డబ్బు వుంటే దాన్ని ఆయన ప్రాపర్టీలోకి కన్‌వెర్ట్ చేస్తాడు'– అంటాడు నాగేష్.

అలా ఆయన చాళుక్య తర్వాత కొన్న ఆస్తులు తర్వాతి కాలంలో అనూహ్యంగా ధరలు పెరిగిపోయి, వాటి విలువ అనేక రెట్లు పెరిగిపోయింది. మొదటి నుంచి భూమి పైన వున్న ప్రేమే ఆయనకు సంపదను ఆర్జించి పెట్టిందని చెప్పవచ్చు.

అయితే ఆయనెప్పుడూ భూమిని 'కొనడం–అమ్మటం' అనే వ్యాపార మాధ్యమంగా చూడలేదు. తన దగ్గర డబ్బు వుంది. తానేమీ కొత్త వ్యాపారాలు చేయడం లేదు. భూమిని కొనిపెడదాం అనుకొని కొన్నాడు ఆయన.

'నేనెప్పుడూ పనిచేసి పెరగాలని ప్రయత్నించలేదు. పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని మాత్రమే అనుకొన్నాను. నేనే కాదు మా కుటుంబంలో అందరూ అంతే. 1940లలోనే మా నాన్న పని చేసిన ఇంజనీరు గరుడాచలం మార్గోసా రోడ్డులో 3 ఎకరాలకు కాంపౌండు వేసుకోమన్నాడు. నెలకు 8 అణాలు ఇస్తే చాలన్నాడు. 'మార్గోసా రోడ్డులో మాకెందుకు కావాల నేల' అని మా నాన్న వేసుకోలేదు. మా యాటిట్యూడ్ కూడా అదే. నేలతో వ్యాపారం చేసి డబ్బు సంపాదించాలనే దృష్టే లేదు మాకు. అదే గనుక వుండి వుంటే, 100 తరాలకు సరిపోయే ఆస్తులు వుండేవి మాకు. పని తప్ప మరో ధ్యాస లేదు'– అంటాడు చిన్నస్వామిరాజు.

అయితే కాంట్రాక్టులు మానివేసిన తర్వాత, ఆయన వ్యాపారంలో 'స్లో అండ్ స్టడీ'గా మాత్రమే ముందుకు పోయినా, ఆయనకు ఆస్తులే అండగా నిలిచాయి.

✦ ✦ ✦

1983లో బెంగుళూరులోని చిత్రపరిశ్రమకు నెలవైన గాంధీనగర్‌లో 'హోటల్ కనిష్క' ప్రారంభమైంది. భారతదేశాన్ని పరిపాలించిన గొప్ప రాజులలో కనిష్క చక్రవర్తి ఒకడు. ఆయన పేరుతో హోటెల్‌ను ప్రారంభించాడు. అందులో ఆరాధ్య, సివిసి శాస్త్రి అనే ఇద్దరు కూడా భాగస్వాములు. వాళ్ళు స్లీపింగ్ పార్టనర్లు.

కట్టడమే కాదు - కూల్చడంలోనూ కింగే మన రాజు

సివిల్ కాంట్రాక్టర్లలో కొంత మందికి బిల్డింగుల్ని కట్టడం మాత్రమే వచ్చు. కూల్చడం రాదు. కానీ చిన్నస్వామిరాజు బిల్డింగుల్ని కట్టడంలో ఎంత మొనగాడో, కూల్చడంలోనూ అంతే మొనగాడు. ఒక ఉదాహరణ చెప్పుకుందాం.

అది ***1983***, సెప్టెంబర్ ***12***, సాయంత్రం ***3*** గం॥ ***20***ని॥లు.

బెంగుళూరులోని ఎస్.సి రోడ్డులో వున్న కపాలి సినిమా థియేటర్. ఆ రోజు కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ నటించిన 'భక్త ప్రహ్లాద' సినిమా ఆడుతోంది. 'ఎక్కడరా నీ నరసింహుడు. రమ్మను చూద్దాం ధైర్యముంటే' అంటూ హిరణ్యకశుపుడు ప్రహ్లాదుడిపై గర్జిస్తున్నాడు. సరిగ్గా స్థంభం పెళపెళమంటూ ముక్కలైంది. భయంకరమైన శబ్దం. మొత్తం థియేటర్ వూగిపోతూంది. వొక క్షణం ప్రేక్షకులకి ఏమీ అర్థం కాలేదు. స్క్రీన్ మీద స్థంభం బ్రద్ధలైతే థియేటర్ వూగిపోవడం ఏమిటి?

అప్పటికే జరగవలసిన ప్రమాదం జరిగిపోయింది. థియేటర్ గోడ కూలి ఇద్దరు ప్రేక్షకులు చనిపోయారు. అనేకమంది గాయపడ్డారు. జనం భయంతో బయటికి పరుగులు తీశారు.

అక్కడ దృశ్యం హృదయవిదారకంగా వుంది. ఏం జరిగిందసలు? కపాలి థియేటర్‌ను ఆనుకొని వున్న ***8*** అంతస్తుల గంగారాం బుక్‌షాప్ భవనం కూలిపోయింది. కొంత భాగం కపాలి థియేటర్ వైపు, ఎక్కువ భాగం దానిని ఆనుకొని వున్న కెంచాంబ లాడ్జివైపు కూలిపోయింది.

గంగారాం బిల్డింగ్ నిర్మాణ దశలో వుండగా కూలిపోవడంతో ఆ భవన నిర్మాణ కూలీలు, ఆ సమయానికి దారినపోతున్న వాళ్ళు, కెంచాంబ లాడ్జిలో కొంతమంది, కపాలి థియేటర్లో ఇద్దరు, తొక్కిసలాటలో మరికొందరు- ఇలా మొత్తం ***120*** మంది చనిపోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు.

ఈ సంఘటన యావత్తు దేశాన్ని కలవర పరచింది. బెంగళూరు నగరం నివ్వెరపోయింది.

34 రోజులపాటు సహాయ కార్యక్రమాలు నడిచాయి. ఈ కార్యక్రమాల్లో కర్నాటక కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కూడా తన వంతు సహాయాన్ని అందించింది.

ఆ బిల్డింగ్ పూర్తిగా పడిపోలేదు. ఇప్పుడు దాన్ని కూలగొట్టాలి. దాన్ని కూలగొడితే పక్కనున్న బిల్డింగులు కూడా దెబ్బతినే ప్రమాదం వుంది. ముఖ్యంగా కపాలి థియేటర్ పూర్తిగా కూలిపోతుంది.

కపాలి థియేటర్ యాజమాన్యం బెంగుళూరులోని అనేక మంది సివిల్ ఇంజనీర్లను, కాంట్రాక్టర్లను సంప్రదించింది. సివిల్ నిర్మాణ రంగంలో హేమాహేమీలంతా వచ్చారు. అయితే కపాలి థియేటర్ దెబ్బతినకుండా, మరింత ప్రాణనష్టం జరగకుండా ఆ బిల్డింగ్‌ను కూల్చడం ఎలాగో ఎవరికీ అర్థం కాలేదు.

చిన్న తప్పు జరిగినా ప్రచారం పెద్దయెత్తున వుంటుంది కాబట్టి చాలామంది ఆ పనిని టేకప్ చేయడానికి భయపడ్డారు.

చివరికి, కపాలీ యాజమాన్యం చిన్నస్వామిరాజును సంప్రదించింది.

ఆయన రంగంలోకి దిగాడు. అప్పట్లో బిల్డింగులను కూల్చడంలో మలయాళీ కూలీలకు మంచి పేరుంది. ఆయన వాళ్ళను పిలిపించాడు.

మొత్తం బిల్డింగును స్వయంగా పరిశీలించాడు. తగిన వ్యూహాలను రూపొందించుకొన్నాడు.

ముందుగా బిల్డింగును తన కంట్రోల్‌లోకి తెచ్చుకోవాలి. అందుకోసం ఎక్కువ కూలీలను ఉపయోగించకూడదు.

నైపుణ్యం వున్న తక్కువ మంది కూలీల్ని ఎంచుకొన్నాడు.

ఎక్కువ ప్రమాదకరంగా వున్నవైపు సపోర్ట్ ఇచ్చాడు. సగం వేలాడుతున్న రూఫ్ కూలిపోకుండా సపోర్ట్ సిస్టమ్‌ను ఏర్పరిచాడు. తక్కువ ప్రమాదకరంగా వున్న వైపు నుంచి పడగొట్టుకుంటూ వచ్చాడు.

సుమారు 2 నెలలకు పని పూర్తయింది. ఎటువంటి నష్టం లేకుండా భవనాన్ని కూలగొట్టడంలో రాజు విజయం సాధించాడు. అన్ని వైపుల నుంచి అభినందనలు అందుకొన్నాడు.

'ఈ కూల్చివేత కార్యక్రమం రాజులోని ఇంజనీరింగ్ పరిజ్ఞానానికీ, సుదీర్ఘ అనుభవానికీ, రిస్క్ టేకింగ్ నేచర్‌కూ ఒక సజీవ ఉదాహరణ'– అంటాడు డాక్టర్ సిఎస్. విశ్వనాథ. ఆయన దేశంలోనే పేరు మోసిన స్ట్రక్చరల్ ఇంజనీర్.

చాళుక్యలాగే, కనిష్క కూడా అతి తక్కువ కాలంలోనే విజయవంతం అయింది. అప్పటి నుంచి చిన్నస్వామిరాజు అంటే అందరికీ 'చాళుక్య–కనిష్క' జంట హోటళ్ళ అధిపతిగానే గుర్తు వుండేది.

కనిష్క తర్వాత ఆయన ఏం చేసేవాడో కానీ, అదే సమయంలో అమెరికాలో చదువు ముగించుకొని ఆయన కొడుకు సుందర్ రాజు వచ్చాడు. సుందర్రాజు ఆగమనం చిన్నస్వామిరాజు జీవితంలో మరిన్ని మార్పులకు కారణమయ్యింది.

13. సన్ అండ్ 'సన్‌రే'

మెరికా నుంచి చదువు ముగించుకొని తమ సన్ వస్తున్నాడు. ఇక మీదట తమ వ్యాపారాల్లో, హోటల్స్ నిర్వహణలో సుందర్ కూడా భాగం పంచుకొంటాడని చిన్నస్వామిరాజు కొంతమంది సన్నిహిత మిత్రులకు చెప్పేవాడు.

అయితే సుందర్ హృదయం చిన్నస్వామిరాజు వ్యాపారాల్లో లేదు. అది మరో చోట వుంది. సుందర్‌కి కన్‌స్ట్రక్షన్ బిజినెస్‌లోగానీ, హోటల్ ఇండస్ట్రీలోగానీ అంత ఇంట్రెస్ట్ లేదు. అతను పెరిగిన వాతావరణం వేరు. చదివిన చదువు వేరు. కన్న కలలు వేరు.

యు.ఎస్.ఏ.లో సుందర్ కంప్యూటర్స్‌లో ఎమ్.ఎస్. చేశాడు. తను చదివిన చదువు వృధా కాకుండా వుండాలంటే, కంప్యూటర్స్‌కు సంబంధించిన వ్యాపారాన్నే ప్రారంభించాలని నిర్ణయించుకున్నాడు.

1981లో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాంతా బార్బారాలో స్టడీస్ పూర్తి చేసుకొని బెంగుళూరు వచ్చిన సుందర్ అతి తక్కువ కాలంలోనే తాను హార్డ్‌వేర్ కంపెనీని మొదలు పెట్టబోతున్నట్టు చిన్నస్వామిరాజుకు చెప్పాడు.

చిన్నస్వామిరాజుకు కంప్యూటర్స్‌కు సంబంధించి ఏ రకమైన అవగాహనా లేదు. తన వ్యాపారంలో పాల్గొని దాన్ని మరింత అభివృద్ధి చేస్తాడనుకొన్న కొడుకు, 'కంప్యూటర్స్' అంటూ 'కాంపొనెంట్స్-హార్డ్‌వేర్' అంటూ ఏవేవో మాట్లాడుతుంటే చిన్నస్వామిరాజు మొదట్లో అప్‌సెట్ అయ్యాడు.

అయితే సుందర్ తాను అదే బిజినెస్ మొదలుపెడతానని పట్టుబట్టడంతో, సుందర్ తెలివితేటల మీద, సామర్థ్యం మీద నమ్మకంతో అతన్ని సపోర్ట్ చేద్దామని నిర్ణయించుకొని అతని బిజినెస్‌కు అవసరమైన పెట్టుబడిని సమకూర్చడానికి సిద్ధమయ్యాడు.

అలా 'సన్‌రే కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ప్రారంభమయింది. అమెరికా నుంచి కంప్యూటర్ విడిభాగాల్ని దిగుమతి చేసుకొని UNIX OS లో 32-బిట్ సిస్టంను తయారు చేయడమే 'సన్‌రే' ప్రధాన కార్యకలాపం. ఇది భారతదేశంలోనే మొదటిసారి ఇలా చేయడం.

సన్‌రే ప్రారంభించిన మొదటి సంవత్సరమే ముంబైలో వున్న న్యూక్లియర్ రీసెర్చ్ సంస్థ అయిన 'బాబా ఆటమిక్ రిసెర్చ్ సెంటర్' నుంచి రూ॥ 1.5 కోట్లకు ఆర్డర్ వచ్చింది. ఆ రోజుల్లో అది పెద్ద ఆర్డర్ అని చెప్పవచ్చు.

రష్యాలో చెర్నోబిల్ ప్రమాదం తర్వాత, అటువంటి ప్రమాదాన్ని నివారించేందుకు రీసెర్చ్ సెంటర్ ఒక స్టిములస్‌ను రూపొందించదలచుకొంది. అది ఆ స్టిములేటర్‌ను తయారు చేయడానికి సన్‌రేను ఎంచుకుంది.

'సన్‌రే' మొదటి అడుగులు చాలా బలంగా పడ్డాయి. అందరూ హ్యాపీగా వున్నారు. చిన్నస్వామిరాజుకు కూడా కొడుకు సుందర్ మీద మరింత నమ్మకం పెరిగింది.

అయితే అంతర్జాతీయంగా పలు మార్పులు చోటు చేసుకున్నాయి. హార్డ్‌వేర్ పరిశ్రమలో కూడా ఈ మార్పులు వేగంగా జరగడం మొదలైంది. చాలా ఫాస్ట్‌గా హార్డ్‌వేర్ సిస్టంలు అప్‌గ్రేడ్ అయ్యాయి.

సన్‌రేకు ఒక ఆర్డర్ వచ్చింది. సిస్టంల విడి భాగాలు అమెరికాలో షిప్‌మెంట్ అయిపోయాయి. అప్పటికే సిస్టంలు అప్‌గ్రేడ్ అయ్యాయి. పైగా రేట్లు తగ్గిపోయాయి. వీళ్ళు ఒక సిస్టంను 24 లక్షలకు అమ్మేవాళ్ళు. షిప్‌మెంట్ అయ్యాక, వీళ్ళ సిస్టంలకన్నా అడ్వాన్స్‌డ్ సిస్టంలు 12 లక్షలకే దొరుకుతున్నాయని అవతలి వాళ్ళు ఆర్డర్‌ను క్యాన్సిల్ చేశారు.

దాంతో పెద్ద ఎత్తున నష్టం వచ్చింది. వచ్చిన ఆ సిస్టంలన్నీ మూలపడిపోయాయి. అప్పటికే ఇండియాలో 4-5 నగరాల్లో సన్‌రే కంపెనీ ఆఫీసుల్ని తెరిచింది. వాటి మెయిన్‌టెనెన్స్ భారంగా పరిణమించింది. అయినా అలాగే 7-8 ఏళ్ళు నడిపారు. చివరికి 'సన్‌రే' మూతపడక తప్పలేదు.

అయితే అమెరికా నుంచి వచ్చిన షిప్‌మెంట్ వృధా కాలేదు. దాదాపు 2సం॥ల తర్వాత లక్నో రైల్వే డిపార్టుమెంటు నుంచి ఆర్డర్ వచ్చింది.

రైలు ట్రాక్ సామర్థ్యాన్ని పరీక్షించడం కోసం వాళ్ళకు స్లో స్పీడ్ మిషన్ కావాలి. ఒక్కో సిస్టంను ఒక్కో బోగీలో ఫిట్ చేసి ఇవ్వాలి. ఒక్కో సిస్టం ధర 15 లక్షల రూ॥లు. ఇంకో 20-25 లక్షలు సాఫ్ట్‌వేర్ మీద ఖర్చు పెట్టారు. అయితే లక్నో రైల్వే ఒక్కో సిస్టంకు 1.5 కోట్లు చెల్లించింది.

ఆ విధంగా లాస్ రికవరీ అయింది. కానీ కంపెనీ తిరిగి ఓపెన్ కాలేదు.

సన్‌రే వైఫల్యం తండ్రీ కొడుకుల మధ్య గ్యాప్‌ను పెంచింది. 'మనకు కంట్రోల్‌లో లేని వ్యాపారం చేయకూడదు' అని నమ్మే చిన్నస్వామిరాజు నమ్మకం మరింత బలపడింది. కొడుకు వ్యాపార నిర్వహణా సామర్థ్యం విషయంలో నమ్మకం సడలింది.

14. ఏట్రియా హోటెల్

లో కనిష్క హోటెల్‌ను ప్రారంభించిన తర్వాత 1990 దాకా చిన్నస్వామిరాజు స్వంతంగా కొత్త ప్రాజెక్టు దేన్నీ మొదలు పెట్టలేదు.

బహుశా సుందర్ అమెరికా నుంచి రావడం, సన్‌రే కంప్యూటర్స్ సంస్థను నెలకొల్పడంతో చిన్నస్వామిరాజు కూడా ఆ ప్రాజెక్టులో ఇన్‌వాల్వ్ అయ్యాడు. ఏ పని చేసినా అందులో పూర్తిగా నిమగ్నం కావడం, దాన్ని గూర్చి సమగ్రంగా తెలుసుకోవడం, దాని మీద పూర్తి స్థాయిలో ఆధిపత్యం తెచ్చుకోవడం ఆయనకు అలవాటు.

అలాగే సన్‌రే కంప్యూటర్స్‌లో కూడా ఆయన పూర్తిస్థాయిలో ఇన్‌వాల్వ్ అయ్యాడు. కంప్యూటర్స్ గురించి, వాటి కాంపొనెంట్స్ గురించి, వాటికి సంబంధించిన ఇతర విషయాల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు ఆయన తన సమయాన్నంతా వెచ్చించాడు.

'సన్‌రే' ప్రయోగం ఫెయిలవడంతో ఆయన తిరిగి హోటెల్ రంగం వైపే దృష్టి సారించాడు.

1985 ప్రాంతంలోనే హార్ట్‌ఆఫ్ ది సిటీలో వున్న ప్యాలస్ రోడ్డులో ఒక సైట్ కొన్నాడు చిన్నస్వామిరాజు. అయితే ఆ సైట్‌లో ఎటువంటి ప్రైవేటు బిల్డింగులు కట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఆ సైట్ చుట్టు పక్కల వున్న సైట్లన్నీ ప్రభుత్వానివే. చిన్నస్వామి సైట్ ఒకటే ప్రయివేటుది.

1990 నాటికి ఎలాగో అనుమతి సంపాదించగలిగారు. ముందుగా కమర్షియల్ కాంప్లెక్స్ కట్టారు.

ఆ తర్వాత ఏట్రియా హోటెల్ కట్టారు. ఈ మొత్తం హోటెల్ నిర్మాణాన్ని చిన్నస్వామిరాజే స్వయంగా పర్యవేక్షించాడు. మొత్తం నిర్మాణం పూర్తి కావడానికి 3సం॥లు పట్టింది. అన్ని ఏళ్ళూ చిన్నస్వామిరాజు మరో పని లేకుండా హోటల్ నిర్మాణ పర్యవేక్షణలోనే వున్నాడు.

హోటల్ నిర్మాణ సమయంలో ఒక ప్రమాదం జరిగింది.

ఆ రోజు రూఫ్ వేస్తున్నారు. బార్ బెండింగ్ సరిగా వేశారా లేదా? సెంట్రింగ్ సీట్లు బాగున్నాయా లేదా? మొదలైన డీటెయిల్స్‌ను స్వయంగా చూసుకొనేందుకు చిన్నస్వామిరాజు మిత్రులు మల్సానీ, బలరాంలతో కలసి రూఫ్ మీదికి వెళ్ళాడు.

కార్పెంటర్‌కూ, బార్బెండర్‌కూ, అక్కడ పనులను సూపర్‌వైజ్ చేస్తున్న సివిల్ ఇంజనీర్‌కూ, అందరికీ తగిన గైడెన్స్ ఇచ్చి వెళుతున్నాడు.

ఇంతలో కార్పెంటర్‌కు ఏదో సందేహం వచ్చింది. వెళుతున్న ఆయన్ను పిలిచాడు. వెళ్తున్న వాడు వెనక్కి తిరిగి కార్పెంటర్ వున్న చోటకి వస్తున్నాడు. ఒక సెంట్రింగ్ సీట్ మీద కాలు పడింది. అంతే. అది క్రిందికి వెళ్ళిపోవడం ఈయన అందులోకి జారిపోవడం సెకనులో జరిగిపోయింది. అది 30 అడుగుల ఎత్తున్న రూఫ్. క్రింద ఇనుప కడ్డీలు, ఇతర కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ వుంది. అక్కడి నుంచి వాటి మీద పడితే... పరిస్థితి తీవ్రంగా వుండేది.

అయితే అనుకోకుండా అతను దానిలో పడబోతూ పక్కకు తిరిగాడు. ఆ సీట్ మధ్యలో వేలాడుతూ అతన్ని బలంగా తాకడం వల్ల అలా తిరిగి వుండవచ్చు. అలా తిరగడంతో రెండు చేతులతో రెండువైపులా పట్టుకొన్నాడు. కేవలం చేతుల బలంతో వేలాడుతున్నాడు.

తను ఎలా పడ్డాడో, ఎలా తిరిగాడో, ఎలా పట్టుకొన్నాడో, తన కేమీ గుర్తులేదనీ, అంతా క్షణాల్లో జరిగిపోయింది అంటాడు చిన్నస్వామిరాజు.

మల్సానీ, బలరాం తదితరులు పరిగెత్తుకెళ్ళి ఆయన్ని లేవదీశారు. సెంట్రింగ్ సీటు బలంగా తగలడంతో ఎముక ఫ్రాక్చర్ అయింది. కొంతకాలం హాస్పిటల్‌లో వుండాల్సి వచ్చింది.

అతని జీవితంలో ఇది రెండవ పెద్ద ప్రమాదం. ఇది 60 ఏళ్ళ వయస్సులో జరిగింది. అంత వయసులోనూ దృఢత్వం కల్గిన శరీరం కాబట్టి చేతుల బరువు మీద వేలాడగలిగాడు.

మొదటి ప్రమాదం జరిగింది చాలా చిన్న వయసులో. దాదాపు 8 ఏళ్ళు వుంటాయి అప్పుడు. అప్పుడప్పుడే ఎద్దుల బండి తోలుతున్నాడు.

ఎద్దుల కాడికీ, బండికీ మధ్య ఒక పొడవైన దూలం లాంటిది వుంటుంది. దానిని 'నొగ' అంటారు. ఆ నొగకు సపోర్టుగా అటూ ఇటూ రెండు కట్టెలు అటాచ్ చేయబడి వుంటాయి. చిన్నస్వామి నొగ మీద కూర్చుని ఆ కట్టెల మీద కాళ్ళు పెట్టుకొని బండి తోలుతున్నాడు.

సడన్‌గా ఒక కట్టె విరిగిపోయింది. బ్యాలెన్స్ తప్పి క్రింద పడిపోయాడు చిన్నస్వామి. చక్రం అతని ముఖం దగ్గరికి వచ్చింది. అది తన తలమీద ఎక్కుతుందేమో అని భయపడిపోయాడు. అయితే అది అతని వెంట్రుకల మీదుగా వెళ్ళింది. తృటిలో తప్పిపోయింది ప్రమాదం.

'చెక్ బౌన్స్?' – అంటే ఏమిటి?

*చెక్ బౌన్స్ అవటం అంటే ఏమిటో చిన్నస్వామిరాజుకి తెలియదు. ఆయనకిప్పుడు **80**సం॥లు. **100**రూ॥లతో మొదలు పెట్టి, కోట్ల రూపాయల వరకు అనేక చెక్కులు ఆయన ఇష్యూ చేశారు. ఇప్పటి వరకు కొన్ని వందల కోట్ల విలువ చేసే చెక్కుల మీద ఆయన సంతకం చేశారు.*

అయితే ఆశ్చర్యకరమైన సంగతి ఏమిటంటే, ఇప్పటి వరకు ఆయన ఇష్యూ చేసిన, సంతకం చేసిన చెక్ బౌన్స్ కాలేదు.

అంతే కాదు. పోస్ట్‌డేటెడ్ చెక్ ఆయనెప్పుడూ ఇష్యూ చేయడు.

ఆయనకు మొదటి నుంచీ 'అప్పులవాడు' అంటే పడదు. అప్పుల వాళ్ళను చూస్తే చాలు కోపం సర్రుమని ఎక్కుతుంది.

*చిన్నస్వామిరాజు అంత గొప్ప కస్టమర్ బ్యాంకులకి దొరకడు. అందుకనే కార్పొరేషన్ బ్యాంక్ ఆయనకు **3** సార్లు 'బెస్ట్ కస్టమర్' అవార్డ్ ఇచ్చి సన్మానించింది. **1975**లో ఫియట్ కారును ప్రజెంట్ చేసింది ఆయనకు. **1989**లో నెహ్రూ శత జయంతి సందర్భంగా మరోసారి ఆ బ్యాంకు రాజును సన్మానించింది.*

ఇవాళ పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలంతా బ్యాంకుల దగ్గర డబ్బు వందల కోట్లు తీసుకొని ఎగ్గొట్టి వాటికి సన్మానం చేస్తుంటే, చిన్నస్వామిరాజుకి మాత్రం బ్యాంకులే సన్మానం చేస్తున్నాయి.

ఆయన మాట ఇస్తే మడమతిప్పడు. చెక్కు ఇస్తే తిరిగి రాదు.

ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు మనిషి తాత్వికంగా ఆలోచిస్తాడు. జీవితం నిశ్చితం కాదు, మృత్యువు నిశ్చితం అనే వాస్తవం ఒక కుదుపుతో మనలోకి చొరబడుతుంది.

చిన్నస్వామిరాజు కూడా ఇటువంటి అనేక సంఘటనల మూలంగా కర్మసిద్ధాంతాన్ని బలంగా నమ్ముతాడు. విధి మనిషి మీద చేసే ఆధిపత్యాన్ని సంపూర్ణంగా విశ్వసిస్తాడు.

✦ ✦ ✦

1993 నాటికి హోటల్ పూర్తయింది. అప్పటికే 'సన్‌రే'లో కార్యకలాపాలు తగ్గిపోవడం వల్ల సుందర్ కూడా హోటల్ పనుల్లో నిమగ్నమయ్యాడు.

హోటల్‌కు 'ఏట్రియా' అని పేరు పెట్టింది కూడా సుందరే. అప్పటికే ఏట్రియా పేరుతో అమెరికాలోని లాస్‌వెగాస్‌లో, ప్యారిస్‌లో హోటల్స్ వున్నాయి.

ఏట్రియా అనేది 'ఏట్రియమ్'కు బహువచనం. ఏట్రియం అంటే పొడవైన, పెద్దగా వుండే తెరచుకొన్న భాగం. అనేక అంతస్థుల ఎత్తు, గ్లేజెడ్ రూఫ్ లేదా పెద్ద పెద్ద కిటికీలు కలిగి వుండే స్థలం. చాలా కంపెనీలు ఏట్రియాను లైక్ చేస్తాయి. ఎందుకంటే అది 'స్పేస్ అండ్ లైట్'కు సంబంధించి ఒక మంచి భావనను సృష్టిస్తుంది.

ఏట్రియా బిజినెస్ క్లాస్ హోటల్. 1993లో దీన్ని ప్రారంభించారు.

ఏట్రియా ప్రారంభం చిన్నస్వామిరాజు జీవితంలో ఒక మైలురాయిగా చెప్పచ్చు. అప్పటి నుంచి చిన్నస్వామిరాజుకు చెందిన అన్ని సంస్థల్నీ 'ఏట్రియా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్'గా పిలవడం మొదలైంది.

సెంట్రల్లీ– ఏర్‌కండిషన్డ్ ఫెసిలిటీతో 168 రూములు, సూట్స్‌తో అనేక రెస్టారెంట్లు, వెన్యూలతో ఏట్రియా బెంగుళూరు ఆతిధ్య పరిశ్రమలో ప్రధాన ఆకర్షణగా నిలచింది.

ఇప్పటికీ ఏట్రియా విజయవంతంగా నడుస్తూ వుంది.

౧౫. 'పవర్'లోకి ప్రవేశం (Power to 'power')

న్నస్వామిరాజు జీవితంలో ప్రతిదీ కాకతాళీయమే. దీర్ఘకాలిక ప్రణాళిక ప్రకారం జీవితాన్నిగానీ, వ్యాపారాన్ని కానీ ముందుకు తీసుకెళ్ళ లేదు ఆయన.

అలాగే పవర్ ప్రాజెక్టుల్లోకి కూడా ఆయన అనుకోకుండానే ప్రవేశించాడు.

కర్నాటకలో పవర్ ప్రాజెక్టుల స్థాపనకోసం పత్రికల్లో ప్రభుత్వం టెండర్లను పిలిచినపుడు ఆయన అప్లై చేశాడు. ఏట్రియా పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీని స్టార్ట్ చేశాడు. 1997–98లో షింషాలో హైడ్రో పవర్ ప్రాజెక్టు వీళ్ళకు వచ్చింది.

షింషా నది కావేరికి ఉపనది. మలవళ్ళి తాలూకాలోని షింషాపురలో జలపాతం వుంది. షింషాలో ఏట్రియా పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ తరపున 1998లో హైడ్రో ప్రాజెక్టు నిర్మాణం మొదలైంది. 15 నెలల్లో ప్రాజెక్టు పూర్తయింది.

షింషా ప్రాజెక్టు నడుస్తున్నంత కాలం చిన్నస్వామిరాజు రోజూ బెంగుళూరు నుంచి ఉదయం 6.30కి షింషా వెళ్ళేవాడు. అక్కడ నిర్మాణ పనుల్ని స్వయంగా పర్యవేక్షించేవాడు. మళ్ళీ రాత్రి 10.30కి తిరిగి వచ్చేవాడు.

'ఆ ప్రాజెక్టు అనుకొన్న స్థలానికి దారిలేదు. అందరూ అక్కడికి పోవడానికి జంకుతున్నారు. ఇంజనీరు అయితే పోవడం సాధ్యం కాదని తేల్చేశాడు. అయితే చిన్నస్వామిరాజు ఏంచేశాడంటే, ఒక కూలివాడ్ని పిలుచుకొని కొంచెం దూరం నడిచి, వాడ్ని పిలిచి అక్కడ పారతో ఒక మెట్టు వెయ్యమన్నాడు. మరికొంత దూరం నడిచి మరొక మెట్టు వెయ్యమన్నాడు. అలా ఆయన నడుచుకొంటూ వెళ్తూ, మెట్లు వేసుకొంటూ వెళ్ళి, ఎలాంటి మెషినరీ సహాయం లేకుండా ఒక రోడ్డును రడీ చేశాడు. ఆయన విజన్ ఆశ్చర్యకరం'– అంటాడు నాగేష్.

అలా ప్రాజెక్టు ప్రారంభించక ముందు నుంచీ, అది విద్యుత్తును ఉత్పత్తి చేసే వరకు ఆయన దాన్ని దగ్గరుండి పర్యవేక్షించాడు. అప్పుడు నా కొడుకూ భార్య 'ఈ వయసులో ఈయన ఎందుకెళ్ళడం?

ఒక ఇంజనీరును పెట్టి జీతం ఇస్తే, అతను చూసుకొంటాడు కదా?' అని అనేవాళ్ళు. 'అయినా నేను వెళ్ళడం ఆపలేదు' అంటాడు చిన్నస్వామిరాజు.

2000సం॥లో ప్రారంభమైన షింషా హైడ్రో పవర్ ప్రాజెక్టు మొదట 6 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసేది. ఇప్పుడు 18 మెగావాట్లను ఉత్పత్తి చేస్తూ వుంది. ఇంకో 6 మెగావాట్ల ఉత్పత్తికి సిద్ధమవుతూ వుంది.

అదే సమయంలోనే శివసముద్రంలో కూడా 8 మెగావాట్ల సామర్థ్యంతో హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టును మొదలు పెట్టారు. (ఇక్కడ ఏషియాలోనే మొదటి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును స్థాపించారు. 1902లో ఈ ప్రాజెక్టు నుంచి సరఫరా అయిన విద్యుత్తుతోనే కోలార్ గోల్డ్ ఫీల్డ్‌ను నడిపేవారు.)

మండ్య జిల్లాలో కృష్ణరాజసాగర్ నది మీద మరో పవర్ ప్రాజెక్టు 2004లో మొదలైంది. దీనిపేరు 'ఏట్రియా బృందావన్ పవర్ ప్రాజెక్టు'. ఇది మినీ హైడెల్ పవర్ ప్రాజెక్టు. దీని విలువ 65 కోట్లరూ॥లు. సామర్థ్యం 12 మెగావాట్లు.


అయితే ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇంట్లో వాళ్ళ ఒత్తిడికి తలొగ్గి చిన్నస్వామిరాజు ఆ ప్రాజెక్టును ఇంజనీరుకు వదిలి పెట్టాడు. వాళ్ళ అన్న కొడుకు నాగరాజు, కొడుకు సుందర్‌లు తగిన పర్యవేక్షణ చేయలేదు.

చిన్నస్వామిరాజు పర్యవేక్షణ లోపించిన ఫలితంగా 20 కోట్ల రూ॥లకు పైగా నష్టమొచ్చింది.

ఒక కాంక్రీట్ వాల్ పడిపోయింది. దానికి ఇంజనీరు అవసరమైన కాంక్రీటు వెయ్యలేదు. ఫలితంగా అది కూలిపోయింది. నీటి ప్రవాహాన్ని నియంత్రించే గేటు పని చేయడం మానేయడంతో ప్రవాహం తన్నుకొని ఒక్కసారిగా బయటికి వురికింది. అదృష్టవశాత్తూ మానవ నష్టం జరగలేదు. పని చేస్తున్న 8 మంది సరైన సమయంలో బయటికి వచ్చేశారు.

నీటి ప్రవాహం వుధృతంగా బయటికి రావడంతో అక్కడున్న నిర్మాణ సామగ్రి మొత్తం కొట్టుకుపోయింది. టర్బైన్లు, జనరేటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటిలో మునిగిపోయాయి.

వార్త తెలిసి హుటాహుటిన బయలుదేరి వెళ్ళాడు చిన్నస్వామిరాజు. ప్రభుత్వ ఇంజనీర్లను సంప్రదించి ముందుగా నీటి వుధృతిని తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాడు. నీటికి ఎగువ భాగాన ఒక coffer damను కట్టాలని నిర్ణయించుకొని బండరాళ్ళనూ, ఇసుక బస్తాల్ని అక్కడ వేసి అడ్డుకట్ట నిర్మించారు. టిప్పర్లతో, జె.సి.బిల సహాయంతో బండల్నీ, ఇతర మెటీరియల్‌నీ కాలువలో వేశారు.



'ఏట్రియా హైడ్రో పవర్ స్టేషన్', షింషా

ఈలోగా కర్నాటక రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివలింగయ్యతో పాటు ఇతర సీనియర్ ఇంజనీర్లు, ఇతర అధికార్లు వచ్చి నష్టనివారణ చర్యల్లో పాల్గొన్నారు.

రెండవ రోజు వుధృతి తగ్గడంతో గేటును రిపేరు చేయగలిగారు.

'కేవలం రోజుకు గంటసేపు పర్యవేక్షణ లోపించడం వల్ల, నిర్లక్ష్యం వల్ల, ఇంజనీరును నమ్మి వదిలేయడం వల్ల ఈ నష్టం జరిగింది. మన స్వంత పర్యవేక్షణ లేకపోతే ఏం జరుగుతుందో చెప్పడానికి ఈ ఉదాహరణ చాలు' అంటాడు చిన్నస్వామిరాజు.

ఆ తర్వాత బృందావన్ పవర్ ప్రాజెక్టు పూర్తయింది. 2007 నుంచి విజయవంతంగా నడుస్తూ వుంది.

ఇంకోవైపు దావణగెరె జిల్లాలోని హరిహర్‌లో నాఫ్తా ఆధారిత పవర్ ప్రాజెక్టు వచ్చింది. ప్రభుత్వంతో వున్న అగ్రిమెంటు ప్రకారం నాఫ్తాను దిగుమతి చేసుకోవాలి. అగ్రిమెంటు నాటికి నాఫ్తాకు ఏ రేటు వుందో, చివరి వరకు ప్రభుత్వం అదే రేటు ఇచ్చేట్లుగా ఒప్పందం. డాలర్ కన్వెర్షన్ రేటు కూడా అంతే.

అమ్మో! ఆయనా? - పని రాక్షసుడు

మీరు జీవితంలో ఎవర్నయినా అమ్మాయిని ప్రేమించారా? అని చిన్నసామిరాజును అడిగితే 'అవును ప్రేమించాను' - అన్నాడు నవ్వుతూ.

అమ్మాయి పేరేమిటి?

'పని' - ఆయన జవాబు... ముఖం నిండా పరచుకొన్న నవ్వు. ఆయన నిజమే చెబుతున్నాడు.

ఆయనకి ప్రేయసి అయినా, స్నేహితుడైనా పనే. ఇంకెవ్వరూ లేరు.

చాలా మందికి జీవితంలో పని వుంటుంది. కానీ ఆయనకు పనిలోనే జీవితం వుంది.

ఆయన చాలా అదృష్టవంతుడని అంటారు కొందరు. కానీ వాళ్ళకు తెలియన్ది ఏమిటంటే 'అదృష్టానికి తల్లి హార్డ్‌వర్క్'. అదృష్టాన్ని సృష్టించేది హార్డ్‌వర్కే.

ఆయన చేసిన హార్డ్‌వర్కే ఆయనకి అదృష్టాన్ని బహూకరించింది.

హార్డ్ వర్క్ చేసే వాళ్లంతా జీవితంలో విజయం సాధించలేకపోవచ్చు. కానీ, జీవితంలో విజయం సాధించాలంటే మాత్రం హార్డ్‌వర్క్ తప్పనిసరి.

'చాలామంది అవకాశాన్ని పోగొట్టుకుంటారు. ఎందుకంటే అవకాశం పని రూపంలో వుంటుంది.' అంటాడు Thomas A. Edison

చిన్నస్వామిరాజు తన ముందున్న పని రూపంలోని అవకాశాన్ని ఎప్పుడూ మిస్ కాలేదు. ప్రతి అవకాశాన్ని పట్టుకొన్నాడు. అంతేకాదు తన హార్డ్‌వర్క్‌తో అనేక అవకాశాల్ని స్వయంగా సృష్టించుకొన్నాడు కూడా.

ఆయన యవ్వనంలో వున్నపుడు పగలంతా పనిచేశాక సాయంత్రం రిక్రియేషన్ ఏమిటో తెలుసా?

ఇదే ప్రశ్న ఆయన్ని అడిగితే, ఠక్కున వచ్చింది జవాబు. 'రాత్రి లారీ రిపేరు చేయడమే నా రిక్రియేషన్'.

నిజమే పనిలోనే రిలాక్స్ అయ్యేవాడికి వేరే రిక్రియేషన్ ఎందుకు?

నిజానికి పదేళ్ళ వయస్సు నుంచే పనిచేస్తున్నాడు. ఆయన స్కూల్ కిడ్ కాదు. వర్కింగ్ చైల్డ్.

అలాగే **80** ఏళ్ళ వయసులోనూ రిటైర్ కాలేదు. ఇప్పటికీ రాత్రి **9**గం॥కు పడుకొని ఉదయం **3.50**కి లేస్తున్నాడు. రోజంతా పనే.

'హాలిడే వస్తే హెడ్ఏక్ నాకు. పండుగ వస్తే నాకు ఏమీ తోచదు' అంటాడాయన. సన్‌డే కూడా పని చేస్తాడు.

80 ఏళ్ళ జీవితంలో ఇంటి దగ్గర ఖాళీగా కూర్చున్న రోజులు ఎన్ని వుంటాయో తెలుసా?

కేవలం **10** రోజులు. నిరంతరం పనికి అలవాటు పడిన ఆయన దేహంలోని సెల్స్ విశ్రాంతిని రిజెక్ట్ చేస్తాయి.

చిన్నస్వామిరాజు వొక పని పూనిన మనిషి.

నాలుగేళ్ళ తర్వాత నాఫ్తా ధర 16రూ॥ నుంచి 38రూ॥లకు పెరిగింది. డీజిల్ రేట్లు కూడా పెరిగాయి. అయితే ప్రభుత్వం మాత్రం ఒప్పందం ప్రకారం పాత రేట్లనే ఇస్తూ వుంది.

చివరికి కోర్టుకు వెళదాం అనుకొన్నాడు చిన్నస్వామిరాజు. అయితే అదే రంగంలో వుంటున్న జి.ఎమ్.ఆర్ గ్రూప్ కూడా కోర్టుకు వెళదాం అనుకొంటూ వుంది. ఇద్దరూ పోవడం ఎందుకు? ఒకరు పోతే సరిపోతుంది కదా? అదే అందరికీ వర్తిస్తుంది అనుకొని 200 మెగావాట్లు తయారు చేస్తున్న జి.ఎమ్.ఆర్ గ్రూపు కోర్టుకు వెళ్ళింది. కోర్టు తీర్పు వాళ్ళకు అనుకూలంగా వచ్చింది. వాళ్ళు పని ప్రారంభించారు.

అయితే ఆ తీర్పు ఏట్రియా పవర్ కార్పోరేషన్‌కు వర్తించదనీ వీళ్ళు ప్రత్యేకంగా కోర్టుకు వెళ్ళాల్సిందేనని ప్రభుత్వం చెప్పడంతో చేసేది లేక ఏట్రియా గ్రూపు కూడా కోర్టుకు వెళ్ళింది. అయితే 10ఏళ్ళు గడిచినా కేసు తేల లేదు. అందువల్ల ఆ ప్రాజెక్టు పెండింగులో పడిపోయింది.

ఇప్పుడు గ్యాస్ ఆధారిత పవర్ ప్రాజెక్టు కోసం అప్లై చేసి వున్నారు.

బహుశా భవిష్యత్తులో సోలార్ పవర్‌లోకి కూడా ప్రవేశించే అవకాశం వుంది.

✦ ✦ ✦

1977 తర్వాత చిన్నస్వామిరాజు ప్రధానంగా 'హోటల్స్ అండ్ పవర్'కు పరిమితమయ్యాడు. ఈ రెండు రంగాలూ సుస్థిరంగా నడుస్తున్నాయి.

వీటితో పాటు 'ఏట్రియా టవర్స్' అనే రెసిడెన్షియల్ కాంప్లెక్సూ మరియు 'ఏట్రియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'ని నిర్మించారు.

విద్యారంగంలో ఆయన అనుభవాల్ని ప్రత్యేకంగా చర్చించుకోవాలి.

సమాజం నుంచి సమాజానికి

1. రాజు జీవితం రాజులకే అంకితం

చివర్లో హైదరాబాద్ వెళ్ళిన ఆయన సుమారు 4 ఏళ్ళపాటు హైదరాబాద్‌లో వున్నాడని చెప్పుకొన్నాం కదా. ఆ కాలంలో ఆయనకు హైదరాబాద్‌లో నివసిస్తున్న రాజు కమ్యూనిటీతో పరిచయాలు వచ్చాయి. హైదరాబాద్‌లో నివసించే రాజులు ఎక్కువ భాగం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకూ, విశాఖపట్టణం, విజయనగరం జిల్లాలకు చెందిన వారు. అందువల్ల చిన్నస్వామిరాజుకు ఆంధ్రప్రదేశ్‌లో నివసిస్తున్న ప్రముఖులందరితో పరిచయాలు వచ్చాయి.

హైదరాబాద్‌లో వున్నప్పుడే అక్కడి క్షత్రియ సేవాసమితి కార్యాలయానికి వెళ్ళిరావటం, అది చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొనటం చేస్తూ వుండేవాడు. ఆ సమితి కార్యలయానికి రూఫ్ కూడా రిపేరు చేసి ఇచ్చాడు.

హైదరాబాద్ నుంచి 1970–71కి బెంగుళూరుకు వచ్చేశాడు. అయినా, హైదరాబాద్ సంబంధాల్ని మాత్రం ఎప్పుడూ విడచిపెట్టలేదు. అక్కడ ఏదైనా కమ్యూనిటీ కార్యక్రమాలుగానీ, వ్యక్తిగత కార్యక్రమాలుగానీ వుంటే వెళ్ళిరావడం, వెళ్ళినపుడంతా పనిగట్టుకుని అందర్నీ కలిసి, వాళ్ళ యోగక్షేమాలు విచారించి రావడం చేసేవాడు.

అదే సమయంలో ఆంధ్రా నుంచి ఏ రాజులు బెంగుళూరుకి వచ్చినా చిన్నస్వామిరాజు అతిథి సత్కారాల్ని స్వీకరించి వెళ్ళాల్సిందే.

అలా 1966 నుంచీ ఆంధ్ర రాజులతో చిన్నస్వామిరాజు తన పరిచయాలను, సంబంధాల్ని సజీవంగా వుంచుకొన్నాడు.

అదే సమయంలో తన కాంట్రాక్టు ఫీల్డ్‌లో పనులను పర్యవేక్షించడం కోసం వివిధ స్థాయిల్లో నమ్మకమైన మనుషులు అవసరమయ్యారు. వాళ్ళని తన కమ్యూనిటీ నుంచీ, తన ప్రాంతం నుంచీ, బంధువర్గం నుంచీ తీసుకొన్నాడు. వాళ్ళను తను ఉపయోగించుకొన్నాడు. అదే సమయంలో వాళ్ళకు తాను ఉపయోగపడ్డాడు. వివిధ స్థాయిల్లో ఆయన దగ్గర పని చేసిన చాలామంది స్వతంత్ర్యంగా

కాంట్రాక్టులు చేసి అభివృద్ధి చెందారు. అలా వాళ్ళు అభివృద్ధి కావడానికి ఆయన తన వంతు సహాయం చేశాడు. అదే సమయంలో అవసరమైనపుడు వాళ్ళ సహాయం కూడా తీసుకొంటాడు.

బెంగుళూరులో వున్న క్షత్రియ సేవాసమితి, క్షత్రియ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యక్రమాలలో కూడా ఆయన చురుకుగా పాల్గొనేవాడు.

1983వ సంవత్సరంలో బెంగుళూరులో అఖిల భారత క్షత్రియ మహాసభలు జరిగాయి. ఆ సభల నిర్వహణకుగాను స్వాగత సమితి ఏర్పడింది. ఆ సమితికి చిన్నస్వామిరాజు అధ్యక్షుడు.

ఆయనకు గతంలో తమిళనాడులో నివసించే రాజులతో వున్న పరిచయంతో తమిళనాడులోని రాజపాళ్యం వెళ్ళి వాళ్లందరికీ సభల అవసరాన్నీ, రాజులు ఐక్యం కావాల్సిన ఆవశ్యకతనూ అర్థం చేయించి, వాళ్ళు పెద్ద సంఖ్యలో బెంగుళూరుకు వచ్చి సభల్లో పాల్గొనేట్లు చేశాడు.

అలాగే పెన్మత్స వెంకట్రాజు, ఏ.రాధాకృష్ణరాజుతో కలసి హైదరాబాద్ నుండి విశాఖపట్నం వరకు రాజులు నివసించే అన్ని ప్రధాన పట్టణాలన్నీ తిరిగి వాళ్ళను సభల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించాడు.

చిన్నస్వామిరాజు, ఇతర మిత్రుల కృషి ఫలితంగా ఆ సభ ఎవరూ వూహించనంత విజయవంతం అయింది. దాదాపు 4వేల మంది ప్రతినిధులతో సభ విజయవంతంగా జరిగింది.

మొదటిసారిగా ఆయన జనాన్ని సమీకరించడం, వాళ్ళని వివిధ పనులకు ఉపయోగించడం, ఆయా పనుల్ని రోజువారీగా సమీక్షించి వారి పని పద్ధతుల్ని మరింత మెరుగు పరచుకోవడానికి అవసరమైన గైడెన్స్ ఇవ్వడం- వంటి నాయకత్వ లక్షణాల్ని ప్రదర్శించాడు.

ఈ అఖిల భారత క్షత్రియ మహాసభలతో ఆయన పరిచయాలు మరింత విస్తృతమయ్యాయి. ఇప్పటి వరకు బెంగుళూరుకూ, ఆంధ్రకూ పరిమితమైన ఆయన పరిచయాలు తమిళనాడుకూ, ఉత్తర భారతానికీ విస్తరించాయి.

ముఖ్యంగా తమిళనాడులోని రాజపాళ్యం రాజులు ఆయన పట్ల తీవ్రంగా ఆకర్షితులయ్యారు. అప్పుడు పరిచయమయిన వాళ్ళు ఇప్పటికీ ఆయన్ని వదిలిపెట్టలేదు.

'రాజపాళ్యం వాళ్ళ అభిమానమే నా నిజమైన ఆస్తి' అంటాడు చిన్నస్వామిరాజు.

రాజపాళ్యానికి చెందిన, అడయార్ ఆనందభవన్ గ్రూపు అధిపతి శ్రీనివాసరాజు మాటలు వింటే మనకు చిన్నస్వామిరాజు మీద రాజపాళ్యం వాళ్ళకి ఏ స్థాయిలో గౌరవం, ప్రేమాభిమానాలు వున్నాయో అర్థమవుతుంది. ఆయన ఇలా అంటాడు,

'డబ్బు గొప్పది కాదు. ఎవరైనా సంపాదించవచ్చు. కానీ టైమ్ అలాకాదు. అది అన్నిటికన్నా విలువైంది. చిన్నస్వామిరాజుగారి టైమ్ మరింత విలువైంది. అలాంటి విలువైన ఆయన సమయాన్ని మా కమ్యూనిటీ కోసం స్పెండ్ చేయడం చాలా గ్రేట్. మా కమ్యూనిటీ మొత్తాన్ని యునైట్ చేయడానికి ఆయన నిరంతరం శ్రమిస్తారు. **గాంధీని నేను చూడలేదు. నా దృష్టిలో చిన్నస్వామిరాజు మా కమ్యూనిటీ గాంధీ.'**

✦ ✦ ✦

అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి సెక్రెటరీగా వున్న దిగ్విజయ్ సింగ్ కూడా క్షత్రియుడే. ఆయన కొంతకాలం ఆంధ్రప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్‌గా వున్నాడు. ఆ కాలంలో ఆయనకు ఆంధ్ర రాజులతో పరిచయాలు వచ్చాయి. ఆంధ్రప్రాంతంలోని అనేక క్షత్రియ సంఘాలు ఆయన్ను ఆహ్వానించడం, సన్మానించడం వంటివి చేస్తుండేవి.

'ఒకప్పుడు అఖిలభారత స్థాయిలో క్షత్రియులంతా ఏకంగా వుండేవాళ్ళు. ఆ తర్వాత ఐకమత్యం పోయింది. మళ్ళీ మన వాళ్ళందర్నీ ఏకం చేయడానికి ప్రయత్నించవచ్చు కదా?' అని దిగ్విజయ్ ఆంధ్రరాజుల ముందు ప్రతిపాదించాడు. వాళ్ళు సుముఖత చూపించారు.


రెండు సన్నాహక సమావేశాల్ని నిర్వహించాడు దిగ్విజయ్. దానికి ఆంధ్ర రాజుల్లోని ముఖ్యులంతా హాజరైనారు. ఆంధ్రలోనేకాక మొత్తం దక్షిణ భారతదేశంలోని ముఖ్యులతో సమావేశం నిర్వహించాలనుకొన్నారు. అప్పుడు ఆయనకు చిన్నస్వామిరాజు గురించి చెప్పారు. ఆయన అప్పటికే రాజు గురించి విని వున్నాడు.

మూడవ సన్నాహక సమావేశానికి చిన్నస్వామిరాజును కూడా ఆహ్వానించారు. రాజు హైదరాబాద్ వెళ్ళాడు.

ఆ సన్నాహక సమావేశంలో అనేక విషయాలు చర్చకు వచ్చాయి. త్వరలో జాతీయ స్థాయిలో ఒక ఆలిండియా క్షత్రియ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని, దేశంలో వివిధ ప్రాంతాల్లో వున్న స్థానిక క్షత్రియ సంఘాలన్నిటినీ నేషనల్ ఫెడరేషన్లో భాగం చేయాలని తీర్మానించారు.

ఈ నేషనల్ ఫెడరేషన్ ఛైర్మన్‌గా దక్షిణ భారతదేశం నుంచే వుంటే బాగుంటుందని దిగ్విజయ్ సూచించాడు.

కొన్ని రోజులకు మరో సమావేశం జరిగింది. అదీ హైదరాబాద్‌లోనే. బెంగుళూరు నుంచి చిన్నస్వామిరాజు, బెంగుళూరు క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు, మైసూరు నుంచి ఒకరు హాజరయ్యారు.



షష్ఠిపూర్తి టూర్‌లో భాగంగా

దాదాపు 80 మంది సీనియర్లు పాల్గొన్న ఆ సభ నేషనల్ ఛైర్మన్ పదవికి చిన్నస్వామిరాజే వుండాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆయన ఆసక్తి చూపలేదు. 'మేము ఏకగ్రీవంగా నిర్ణయించాం. మీరు వుండాల్సిందే' అనడంతో రాజు అంగీకరించక తప్పలేదు. అలా 'ఆల్ ఇండియా క్షత్రియ ఫెడరేషన్' ఏర్పడటమూ, దానికి చిన్నస్వామిరాజు ఛైర్మన్ కావడమూ జరిగింది.

2007లో విశాఖపట్టణంలో ఫెడరేషన్ జాతీయ మహాసభలు జరిగాయి.

ఈసారి ఈ సభలకోసం కొందరు మిత్రుల్ని తీసుకొని హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, తమిళనాడు వంటి అనేక రాష్ట్రాల్ని పర్యటించాడు చిన్నస్వామిరాజు.

'ఆయనకు ట్రావెలింగ్ అంటే ఇష్టం. ఎక్కువ మందితో పరిచయాలు అంటే ఇష్టం. కమ్యూనిటీ అంటే ఇష్టం. ఈ మూడు ఇష్టాల మూలంగా ఆయన దేశవ్యాప్తంగా తిరిగి మా కమ్యూనిటీని ఏకం చేశాడు.

'ఆయన ప్రధానంగా మా రాజుల కమ్యూనిటీకి ఏం చేశాడురా అంటే కనెక్టివిటీ, నెట్‌వర్కింగ్– ఈ రెండింటినీ సాధించాడు. డబ్బుల కంటే తన టైమ్‌ను ఎక్కువగా కమ్యూనిటీకి స్పెండ్ చేశాడు. ఆ

విషయంలో ఆయన కమిట్‌మెంట్ మెచ్చుకోతగింది'– అంటాడు రాఘవరాజు. ఆయన ఫెడరేషన్ సెక్రెటరీ.

2007 నుంచీ ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా రాజు, క్షత్రియుల్లో ఐక్యతను తీసుకురావడం, అవేర్‌నెస్‌ను పెంచడమే ప్రధాన వుద్దేశంగా ఫెడరేషన్ పనిచేసింది. అందులో భాగంగా ఫెడరేషన్ రెండవ జాతీయ మహాసభలు నాగ్‌పూర్‌లో, మూడవ మహాసభలు మధ్యప్రదేశ్‌లో జరిగాయి.

4వ మహాసభలు ఫిబ్రవరి 4–6, 2011 తేదీల్లో జైపూర్‌లో జరుగుతాయి.

ఫెడరేషన్ ముందున్న ప్రధాన కర్తవ్యాల్ని చిన్నస్వామిరాజు ఇలా వివరించాడు.

1. అఖిల భారత స్థాయిలో క్షత్రియులందరూ సమైక్యం కావడం, సంబంధ బాంధవ్యాల్ని కలుపుకోవడం.
2. రాజు–క్షత్రియ కమ్యూనిటీలో స్త్రీ విద్య చాలా తక్కువ. బాలికల్ని పెద్ద సంఖ్యలో విద్యావంతుల్ని చేయాలి. హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో తక్షణం రెండు బాలికల హాస్టళ్ళు నెలకొల్పాలి.
3. కమ్యూనిటీలోని పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం చేయాలి. ఎడ్యుకేషనల్ లోన్లు ఇవ్వాలి వడ్డీ లేకుండా.
4. ఇంజనీరింగు, ఇతర వృత్తి విద్యా సంస్థల్లో కమ్యూనిటీ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించాలి.

ఇలా 1983 నుంచి చిన్నస్వామిరాజు తమ రాజు, క్షత్రియ కమ్యూనిటీ కోసం పని చేస్తున్నాడు.

'మనం ఈ కమ్యూనిటీ వల్ల, సొసైటీ వల్ల బాగుపడ్డాము. ఇప్పుడు మన వంతుగా తిరిగి కమ్యూనిటీకీ, సొసైటీకీ సహాయ పడటం, సేవ చేయడం మన కనీస కర్తవ్యం' అంటాడు చిన్నస్వామిరాజు.

'Give back to the Society' అనే భావనను అమలు చేసే పనిలో వున్నాడు ఆయన.

౨. కాంట్రాక్టర్ల 'పితామహ'

న్నస్వామిరాజును **'A born civil contractor'** అని చెప్పవచ్చు. ఆయనకు సివిల్ కన్‌స్ట్రక్షన్ అంటే స్పెషల్ ఇంటరెస్ట్. 80 ఏళ్ళ వయసులో ఇప్పటికి కూడా కన్‌స్ట్రక్షన్ వర్క్‌ను పర్యవేక్షించడమంటే ఆయనకు మహా ఆసక్తి.

ఆయన కన్‌స్ట్రక్షన్ రంగంలో అన్ని కోణాలు, లోతులు, ఎత్తులూ చూశాడు. ఆ రంగంలో **ఆయన ఒక మేస్త్రీకి అసిస్టెంట్‌గా జీవితాన్ని ప్రారంభించాడు. అదే వ్యక్తి తర్వాతి కాలంలో 'బిల్డర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా'కు ప్రెసిడెంట్ అయ్యాడు.** అదీ ఒక్కో మెట్టే ఎక్కుతూ వెళ్ళాడు. బిల్డర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా, కాంట్రాక్టు రంగంలో ఒక శిఖరం అనుకుంటే, ఆ శిఖరం మీదికి కష్టపడకుండా ఫ్లయిట్‌లోనో, కారులోనో మరో రకంగానో చేరుకోవచ్చు. కానీ చిన్నస్వామిరాజు ఒక్కో అడుగే వేసుకుంటూ, ఒక అడుగు కూడా వెనక్కి వేయకుండా కొద్ది కొద్దిగా ఎక్కుతూ ఆ శిఖరాన్ని చేరుకొన్నాడు.

అది వొక కష్టభరితమైన సుదీర్ఘ ప్రయాణం. అయితే ఆయన తన ప్రయాణాన్ని వొంటరిగా చేయలేదు. అనేక మందిని వెంట తీసుకెళ్ళాడు. చాలా మంది తనను దాటి వెళ్ళేందుకు సహాయం చేశాడు కూడా.

ఆయనకు ఒంటరిగా ప్రయాణించడం ఇష్టం లేదు. సమూహంలో ప్రయాణించడమే ఇష్టం.

అలా, ఆయన చేసిన ఒక సామూహిక ప్రయాణమే 'కర్నాటక స్టేట్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్'.

అసోషియేషన్ 1945లోనే ప్రారంభమయింది. అయితే 'నామ్‌కే వాస్తే' అన్నట్టు నడిచేది. 1978లో చిన్నస్వామిరాజు అసోషియేషన్‌లో సభ్యుడిగా చేరాడు. 1981లో అసోషియేషన్‌కు ప్రెసిడెంట్ అయ్యాడు.

ఆయన ప్రెసిడెంట్ అవగానే మొదట చేసిన పని అసోషియేషన్లో సభ్యత్వాన్ని పెంచడం. అప్పటి వరకు అది ఏ కొద్ది మందికో పరిమితమై వుండేది.

'ఆయన ప్రెసిడెంట్ అయిన వెంటనే స్తబ్దుగా వున్న అసోషియేషన్లో చలనం వచ్చింది. కాంట్రాక్టర్ల సమస్యల్ని ముందుకు తీసుకు వచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయడం మొదలు పెట్టాడు.'– అంటాడు కె.కె.మల్వానీ. ఆయన మల్వానీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు అధిపతి. 60 ఏళ్ళ నుంచీ చిన్నస్వామిరాజుకు మిత్రుడు.

'అంతకు ముందు అసోషియేషన్ కేవలం రెండు నగరాల్లో మాత్రమే వుండేది. ఆయన ప్రెసిడెంట్ అయ్యాక అది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలకూ విస్తరించి, నిజమైన రాష్ట్రస్థాయి అసోషియేషన్‌గా మారింది' అంటాడు మల్వానీ.

మొదటి మహాసభ సందర్భంగా ఆయన రాష్ట్ర వ్యాప్తంగా వున్న కాంట్రాక్టర్లందరినీ కదిలించాడు. ఫలితంగా అసోషియేషన్ ఏర్పడిన నాటి నుంచీ ఎప్పుడూ లేని విధంగా, రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కాంట్రాక్టర్ల ప్రతినిధులు సభకు హాజరయ్యారు. ఆ సభలో అనేక నిర్ణయాలు తీసుకొన్నారు. వాటిని సక్రమంగా అమలు చేసే బాధ్యతను కూడా ఆయన తీసుకొన్నాడు.

అప్పటి వరకు రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోషియేషన్ తనకంటూ ఒక భవనాన్ని నిర్మించుకోలేక పోయింది. అప్పుడు చిన్నస్వామిరాజు ఆధ్వర్యంలో అసోషియేషన్‌కు స్వంత బిల్డింగ్ ఏర్పడింది. ఈ భవనంలో వీళ్ళ ఆఫీసు వుండటంతో పాటు, ఇతర ఆఫీసులకు అద్దెకు కూడా ఇవ్వడంతో అసోషియేషన్‌కు అది ఆదాయ వనరుగా కూడా ఉపయోగపడింది.

అయితే ఈ మధ్య బెంగుళూరు నగరంలో మెట్రో రైల్వేట్రాక్‌ను వేస్తున్నారు. ఆ ట్రాక్ రూట్లో ఈ బిల్డింగ్ కూడా వుండటంతో అది కాస్తా మెట్రో అథారిటీ చేతుల్లోకి వెళ్ళిపోయింది.

ప్రస్తుతం మరో నూతన భవనాన్ని నిర్మించే ప్రయత్నంలో అసోషియేషన్ వుంది. మొదటి భవనాన్ని నిర్మాణ సమయంలో దగ్గరుండి కట్టించాడు చిన్నస్వామిరాజు. ఇప్పుడు కూడా స్వయంగా నిర్మాణ పర్యవేక్షణ చేయాలనే ఆసక్తి వుంది ఆయనకు. చిన్నస్వామిరాజు నాయకత్వంలో కర్నాటక స్టేట్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్ రెండు ముఖ్యమైన స్కీముల్ని విజయవంతంగా అమలు చేసింది.

1. క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటి

అప్పుడు కర్నాటక రాష్ట్ర PWD మినిస్టర్‌గా హెచ్.డి.దేవేగౌడ వున్నాడు. ఆయన సహకారంతో వీళ్ళ సొసైటీ కోసం రాష్ట్ర అసెంబ్లీలో కొత్త శాసనాన్ని పాస్ చేశారు.

ఈ సొసైటీలో రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లందరూ సభ్యులుగా వుంటారు. వీళ్ళే షేర్ కేపిటల్ ఇస్తారు.

ప్రతి కాంట్రాక్టర్‌కూ, ప్రభుత్వం నుంచి వచ్చిన కాంట్రాక్టు వర్క్ ఆర్డర్ మీద 12% మొబలైజేషన్

అడ్వాన్స్ ఇస్తారు. చిన్న చిన్న పనులకు బ్యాంకు అప్పు ఇవ్వదు. ప్రభుత్వం ఎలాగూ ఇవ్వదు. అటువంటప్పుడు ఈ కోఆపరేటివ్ సొసైటీ వాళ్ళని ఆదుకొంటుంది.

మొదట కొంతమందితో, 2 లక్షల రూ॥లతో మొదలైన సొసైటీ ఇప్పుడు 35,000 మంది సభ్యులతో 500 కోట్ల టర్నోవర్‌తో నడుస్తూ వుంది. మొదట అడ్వాన్స్ 5 వేలు వుండేది. ఇప్పుడు 50 లక్షల వరకు వుంది. మొదట ఒక బ్రాంచ్ వుండేది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 22 బ్రాంచ్‌లు వున్నాయి.

కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఇచ్చే వర్క్ ఆర్డర్ సొసైటీ దగ్గరే వుంటుంది. ప్రభుత్వం ఆ కాంట్రాక్టర్‌కు ఇవ్వవలసిన చెక్కునూ నేరుగా సొసైటీకే పంపుతుంది. కాంట్రాక్టర్ల షేర్ క్యాపిటల్ మీద వడ్డీ కూడా 12% వరకు సొసైటీ చెల్లిస్తుంది.

2. బెనొవలెంట్ ఫండ్ స్కీము


కన్‌స్ట్రక్షన్ రంగంలో పనిచేసే వర్కర్ల సంక్షేమం కోసం ఇది వుద్దేశించబడింది. ప్రతి కాంట్రాక్టరూ వర్క్ ఆర్డర్ వచ్చినపుడు ప్రతి 1000రూ॥లకు ఒక రూపాయిని ఈ ఫండ్‌కు చెల్లించాలి. దాంతో పాటు ప్రతి కాంట్రాక్టర్ చెల్లించే రిజిస్ట్రేషన్ ఫీజు 150రూ॥లు కూడా ఈ ఫండ్‌కే వెళుతుంది.

నిర్మాణ సమయంలో వర్కర్లు ప్రమాదానికి గురైనా, అనారోగ్యానికి గురైనా ఈ ఫండ్ నుంచి వాళ్ళకు సహాయం చేస్తారు. మెడికల్ రీఎంబర్స్‌మెంట్ కూడా వుంటుంది. కూలీలకు చేసే సహాయం మొదట 5వేల రూ॥లతో మొదలైంది. ఇప్పుడది 2 లక్షల వరకు వుంది. ఇప్పుడు ఈ ఫండ్ కింద 40 కోట్ల రూ॥ల డిపాజిట్ వుంది. దీన్ని కర్నాటక రాష్ట్ర ట్రెజరీలో వుంచారు. ప్రభుత్వం వీళ్ళకి వడ్డీ చెల్లిస్తుంది. ఈ రెండు స్కీములు దేశంలో మరెక్కడా లేవు. ఇది ఒక రికార్డు.

ఇలా కాంట్రాక్టర్స్ అసోషియేషన్‌కు చిన్నస్వామిరాజు చేసిన సర్వీసు మూలంగానే గత 4 దశాబ్దాల నుంచి అసోషియేషన్‌కు ఆయనే ప్రెసిడెంట్‌గా వున్నారు. ఎన్నికలే లేవు. చివరికి సభ్యులను కూడా నామినేషన్ పద్ధతిలో నియమించాల్సి వస్తుంది.

కర్నాటక స్టేట్ కాంట్రాక్టర్ల అసోషియేషన్‌కు చిన్నస్వామిరాజు చేసిన సేవల్ని భారత ప్రభుత్వం కూడా గుర్తించింది.

8వ పంచవర్ష ప్రణాళిక (1992-97) కాలంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'నిర్మాణ కార్యక్రమాల సమావేశం'లో కర్నాటక కాంట్రాక్టర్ల సమస్యలు, వాళ్ళ అసోషియేషన్ సాధించిన విజయాల గురించి 'కీనోట్ అడ్రస్'ను సమర్పించవలసిందిగా కేంద్రప్రభుత్వం చిన్నస్వామిరాజును ఆహ్వానించింది. అప్పటి ప్రధాని దేవేగౌడ సూచనలతో ఏర్పాటైన 'ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్'కు



బిఏఐ సన్మానసభలో చిన్నస్వామిరాజు

చిన్నస్వామిరాజును ఛైర్మన్‌గా అపాయింట్ చేశారు. ఆ కౌన్సిల్‌లో అప్పటి ప్లానింగ్ కమిషన్ మరియు ఫైనాన్స్ సెక్రెటరీ అహ్లూవాలియా కూడా సభ్యుడు. ఈ పదవీ కాలం 2సం॥లు.

బిల్డర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా

1986 సం॥లో బెంగుళూరులో 'ఆల్ ఇండియా బిల్డర్స్ కాన్ఫరెన్స్' జరిగింది. అప్పటికే చిన్నస్వామిరాజు కర్నాటక స్టేట్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్‌గా యాక్టివ్‌గా వున్నాడు.

బిల్డర్స్ కాన్ఫరెన్స్‌లో కూడా చురుకుగా పాల్గొన్నాడు చిన్నస్వామిరాజు.

బిల్డర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా (BAI) 1941లో పూణేలో ఏర్పడింది. అది అఖిల భారత నిర్మాణ పరిశ్రమకు జాతీయ ప్రతినిధి. దేశవ్యాప్తంగా 99 సెంటర్లలో పనిచేస్తూ వుంది. దీని కేంద్ర కార్యాలయం ముంబైలో వుంది. ఇందులో ప్రత్యక్ష సభ్యులు 10 వేలమంది కాగా, దీనికి అనుబంధంగా వుండే వివిధ సంఘాల ప్రతినిధులు 30 వేల మంది వున్నారు.

బిఏఐ 'ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ అండ్ వెస్టరన్ పసిఫిక్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్స్ (IFAWPCA) లోనూ, 'కాన్‌ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్స్ (CICA) లోనూ సభ్యత్వం కలిగి వుంది.

బిఏఐకి చాలాకాలం పాటు దక్షిణ భారత శాఖ అధ్యక్షుడిగా వున్నాడు చిన్నస్వామిరాజు. ఆ

తర్వాత 1996-97 పీరియడ్‌కు ఆయన బిఏఐ నేషనల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఆ మధ్యకాలంలో బిఏఐ ప్రెసిడెంట్‌గా, ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నది చిన్నస్వామిరాజునే. మామూలుగా బిఏఐ ప్రెసిడెంట్ అంటే, పోటీ చాలా తీవ్రస్థాయిలో వుంటుంది. గతంలో జరిగిన ఎన్నికలలో గ్యామన్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ కూడా ఓడిపోయాడు. అలాంటిది చిన్న స్వామిరాజు ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాడంటే బిల్డర్స్ కమ్యూనిటీలో ఆయన మీద ఎంత గౌరవం వుందో అర్థమవుతుంది.

బిఏఐకి చిన్నస్వామిరాజు ప్రెసిడెంట్‌గా వున్న కాలంలో చాలా పనులు చేశాడు. 1997లో భారత ప్రభుత్వ రెడీమిక్సింగ్ కాంక్రీటు వ్యాపారాన్ని పరిశ్రమగా ప్రకటించి దానిమీద విపరీతంగా పన్నులు విధించింది. ఆ జీవోను అనుసరించి పన్నులు కట్టలేదని ఎల్ అండ్ టీ మేనేజర్‌కు అరెస్ట్ వారెంట్ జారీ చేసింది.

అప్పుడు చిన్నస్వామిరాజు నాయకత్వంలో బిఏఐ ప్రతినిధి బృందం అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరంను కలసి వినతిపత్రం ఇవ్వడంతో పాటు చిన్నస్వామిరాజు చిదంబరంను జీవోను ఉపసంహరించుకొనేట్లుగా ఒప్పించగలిగాడు. కేంద్ర ప్రభుత్వం ఒకసారి జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోవడం చాలా అరుదైన విషయం.

అలాగే సేల్స్ టాక్స్, సర్వీసు టాక్స్, సిమెంటు ధరలు మొదలైన అంశాల మీద కూడా చిన్నస్వామిరాజు అధ్యక్షుడుగా వున్న కాలంలో ప్రభుత్వం మీద పోరాటాలు చేశాడు.

ఆయన అధ్యక్షుడుగా వున్న కాలంలోనే FAWPCA అంతర్జాతీయ కన్వెన్షన్ కొరియాలో జరిగింది. ఆ కన్వెన్షన్‌కు బిఏఐ తరపున ఒక ప్రతినిధి బృందాన్ని తీసుకెళ్ళాడు చిన్నస్వామిరాజు.

1997లో చెన్నైలో బిఏఐ ఆల్ ఇండియా కాన్ఫెరెన్స్ జరిగింది. దానికి అప్పటి ప్రధానమంత్రి దేవేగౌడ, గవర్నరు ఇతర అనేక మంత్రులు హాజరయ్యారు.

'కొరియా వెళ్ళినపుడు ఆ దేశపు నాయకుల్ని కూడా చిన్నస్వామిరాజు ఇంప్రెస్ చేశాడు. తన సాదాసీదా పద్ధతులతో ఆయన ఎవర్నయినా సులభంగా ఆకర్షిస్తాడు. ఆయనతో కలసి పని చేయడం నా అదృష్టం.' అంటాడు ఆర్.రాధాకృష్ణన్. ఆయన బిఏఐకి 1988-89కి ప్రెసిడెంట్‌గా వున్నాడు.

చిన్నస్వామిరాజును కాంట్రాక్టర్ల కమ్యూనిటీలో, బిఏఐ కమ్యూనిటీలో 'పితామహ' అని పిలుస్తారు. 'ఆయన మా కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు నాయకుడు. పదవులున్నా, లేకపోయినా ఆయన మా సమూహానికి పెద్ద. అందుకే ఆయన్ని మేమంతా 'పితామహ' అని పిలుస్తాం' అంటాడు మల్వానీ.

దాదాపు 10 ఏళ్ళ నుంచీ కాంట్రాక్టర్ల, బిల్డర్స్ మీటింగులన్నిటిలోనూ ఆయన్ను 'పితామహ' అని పిలుస్తున్నారు.

3. విద్యలేని వాడి విద్యాసేవ

ను ఎడ్యుకేషన్ ఫీల్డ్‌లోకి రావడానికి కారణం నాకు ఎడ్యుకేషన్ లేకపోవడమే'– అంటాడు చిన్నస్వామిరాజు.

ఆయన చదివింది 4వ తరగతి వరకే. ఆ తర్వాత ఆయనకు ఎటువంటి ఫార్మల్ ఎడ్యుకేషన్ లేదు. స్వంతంగా ఇంగ్లీష్‌తో పాటు ఇతర 4–5 భాషలు నేర్చుకొని, ఆయా భాషల్లో ఉపన్యాసాలు ఇవ్వగలుగుతున్నాడు.

అయితే జీవితంలో ఎదిగే కొద్దీ ఆయనకు ఎడ్యుకేషన్ విలువ ఏమిటో తెలుస్తూనే వుంది. అందువల్లే ఆయన విద్యారంగం ద్వారా వీలైనంత మందికి సహాయం చేయాలనుకొన్నాడు.

ఆయన ఏ సామాజిక సేవ చేయాలన్నా ముందుగా తన కమ్యూనిటీతోనే మొదలు పెడతాడు.

అలాగే విద్యారంగంలో కూడా తన కమ్యూనిటీకి సహాయం చేయడంతో సేవ ప్రారంభించాడు. జయనగర్‌లో ప్రారంభించిన 'రాజు–క్షత్రియ ఎడ్యుకేషనల్ ట్రస్టు' నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నాడు. ఆ తర్వాత ఆ హాస్టల్ విద్యార్థులకు వందలాది మందికి ఎడ్యుకేషనల్ లోన్లు ఇవ్వడం ద్వారా సహాయం చేశాడు.

ఒక పాత సామెత వుంది, 'ఆకలి వేసిన వాడికి చేపలు ఇస్తే వాడికి ఆ పూటకు మాత్రమే ఆకలి తీరుతుంది. అదే వాడికి చేపలు పట్టడం నేర్పిస్తే, అతని ఆకలి సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది'– దాన్ని పూర్తిగా నమ్ముతాడు చిన్నస్వామిరాజు.

అందుకే ఆయన విద్యార్థులకు విద్యను అందించడానికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తాడు. ఒకరు విద్యావంతుడైతే మొత్తం ఆ కుటుంబమే మారిపోతుందని నమ్ముతాడు ఆయన.

1983లో బెంగుళూరులో క్షత్రియ మహాసభలు జరిగినప్పుడు క్షత్రియ విద్యార్థులకోసం ఒక ఇంజనీరింగ్ కాలేజీ పెట్టాలని చిన్నస్వామిరాజు మిగిలిన క్షత్రియ ప్రముఖుల్ని ఆర్గనైజ్ చేసి అప్పటి కర్నాటక ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డేని కలిశాడు. ఆయన కాలేజీకి అనుమతినివ్వడానికి ఒప్పుకొన్నాడు.



3వ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మతో

అలా 'కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ఏర్పడింది. ట్రస్టుకు అధ్యక్షుడు ఏ.ఎస్.కుప్పరాజు. చిన్నస్వామిరాజు ట్రస్టీలలో ఒకడు.

ఈ KET ట్రస్ట్ తరపున సర్ ఎమ్ విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 1986లో ప్రారంభమయింది. ప్రస్తుతం ఈ ట్రస్టుకు అధ్యక్షుడు చిన్నస్వామిరాజు. Sir MVIT మొదట రాజు-క్షత్రియ విద్యార్థుల కోసం ప్రారంభించబడినా, ఇప్పుడది అన్ని కమ్యూనిటీ విద్యార్థులకు అందుబాటులో వుంది. బెంగుళూరులో బళ్ళారి రోడ్డులో వున్న ఈ కాలేజీ మొత్తం విస్తీర్ణం 133 ఎకరాలు. 3,380 మంది విద్యార్థులు, 184 మంది బోధనా సిబ్బంది వున్నారు.

ప్రముఖ ఇంగ్లీష్ పత్రిక 'డాటాక్వెస్ట్' ఈ కాలేజీకి కర్నాటకలో నెం1, దేశంలో 17వ ర్యాంకునూ ఇచ్చింది.

ఇటువంటి ఒక ప్రిస్టేజియస్ టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రస్తుతం 4వ తరగతి మాత్రమే చదివిన చిన్నస్వామిరాజు నాయకత్వాన నడుస్తూ వుంది.

బెంగుళూరులో రాజు-క్షత్రియ కమ్యూనిటీకి చెందిన పేద విద్యార్థుల చదువు కోసం ఏర్పడిన వైయాలికావల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు, వివేకానంద కళాశాల, తెలుగు విజ్ఞాన సమితి ఎడ్యుకేషనల్ ట్రస్టు

వంటి కొన్ని విద్యాసంస్థలకు వివిధ హోదాలలో పనిచేసిన చిన్నస్వామిరాజు ఆయా సంస్థల అభివృద్ధికి ఎంతో కృషి చేశాడు, చేస్తున్నాడు.

వీటితో పాటు తనుకూడా ఒక ఇంజనీరింగ్ కాలేజీని స్వయంగా స్థాపించాడు. ఇందుకోసం 1984లో 'ఏఎస్ కుప్పరాజు అండ్ బ్రదర్స్ ఛారిటబుల్ ఫౌండేషన్ ట్రస్ట్' అనే ఒక సంస్థను స్థాపించి, దాని తరపున 'ఏట్రియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'ని నెలకొల్పాడు. 17 ఎకరాల స్థలంలో, బెంగుళూరులోని ఆనందనగర్‌లో ఈ కాలేజీ వుంది.

1200 మంది విద్యార్థులు చదువుతున్న ఈ కాలేజీ కూడా చిన్నస్వామిరాజు గైడెన్స్ క్రిందనే నడుస్తూ వుంది. ట్రస్ట్‌కు ఆయనే అధ్యక్షుడు.

'విద్యారంగానికి సేవ చేయాలంటే ఆక్స్‌ఫర్డ్‌లోనో, యేల్ యూనివర్సిటీలోనో చదివి వుండనక్కర్లేదు. ఫార్మల్ ఎడ్యుకేషన్ ఏమాత్రం లేకుండా కూడా విద్యారంగానికి సేవ చేయవచ్చును అని చిన్నస్వామిరాజుగారు తన జీవితంలో నిరూపించాడు'– అంటుంది ఇందిర. ఆమె సర్ ఎమ్‌విఐటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్.



తెలుగు విజ్ఞాన సమితి సభలో రెబల్‌స్టార్స్ కృష్ణంరాజు, అంబరీష్‌లతో

మరువలేని రాజుగారి పికప్

ఇవాళ ఉదయం చిన్నస్వామిరాజుగారు, నేను ఏట్రియా కాలేజ్ ఆఫ్ టెక్నాలజీకి వెళ్ళాము. నేనెప్పుడు సిటీకి వెళ్ళినా కారు తీసుకెళ్ళను.

నేను రాజుగారితో వెళ్ళినపుడంతా, ఆయన తన కారులో నాకు లిఫ్ట్ ఇస్తుంటారు.

అయితే ఈ రోజు ఏమి జరిగిందంటే, కాలేజీలో పని అవగానే ఏదో అర్జంటు పని వుండటంతో రాజుగారు తన కారులో వెళ్ళిపోయారు.

నేను ఆటో కోసం ఎదురు చూస్తున్నాను.

రెండు కి.మీ. పోయిన తర్వాత నన్ను వదిలేసి వచ్చానని గుర్తొచ్చింది రాజుగారికి.

సాధారణంగా ఎవరైనా ఆయన స్థానంలో వుంటే నాకు ఫోన్ చేసి, "హలో నాగేష్. సారీ అమ్మ. కొంచెం అర్జెంట్ పని వొత్తిడిలో నిన్ను పికప్ చేసుకోవడం మర్చిపోయాను. ఏమనుకోవద్దు. ఆటో పట్టుకొని వెళ్ళిపోతావు కదా– సారీ ఆం ఫీల్ కాకు. ఏం." అనే వాళ్ళు – అదీ చాలా కన్సర్న్ వున్న మనిషి అనుకొంటాం వాళ్ళని చూసి.

కానీ రాజుగారు నాకు ఫోన్ చేయలేదు. మళ్ళీ 2 కి.మీ. వెనక్కి వచ్చి నన్ను తన కారులో ఎక్కించుకొని వెళ్ళారు.

కొసమెరుపు: చిన్నస్వామిరాజుగారు ఒక సారి ఒక స్థలం నుంచి బయలుదేరితే, తిరిగి వెంటనే వెనక్కిరారు. అది ఎప్పటి నుంచో ఆయనకు వున్న సెంటిమెంటు. ఇవాళ ఆయన ఆ సెంటిమెంటును బ్రేక్ చేసి, వెనక్కి వచ్చి నన్ను తీసుకెళ్ళారు. ఈ రోజంతా నాకు ఆనందంగా వుంది.

That's Chinnaswamy Raju

Many Many Hats off to Him

నాగేష్

20.11.2010

'ఆయనకు సమర్థవంతమైన నాయకత్వం లేకపోతే ఈ కాలేజీ ఇన్ని విజయాల్ని సాధించి వుండేదే కాదు. మేము కాలేజీల్లో పెద్ద పెద్ద చదువులు చదివి వుండచ్చు. ఆయనకు అలాంటి విద్య లేకపోయి వుండచ్చు. కానీ జీవితం అనే విద్యాసంస్థలో ఆయన చదివిన చదువు మా చదువుకన్నా గొప్పది. అందుకే ఆయన నిరంతరం మమ్మల్ని అందర్నీ ఇన్‌స్పైర్ చేయగలుగుతున్నాడు.'– అంటుంది ఇందిర.

చిన్నస్వామిరాజు కేవలం తన కమ్యూనిటీ విద్యార్థులకు మాత్రమేకాక, ఆంధ్ర నుంచి విద్యకోసం బెంగుళూరుకు ఎవరు వచ్చినా, వాళ్ళకు తన వంతు సహాయం చేస్తూనే వున్నాడు.



ఇద్దరు ముఖ్యమంత్రులు రామకృష్ణహెగ్డే, ఎన్టీఆర్‌లతో

ఆయనకు సివిల్ సర్వీస్ అంటే చాలా ఇష్టం. 'ఎవరైనా ఐఏఎస్, ఐపీఎస్ చేస్తానంటే వాళ్ళ ఖర్చు అంతా నేనే భరిస్తానని చాలాసార్లు మా కమ్యూనిటీ సభలు, సమావేశాల్లో ప్రకటించాను. కానీ ఎవరూ ఇప్పటివరకు ముందుకు రాలేదు' అన్నాడాయన.

'మా నాన్న ఏ పని చేసినా, ఆ పని చేయడం వల్ల నాకేమిటి లాభం? అని ఆలోచించరు. ఆ పనిని మరింత బాగా, మరింత వేగంగా ఎలా చేయాలా అని ఆలోచిస్తారు. ఇది బిజినెస్‌లో చాలా ఇబ్బందికరమైన యాటిట్యూడ్. అందుకే ఆయన సామాజిక సేవకు బాగా సరిపోతాడు. అక్కడ ఆయన కంఫర్టబుల్‌గా వుంటాడు'– అంటాడు చిన్నస్వామిరాజు కొడుకు సుందర్.

చిన్నస్వామిరాజు తన సుదీర్ఘ జీవితంలో చాలా ఏళ్ళపాటు తన కోసం, తన కుటుంబం కోసం తీవ్రంగా శ్రమించాడు. అయితే హైద్రాబాద్ వెళ్ళి వచ్చాక తన పరిధిని విస్తృతం చేసుకొన్నాడు. తన కమ్యూనిటీకోసం, తను పనిచేస్తున్న రంగమైన కాంట్రాక్టు ఫీల్డ్‌లోని ఇతరుల కోసం, ఇతర రంగాల కోసం తాను పని చేయాలని, తన వంతు సేవ చేయాలని ఆయన నిర్ణయించుకొన్నాడు. ఆ వైపుగా స్థిరంగా అడుగులేశాడు, వేస్తున్నాడు. చాలా విషయాల్లో చిన్నస్వామిరాజుకు దారి చూపింది వాళ్ళ పెద్దన్న కుప్పరాజు. ఆయన ఆదర్శవాది. విద్యారంగంలో కూడా చిన్నస్వామిరాజుకు దారి చూపింది ఆయనే.

అనుబంధం

1. కబ్బన్ పార్క్ గ్యాంగ్

న కుడి కాలూ, ఎడమ కాలు మన డాక్టర్ల వంటివి. వాటికి అవసరమైన శ్రమ కల్గిస్తే, మనం జీవితాంతం ఆరోగ్యంగా వుండచ్చు' – GM. Trerelyan

'a walk a day keeps the doctor away'

మన కబ్బన్ పార్క్ గ్యాంగ్ పై సామెతల్ని నమ్ముతుంది. నమ్మడమే కాదు. ఆ మార్గంలో నడుస్తుంది. ఎందుకంటే నడవడం ద్వారా మాత్రమే ఆ మాటల్ని ఆచరణలో పెట్టగలరు వాళ్ళు.

ఇంతకీ ఈ కబ్బన్ పార్క్ గ్యాంగ్ ఎవరు? వాళ్ళ గ్యాంగ్ లీడర్ ఎవరు?

కబ్బన్‌పార్క్ గ్యాంగ్ అంటే కబ్బన్ పార్కులో రోజూ వాకింగ్ చేసే సీనియర్ సిటిజన్ల బృందం. వీళ్ళ 'యజమాన్ను' చిన్నస్వామిరాజు. వీళ్ళకు తోటి వాకర్లు పెట్టిన పేరు 'కబ్బన్ పార్క్ గ్యాంగ్'. వీళ్ళకు వీళ్ళు పెట్టుకొన్న పేరు 'కబ్బన్‌పార్క్ వాకర్స్ క్లబ్.'

కబ్బన్ పార్కు దేశంలోని పెద్ద పార్కుల్లో ఒకటి. 300 ఎకరాల విస్తీర్ణం వున్న ఈ పార్కు బెంగుళూరు సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ఏరియాలో వుంది. 1870లో ఈ పార్క్ ఏర్పడింది. అప్పుడు మైసూర్ స్టేట్‌కు ముఖ్య బ్రిటిష్ ఇంజనీర్ అయిన మేజర్ జనరల్ రిచర్డ్ శాంకీ ఈ పార్క్ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాడు.

మైసూరు రాష్ట్రంలో 1834 నుంచి 1860 వరకు కమిషనర్‌గా పని చేసిన సర్ మార్క్ కబ్బన్ పేరు మీద ఈ పార్క్‌కు కబ్బన్ పార్క్ అనే పేరు వచ్చింది. దీన్ని అధికారికంగా 'చామరాజేంద్ర పార్క్' అని పిలుస్తారు. ఈ పార్క్ ప్రజలకు అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. చిన్నస్వామి రాజు అండ్ కంపెనీకి మాత్రం, ఇతర అనేక మందికి లాగే వాకింగ్‌కు ఉపయోగపడుతూ వుంది.

ఈ వాకింగ్ క్లబ్‌ను ప్రారంభించింది కె.కె.మల్హానీ సోదరులు. కె.కె.మల్హానీ చిన్నస్వామిరాజుకు 60 ఏళ్ళుగా మిత్రుడు. అందువల్ల 1970లో వాళ్ళ వాకర్స్ క్లబ్‌లో చిన్నస్వామిరాజు కూడా చేరాడు.

1970కు ముందు చిన్నస్వామిరాజు మల్లేశ్వరం 18వ క్రాస్‌లో వున్న 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' ఆవరణలో వాకింగ్ చేసేవాడు. 1970 నుంచీ కబ్బన్ పార్క్‌కు వెళుతున్నాడు.

1974 ప్రాంతంలో చాళుక్య హోటల్ నిర్మాణ సమయంలో వాకర్స్ క్లబ్ బలపడింది. 1970 నుంచీ ఇప్పటి వరకు అంటే 40 ఏళ్ళపాటు చిన్నస్వామిరాజు నాయకత్వంలో 'వాకర్స్ క్లబ్' నిరాటంకంగా నడుస్తున్నది.

ఈ వాకర్స్ క్లబ్‌లో 60 యేళ్ళ ప్రకాష్ బెలానీ దగ్గరి నుంచీ, 95 యేళ్ళ ఆర్ ఎన్ షెట్టి వరకు వున్నారు. దాదాపు ఎక్కువ మంది 70 ఏళ్ళకు పైబడిన వారే. ప్రస్తుతం సుమారు 20 మంది వున్నారు ఈ క్లబ్‌లో. డాక్టర్లు, వ్యాపారవేత్తలు, బిల్డర్లు– ఇలా అందరూ ఆయా రంగాల్లో గొప్పవాళ్ళే.

ఉదయం 5.30కు అందరూ తమతమ కార్లలో కబ్బన్ పార్క్‌కు చేరుకుంటారు. 5.30కు వాకింగ్ మొదలు పెడతారు. 6.20 వరకు నడుస్తారు. అక్కడి నుంచి కార్లలో సమీపంలో వున్న హోటల్ చాళుక్యకు 6.30కి చేరుకొంటారు. 1977లో 'చాళుక్య' ప్రారంభమయినప్పటి నుంచీ 6.30కి చేరుకోవడం మొదలైంది.

చాళుక్యలో లాబీలో సోఫాల్లో కూర్చుంటారు. పేపర్లు చదువుతారు. కాఫీ తాగుతారు. గత 33 యేళ్ళుగా చిన్నస్వామిరాజు వీళ్ళకు కాఫీ ఉచితంగా అందిస్తున్నాడు.

కాఫీతో పాటు ఎవరైనా వాళ్ళ ఇళ్ళ నుంచి తెచ్చే బిస్కట్లు తింటారు. కాసేపు అందరూ చిన్న పిల్లలయిపోయి గోల చేస్తారు. సరదాగా జోకులేసుకొని నవ్వుకుంటారు. అక్కడ కూడా చిన్నస్వామిరాజులో 'యజమాన్ని' బయటికొస్తుంటాడు. వాళ్ళల్లో ఎవరైనా 'మితి'మీరి 'అశ్లీల' జోకులేస్తే ఆయన వాళ్ళని మందలిస్తాడు. కాసేపు ఆ రోజు న్యూస్ పేపర్లలో వచ్చిన ప్రధాన వార్తల గురించి మాట్లాడుకొంటారు.

ఇలా 7.00 వరకు వుంటారు. ఏడు కాగానే అందరూ లేచి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారు.

వారానికి ఒకసారి, ఆదివారం రోజున ఏదో ఒక హోటెల్ కెళ్ళి టిఫిన్ చేస్తారు. నెలకొకసారి సాయంత్రాలు ఎక్కడో ఒక చోట కలిసి పార్టీ చేసుకొంటారు.

పైకి ఇది కేవలం 'నడిచే వాళ్ళ క్లబ్'గా కనిపించినప్పటికీ, వీళ్ళ మధ్య అంతకన్నా లోతైన సంబంధం వుంది. అందరూ చిన్నస్వామిరాజును తమ యజమాన్నిగా అంగీకరించారు.

'చిన్నస్వామిరాజు మా లీడర్. ఆయన మమ్మల్ని యునైట్ చేసే శక్తి. అందుకే మేము మా వాకర్స్ క్లబ్‌కు మోటోగా 'యూనిటీ ఈజ్ స్ట్రెంగ్త్' అని పెట్టుకొన్నాము'– అంటాడు బలరాం నిచానీ.

ఉదయమే నడవడం వల్ల రోజంతా వుల్లాసంగా వుంటుంది వీళ్ళకు. అందరూ వాళ్ళ వాళ్ళ జీవితాల్లో బిజీగా వుండేవాళ్ళే. 'We live in a fast-paced society. Walking slows us down'అంటాడు Robert Sweetgall. వీళ్ళ విషయంలో ఇది నిజం. పచ్చని చెట్ల మధ్య, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య ప్రారంభమయ్యే వాకింగ్ వల్ల వీళ్ళ మనసులు కూడా చక్కగా పని చేస్తాయి. 'నీకు



యువ వృద్ధులు - కబ్బన్‌పార్క్ గ్యాంగ్

సృజనాత్మక భావాలు రావాలంటే, ఉదయమే వాకింగ్‌కు వెళ్ళు. అప్పుడు దేవతలు నీ చెవిలో గుసగుసలాడుతారు' అంటాడు రేమాండ్ ఇన్‌మాన్. 'నడుస్తున్నపుడు శరీరం ముందుకు కదులుతుంది. మనసు దాని చుట్టూ పక్షిలా రెక్కలు విప్పుకొంటుంది' అంటాడు జొల్స్ రెమావో. 'మన కాళ్ళు ముందుకు కదలడం మొదలవగానే మన ఆలోచన్లు ప్రవహించడం ప్రారంభమవుతుంది' అంటాడు డేవిడ్ హెన్రీ థోరో.

సహజంగా వీళ్ళ వయసులో వుండే విసుగు, కోపం వంటివన్నీ వాకింగ్ వల్ల పోతాయి. 'The best remedy for a short temper is a long walk' అంటాడు జాక్వెలైన్ షిఫ్.

వాకర్స్ క్లబ్ సభ్యుల్ని అప్పుడపుడు యాత్రలకు కూడా తీసుకెళతాడు చిన్నస్వామిరాజు. ఒకసారి అందరూ 'హరిద్వార్'కి బస్సులో వెళ్ళారు. మరోసారి వాకర్స్‌ను తనవెంట కొరియా తీసుకెళ్ళాడు చిన్నస్వామిరాజు.

మానవ ఉద్వేగాలు అంటువ్యాధుల వంటివి. అయితే వీళ్ళు సానుకూల వుద్వేగాల్ని మాత్రమే ఒకరికి ఒకరు అంటించుకొంటారు. ముఖ్యంగా ఈ వయస్సు వాళ్ళకి కావలసింది వుత్సాహం, జీవితేచ్ఛ. ఈ రెండూ ఒకరి నుంచి ఒకరికి లభిస్తాయి ఈ క్లబ్బులో.

'వాకింగ్' అనేది కేవలం ఒక భౌతిక వ్యాయామంగానే కాక ఒక జీవిత విధానంగా చేసుకొన్నారు

వీళ్ళు. వీళ్లందరికీ ప్రేరక శక్తి చిన్నస్వామిరాజు. వీళ్ళ జీవనశైలి, ఆరోగ్యకరమైన శరీరాలు, ఆహ్లాదకరమైన చిరునవ్వులు చూసి యువత కూడా అసూయపడాల్సిందే.

'వాకర్స్‌క్లబ్' దగ్గర ఫండ్ కూడా వుంది. ఇది 'ఫైన్' మనీ. ముందుగా క్లబ్ ప్రెసిడెంట్ దగ్గర అనుమతి తీసుకోకుండా ఎవరైనా వాకింగ్‌కు నిలచిపోతే వాళ్ళు క్లబ్‌కు 100రూ॥లు ఫైన్ కట్టాలి. ఒకప్పుడు ఇది 10రూ॥ వుండేది. ఇలా ఫైన్ కట్టిన డబ్బే 6 లక్షల వరకు వుంటుంది వీళ్ళ దగ్గర. దీనికి వడ్డీ కూడా వస్తుంది. ఈ డబ్బును కిడ్నీలేని వాళ్ళకు, కళ్ళు లేని వాళ్ళకు డొనేషన్ ఇచ్చేందుకు ఉపయోగిస్తారు. ప్రతి శనివారం కబ్బన్ పార్క్ దగ్గరున్న దేవస్థానానికి వచ్చే బిక్షగాళ్ళకు డబ్బులిస్తారు. చలికాలం వస్తే వాళ్ళకు కంబళ్ళు పంచుతారు.

ఒకరి నుంచి ఒకరు హెల్ప్ తీసుకోవడానికి మాత్రం వీళ్ళు దూరంగా వుంటారు. తమ క్లబ్‌లో బిజినెస్ వ్యవహారాల్నీ, వ్యక్తిగత సమస్యల్నీ తీసుకొని రాకూడదని వీళ్ళు నిర్ణయించుకొన్నారు. తమ క్లబ్‌ను ఒక 'ఫీల్‌గుడ్' క్లబ్‌గా మార్చుకున్నారు.

40 ఏళ్ళుగా వాక్ చేస్తున్నవారు కనీసం 7 మంది వున్నారు ఈ క్లబ్బులో. చూసేందుకు ఇది చిన్న సమూహమే అయినా, ఒక సమూహం ఐక్యంగా వుంటే ఎంత అద్భుతంగా వుంటుందో తెలియడానికి ఇది ఒక ఉదాహరణ.

విజిటింగ్ కార్డ్ లేకుండా వాకింగ్‌కు వెళ్ళను

చిన్నస్వామిరాజు విజిటింగ్ కార్డ్ లేకుండా వాకింగ్‌కు వెళ్ళడు.

వాకింగ్‌కూ - విజిటింగ్ కార్డుకూ ఏమిటి సంబంధం?

బెంగుళూరులో నరసింహయ్య అనే వ్యాపారవేత్త వుండేవాడు. ఆయన చిన్నస్వామిరాజుకు తెలుసు.

నరసింహయ్య ఒకసారి ఎక్కడికో బయటికెళ్ళి చనిపోయాడు. ఆయన దగ్గర ఎటువంటి గుర్తింపు కార్డూ లేకపోయేసరికి, నగర కార్పోరేషన్ వాళ్ళు ఆయన శవాన్ని యెక్కడో ఖననం చేసేశారు.

ఈ సంఘటన గూర్చి తెలిసినప్పటి నుంచీ, చిన్నస్వామి రాజుకు కొద్దిగా భయమేసింది.

*ఇంత బతుకు బతికి, చివరికి అనామక చావా? ఒక వేళ తనకు కూడా అలా జరిగితే? **'No'** - అలా జరగడానికి వీల్లేదు. అందుకే ఆయన వాకింగ్‌కు వెళ్ళినా, బయటికెక్కడికి వెళ్ళినా విజిటింగ్ కార్డు తన దగ్గర వుంచుకొంటాడు.*

బతుకులో ఖ్యాతి గడించిన వారు చావులో అనామకత్వాన్ని భరించలేరు.

2. ఇది నా కథ

- ఇందిర, W/O చిన్నస్వామిరాజు

ది నా కథ. నేనే చెబుతాను. నా మాటల్లో.

అది 1956వ సం॥. ఒక రోజు సాయంత్రం స్కూలు నుంచి ఇంటికొచ్చాను. అప్పుడు నేను కోదండరామాపురం గాళ్స్ హైస్కూల్లో, కన్నడ మీడియంలో 6వ తరగతి చదువుతున్నాను.

ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా హడావిడిగా వుంది. ఆ హడావిడికి కారణం నాకు తెలుసు. మా అన్నకు పెళ్ళి త్వరలో. పెళ్ళంటే ఇల్లంతా సందడిగా వుంటుంది కదా. నాక్కూడా చాలా సరదా సరదాగా వుంది.

అమ్మా, నాన్న ముగ్గురు అన్నదమ్ములు హడావిడిగా వున్నారు. అంతా కలసి బయటికెళు తున్నారు బట్టలు కొనడానికి. పెళ్ళికి 15 రోజులే వుంది గడువు. నన్ను కూడా పిలిచారు. నాకూ చాలా ఆనందంగా వుంది.

బట్టల కొట్టుకెళ్ళాం. అందరికి బట్టలు కొన్నారు. నాక్కూడా కొన్నారు. పావడా, రైక. ఇంకా ఏవేవో కొంటున్నారు. నాకెందుకు ఇన్ని బట్టలు కొంటున్నారు? పెళ్ళి కొడుక్కి కదా ఎక్కువ కొనాల్సింది?

అప్పుడు చెప్పారు నాకు. పెళ్ళి అన్నకు కాదు నాకు అని. ఆ వార్తకు ఎలా స్పందించానో గుర్తు లేదు నాకు.

పట్టుమని 14 ఏళ్ళు లేవు నాకు. అప్పట్లో చిన్న పిల్లల పెళ్ళిళ్ళు మామూలు విషయమే అయినా, నా పెళ్ళి అలా... అంత తొందరగా జరగుతుందని నేను వూహించలేదు.

పెళ్ళి కొడుకు చిన్నస్వామిరాజు. పరాయివాడేం కాదు. మా అమ్మ వాళ్ళ చిన్నాన్న కొడుకే. ఆయన, మా పెద్దన్న స్నేహితులు. మా అన్న కోసం చాలా తడవలు వచ్చేది పోయేది ఆయన.

తెలిసినోడే. కానీ సడన్‌గా నాకు పెళ్ళంటే... ఏమో, ఏమీ అర్థం కాని వయసు కదా అది. ముందుగా ఇంట్లో ఎవరూ నా దగ్గర ఈ ప్రస్తావన తేలేదు.

అప్పట్లో మొగపిల్లల్నే 'ఈ పెళ్ళి నీకిష్టమేనా?' అని అడిగే వాళ్ళు కాదు. ఇంక ఆడపిల్లల కత చెప్పేదేముంటుంది? అంతా పెద్దలదే నిర్ణయం. వాళ్ళు ఎంత చెబితే అంత.

సరే. ఇంక స్కూలుకు కూడా నిలిపేశారు. ఇంక నాకు పెళ్ళయిపోయింది.

నాకు అయిన ఒక 15 రోజులకి మా అన్నయ్యకి పెళ్ళి అయింది. అంత అర్జంటుగా ఆయన పెళ్ళి నిలిపి నాకెందుకు పెళ్ళి చేశారో నాకు ఇప్పటి వరకు తెలియదు. అప్పుడు చాలా చిన్నపిల్లని. ఏమీ తెలియదు.

మా ఆయన వాళ్ళలాగే మేము కూడా మా తాతల కాలంలోనే చిత్తూరు జిల్లా నుంచి బెంగుళూరుకు వచ్చినాము. మేము కోదండరామాపురంలో వుండేది. ఆయన పైప్‌లైన్‌లో దత్తాత్రేయ గుడి దగ్గర వుండేవాళ్ళు.

బెరుకు బెరుకుగా.. కొత్తగా వాళ్ళింట్లోకి అడుగుపెట్టాను. కొంచెం పెద్దదే... కుటుంబం.. వాళ్ళది.

మొదట్లో ఈయన్ను చూస్తే అందరూ భయపడే వాళ్ళు. అన్నలు, వదినలు, అక్కచెల్లెళ్ళు. అమ్మా నాయనలకి కూడా భయమే. ఏమో... ఆ మనిషిని చూస్తే.. ఆయన జోరు.. అందుకనుకుంటా.. అందరూ భయపడేవాళ్ళే.

మాది ఉమ్మడి కుటుంబం కదా. వాళ్ళ అన్నలు, వదినలు, మా మామ, పెద్దమామ, అత్త, పెద్దత్త, మామ వాళ్ళ సిస్టర్ విడో ఒకావిడ. పిల్లలు... అందరూ మాతోనే వుండేవారు.


ఈయనకేమో నాతో గడపడానికి టైమే వుండేది కాదు. పొద్దున్న ఐదున్నర, ఆరు గంటలకు వెళ్ళిపోతే రాత్రి 9.30–10 గంటలకు వచ్చేవారు.

అప్పుడు, మొదట్లో చాలా భయమేసేది నాకు. ఈ మనిషేమో జోరు. ఇంట్లో అంతా పెద్ద వాళ్ళు. ఎలా మెలగాలో తెలియక భయమేసేది. ఏడ్చేదాన్ని. మా అత్తతో, 'అమ్మా నన్ను ఇంటికి పంపరా.. అమ్మా నన్ను ఇంటికి పంపరా....' అని ఏడుస్తూ అడిగేదాన్ని.

'అట్లంతా వెళ్ళకూడదమ్మా. అందర్నీ అడిగేసి వెళ్ళాల. నా ఇష్టం కాదు'– అనేవాళ్ళు మా అత్తగారు. ఆవిడ కూడా భయపడేది కొడుకంటే.

ఇంక ఈయన మోటర్ బైక్‌లో వస్తే పిల్లలూ, వదినలూ, అమ్మా, నాన్న– అందరూ 'చిన్నోడొచ్చె.. చిన్నోడొచ్చె... చిన్నోడొచ్చె' అనేవాళ్ళు... ఎందుకిట్లా భయపడుతున్నారో నాకు అర్థం అయ్యేది కాదు. అలా భయపడాలని తెలియదు కదా నాకు. తర్వాత్తరువాత అలవాటయిపోయింది.

నాతో కూడా ఆయన అట్లనే... జోరే మనిషి.



తాజ్‌మహల్ ముందు చిన్నస్వామి–ఇందిర

ఆయన బయటి సమస్యలేవీ తెలిసేవి కావు. అన్నదమ్ములు మాట్లాడుకుంటారేమో హాల్లో. మా ఆడోళ్ళ వరకు వచ్చేవి కాదు. మేమంతా లోపల వుండిపోతాం. బయటికొచ్చే వాళ్ళం కాదు. మొగాళ్ళ ముందుకు.

మా బాబు పుట్టిన తర్వాత... అప్పటికి మా అత్తగారు చనిపోయారు. ఆ తర్వాత కొద్ది రోజులకి పెద్దావిడ విడిపోయేది మంచిదని వాళ్ళయనతో చెప్పిందేమో, కుప్పరాజు బావగారితో. రెండో బావగారి కుటుంబాన్ని వేరే ఇంట్లో పెట్టారు.

తర్వాత వాళ్ళకి నన్ను పెట్టుకొని వాళ్ళని బయట పెట్టారని కొంచెం గొడవ వచ్చినట్టు వుంది. మమ్మల్నీ వెళ్ళిపొమ్మన్నారు. ఈయనకు ఇష్టం లేదు అది.

తర్వాత మా బావగారు, మామగారు ఇల్లు చేసి, నన్ను అక్కడ పెట్టారు. నాలుగైదు రోజుల తర్వాత ఈయన వచ్చారు. మామగారు, ఆయన చెల్లెలు, మా ఆడబిడ్డ– అందరం ఆయనతో, ఆ ఇంట్లోనే వున్నాం.

మా మామగారు నన్ను తండ్రిలా చూసుకొనేవారు. నాతో బాగా మాట్లాడేవాళ్ళు. ఈయనలో ఏ మార్పూ లేదు. ఇంతకు ముందు ఎలాగో ఇప్పుడూ అలాగే.

ఆయన సమస్యలేమిటో, పనిలో ఆయన కష్టాలేమిటో బయటి నుంచి నాకూ ఏమీ తెలిసేది కాదు. ఎవరూ నాతో ఆ విషయాలు మాట్లాడేవాళ్ళు కాదు. 'చిన్నపిల్ల... చిన్నపిల్ల...' అన్నట్టుగా అట్టా వుండిపోయారు.

పిల్లలతో గడపడానికి కూడా ఆయనకు టైమ్ వుండేది కాదు మొదట్లో. ఎప్పుడో.. సన్‌డే... వన్ అవర్... అలా స్పెండ్ చేసేవాడు... పిల్లలు కూడా దగ్గరకు పోవాలంటే భయపడేవాళ్ళు. రేవతితో కొంచెం క్లోజ్‌గానే వుండేవాళ్ళు– సుందర్‌కి కొంచెం భయమే తండ్రి అంటే.

పిల్లలిద్దరూ నాతో బాగా క్లోజ్‌గా వుండేవాళ్ళు. ఏది కావాలన్నా నన్నే అడిగేవాళ్ళు.

నా అవసరాలు– ఇంటివి, నేనే చూసుకొనేదాన్ని. నా అన్న ఒకడు వుండేవాడు– మాధవరాజు అని. వాడొచ్చి అన్నీ చూసి తెచ్చి పెట్టేసి పోయేవాడు. నా కష్టసుఖాలు చూసి పోతుండేవాడు. ఆయన కొంచెం జోరు కదా– అతన్ని ఏమీ అడగలేము. అందుకని మా అన్నే అన్నీ చేసేవాడు.

తర్వాత– పిల్లల్ని స్కూలుకు వెయ్యాలంటే, కాన్వెంటుకు వెయ్యాలని నేను, వద్దు, గవర్నమెంటు ఇస్కూలు కెయ్యాలని ఈయన. ఎందుకో మరి తెలియదు, నేనన్నానూ, 'వీలవదు. వాళ్ళని కాన్వెంటులోనే వెయ్యాల.' 'నేను డబ్బులు కట్టను' అన్నాడు . 'ఓకే' అని మా అన్నని అడిగాను.

కాన్వెంటు అంటే ఎందుకో నాకు ఇష్టం. నా పిల్లలు కాన్వెంటులో పెరగాలనీ, ఇంగ్లీష్‌లో బాగా మాట్లాడాలనీ వుండేది నాకు. నలుగురితో కలుస్తారనీ... అట్లా. కన్నడ ఇస్కూల్లో అంత ఇదిగా వుండేది కాదు నాకు. అది నాకు తెలుసు కాబట్టి.

నెలరోజులు ఘర్షణ జరిగింది ఇంట్లో. 'నా ఇష్టప్రకారమే జరగాలి' అని ఆయన. 'వద్దండీ ప్లీజ్. బిడ్డలు చెడిపోతారు' అని నేను– 'నీ ఇష్టంగా అయితే నువ్వు ఫీజులు కట్టు'. ఓకే. తీసుకెళ్ళాను. క్లూనీ కాన్వెంట్లో చేర్పించాను సుందర్ని.

మా అన్నయ్యకి చెప్పాను. 'కాన్వెంటుకి ఆయనకిష్టం లేదు కాబట్టి మీరు డబ్బులు కట్టండి' అని. వాడు కట్టేవాడు. నెల నెలా తెచ్చి ఇచ్చేవాడు.

పిల్లల విషయంలో నేను గట్టిగానే వున్నా అన్నిటిలో. వాళ్ళ వరకు వదిలే దాన్ని కాదు. ఎందుకంటే ఆయన పొద్దున్నే ఆరుగంటలకి పోతే రాత్రి 10,11 గంటలకు వచ్చేవాళ్ళు. ఆ పిల్లల ఇష్టాలు, నా ఇష్టాలు ఆయనకి తెలిసేవి కావు.

పిల్లల గురించి నాకే కదా తెలిసేది. ఆయనకేమంటే 'దీనికి ఇదంతా తెలిసిపోయింద'నే కోపం వుండేదనిపిస్తుంది నాపైన. దాన్నేమీ నేను పట్టించుకోలేదు.

అయితే నన్నెపుడూ బాధ పెట్టేవాళ్ళు కాదు. పిల్లలన్నా, పెళ్ళామన్నా చాలా ఇష్టమే. అది ఎట్లా బయట పెట్టాలా, ఎట్లా చూడాలా తెలియదో, బిజీనో, ఏమో నాకు ఇప్పటికీ అర్థం కాదు అది.

సుందర్ పి.యు.సి అయిన తర్వాత వాడిని డాక్టర్ చదివించాలని ఆయన– ఆయనకి కొడుకు డాక్టర్ కావాలని వుంది. వాడికేమో కంప్యూటర్ ఇంజనీరు కావాలని వుంది. 'లేదు నాన్నగారూ నాకు ఇంజనీరు చదవాలని వుంది' అని సుందర్ అన్నాడు. కోపం వచ్చింది ఆయనకి.

అప్పుడు నేను ఒకరోజు అన్నానూ, 'ఏంచేపూ.... మీది చూసుకుంటున్నారేగానీ... మన కత అయిపోయింది. పిల్లలన్నా సరదాగా... తండ్రి అనీ, దగ్గరికి రావాలనీ.. వాళ్ళిష్టాలు కూడా వుంటందనీ మీరెందుకనుకోరు? ఇది బాగా లేదు. మీ పద్ధతేమీ.. వాడు ఇంజనీరు అంటున్నాడు కదా. వదిలేయండి. మనం డాక్టరని ఈడ్చామనుకోండి ఆ వైపుకు... ఫెయిలవుతా వుంటాడు. అడిగితే నాకిష్టం లేదు. మీరు వేశారు– అంటే ఏం చేసేది? ఇంత వరకు వాడు మీతో ఏ మాటా మాట్లాడలేదు.. ఇంక మనం మాట్లాదేది బాగుండే లేదు... వాడు ఇంజనీరు అంటున్నాడు.. వదిలేయండి...'

'ఓ.. నీకూ మాటలొస్తున్నాయే... ఫర్వాలేదే... ఎవరు నేర్పిస్తున్నారు ఈ మధ్యలో...' అన్నారాయన. 'మాటలు ఒకరు నేర్పించక్కరలేదండీ... మన పద్ధతిలో నుంచే వచ్చేస్తుంది బయటికి... నాలుగుసార్లు మీరు వాడ్ని అరిసారంటే... వాడు బదులు మాట్లాడుతాడు.... వాడు మంచి బిడ్డ కాబట్టి.... నాతో అంటున్నాడు. 'అమ్మా... నా కిష్టంలేద'ని. మీతోనే నేరుగా అంటే ఎంత బాధవుతుంది మీకి? వాడికి కూడా అట్టే బాధవుతుంది కదా– తండ్రి ఇలా మాట్లాడుతారేంటి? మనిష్టం లేదా? అలాంటి బిడ్డ మనకు కాలేదు కాబట్టి సంతోషించి.... 'నీ ఇష్టంరా' అనండి...' అన్నాను.

'సరే.... వాడితో చెప్పు వాడిష్టం' అన్నారు. 'నేను చెప్పను... మీరే చెప్పాల'. అప్పుడు తనే చెప్పారు. సుందర్ ఇంజనీరింగులోనే జాయినయ్యాడు. ఇంజనీరింగు అయిపోయింది. ఫారిన్ కెళ్ళాడు. అప్పుడు సంతోషంగానే వున్నారు... కొడుకు ప్రయోజకుడయ్యాడని.

తర్వాత్తర్వాత ఆయన చాలా మంచి అతనే. పిల్లలు కొంచెం పెద్దోళ్ళయ్యే సరికి ఆయన్లో కొంచెం మార్పు. ఆడపిల్ల కొంచెం గట్టిది. వంచేది తండ్రిని. వీడు మాట్లాడేవాడు కాదు పాపం సుందర్. ఒకటి రెండు మాటలే.

సుందర్ అప్పుడే కాదు. ఇప్పుడూ అంతే. పెద్దాయన ముందు ఏమీ మాట్లాడకూడదు అని వుందేమో సుందర్‌కి. గబగబా ఏమీ మాట్లాడడు. ఆలోచించీ... ఆలోచించీ మినుగుతుంటాడు.

'అదేదో కరెక్టుగా మాట్లాడురా... భయమెందుకూ... ఇంకా భయపడి.... ఆ లోపల అట్లా పెట్టుకోకూడదు. ఏదైనా వుంటే... నాన్నగారూ.... ఇలా వుంది అని చెప్పు పోయి' అంటాను నేను. 'గమ్మునుండమో.... అట్లంతా బాగుండే లేదు' అంటాడు.

మొన్న... ఈ నెల 20వ తేదీ ఏం జరిగిందంటే... సుందర్ అమెరికా ప్రయాణం పెట్టుకున్నాడు. ఆ సంగతి వాళ్ల నాన్నగారికి చెప్పాల. మా ఇంట్లో హాల్లో నేనూ, సుందర్ ఒక తట్టు కూర్చుని వున్నాం. వాళ్ళ నాన్నగారు కొంచెం దూరంగా వేరే పక్క కూర్చుని వున్నారు.

ఇటూ అటూ తిరుగుతున్నాడు సుందర్. 'సుందర్... ఏదైనా నాన్నగారితో మాట్లాడాలని వుంటే మాట్లాడు. కరెక్టుగా చెప్పు. ఎందుకన్నిసార్లు తిరుగుతావ్? ఆలోచిచ్చేదేముంది? వుండేది చెప్పుకోవాల' అన్నాను నేను. ఆయన్తో 'మీరు మాట్లాడండి' అంటే, 'ఏంబా? ఏమి? ఏమో చెప్తావుంది మీ అమ్మ.. ఏంబా?' అని అడిగాడు ఆయన. 'నాన్నగారూ–మర్నాడు అమెరికాకు వెళ్ళాలనుకుంటున్నాను...' అన్నాడు సుందర్. 'కావచ్చు... దాందేముంది? పనుంటే పోయే రావాల కదా– వెళ్ళిరా' అన్నాడు. అంతే. వెళ్ళేటపుడు వెళ్ళొస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

సుందర్ వాళ్ళ తాతగారు కూడా అంతే. కొడుకంటే భయం. నేనూ, ఆయన కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటూ వుండే వాళ్ళం. కారు సౌండ్ అవతంది కదా– 'వాడొచ్చాడు. నోర్మూయ్.. వెళ్ళిపో లోపలికి'– అనేవాడు. పాపం ఆయన భయపడే వాడు కొడుకంటే.

ఆయన అన్నగార్లు కూడా అంతే. ఏ సమస్య వచ్చినా ఆయన్నే పిలిచే వాళ్ళు. ఈయనకు కోపం వస్తే అన్నలిద్దరూ మాట్లాడేవాళ్ళు కాదు పాపం. 'వీడిప్పుడు ఉడుకుగా వున్నాడు. ఇప్పుడు మాట్లాడితే కుదరదు' ముఖం చూసేసి వాళ్ళు రూముల్లోకి వెళ్ళిపోయేవాళ్ళు. తిరిగి ఎప్పుడో సమాధానంగా వున్నపుడు ఆయన్తో విషయాలు మాట్లాడేవారు.

ఈయన మాట్లాడేటప్పుడే మా బావగారికి భయం వచ్చేసేది. 'సరేరా.... సరేరా... ఈ రోజు నువ్వెందుకో సరిలేదు. రేపు పెట్టుకుందాం మాటలు.' అని వెళ్ళిపోయేవారు. 'ఏమి?' అనేవారు పెద్ద గొంతుతో ఈయన. 'ఏమి?' అని అనగానే వాళ్ళకు తెలిసిపోతుంది అన్నమాట.

చూసేందికి గంభీరంగా వుంటారు కానీ ఈయన చాలా మంచి మనిషి. హాని చేసే తత్వం ఎప్పుడూ లేదు. బాగా సపోర్టు అన్నమాట. పిల్లలకి పెళ్ళిళ్ళు చేయటం, ఏమన్నా ఒంట్లో బాగా లేకపోయినా, గొడవలొచ్చినా తనే నిలబడే వాడు. ఆయన్ని చూస్తే భయం కాబట్టి తను గట్టిగా నిలబడేవాడు. తప్పుంటే... ఎవర్నయినా తప్పని అరుస్తారు. తను తప్పు చేయడు కాబట్టి ధైర్యం వుంటుంది.

ఆయన గుట్టు మనిషి. ఎన్ని సమస్యలున్నా బయటపడరు. స్నేహితులతో కూడా చెప్పరు. ఆయనే ఒంటరిగా ఎదుర్కొంటారు. ఆ శక్తి ఆయనకి భగవంతుడే ఇచ్చాడేమో. తలమీదికొస్తే కూడా చెప్పేవారు కాదు. ఆ ముఖంలో తెలుస్తుంది 'ఏదో జరిగింది... ఏదో జరిగింది' అని. అడిగితే కూడా కోపం వచ్చేస్తుంది. ఆడోళ్ళతో అన్నీ చెప్పకూడదనే తత్వం ఆయనలో వుంది. ఆయనకిష్టమొచ్చినప్పుడు చెపితే చెబుతారు. అప్పుడే వినాలి మనం. మనమై అడగకూడదు.

నాకు తెలిసి, ఆయనకు దగ్గరి స్నేహితులెవరూ లేరు. ఆయన అంత ఈజీగా మాటలు వదలరు ఎవరికీ. మనసులో బాధ చెబితేనే కదా సాల్వ్ చేయగలరు. ఆయన చెప్పకుండా ఎవరైనా ఎట్లా సాల్వ్ చేస్తారు? అది వొక పెళ్ళానికీ, కొడుక్కి మాత్రమే తెలుస్తుంది. 'ఏదో జరిగింది ... ఏదో జరిగింది..' అని.

ఆయన ముఖం చూసి సుందర్ నాతో 'ఏం జరిగిందమ్మా' అన్నట్టు కళ్ళతో సైగ చేస్తాడు. 'ఏదో జరిగిందిలేరా– నాకింకా చెప్పలేదు. చెప్పాక నీకు చెప్తాను'– అనేదాన్ని.

తర్వాత ఎప్పుడైనా జ్ఞాపకం వచ్చినపుడు 'ఏమయిందమ్మా– నాన్నగారు ఆ రోజు అట్లున్నారు?' అడిగేవాడు సుందర్. అప్పుడేదో తెలిస్తే చెప్తా. లేకపోతే 'ఏం తెలియదు బాబూ నాకు'– అంటే గమ్మున అయిపోతాడు.

ఇప్పుడు.... తండ్రీ కొడుకులు కూడా అన్నీ చెప్పుకోవాలికదా? ఆయన ఎవరితోనూ చెప్పరు. అంత గట్టి మనిషి.

అయితే ఎదుటి వాళ్ళ మనసుల్లో ఏముందో మాత్రం బాగానే గ్రహిస్తారు ఆయన.

ఒక సంగతి చెప్పాల మీకు.

సుందర్ అమెరికాలో చదువుతున్నాడు. నాకి వంట్లో బాగలేక అయిపోయింది– ఏం చేసినా కుదరలేదు. తర్వాత డాక్టరన్నాడు 'ఆమెకి ఏదో ఫీలింగ్ వుంది. మీకేమైనా తెలుసా?' అని ఈయన్ని అడిగాడు. 'ఫీలింగ్ ఏముందో తను చెప్పదు నాతో. కొడుకు లేడని ఏమైనా ఫీలింగ్ వుందో ఏమో... తల్లీ కొడుకు– చాలా క్లోజ్ వాళ్ళు.... అదేమైనా వుంటే వుండచ్చు సార్' అని అన్నారు ఈయన. నన్ని

డాక్టరు అడిగాడు. నేనేమీ మాట్లాడలా చాలా సేపు. తర్వాత ఏమ్మా కొడుకుని చూడాలని వుందా అంటే అవునన్నట్టు తలూపాను.

తర్వాత డాక్టరు ఈయన్ని పిల్చి 'చాలా లోతుగా వుంది ఆమెకి కొడుకు మీద. ఫస్ట్ మీరక్కడికి తీసుకెళ్ళిపోతే మంచిది' అన్నాడు.

తక్షణం, మరుసటి రోజే ఫోటోలంతా తీయించి అప్లై చేసి... ఒక వన్ వీక్లో వెళ్ళిపోయాం ఇద్దరం.

ఫీలింగ్ వస్తే ఆయన తట్టుకోలేరు. మొఖం చూస్తే తెలుస్తుంది ఆయనకి. తక్షణం తెలుసుకొంటారు.

రెండు నెలలు అమెరికాలో వున్నాం. ముందు ఇంగ్లండ్లో కొద్ది రోజులున్నాం. తర్వాత అమెరికా వెళ్ళాం.

అక్కడ సుందర్తో కలసి ముగ్గురం తిరిగే వాళ్ళం.

అప్పుడు కూడా మేము ఇద్దరమే వున్నా ఎక్కువ ఏమీ మాటలు వుండేది కాదు. ఎందుకంటే ఆయన్ని చూసి భయపడీ, భయపడీ మాటలు రాకుండా అయిపోయింది నాకు. ఆయన మాట్లాడాల్సిన నెససిటీ వుంటే మాట్లాడుతారు. నెససిటీ లేకపోతే మాట్లాడరు. గంభీరంగా కూర్చుంటారు.

✦ ✦ ✦

మా అన్న మాధవరాజు నాకంటే రెండేళ్ళు పెద్ద. వాడు నా కష్ట సుఖాలు చూస్తుండేవాడని చెప్పా కదా. మమ్మల్ని వేరు కాపురం పెట్టినప్పుడు వాడ్ని ఇక్కడ్నే పెట్టుకొందామా అనుకొన్నా. స్కూల్లో పిల్లలకోసం వెళ్ళాలి. ఇంగ్లీషులో నేను మాట్లాడలేను. అందుకని పెట్టుకొందామని మామయ్యను అడిగాను. 'ఏం మామయ్యా మా అన్నయ్యని పెట్టుకోవచ్చా?' 'భేష్గా పెట్టుకోవే... వాడి పాటికి వాడు వెళ్ళిపోతాడు. ఇక్కడ చూసేవారు లేరు ఇంట్లో.' అలా ఆయన పెట్టుకోమన్నాడు. సరే అని పెట్టుకొన్నా వాడిని.

వాడు అన్నీ చూసుకొనేవాడు. స్కూలుకెళ్ళడం, ఫీజులు కట్టడం, మాకెవరికైనా వంట్లో బాగలేకపోయినా, కారు వుండేది– తీసుకెళ్ళేవాడు.

మా వాడు మా బావగారి కూతురిని ఇష్టపడ్డాడు. పద్మని. వాళ్ళింట్లో వాళ్ళకందరికీ ఇష్టముందో లేదో తెలియదు.

నేను అన్నానూ.. 'నా కోసరం నిన్ను పెట్టుకొన్నారా... నా బావగారి కూతురు కావాలని కోరుకొనేది నీకు మంచిది కాదు. పెద్దోళ్ళు నిల్చుకొని చేద్దాము అని మాట్లాడితే అప్పుడు కావచ్చు. నువ్వు కావాలని ఎగిరిన మాత్రానికి మేము నిల్చుకొని చెయ్యం' అన్నాను.

'నువ్వే అట్లంటే ఎట్ట?' అన్నాడు. 'అవును నా బిడ్డ అయితే ఏమి? వాళ్ళ బిడ్డ అయితే ఏమి? నా బిడ్డ వేరు... వాళ్ళ బిడ్డ వేరు అని నేననుకోలేదు. వాళ్ళు అనుకొన్నపుడు చూద్దాం. అంత వరకు ఈ కతలంతా చేయవద్దు.' అని అరిసాను ఆ పిల్లవాడ్ని.

వాడు నసుగుతున్నాడు. నేనన్నాను 'ఇది కల రా... మర్చిపో... నేను నా మొగుడింట్లో మర్యాదగా వుండాలంటే మర్చిపో'– అన్నా. 'నీకే ఇష్టం లేదా?' అడిగాడు. 'ఇష్టాలంతా మా మొగుళ్ళ నుంచే రావాల.. నా ఇష్టం.. నీ ఇష్టం.. కాదిక్కడ. ఆయన చెయ్యాలనుకుంటే చేయనీ.. లేకుంటే.. ఇంకొక బిడ్డ అయింది..' అన్నా. ' ఆ అమ్మాయికి ఇష్టమే' అన్నాడు. 'ఆ అమ్మాయికి ఇష్టమైతే కూడా నీకు చెయ్యం... నీ ఇష్టానికి మేము రాము. అది తలరాత వుంటే జరగనీ.. నువ్వు చిల్లర పనులంతా చెయ్యక్కరలేదు.. లేచిపో ఇంటికి' అని అరిసినా. వాడెల్లిపోయాడు పాపం. ఇంకేమీ మాట్లాడలేక.

ఆ తర్వాత మా కుటుంబాల్లో ఏవేవో రాజకీయాలు జరిగాయి. అందరూ కలిసి పోయినారు ఒక తట్టు.. వాడికి ఆ పిల్లని ఈయకూడదని.

ఆ పిల్లనీ... వీడినీ మాట్లాడిపిచ్చింది నేనే అనే మాట వచ్చింది. నేను పెళ్ళయినాక, నా పిల్లలు పెద్దోళ్ళయినాక కూడా నేనెప్పుడూ మా బావగారి ఎదురుగుండా వచ్చేదిగానీ, మాట్లాడేది కానీ చేయలేదు.

'బావగారూ... ఇంత వరకు మీ ఎదురుగుండా రాలేదు. మాట్లాడ లేదు.. మీ బిడ్డని నా బిడ్డే అనుకొంటి నేను. పరిస్థితి ఇక్కడ వరకు తెచ్చింది... నేను నీ బిడ్డ. అలాంటి పని చేయను. మీ మనసుకు తెలుసు. వాళ్ళ మాటలంతా విని నాపైన అసహ్యించుకోవద్దండి. నేను తండ్రిలేని బిడ్డ. చిన్నతనమయినా అట్లా అల్కాపనికి దిగను' అని చెప్పాను.

ఒక మధ్యానం బతికినా మర్యాదగా బతకాలే కానీ.. అట్లా నీచమైన బతుకు బతకనని ఆయనకు చెప్పాను.

మా అత్తగారి తిథి రోజు. అందరూ చేరి పద్మను వేరే ఒకాయనకి ఇచ్చి పెళ్ళి చేయాలని మాట్లాడుకుంటూ వున్నారు. ఇంతలో ఈయన కోపంగా లోపలికి వచ్చినాడు. 'లేయండ్రా పైకి... పైకి లేయండ్రా... నా బిడ్డని.. నా ఇంటి బిడ్డని మీరంద్రు ఎవర్రా మాట్లాడేకి... నేను డిసైడ్ చేసి పెళ్ళికి పిలిస్తే రండి. ఒక ఇస్తరాకు ఇడిసేసి వెళ్లండి.. లేకపోతే బయటుండండి.. లేయండి బయటికి పొండి' అని అరిచాడు ఈయన. అందరూ ఎళ్ళిపోయినారు.

మరుసటిరోజున మేము హైదరాబాద్ వెళ్ళిపోయినాం. మళ్ళీ వన్ ఇయర్ దాకా రాలేదు. మళ్ళీ తిథికి వచ్చినాము.

ఈయన డిసైడ్ చేశాడు. 'నేను పద్మని మా బావమరిదికి ఇచ్చి చేయాలని డిసైడ్ చేసి వుండాను. అందరితో మాట్లాడి రడీ చేయండి' అన్నాడు.

అందరూ నోర్మూసుకొని వున్నారు. అందరికీ కోపమే లోపల. కానీ మాట్లాడితే కష్టమని ఎవరూ మాట్లాడలే.

✦ ✦ ✦

మేము హైదరాబాద్ కెళ్ళాం. ఆయనకి పని వచ్చింది అక్కడ. నేను, పిల్లలు, మామగారు. మమ్మల్ని తీసుకెళ్ళారు హైదరాబాద్‌లో ఇల్లు చేసి. నాలుగేళ్ళు హిమాయత్‌నగర్‌లో రెంట్‌కున్నాం. ఆ తర్వాత సైదాబాద్‌లో... సినిమా యాక్టరు జమున వుంది కదా వాళ్ళింటి పక్కలో.

1970 అనుకొంటా తెలంగాణ రాష్ట్రం కావాలని గొడవలు మొదలయినాయి. అప్పుడే స్వంతిల్లు కట్టుకొని వెళ్ళాము. కొత్తింటికెళ్ళి 10డేసో, వన్ మంతో అయింది. అంతే ఈ గొడవలు.

అప్పుడు సుందర్ ఎనిమిదో క్లాసు. ఈయన భయపడి పిల్లల్ని బయటికి వదల్లేదు. వాడికి స్కూలు పోయింది.

మా బావగారు ఫోన్ చేసినారు ఆయనకి. 'ఆమెనీ.... పిల్లల్నీ అంపించేయ్యరా... నువ్వు పొద్దున్న వెళ్ళిపోతావు. ఏమి జరుగుతుందో తెలియదు' అని.

అప్పుడు మాకు లారీ వుంది కదా– లారీలో సామాన్లు వేసేసి బెంగుళూరు పంపేసినారు. మమ్మల్ని ఫ్లైట్‌లో ఎక్కించేశారు.

ఇక్కడ కొచ్చింతర్వాత నేనూ, నా పిల్లలు మా బావగారితో వాళ్ళింట్లో వున్నాం.

నేనొకసారి అన్నాను. 'అక్కా మేం వేరే ఇంటికి వెళ్ళి పోవచ్చా?' 'ఎందుకమ్మా, ఏం బేజారు నీకు?' అడిగింది ఆవిడ. 'కాదు.. ఒకసారి మీరు బయటికి అంపిచ్చారు. నాకు అట్లనే వుండాలని అన్పిస్తూ వుంది. నేను ఆయనతో మాట్లాడలేను. నువ్వు బావగారితో చెప్పి మమ్మల్ని బయట పెట్టక్కా'– అన్నాను.

'ఆయన అడుగుతారమ్మా. నువ్వు ఏమిష్టమో అది చెప్పు' అంది. 'ఎట్లక్కా. దాని గురించి నేను ఆయన ఎదురుగుండా వెళ్ళటం?' 'ఫర్వాలేదులే నేను వుంటాను నీ జతలో' అంది.

చెప్పిందేమో తను. 'ఏమ్మా నీకు? ఇప్పుడు నీకేమన్నా తొందరా ఇక్కడ?' అన్నాడు.

'తొందరేమీ లేదు. ఒకసారి బయటికెళ్ళాక బయటుంటేనే బాగుంటుందనిపిస్తుంది. ఇల్లు చూసి నన్ను పెట్టండి' అన్నాను. 'పైన రడీ చేసిస్తానమ్మా వుండే కయితందా?' 'పైనున్నా, కిందున్నా ఒకటే... పెడితే ఇల్లు చూసి విడిగా పెట్టండి. లేకపోతే ఇట్లే వుండిపోతా' అన్నాను.

తర్వాత నేను ఆయనకి ఫోన్ చేశాను. 'ఏమి నీకు కష్టమక్కడ?' అన్నాడు. 'కష్టమేమీ లేదు.

ఒకసారి నన్ను బయట పెట్టాక, నాకు బయట వుండాలనిపిస్తుంది' అన్నాను. 'చాలా పెద్దమనిషి అయిపోయినావు'. అదీ... ఇదీ అని అరిసినాడు.

సరే. ఆ తర్వాత బావగారు– 'సరేమ్మా– ఒకసారి నీ మనసులోకి వచ్చినాక నువ్విక్కడ వుండడం బాగుండదు' అన్నాడు. మా ఆయనతో బావగారు ఏం మాట్లాడారో తెలియదు. ఇల్లు చూశారు. నన్ను పెట్టారు. మూడు రోజుల తర్వాత ఆయన వచ్చారు. హైదరాబాద్‌లో ఆ ఇల్లు అమ్మేశారు.

✦ ✦ ✦

ఆయన్ని గూర్చి మరికొన్ని విషయాలు:

బెంగుళూరులో సొంతిల్లు– ఇప్పుడున్న ఇల్లే– 1972లో కట్టారు. ఈ ఇల్లు అప్పుడు అటు పక్క వుండేది. అయితే అక్కడ వుండకూడదని చాలా మంది వాస్తులు చూసే శాస్త్రగోల్లు చెప్పారు. తిరుపతిరెడ్డి కూడా చెప్పాడు. ఎవరిమాట వినలేదు ఈయన. ఇప్పుడు 6 నెలల్లో గబగబా మార్చేశారు.

ఆయన మనసుకు వస్తే ఎవరిమాట వినరు. ఇన్నేళ్ళ తర్వాత, కొడుక్కి పెళ్ళి అయి మనుమలు పుట్టాక ఆ తట్టుకు మార్చారు. ఎందుకో తెలియదు.

✦ ✦ ✦

చాలా భక్తి ఆయనకు. రోజూ పూజ చేయంది బయటికి వెళ్ళరు. ఎప్పుడు చూసినా తిరుపతి అనీ, తిరుత్తణి అనీ వెళ్తూ వుండాలి.

ఆయన నాకు తెలిసి ఎప్పుడూ గుండుకొట్టుకోలేదు.

మంగళవారం.. రాహుకాలం... అలాంటివంతా పాటిస్తారు. కొత్త కారు కొన్నారు మొన్న. ఈ రోజు మంచి రోజు... పూజ చేయించమని చెప్పేసి వెళ్ళారు పొద్దున. జ్యోతిషం ఆయనకు అంతిష్టం లేదు– నాకు ఇష్టం.

✦ ✦ ✦

వీళ్ళన్న ఈయన మీద కేసు వేసినాడు కదా– దాని గూర్చి ఈయనేమీ తలకేసుకొనేది లేదు. కేసు బాధ లేదు. కేసు ఏసిన మరుసటి రోజే అన్నగారితో కలిసి మా ఇంట్లో భోజనానికి కూర్చున్నారు. 'ఏంటండీ' అంటే 'నోర్ముయ్– నీకెందుకవన్నీ' అన్నాడు. 'ఏదో అడిగారు ఆయన కిష్టమయ్యి.... ఇస్తే పోయె...' అన్నాడు. బావగారు ఈయన కష్టంలో భాగం పంచుకోకపోయినా, ఆస్తిలో భాగం కావాలంటున్నారు– దాన్ని ఈయన పెద్దదిగా తీసుకోరు. అదంతా మామూలే అన్నట్టు వుంటారు.

✦ ✦ ✦

మనవళ్ళు, మనవరాళ్ళతో చాలా క్లోజ్‌గా వుంటారు. వాళ్ళు భయపడకుండా అన్నీ చెప్పేస్తారు.

'మీ మనసులో ఏమన్నా వుంటే, బాబాతో మాట్లాడాలంటే– బాబా జోరే... సరే... కష్టపడ్డారు కాబట్టి అరుస్తారు. ఖర్చవుతుందని వుంటుందేమో లోపల. గంభీరంగా, నీట్‌గా చెప్పెయ్యండి... అబద్ధాలు చెప్పకుండా నిజమైన మాటలు.. 'బాబా నాకిది కావాలి.. నేనిట్లా వెళ్తున్నాను. ఇట్లా వస్తున్నాను' అని. అన్నీ చెప్పాల.

'మీరు స్టార్ట్ చేయండి' అంటారు. స్టార్ట్ గీర్టు ఏమొద్దు నేరుగా చెప్పేసెయ్యండి. నేనిక్కడ వున్నా కదా' అంటాను.

✦ ✦ ✦

ఆయనకి ఏ చెడ్డలవాట్లూ లేవు. మందుకొట్టే అలవాటు లేదు. నేను బాలింతగా వున్నపుడు బ్రాంది ఇచ్చారు నాకు వాళ్ళ అక్క. ఈయనకు తెలిసిపోయింది. వాళ్ళక్క అనింది– 'బాలింత అయితే అలా ఇయ్యాలబ్బా. నువ్వేమీ అరవద్దు.' ఆయన ఏమనలేదు.

✦ ✦ ✦

ఈయనలో నాకు నచ్చని అంశాలు పెద్దగా ఏం లేవు. కోపం వచ్చేస్తుంది అంతే. ఆ కోపంలో తను ఏం చేస్తాడో తెలిసేది లేదు. మళ్ళీ అడిగితే 'కదా– అలా మాట్లాడకూడదు కదా' అంటారు. ప్రయోజనం ఏముంది? కింద పోసేసినంక ఏరుకొనేకి అయ్యే లేదు కదా.

'మీరు ఆలోచిచ్చి మాట్లాడండి... కొన్ని సార్లు టెన్షన్లో ఏదో అనేస్తారు' అంటాను. 'నువ్వు కూడా బుద్ధి చెప్పేంత యిదయిపోతివా నాకు' అంటారు.

అలా చెప్పించుకోవడం ఇష్టం లేదు ఆయనకి. కానీ చెప్పకపోతే మైండ్‌కి తట్టదు.

సంసారంలో అంత కోపమున్న మనిషితో ఓపిక లేకపోతే... అది పగిలిపోతుంది. నాకూ ఆయనకూ ఏ సంబంధం లేకుండా పోతుంది. తిరగ నాకు విలువ వుండదు.

✦ ✦ ✦

టోటల్‌గా మనిషి చాలా మంచతను. ఇప్పుడు చాలా బాగా తగ్గింది కోపం. అసలు కాలు భాగం కూడా లేదు.

నాకు మనసు బాగా లేకపోయినా, సప్పగా వున్నా ఆయనకి తెలిసిపోతుంది. అడుగుతారు. 'ఏమి సమాచారం? వంట్లో బాలేదా?'

ఎవర్నీ చూసీ అసూయపడే తత్వం లేదు. మా మావగారిది మంచి నవ్వు. ఆయనది ఈయనకు వచ్చింది. మంచి అందగాడు.

✦ ✦ ✦

ఆయనకు బయట పేరొచ్చినపుడు నాకు గర్వంగా వుంటుంది కదా. మొగుడు ఇంతటోడా... అట్లా.. హ్యాపీగా వుండేదాన్ని నేను.. అప్పుడు కూడా బయట పడేవాళ్ళు కాదు. 'ఇలా జరిగింది.. అలా జరిగింది'– అని చెప్పేవాళ్ళు కాదు.

నేను అడిగితే, 'వూ– జరిగిందిలే... ఈ కతంతా నీకెవరు చెప్పారు?' అనేవాడు.

ఇప్పుడిప్పుడు ఆయనకు చెప్పాలనిపిస్తుందేమో చెబుతుంటారు ఏదైనా. అంతకు ముందు ఇలా లేదు.

✦ ✦ ✦

నేను 'ఏమండీ' అని పిలుస్తాను. ఆయన 'ఏమే' అని పిలుస్తారు.

✦ ✦ ✦

కుటుంబానికి సంబంధించి ఎవర్నీ వదిలిపెట్టరు. ఏది వచ్చినా వాళ్ళకి అండగా నిలబడతారు.

వాళ్ళన్న కేసు వేసాడు కదా– ఆయనకు ఏమైనా సమస్య వచ్చి హాస్పిటల్‌కు వెళితే.. పరిగెత్తుతారు ఈయన... స్వంతంగా టిఫన్ తీసుకెళ్ళి, ప్లేట్ పెట్టి తినిపించి వస్తారు.

బయట చేసే సంఘ సేవ గురించి ఆయనేమీ చెప్పరు నాతో. వీళ్ళూ, వాళ్ళూ చెప్పటమే.

✦ ✦ ✦

ఆయన కొన్ని టైముల్లో మూడీ. హ్యాపీగా వుంటారు. అన్నీ చెప్పగలరు. వొక్కోసారి... 'పో.. ఏమీ పని లేదా?' అంటారు.

నేను ఎవరితో ఫ్రెండ్‌షిప్ చేయటం ఆయనకిష్టం లేదు. అందుకని నాకు ఎవరూ ఫ్రెండ్స్ లేరు. ఇప్పుడు అంటారు. 'నీకు ఎవరూ ఫ్రెండ్స్ లేరు. నీకు బోరు కొడితే అటూ ఇటూ వెళ్ళొచ్చు కదా'.

'అప్పుడు వదల్లేదు కదండీ మీరు. ఇప్పుడు, ఈ వయసులో నేను ఏ ఫ్రెండ్ దగ్గరికి పోను?' అంటాను.

✦ ✦ ✦

ఆయన ఎవరితోనూ క్లోజ్‌గా వుండరు. నాగేష్‌తో క్లోజ్‌గా వుండారు ఇప్పుడు. ఆయనకు ఫ్యామిలీ అంతా క్లోజే. సరదా మనిషి నాగేష్.

✦ ✦ ✦

నా వంటలు ఆయనకు చాలా ఇష్టం. వెజ్ & నాన్ వెజ్ బాగా తింటారు. రోజూ రెండు మూడు కూరలుంటే హ్యాపీ ఆయనకి.

ఆయనెప్పుడూ భోజనానికి రానని చెప్పరు. నేనలా కాసుకొని వుండటమే ఇష్టం ఆయనకు. అదే అలవాటయిపోయింది కొడుక్కీ, మనవళ్ళకి కూడా.

ఇంట్లో అందరూ వుంటే అందరూ కలసి తింటాం. ఈ మధ్య సుందర్ కూర్చోడు ఆయన్తో.

✦ ✦ ✦

మనువడు కౌషిక్ అంటే చాలా ఇష్టం. అన్నిటికీ అతను పక్కనే వుండాలి. 'ప్రాణం తింటారు కదండీ చిన్న పిల్లోడ్ని. మీ ముసలాయనతో వాడు చిన్న పిల్లవాడు అస్తమాను వుండేకవునా? ఎప్పుడో ఒకసారి....' అంటే 'నీకెందుకే అవన్నీ' అంటారు.

మా అదృష్టం ... పిల్లలు మంచి వాళ్ళు. కొడుకు, మనువళ్ళు. తాతకూడా ఇంటికి రాగానే 'పిల్లలొచ్చారా? అన్నం తిన్నారా? ఇంకా రాలేదా? ఒకసారి ఫోన్ చేయ్ వాళ్ళకి' అంటారు.

నిజంగానే ఆ దేవుడి గిఫ్ట్ మా పిల్లలు.

3. తండ్రీ Vs కొడుకు

ండ్రి పెద్ద పారిశ్రామికవేత్త. ఆయన ఆస్తి మొత్తం ఆయన కష్టార్జితం. దాదాపు 60 ఏళ్ళ వయస్సులో కూడా ఆయన కష్టపడుతూనే వున్నాడు. పనితప్ప మరో ధ్యాస లేదు.

అమెరికాలో చదువుతున్న కొడుకు వస్తున్నాడు. చదువు ముగించుకొని శాశ్వతంగా ఇండియాకు వచ్చేస్తున్నాడు. తండ్రి ఆనందానికి అవధులు లేవు. కొడుకు వస్తాడు, తన కంపెనీల్ని నడిపే బాధ్యతల్ని తీసుకొంటాడు. తన అనుభవాన్ని అతనికి అందిస్తాడు. తన వ్యాపార సామ్రాజ్యం మరింత విస్తరిస్తుంది. ఆయన వూహల్లో తేలిపోతున్నాడు.

ఆ రోజు రానే వచ్చింది. కొడుకు ఏర్‌పోర్ట్‌లో దిగాడు. ఘనంగా ఆహ్వానించేందుకు వెళ్ళాడు పెద్దాయన. కొడుకును చూసిన మరుక్షణం షాక్ తిన్నాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు.

కొడుకు ఒంటరిగా రాలేదు. వెంట ఒక అమెరికన్ పిల్ల కూడా వుంది. 'జెన్నిఫర్' అంటూ పరిచయం చేశాడు.

పెద్దాయనకి షాక్ నుంచి తేరుకోవడానికి కొంచెం టైమ్ పట్టింది.

దాన్నుంచి తేరుకొనే లోపలే పెద్దాయనకు మరో షాక్ ఇచ్చాడు కొడుకు. పెద్దాయన వ్యాపారాల్లో తనకు ఆసక్తి లేదట. తను, జెన్నిఫర్ కలసి 'వెంచర్ క్యాపిటల్ ఫండ్'ను క్రియేట్ చేసి రన్ చేయబోతున్నారట.

కొడుకు వేషం, భాష, పద్ధతి– ఏదీ అర్థం కాలేదు పెద్దాయనకు. ఒకటి మాత్రం అర్థం అయింది. కొడుకును గురించి తను కన్న కలలన్నీ కల్లలయ్యాయి అని.

– పై దృశ్యాన్ని మనం చిన్నప్పటి నుంచీ అనేక సినిమాల్లో చూశాం. ప్రస్తుతం మన కథలో కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. అయితే జెన్నిఫర్ పాత్ర లేదు.

✦ ✦ ✦

'తండ్రీ కొడుకుల మధ్య తరాల అంతరం' అనే ఇతివృత్తం చాలా పురాతనమైంది. రాజరికాల్లో అనేక వుదాహరణలు తెలుసు మనకు.



కుటుంబ చిత్రం -1

ఆధునిక యుగంలో వ్యాపార సామ్రాజ్యపు కుటుంబాలలో కూడా తండ్రీ కొడుకుల మధ్య ఇబ్బందికర పరిస్థితులు తలెత్తడం, అవి కొన్ని విపరీత పరిణామాలకు దారి తీయడం కూడా మనం చూస్తున్నాం.

చిన్నప్పటి నుంచి కష్టపడి, ఒక్కో మెట్టే ఎక్కుతూ పైకి వచ్చిన తండ్రి. ఆ తండ్రి నుంచి ఆస్తినీ, జీన్స్‌నూ వారసత్వంగా పొందినా, తనకంటూ స్వంత వ్యక్తిత్వం, ఆశయాలు, కలలు వుండి, తండ్రికి భిన్నంగా ఆలోచించే కొడుకు వున్నప్పుడు వాళ్ళిద్దరి మధ్య 'ఘర్షణ' అనివార్యం.

ముఖ్యంగా వ్యాపార, పారిశ్రామిక కుటుంబాల్లో వివిధ వ్యక్తుల మధ్య, వివిధ తరాల మధ్య సంబంధాలు అంత సరళంగా వుండవు. ఎంతో సంక్లిష్టత, తీవ్రత వుంటాయి ఆ సంబంధాల్లో.

రెండు ప్రధాన అంశాల్ని బ్యాలెన్స్ చేయాల్సిన బాధ్యత వుంటుంది ఈ వ్యాపార కుటుంబాలకు. ఆ రెండు వ్యవస్థలు ఏవంటే: 1. వ్యాపారం 2. కుటుంబం.

కుటుంబ సంబంధాలు వ్యాపారంలోకి ప్రవేశించినట్లుగానే, వ్యాపార సంబంధాలు కుటుంబంలోకి చొరబడుతాయి. ఈ రెండింటినీ సమర్థవంతంగా సమ్మిళితం చేసిన వ్యాపార కుటుంబాలు

విజయవంతంగా తరాల నుంచి తమ సామ్రాజ్యాల్ని విస్తరించుకొంటూ అప్రతిహతంగా ముందుకు వెళుతున్నాయి.

మన దేశంలో టాటాలు, మన దేశానికి చెందిన మిట్టల్ గ్రూపు దీనికి ఒక ఉదాహరణ.

తండ్రి మార్గాన్ని అనుసరించి ఆయన అడుగుజాడల్లో, ఆయన మార్గదర్శనంలో కొడుకు నడిచినపుడు ఘర్షణలు తలెత్తవు. దీనికి మిట్టల్ గ్రూపు ఒక ఉదాహరణ. తండ్రి లక్ష్మీకాంత్ మిట్టల్ నిర్మించిన స్టీలు మహా సామ్రాజ్యంలోకి ప్రవేశించిన ఆదిత్య మిట్టల్ తండ్రి మార్గదర్శనంలో నడిచాడు. తండ్రి కూడా కొడుకుకు దిశా నిర్దేశనం చేస్తూనే, అతని మీద పూర్తి విశ్వాసం వుంచి, తగినంత స్వేచ్ఛనిచ్చాడు. ఫలితంగా తండ్రీ కొడుకుల సంయుక్త నాయకత్వంలో మిట్టల్ గ్రూపు ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యాపార కుటుంబాల జాబితాలోకి వెళ్ళింది.

అయితే అనేక వ్యాపార కుటుంబాల్లో తండ్రీ కొడుకుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొని చివరికి చీలిక దిశగా పయనించిన సందర్భాలు చాలా వున్నాయి.

రాన్‌బాక్సీ కంపెనీ యజమాని భాయ్ మోహన్‌సింగ్‌కూ, అతని కొడుకు పర్వీందర్‌కూ మధ్య తీవ్రమైన సంఘర్షణ చోటు చేసుకొంది. నూతన ఆర్థిక విధానాలకు అనుగుణంగా వ్యాపారాల్లో మార్పులు చేయాలని కొడుకు, సంప్రదాయ పద్ధతుల్లోనే నడపాలని తండ్రి.

'అపోలో టైర్స్'ది కూడా అదే కథ. దాని యజమాని రౌనక్‌సింగ్‌కూ, అతని కొడుకు ఓంకార్ సింగ్ కన్వర్‌కూ మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి.

మన దేశంలోని బిర్లా, అంబానీ, మోడీ, శ్రీరాం, నందా, దాల్మియా, ఛాబ్రియా, థాపర్ గ్రూపులకు చెందిన వ్యాపార కుటుంబాల్లో కూడా చీలికలు వచ్చాయి.

విదేశాలకు చెందిన ఐబియం, బాటా వంటి వ్యాపార కుటుంబాల్లో కూడా పెద్ద ఎత్తున తండ్రీ కొడుకుల మధ్య సంఘర్షణలు చోటు చేసుకొన్నాయి.

మధ్య యూరప్ దేశమైన జెక్ రిపబ్లిక్‌కు చెందిన థామస్ బాటా సీనియర్ బాటా షూకంపెనీ యజమాని. ఆయనకూ, ఆయన కొడుక్కీ మధ్య ఘర్షణ ఏర్పడింది. బాటా సీనియర్ ప్లేన్ క్రాష్‌లో చనిపోవడంతో థామస్ జూనియర్ షూకంపెనీకి యజమాని అయ్యాడు.

ఇంటర్నేషనల్ బిజినెస్ మెషిన్స్ IBMను స్థాపించిన థామస్ జె.వాట్సన్ సీనియర్‌కూ, ఆయన కొడుకు థామస్ జె. వాట్సన్ జూనియర్‌కూ మధ్య 'లవ్–హేట్' రిలేషన్‌షిప్ వుండేది. నాన్నకు కొడుకు ఎంత సాధించినా తృప్తి వుండేది కాదు. అటువంటి నియంత వంటి తండ్రి చాటున కొడుకు బాల్యం సాఫీగా జరగలేదు. కొన్నిసార్లు 'క్లినికల్ డిప్రెషన్'కు కూడా గురయ్యాడు.

తండ్రి-కొడుకుల మధ్య ఘర్షణ తీవ్రతరం దాల్చడంతో కుటుంబేతర ఎగ్జెక్యూటివ్‌లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇలా ప్రపంచవ్యాప్తంగా అనేక వ్యాపార కుటుంబాల్లో తండ్రి కొడుకుల మధ్య సంఘర్షణలు చోటు చేసుకొన్నాయి.

✦ ✦ ✦

చిన్నస్వామిరాజు-సుందర్‌రాజు మధ్య కూడా కొంతకాలం ఇబ్బందికరమైన వాతావరణం (tensed climate) వుండింది.

సుందర్ బాల్యంలో నాన్నతో గడిపిన సందర్భాలు తక్కువ. నాన్న అంటే దూరంగా వుండే దర్పం, దర్జా వున్న మనిషి.

అందువల్ల సుందర్‌కి చిన్నతనంలో తాతయ్య అక్కలరాజుతో, అమ్మతో చనువు ఎక్కువ. అమ్మ కూడా సుందర్‌ని ఒక రక్షిత వలయంలో పెంచింది. మిగతా పిల్లలతో కలవడంకానీ, వాళ్ళ కమ్యూనిటీ వాళ్ళతో తిరగడం కానీ నిషిద్ధం.

చిన్నస్వామిరాజుకు కూడా తీవ్రమైన పని ఒత్తిడి వుండేది. ఆయన ముద్దులకొడుకు పనే. 'ఉదయం పిల్లలు లేవకముందే ఇల్లు వదిలి పెడితే తిరిగి రాత్రి 10-11 గంటలకు వచ్చేవాడ్ని. పిల్లలు నన్ను చూసే వాళ్ళు కాదు. ఏ ఆదివారమో చూస్తే 'వీడెవడు?' అన్నట్టు చూసేవాళ్ళు'- అంటాడు ఆయన.

అలా సుందర్ బాల్యమంతా వాళ్ళ నాన్నకు దూరంగానే గడిచింది. కాలేజీ రోజుల వరకు కూడా సుందర్ అలా దూర దూరంగానే వుంటూ వచ్చాడు. అందువల్ల ఆయనను అర్థం చేసుకోవడం, ఆయన నీడలో పెరగడం సుందర్‌కి కష్టంగా వుండేది.

సుందర్ కాలేజీ రోజుల్లో, చిన్నస్వామిరాజు అతన్ని ఒక పేద పిల్లవాడ్ని ఎలా పెంచుతారో అలా పెంచాడు. సుందర్ బస్సులోనే వెళ్ళాలి. సాదాసీదాగా వుండాలి. 'వాడికి కష్టం అంటే ఏమిటో తెలియాలని అలా పెంచాను' అంటాడు ఆయన.

కాలేజీ అయ్యాక, తర్వాత ఏమి చదవాలి అనే విషయంలో సుందర్‌కీ వాళ్ళ నాన్నకు మధ్య చిన్న విభేదం వచ్చింది. సుందర్‌ని సివిల్ ఇంజనీర్‌గా చూడాలని వాళ్ళ పెదనాన్న కుప్పరాజు ఆశ. కానీ సుందర్ ఎలక్ట్రానిక్స్ చదవాలనుకున్నాడు. చివరికి చిన్నస్వామిరాజు సుందర్ ఇష్టానికి వదిలేశాడు.

సుందర్ చదువులో బ్రైట్‌గా వుండేవాడు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో ఎమ్.ఎస్. కి సీటు వస్తే, చిన్నస్వామిరాజు గర్వంగా ఫీలయ్యాడు. వాళ్ళ కమ్యూనిటీలో ఆ స్థాయి చదువు చదవడం మొదటిసారి. అందరూ సుందర్ గురించి గొప్పగా చెబుతుంటే ఆయన లోలోపల పొంగిపోయేవాడు.



కుటుంబ చిత్రం -2

1981లో కోర్సు పూర్తి చేసుకొని సుందర్ ఇండియాకి తిరిగొచ్చాడు.

అప్పటికే సుందర్ గూర్చి చిన్నస్వామిరాజుగారి కుటుంబంలో, కమ్యూనిటీలో 'కాబోయే వ్యాపార యువరాజు' అన్న పద్ధతిలో ఎన్నో అంచనాలు వున్నాయి.

చిన్నస్వామిరాజుకు కూడా సుందర్ విషయంలో చాలా ఆశలు వున్నాయి. తన హోటల్ బిజినెస్‌లో తోడుగా వుంటాడని ఆయన నమ్మకం.

అయితే సుందర్ కోరికలు, లక్ష్యాలు భిన్నంగా వున్నాయి. అప్పటికే వున్న బిజినెస్‌లో కొనసాగటం అతనికి ఇష్టం లేదు. తనంటూ స్వతంత్ర్యంగా ఏదో చేయాలి. తన చదువుకు సరిపోయే వ్యాపారాన్ని ప్రారంభించాలి. తన సవాళ్ళను తానే ఏర్పరచుకొని వాటిని అధిగమించాలి. అదీ సుందర్ ఆలోచన అప్పుడు.

అయితే సుందర్‌కి వాళ్ళ నాన్న ఎంత అగ్రెసివ్‌గా వుంటాడో తెలుసు. ఆయనతో ఢీకొంటే ఇంట్లో అశాంతి నెలకొంటుంది. అది ఇష్టం లేదు సుందర్‌కు. అందుకనే ఆయన్ను ఒప్పించి తాను బిజినెస్ ప్రారంభించాలని నిర్ణయించుకొన్నాడు.

చివరికి పెద్దాయన ఒప్పుకొన్నాడు. సుందర్ తెలివితేటల మీద నమ్మకం వుంది ఆయనకు. సుందర్ 'సన్‌రే కంప్యూటర్స్'ను ప్రారంభించాడు. అది మొదట్లో బాగున్నా, రాను రాను దెబ్బతినేసింది. మెల్లగా దాన్ని మూసేయాల్సి వచ్చింది.

సుందర్ మీద వున్న అంచనాలన్నీ పటాపంచలయిపోయాయి. పెద్దాయనకు కూడా సుందర్ బిజినెస్ స్కిల్స్ మీద నమ్మకం సడలింది.

ఫలితంగా సుందర్ అప్పటికే ఏట్రియా హోటల్ నిర్మాణం జరుగుతుంటే, ఆ పనులు చూసుకోవడం మొదలు పెట్టాడు. ఒక రకంగా సుందర్ పెద్దాయన్ను 'ఫేస్' చేయడం మానేశాడు.

మెల్లగా రెండవ ప్రయత్నంగా సుందర్ "శాంతాక్రజ్ ఆపరేషన్స్'ను ప్రారంభించాడు. అది కూడా దెబ్బతినింది. ఫలితంగా మూతపడింది.

సుందర్‌ని ఒక ఫెయిల్యూర్‌గా అందరూ చూడటం మొదలుపెట్టారు. కొన్ని ఏళ్ళు గడిచాయి. చిన్నస్వామిరాజుకి కొడుకు పట్ల అసంతృప్తి. ఏ సలహాకూ స్పందించని కొడుకును చూసి బాధ.

సుందర్‌కి ఒక ఆదర్శం వుంది. ఒక ఇంటరాక్టివ్ టెలివిజన్‌ను రూపొందించాలి. ప్రతి పిల్లవాడు నెలకు 50రూ॥లతో ఆ టీవీ ద్వారా చదువుకోగలగాలి. మన ఆదర్శాల్ని మనం నెరవేర్చుకోకపోతే మనిషి జీవితానికి అర్థం ఏముందదని అతని భావన. మూడుపూటలా కడుపు కింత తిండి, నెత్తి మీద ఒక పై కప్పు. ఇంతే కదా జీవితం. ఇదీ అతని ఆలోచన.

అందుకని 'ఏట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజీ'ని ప్రారంభించాడు. అయితే దురదృష్టవశాత్తూ అది కూడా మొదట్లోనే 20 కోట్లకు పైగా నష్టాల్లో కూరుకుపోయింది.

ఇక సహించకలేకపోయాడు చిన్నస్వామిరాజు. స్వంత వ్యాపారాలన్నీ పక్కన పెట్టేసి హోటల్స్‌ను చూసుకోమన్నాడు.

కానీ వెనక్కి తగ్గదలచుకోలేదు సుందర్. ఒకవైపు పిల్లలకి విద్యనందించాలనే తన ఆదర్శం. మరోవైపు తనను అప్పటికే అంతా 'ఫెయిల్యూర్ కేస్'గా లెక్కకట్టేశారు. ఇప్పుడు కనుక వెనక్కి వెళితే 'పర్మనెంట్ ఫెయిల్యూర్ కేస్' అయిపోతాడు. పైగా తాను ఇప్పటి వరకు నాన్నతో ఘర్షణ వైఖరి ఎందుకు అవలంబించలేదంటే, ఆయన చాలా స్ట్రాంగ్ అండ్ పవర్‌ఫుల్ పర్సనాలిటీ. ఆయన ఎవరికీ లొంగడు. ఆయన్ను ఢీ కొంటే ఇంట్లో అశాంతి నెలకొంటుంది. అది ఇష్టం లేకే ఆయన్ను అవాయిడ్ చేస్తూ వచ్చాడు. అయితే ఇప్పుడు కూడా అదే జరిగింది. ఇంట్లో అశాంతి ఏర్పడింది.

అందువల్ల సుందర్ పెద్దాయన్ను ఎదిరించడానికే సిద్ధమయ్యాడు. అగ్రెసివ్‌గా ముందుకెళ్ళడానికే నిశ్చయించుకొన్నాడు. అంతే. పెద్దాయన రగిలిపోయాడు. ఇప్పటి వరకు ఆయన్ను జీవితంలో అలా ఎవరూ ఎదిరించలేదు. వాళ్ళ పెద్దన్న కుప్పరాజు కూడా ఇతని మాట వినేవాడు.

కొన్ని రోజులు ఇద్దరి మధ్యా యుద్ధవాతావరణం నెలకొంది. పెద్దాయన దగ్గరి మిత్రుల్ని, బంధువుల్ని పిలిపించి సుందర్‌కి బుద్ధి వచ్చేట్టు సలహాలివ్వమన్నాడు. సుందర్ మరింత దూకుడుతనంతో

ముందుకెళ్ళాడు. ఆయనకు మామూలు మాటలు వినపడవు. అరచి చెప్పాలి. అదీ సుందర్ అభిప్రాయం. దాన్నే ఆచరణలో పెట్టాడు.

సుందర్ పెట్టిన కంపెనీని నష్టాల్లోంచి బయటపడేయడానికి అవసరమైన 20 కోట్ల రూ॥లు పెద్దాయన బెంగుళూరులో సైట్ అమ్మి మరీ క్లియర్ చేశాడు. ఇప్పుడు ఇంకా బుద్ధిరాకుండా, మళ్ళీ ముందుకెళతానంటున్నాడు. అదీ పెద్దాయన ఆలోచన.

అయితే అలా తిరుగుబాటు ధోరణిలో వెళుతున్న కొడుకును ఎలా డీల్ చేయాలో ఆయనకు అర్థం కాలేదు. ఇటువంటి పరిస్థితి ఆయనకు మొదటిసారి.

ఆర్థిక విషయాల్లో ఆయన ఎంత పొదుపరి అంటే ఏర్‌పోర్ట్ నుంచి హోటల్‌కు ఆటోలో వెళితే 30రూ॥లు. టాక్సీలో వెళితే 100రూ॥లు. ఆయన ఆటోలోనే వెళ్ళేవాడు. ఆ రోజు తన సంపాదన 70రూ॥లు అని సంతోషించేవాడు. వాళ్ళ ఇల్లు కడుతున్నపుడు ఒక కూలివాడు ఒక టైల్‌ను పగులకొడితే వాడి మీద ఇంతెత్తున అరిచాడు. ఎందుకు నాన్న అలా అరవటం అని కూతురు అడిగితే 'దాని ఖరీదు 35రూ॥లమ్మా' అని జవాబిచ్చాడు. అదీ ఆయన తత్వం. ఇప్పటి వరకు ఆయన చేసిన ఏ పనిలో కూడా నష్టం రాలేదు. అలాంటిది మొదటిసారిగా సుందర్ మూలంగా వచ్చిన కోట్లాదిరూపాయల నష్టం చూసి ఆయన తట్టుకోలేకపోయాడు.

సుందర్ హద్దుమీరి ప్రవర్తిస్తున్నాడు. అది భరించలేకపోయాడు. పెద్ద స్థాయి ఘర్షణ చోటు చేసుకుంది.

చివరికి లక్కీగా ఏట్రియా కన్వర్జెన్స్ టెక్నాలజిలో పెట్టుబడి పెట్టడానికి ఇన్వెస్టర్ ముందుకొచ్చాడు.

ఇక అప్పటి నుంచి సుందర్, చిన్నస్వామిరాజు మధ్య అంత మంచి స్నేహ పూర్వక సంబంధం లేదు. అయితే గత 7–8సం॥ల నుంచి ఇద్దరి మధ్యా సయోధ్య నెలకొంది. ఆయన కొంచెం మెత్తపడ్డారు.

✦ ✦ ✦

బిజినెస్ ఫ్యామిలీల్లో ఇటువంటి ఘర్షణ అసాధారణమేమీ కాదని మొదటే చెప్పుకొన్నాం.

'ఒక వ్యాపారంలో తండ్రీ–కొడుకుల సంబంధం చాలా ఒడిదుడుకులతో, సంక్లిష్టంగా వుంటుంది' అంటాడు విల్‌బర్ రాస్. ఆయన మిట్టల్ గ్రూపులో బోర్డు మెంబర్.

ముందుగా చిన్నస్వామిరాజు ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం.

ఆయన ఎద్దులబండితో జీవితం స్టార్ట్ చేశాడు. ఒక మేస్త్రీకి అసిస్టెంట్‌గా కాంట్రాక్టు ఫీల్డ్‌లోకి అడుగుపెట్టాడు. సుదీర్ఘ శ్రమ భరిత ప్రయాణం. తాను కష్టపడి పని చేయడం, ఇతర్లను కష్టపడి పనిచేసేట్టుగా చేయడం– ఈ రెండే ఆయనకు తెలుసు.

తను చేసే ఏ పని అయినా, దాన్ని ఇన్ అండ్ అవుట్ తెలుసుకొంటాడు. దాని మీద పూర్తి ఆధిపత్యాన్ని సాధిస్తాడు. తన కంట్రోల్‌లో లేని వ్యాపారాల జోలికి ఆయన వెళ్ళడు.

తన వ్యాపార సామ్రాజ్యాన్ని అగ్రెసివ్‌గా విస్తరించాలనీ, గెంతులతో, జంప్‌లతో పైకి ఎగరాలనీ ఆయనకు లేదు. 'సైకిల్ తొక్కేవాడ్ని. ఒక స్టేజిలో కడుపుకు అన్నం తినేదానికి కూడా కష్టమే. అలాంటి స్టేజి నుంచి ఇంత స్టేజి కొచ్చాను. ఇంకేమి కావాల నాకు? ఆశకు కూడా అంతు వుండాలకదా?' ఇదీ ఆయన దృక్పథం.

ఆయన తన కొడుకు కూడా తన దారిలోనే నడవాలనుకొన్నాడు. తనకన్నా కొడుకు పైకి ఎదగాలి. తన better version ... advanced version గా కొడుకు వుండాలి. ఇదీ ఆయన కోరిక. దీన్నే సైకాలజీలో 'ప్రాజెక్షన్' అంటారు.

ఈ 'ప్రాజెక్షన్'కు తగినట్టుగా కొడుకు లేకపోవడంతో సమస్యలు తలెత్తాయి.

ఇక సుందర్ విషయానికి వస్తే, అతను చిన్నప్పటి నుంచీ తండ్రితో భౌతికంగా, ఉద్వేగపరంగా దూరంగా వున్నాడు. 'ఆధిపత్యాన్ని కోరుకొనే తండ్రి అధికారాన్ని మాత్రమే చలాయిస్తాడు, ఎమోషనల్ సపోర్టును పిల్లలకు అందివ్వడు. వాళ్ళకు దూరంగా వుంటాడు'– అంటుంది బాచీ జె.కర్కారియా అనే జర్నలిస్టు.

బిజినెస్ అన్నాక లాభం నష్టం రెండూ వుంటాయి. నష్టం రాగానే 'ఫెయిల్డ్ కేస్'గా పరిగణించి స్వంత తల్లిదండ్రులే విలువ ఇవ్వకపోవడంతో సుందర్ తీవ్రంగా నొచ్చుకొన్నాడు. తను ఒక స్వతంత్ర్య వ్యక్తిగా, ఒక మనిషిగా విలువను కోల్పోయాడా? అన్నది అతని ఆక్రోశం.

వీళ్ళిద్దరి సమస్య మాత్రమే కాదు ఇది. రెండు తరాల మధ్య సంబంధాల్లో ప్రతిఫలించే 'భిన్న ధృవాల ఘర్షణే' ఇక్కడా ప్రతి ఫలించింది.

ఈ సమస్యను మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం.

చిన్నస్వామిరాజుకు మొదటి నుంచీ సుందర్‌తో కమ్యూనికేషన్ లేదు. కొన్ని రకాల ఫ్యూడల్ కుటుంబాలలో, ముఖ్యంగా ఉమ్మడి కుటుంబాలలో వివిధ వ్యక్తుల మధ్య సంబంధాలలో (interpersonal relationships) కమ్యూనికేషన్ ఒక సమస్య. ఒక కుటుంబం వ్యాపార కుటుంబం అయినపుడు అది ఇంకా పెద్ద సమస్య. అప్పుడు ఆ కుటుంబ సభ్యుల మధ్య వ్యాపార సంబంధాలు ఎక్కువయ్యే అవకాశం వుంటుంది.

భయం, భక్తి, గౌరవం–ఇవి ఫ్యూడల్ కుటుంబ సంబంధాలలో ప్రధాన పాత్ర వహిస్తాయి. అందువల్ల పరస్పరం కూర్చుని స్పష్టంగా ఒకరి లోపలి భావాల్ని, అభిప్రాయాల్ని వ్యక్తపరచుకోవడం చాలా అరుదు.

కుటుంబాలు అన్ని ఎమోషన్స్‌నూ యాంప్లిఫై చేస్తాయి. భూతద్దంలో చూపుతాయి. అవి సానుకూల ఉద్వేగాలు కావచ్చు, ప్రతికూల ఉద్వేగాలు కావచ్చు. వీటిని అర్థం చేసుకొని సరైన పద్ధతిలో ఛానలైజ్ చేసే కర్తవ్యం ఆ కుటుంబంలోని అందరికన్నా ఆ కుటుంబ పెద్ద మీద వుంటుంది.

సుందర్ విషయంలో చిన్నస్వామిరాజు ఇది చేయలేకపోయాడు. గాంభీర్యత మాటున, ఆధిపత్యం మాటున వుండిపోవడంతో వ్యాపార సంబంధాల్లో వుండాల్సిన స్పష్టత రాలేదు.

సుందర్ అమెరికా నుంచి రాగానే తన అభిప్రాయాల్ని, ఆశయాల్ని వ్యక్తపరచినపుడు చిన్నస్వామిరాజు అతనితో ముఖాముఖి కూర్చుని స్పష్టంగా మాట్లాడాల్సి వుండింది. అది చేయలేదు. తరాలు మారినపుడు, తమ తరంలో ఉపయోగించిన పద్ధతుల్నే నెక్స్ట్ తరానికి అన్వయించకూడదు. రెండవ తరాన్ని, ఆ తరం యొక్క దృష్టి కోణం నుంచి అర్థం చేసుకోవాలి. దీన్నే 'empathatic understanding' అంటారు.

మరో విషయం ఏమిటంటే చిన్నస్వామిరాజు వాళ్ళది ఒక వ్యాపార కుటుంబం కాదు. రెండు వ్యాపార కుటుంబాలు. ఆయన, వాళ్ళ పెద్దన్న కుప్పరాజు కుటుంబాలు.

కుప్పరాజు చనిపోయాక ఆ రెండు కుటుంబాలకు కుటుంబ పెద్ద చిన్నస్వామిరాజే. మన భారతీయ ఉమ్మడి కుటుంబానికి కొన్ని సంప్రదాయాలు, పద్ధతులు వున్నాయి. అందులో ఒకటి ఏమిటంటే, కుటుంబానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తి తన వ్యక్తిగత ప్రయోజనాలకు, తన స్వంత కుటుంబ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వకూడదు. అతని మొదటి ప్రాధాన్యత విశాల ఉమ్మడి కుటుంబ ప్రయోజనాలకే వుంటుంది. దీన్నే 'సామూహిక దృక్పథం' (communitarion percepective) అంటారు.

ఈ సంప్రదాయంలో పుట్టి పెరిగిన వ్యక్తి చిన్నస్వామిరాజు. తన కుటుంబంకన్నా ఉమ్మడి కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమని నమ్మి, దాన్నే ఆచరించే వాడు.

కానీ సుందర్‌కి అటువంటి సంప్రదాయం లేదు. అతను వ్యక్తివాద సమాజం (individuated society) కు చెందినవాడు. అందువల్ల వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తి ప్రత్యేక వ్యక్తిత్వం, ఆశయాలు, లక్ష్యాలు అతనికి ముఖ్యం. అందువల్ల సుందర్‌కు చిన్నస్వామిరాజు యొక్క కమ్యూనిటేరియన్ పర్‌స్పెక్టివ్ ఇబ్బంది కలిగిస్తుంది. అతన్ని వుక్కిరి బిక్కిరి (suffocation)కి గురిచేస్తుంది.

సుందర్ ప్రయోజనాలకూ– ఉమ్మడి కుటుంబ ప్రయోజనాలకు మధ్య వైరుధ్యం వచ్చినపుడు చిన్నస్వామిరాజు నిర్ద్వంద్వంగా ఉమ్మడి కుటుంబ ప్రయోజనాలవైపే దృఢంగా నిలబడ్డాడు. అది సహజంగానే సుందర్‌కి మింగుడుపడలేదు.

సుందర్ తన ఆశయాల వెంట ప్రయాణించాలనుకొన్నాడు. తాను కోరుకున్న వ్యాపారం చేయాలనుకొన్నాడు. అంత వరకు బాగానే వుంది. అయితే తన ఆశయాల అమలుకు ఉమ్మడి కుటుంబం నుంచే పెట్టుబడిని ఆశించాడు. అంటే ఆ కుటుంబ పెద్ద అయిన చిన్నస్వామిరాజు తను కోరుకున్న వ్యాపారానికి పెట్టుబడి పెట్టాలని కోరాడు. ఇది కూడా చాలామందికి సహజమైన కోర్కెగానే కన్పిస్తుంది. 'కొడుకు వ్యాపారం చేయబోతుంటే, తండ్రికాక ఇంకెవరు పెట్టుబడి పెడతాడు?' - అనుకొంటారు.

అయితే అసలు సమస్య ఇక్కడే వుంది. సుందర్‌కు వ్యాపారానికి వాళ్ళ నాన్న పెట్టుబడులు కావాలి. వాళ్ళ నాన్న పరిచయాలు, వ్యవస్థల నుంచి సపోర్టు కావాలి. కానీ వాళ్ళ నాన్న నియంత్రణ వుండకూడదు. అక్కడ తన వ్యక్తి స్వేచ్ఛ, స్వీయ ఆకాంక్షలు ప్రధానంగా వుండాలి. ఈ ధోరణి మూలంగానే సమస్యలు తలెత్తాయి.

ఉమ్మడి వ్యాపార కుటుంబాల్లో వ్యక్తి స్వేచ్ఛ, వ్యక్తి ప్రయోజనాలు ప్రాధాన్యతకు వచ్చినపుడంతా ఆ కుటుంబాల్లో సంక్షోభాలు చోటు చేసుకొన్నాయి. దీనికి అతిపెద్ద, అతి పాపులర్ వుదాహరణ రిలయన్స్ గ్రూపు యాజమాన్య కుటుంబం. వ్యక్తిగత లక్ష్యాలకూ- ఉమ్మడి వనరులకూ మధ్య వైరుధ్యపు ఫలితం అది.

సుందర్ కోర్కెలు, పద్ధతులు ఉమ్మడి కుటుంబ ప్రయోజనాలకు భిన్నంగా వున్నప్పటికీ, అతని టాలెంట్ మీద వున్న నమ్మకంతో అన్న కొడుకు నాగరాజు ఆమోదంతో సుందర్‌కు సపోర్ట్‌గా నిలిచాడు చిన్నస్వామిరాజు. ఒకసారి కాదు మూడుసార్లు. అయితే సుందర్ సక్సెస్ కాలేదు. సక్సెస్ అయివుంటే సమస్య వచ్చేది కాదు. ఉమ్మడి కుటుంబానికి తర్వాతి నాయకత్వం సుందర్‌దే అయ్యేది. కానీ వ్యాపారాల్లో సుందర్ వైఫల్యం చెందడంతో చిన్నస్వామిరాజు తన సపోర్టును వుపసంహరించుకొన్నాడు.

సుందర్ తనకు ఇష్టమైన వ్యాపారాన్ని తనే చేసుకొని వుండాల్సింది. ఉమ్మడి కుటుంబపు పెట్టుబడుల మీద, నాన్న సపోర్ట్ మీద ఆధారపడి వుండకూడదు. అప్పుడు ఫెయిల్యూర్ అయినా, సక్సెస్ అయినా సుందర్‌దే బాధ్యత అయివుండేది.

మరో విషయం ఏమిటంటే వ్యాపార కుటుంబాలలో కుటుంబ సభ్యుల మధ్య వ్యాపార సంబంధాలే ప్రబలంగా వుండే అవకాశం వుంది. వాళ్ళకి-ఆఫీసుకీ, ఇంటికీ మధ్య తేడా వుండదు. 'మా నాన్నకీ తాతయ్యకి మధ్య ఒక బాస్‌కీ, అతని సబార్డినేట్‌కీ మధ్య వున్న సంబంధాలే వున్నాయి. వాళ్ళిద్దరూ తండ్రీ కొడుకుల్లాగా కాక, బాస్ అండ్ సబార్డినేట్‌లా వుంటారు'- అంటాడు సుందర్ వాళ్ళ అబ్బాయి కౌశిక్.

సుందర్‌కీ వాళ్ళ అబ్బాయికీ మధ్య కూడా వ్యక్తిగత సంబంధాలు అంత గొప్పగా ఏమీ లేవు.

అందుకే వ్యాపార సంబంధాల నుంచి ఇంటిని విముక్తం చేయాలి. 'మేము ఇంట్లోకి ప్రవేశించగానే తండ్రీ కొడుకులం అయిపోతాం. ఇంట్లో వ్యాపారానికి నో చెబుతాం'– అంటాడు ఆదిత్య మిట్టల్.

కుటుంబంలో సంబంధాలు మెరుగుపడేలా నిరంతరం ప్లాన్ చేస్తూ వుండాలి. 'The family that plays together, stays together' అనే సామెత వుంది. కుటుంబ సభ్యుల మధ్య అటువంటి ఆహ్లాదకరమైన సంబంధాలు మెరుగు పడాలంటే కుటుంబమంతా కలసి పిక్‌నిక్‌లకు వెళ్ళడం, యాత్రలు చేయడం, ఆటలు ఆడుకోవడం వంటివి చేయాలని www.fatherandsonbusiness.com వెబ్‌సైట్‌లో ఫ్యామిలీ సైకాలజిస్టులు సూచిస్తున్నారు.

కుటుంబంలోని ప్రతి సభ్యుడికీ తనదైన స్వంత ఫ్లేవర్ వుంటుంది. ఒక్కోసారి వివిధ వ్యక్తిత్వాల మధ్య బ్లెండ్ బాగా కుదిరి మంచి సూప్ తయారవుతుంది. మరికొన్ని సార్లు మిశ్రమం తగిన పాళ్ళలో లేక బ్లెండ్ సరిగా కాదు. అప్పుడు అవాంఛిత దినుసులు సూప్‌లో పైకి తేలుతాయి.

మంచి ఫ్యామిలీ వంటకం, కొంత వరకు అందులో వాడే దినుసుల మీద, ఇంకొంత భాగం వంట చేసే పద్ధతి మీద ఆధారపడి వుంటుందని ఫ్యామిలీ సైకాలజిస్టులు చెబుతారు.

ఒక కుటుంబంలో బలమైన వ్యక్తిత్వాలు వున్న వ్యక్తులు తమ ఫ్లేవర్‌తో మిగతా ఫ్లేవర్స్‌ను డామినేట్ చేస్తారు. అప్పుడు ఆ ఫ్లేవరే ఆ కుటుంబ ఫ్లేవర్ అవుతుంది. దీన్నే 'ఫ్యామిలీ క్లయిమేట్' అంటారు.

వ్యక్తిత్వం అనేది 50 శాతం అనువంశికమే అయినప్పటికీ, పిల్లలు విభిన్న కలయికల జీన్స్ (different patterns of the same genes) ను కల్గివుండే అవకాశం వుంది. అందువల్ల వాళ్ళు తల్లితండ్రులకన్నా భిన్నమైన వ్యక్తిత్వాన్ని పొందే అవకాశం వుందని జన్యు శాస్త్రవేత్తలు చెబుతారు.

తమ జన్యువులతోనే పిల్లలు కలగడం, తమ లక్షణాలతో వాళ్ళ వ్యక్తిత్వాలు సంతరించుకొంటాయని తల్లిదండ్రులు ఆశించడం జరుగుతుంది. అయితే ఇది జరగవచ్చు, జరగకపోవచ్చు. దీన్నే 'జీన్ లాటరీ' అంటారు.

దీన్నే యిలా చెబుతారు జన్యు శాస్త్రవేత్తలు. ఒక కొడుకు దగ్గర తండ్రి పేకముక్కలు, తల్లి పేక ముక్కలు వుంటాయనుకోండి. కానీ ఆ పేకముక్కలతో కొడుకు ఆడే ఆట తల్లిదండ్రుల ఆటకన్నా భిన్నంగా వుండచ్చు. ముక్కలు అవే, కాని ఆట వేరు. ఇక్కడ పేక ముక్కలంటే జన్యువులు. ఆట అంటే పేటర్న్స్.

తల్లిదండ్రులు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం వుంది. తమ లక్షణాలే తమ

పిల్లలకు రావాలనుకోవడం, అలా రానప్పుడు వాళ్ళతో ఘర్షణ వైఖరి అవలంబించడం కాకుండా, పిల్లల్ని వాళ్ళ దృష్టికోణం నుంచి అర్థం చేసుకొని, వాళ్ళతో వ్యవహరించవలసిన అవసరం వుంది.

చిన్నస్వామిరాజుకూ– సుందర్‌కూ మధ్య తండ్రీ కొడుకులకు మధ్య వుండే ప్రేమాభిమానాలు, పరస్పర గౌరవం అన్నీ వున్నాయి. సాదా జీవితం, ఎటువంటి చెడు అలవాట్లు లేకపోవడం, క్రమశిక్షణ వంటి విషయాల్లో ఇద్దరికీ సారూప్యత వుంది.

వాళ్ళ మధ్య వచ్చిన ఘర్షణాత్మక వాతావరణం తర్వాత ఇద్దరి మధ్యా సయోధ్య నెలకొంది. వ్యాపార కుటుంబాల్లో తండ్రీ కొడుకుల మధ్య వచ్చే సంఘర్షణ తర్వాత ఇద్దరి మధ్యా దగ్గరితనం వచ్చేందుకు చైతన్యయుతంగా కృషి చేయడం ద్వారా ఆ సంఘర్షణను ఒక మంచి అవకాశంగా వుపయోగించుకోవాలని ఫ్యామిలీ సైకాలజిస్టులు సూచిస్తున్నారు. చిన్నస్వామిరాజు– సుందర్ మధ్య కూడా ఇదే చోటు చేసుకుంది.

చిన్నస్వామిరాజు, సుందర్, నాగరాజు కలసి పవర్ ప్రాజెక్టుల్ని నెలకొల్పారు. అవి విజయవంతంగా నడుస్తున్నాయి. మరికొన్ని భవిష్యత్ వ్యాపార ప్రణాళికలు కూడా రచిస్తున్నారు. ఒక్కోసారి ఘర్షణ మరింత ఐక్యతకు దారితీస్తుందనేందుకు ఈ తండ్రీ కొడుకులు ఒక ఉదాహరణ.

4. 'ఆయనే మా హీరో'- ఆ ఆరుగురు

జీవితం మీద మా తాతయ్య ప్రభావం చాలా వుంది'– **శృతి**

'ఆయన ఒక కమాండర్ లాంటి వాడు. జస్ట్ ఆయన్ను చూస్తే చాలు మేము ప్రభావితులమవుతాం'– **గౌతమ్.**

'ఆయన గ్రాండ్ చిల్డ్రన్‌కి ఆయన నిజంగా ఒక గొప్ప హీరో'– **శ్రీనివాసరాజు, అల్లుడు.**

ప్రతి తరంలోనూ, స్థలకాలాదులకు అతీతంగా గ్రాండ్ పేరేంట్స్‌కూ గ్రాండ్ చిల్డ్రన్‌కూ మధ్య గొప్ప ఆత్మీయత, దగ్గరితనం వుంటాయి.

ఈ సంబంధాన్ని గూర్చి Levension సరదాగా ఇలా అంటాడు, 'గ్రాండ్ చిల్డ్రన్ మరియు గ్రాండ్ పేరెంట్స్ మధ్య అంత మంచి సంబంధం ఎందుకు వుంటుందంటే, వాళ్ళిద్దరికీ ఉమ్మడి శత్రువు ఒకరే కాబట్టి.'


ఈ వుమ్మడి శత్రువు గ్రాండ్ చిల్డ్రన్‌కి వాళ్ళనాన్న, గ్రాండ్ పేరెంట్స్‌కి వాళ్ళ కొడుకు.

బహుశా సుందర్‌కి ఇది వర్తిస్తుంది. వాళ్ళ నాన్న చిన్నస్వామిరాజుకి అతను భయపడేవాడు. వాళ్ళ తాత అక్కలరాజు కూడా చిన్నస్వామిరాజుకి భయపడేవాడు. అందువల్ల సుందర్ మరియు అక్కల రాజుకు 'ఉమ్మడి శత్రువు' చిన్నస్వామిరాజు అన్నమాట. అందుకే సుందర్ వాళ్ళ నాన్నతో కంటే వాళ్ళ తాతయ్యతో సన్నిహితంగా వుండేవాడు.

అయితే సుందర్, రేవతి పిల్లల విషయంలో పరిస్థితి మరోలా వుంది. చిన్నస్వామిరాజుకీ వాళ్ళ కొడుకు సుందర్‌కూ మధ్య సాన్నిహిత్యం లేదు. అయితే సుందర్‌కి పిల్లలతో సాన్నిహిత్యం వుంది. కానీ వాళ్ళతో ఎక్కువగా గడిపే టైము, వెసులుబాటు లేదు.

కారణాలు ఏవైనా చిన్నస్వామిరాజు ఆయన గ్రాండ్ చిల్డ్రన్‌తో అద్భుతంగా కనెక్ట్ అయ్యాడు.

ఆయన మొదటి మనువడు గౌతమ్ ఆయన కూతురి కొడుకు. ఆ అబ్బాయి చాలా కాలం పాటు ఆయనతో వాళ్ళింట్లోనే వుండేవాడు.



మనవడా? మజాకా?

ఆయన కొడుకు సుందర్‌కి ముగ్గురు పిల్లలు– కార్తిక్, కౌశిక్, సనిత్ర.

కూతురు రేవతికి ముగ్గురు పిల్లలు– గౌతమ్, శృతి, చైతన్య. అయితే తనకు గ్రాండ్ చిల్డ్రన్ ఆరుగురు అంటే చిన్నస్వామిరాజు ఒప్పుకోడు. 'నాకు గ్రాండ్ చిల్డ్రన్ ఆరుగురు కాదు. 40–50 మంది' అంటాడు. మనం అర్థం కానట్టు చూస్తే ఆయన 'మా అన్నల మనవళ్ళు–మనవరాళ్ళు, మా సిస్టర్స్ మనవలు–మనవరాళ్ళు కూడా నా గ్రాండ్ చిల్డ్రనే' అంటాడు. అనడమే కాదు నిజజీవితంలోను ఆయన అలానే చూస్తారు వాళ్ళని.

పిల్లలు చిన్నగా వున్నపుడు ఆయన ఒక మామూలు సగటు తాతయ్యలాగ వాళ్ళను ఎత్తుకొని ఆడించడం, వాళ్ళతో టైమ్ స్పెండ్ చేయడం చేసేవాడు.

వాళ్ళను ఆదివారాలు బయటికి తీసుకెళ్ళేవాడు. పిల్లలందరూ అప్పటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంటారు. అప్పట్లో పిల్లల్ని తీసుకొని విధాన సౌధాకో లేదా కబ్బన్ పార్క్‌కో వెళ్ళేవాడు. లేదా ఏదో ఒక హోటల్‌కెళ్ళి లంచ్ చేసేవాళ్ళు. పిల్లలకు చిరుతిండ్లు వంటివి కొనిపెట్టేవాడు.

గ్రాండ్ చిల్డ్రన్ వచ్చాకే ఆయన భార్య ఇందిరతో కూడా ఎక్కువ టైమ్ స్పెండ్ చేశాడు. 'మొదటి గ్రాండ్ చైల్డ్ పుట్టేదాకా, కొన్నిసార్లు భార్యాభర్తల మధ్య పరిపూర్ణ ప్రేమ సాధ్యం కాదు' అని ఒక వెల్ష్ సామెత వుంది. చిన్నస్వామిరాజు–ఇందిరమ్మ విషయంలో ఇది కొంత వరకు నిజం అని చెప్పవచ్చు.

పిల్లలు కొంత పెద్ద వాళ్ళయ్యాక వాళ్ళతో కలసి బయటి ప్రదేశాలకు కూడా వెళ్ళేవాడు.

కులూ, అరకు వెళ్ళారు. మలేషియా, థాయ్‌లాండ్ కూడా వెళ్ళారు. పిల్లలూ– ఆయనా అంతే. మధ్యలో ఇంకెవ్వరూ వుండేవాళ్ళు కాదు. 'ఆయన బయటికి రాగానే పూర్తి జోవియల్‌గా మారిపోతారు. ఫుల్‌గా ఓపెన్ అవుతారు. మాలో ఒకడిగా కలిసిపోతారు' అంటాడు కౌశిక్.

'ఆయన ఒకసారి మమ్మల్ని చైనా తీసుకెళ్ళాడు. మాకు పూర్తి ఫ్రీడం ఇచ్చాడు. మా ఇష్టమొచ్చినట్టుగా మమ్మల్ని వుండనిచ్చాడు. అదే సమయంలో మా గురించి గొప్ప కేర్ తీసుకొన్నాడు. అది నా జీవితంలో మరచిపోలేని ట్రిప్'– అని ఆనందంగా చెబుతుంది శృతి.

తన పిల్లల ఎడ్యుకేషన్‌లో ఆయన ఎక్కువ కేర్ తీసుకోలేదు. కానీ గ్రాండ్ చిల్డ్రన్ విషయంలో ఎక్కువ కేర్ తీసుకొనేవాడు. వాళ్ళు ఏం చదువుతున్నారు? ఎలా చదువుతున్నారు? అన్నీ పట్టించుకొనేవాడు.

బాబా – పేరులో ఏముంది?

చిన్నస్వామిరాజును వాళ్ళ మనవలు, మనవరాళ్ళు అందరూ 'బాబా' అని పిలుస్తారు. ఎవరూ 'తాతా' అనో 'grandpa' అనో పిలవరు. ఎందుకలా?

ఆయన మొదటి మనవడు గౌతమ్ మొదలుపెట్టాడు ఇలా పిలవటం. గౌతమ్ చేత అలా పిలిపించింది వాళ్ళ అమ్మమ్మ ఇందిర.

వాళ్ళ ఇంటి పక్కన నార్త్ ఇండియన్స్ వుండేవాళ్ళు. వాళ్ళ పాప రాజుగార్ని 'బాబాజీ... బాబాజీ' అని పిలిచేది.

ఇందిర కొంచెం ఆధునిక భావాలున్న మహిళ. ఆమెకు మనవడు 'తాతా' అని పిలవడం ఇష్టం లేదు. అందుకనే గౌతమ్ చేత 'బాబా' అని పిలిపించింది. అది అలా కంటిన్యూ అయిపోయింది. ఆయన స్వంత మనవలే కాదు. మొత్తం కుటుంబంలోని పిల్లలందరూ ఆయన్ని బాబా అనే పిలుస్తారు.

ఆయనకు ఇష్టమే అలా పిలిపించుకోవడం.

ఆయనకు 'సివిల్ సర్వీస్' అంటే ఇష్టం. బహుశా ఆయన కాలంలో సివిల్ సర్వెంట్లకున్న పవర్, దర్జా, దర్పం ఆయన్ను ఆకర్షించి వుండవచ్చు. తన మనవళ్ళు, మనవరాళ్ళల్లో ఎవరైనా సివిల్ సర్వెంట్లు అవుతారేమో అని ఆయన ఆశ. అవ్వాలని ఆయన కోరిక. కానీ పిల్లలెవరికీ అటువంటి యాంబిషన్ లేదు. 'ఆ విషయంలో ఆయన కొంత నిరాశకు గురయ్యారు. ఆయన చదువుకోలేదు కాబట్టి, మా ద్వారా ఆ కోర్కెలు నెరవేర్చుకోవాలనుకొన్నారు. మేం ఆయన కోర్కెను నెరవేర్చలేకపోయాం' అంటాడు చైతన్య.

చదువు విషయంలో ఆయన నుంచి శృతికి మంచి ప్రోత్సాహం లభించింది. వాళ్ళ కమ్యూనిటీలో ఆడపిల్లలు అంతగా పెద్ద చదువులు చదవకపోయినా, ఆయన మాత్రం శృతిని పెద్ద చదువులు చదివేందుకు ప్రోత్సహించాడు.

'మాకు బెస్ట్ ఎడ్యుకేషన్ ఇవ్వడానికి బాబా ఎంతో ప్రయత్నించేవాడు. చాలాసార్లు మా పేరెంట్స్‌కన్నా బాబానే ప్రోగ్రెసివ్‌గా ఆలోచించేవాడు' అంటుంది శృతి.

అయితే ఆయనతో గడపడం కొన్నిసార్లు కొంత ఇబ్బందికరంగా వుండేది పిల్లలకు.

'గ్రాండ్ పేరెంట్స్ తలుపు తీసుకొని లోనికి ప్రవేశించగానే క్రమశిక్షణ కిటికీలోంచి పారిపోతుంది' అంటాడు గార్డన్ నాష్. కానీ చిన్నస్వామిరాజు విషయంలో ఇది కరెక్టు కాదు. ఆయన లోనికి ప్రవేశించగానే క్రమశిక్షణ కూడా ఆయన వెంట వస్తుంది.

ముఖ్యంగా డబ్బు విషయంలో, ఖర్చు పెట్టే విషయంలో పిల్లలకు ఎక్కువ స్వేచ్ఛనిచ్చేవాడు కాదు. ఎంత వరకు అవసరమో అంతే. 'మేము ఏది పడితే అది కొనుక్కోవడానికి వీలు లేదు. ఆ విషయంలో ఆయన స్ట్రిక్టు. ప్రతిదానికీ ఒక రేషన్ వుండేది. ఒక బౌండరీ లైన్ వుండేది. దాన్ని దాటిపోవడానికి లేదు మేం. ఉదాహరణకు నేను బైక్ కావాలని అడిగాననుకో– 'నువ్వే సంపాదించి కొనుక్కో' అనేవాడు. మేమెప్పుడైనా హోటల్‌కెళ్ళినా టిప్ విషయానికి వచ్చేసరికి 'మా నాన్న పేదవాడు. మీ నాన్న రిచ్ కాబట్టి టిప్ విషయం మీరే చూసుకోండి' అనేవాడు మా తాతయ్య' అంటాడు కౌశిక్.

అయితే పిల్లలు క్రమశిక్షణ విషయంలో కొంత ఇబ్బంది పడ్డా, పోనుపోనూ ఆయన్ను అర్థం చేసుకున్నారు. ఆయన కూడా మూర్ఖంగా క్రమశిక్షణనూ, దుబారా వ్యతిరేకతనూ వాళ్ళ మీద రుద్ద లేదు. వాళ్ళకు తన గత జీవితంలో తాము ఒక అణా కోసం కూడా ఎంత కష్టపడిందీ, డబ్బు అంటే కేవలం నోట్లు కాదనీ, వాటి వెనక శ్రమ వుంటుందనీ వాళ్ళకు చెప్పేవాడు.

ఆయనకు ఎక్కువ మాట్లాడే అలవాటు లేదు. పిల్లలతో కూడా అంతే. తక్కువగానే మాట్లాడేవాడు. అయితే ఉపయోగపడే మాటలే మాట్లాడేవాడు. ఆయనిచ్చే సలహాలు వాళ్ళకు బాగా వుపయోగపడేవి.

'మా మొత్తం కుటుంబంలో బిజినెస్‌కు సంబంధించి మంచి సలహాలు ఆయనొక్కడే ఇవ్వగలడు. నేను మా నాన్న దగ్గర కూడా సలహాలు తీసుకోను. కానీ బాబా దగ్గర తీసుకొంటాను. ఆయన సలహాలు నాకెంతో హెల్ప్ చేస్తాయి'– అంటాడు గౌతమ్.

పిల్లల్ని తన బిజినెస్‌లోకి తీసుకురావాలని ఆయనకు చాలా కోరిక. వాళ్ళకు తన ఆధ్వర్యంలో 'ఆన్‌హ్యాండ్స్ ట్రెయినింగ్' ఇవ్వాలని కోరుకునేవాడు. అందుకే తన పెద్ద మనవడు గౌతమ్‌ని తీసుకెళ్ళి హోటల్ చాళుక్యలో పెట్టాడు. అతను క్రింది స్థాయి నుంచి పనులు నేర్చుకోవాలని ఆదేశించి, అందుకు తగిన ఏర్పాట్లు చేశాడు.

అయితే గౌతమ్ వాళ్ళమ్మ రేవతికి తన కొడుకు అలా ఒక మామూలు వర్కర్‌లా పని చేయడం కష్టంగా తోచింది. దాంతో అతను పనికి నిల్చిపోయాడు. ఆ విషయం తల్చుకొని బాధపడతాడు చిన్నస్వామిరాజు. ఆ సందర్భంగా 'వర్క్ నేర్చుకుంటేనే యజమాని అయ్యేది. వర్క్ నేర్చుకోకుండా యజమాని ఎలా అవుతాడు?' అని ప్రశ్నిస్తాడు.

పనిపట్ల ఆయన ఫిలాసఫీ వేరు. పనిలో చిన్నా, పెద్ద తారతమ్యం వుండకూడదు. పనిని ప్రేమించాలి తప్ప, అది తక్కువ పని అనుకోకూడదు. 'యజమాని అయినా అవసరం వస్తే ఒక లేబర్‌లా పని చేయాలి. నేను ఇప్పటికీ కన్‌స్ట్రక్షన్‌లో ఒక కూలివాడితో సమానంగా పని చేస్తాను' అంటాడు ఆయన.

ప్రస్తుతం ఆయన తన ఇద్దరు మనవలు– కార్తిక్, కౌశిక్‌లకు తన దగ్గర ట్రెయినింగ్ ఇస్తున్నాడు. కార్తిక్‌ను కాలేజీల్లో, కౌశిక్‌ను హోటళ్లలో పని చేయిస్తున్నాడు.

ఎక్కువ భాగం ఆయన వాళ్ళని తనతో పెట్టుకుంటాడు. తన పనిని గమనించమంటాడు. వివిధ విషయాల్లో తన వ్యవహార శైలిని గమనించమంటాడు.

అయితే ఇక్కడొక ఇబ్బంది వుంది. ఆయన తన సుదీర్ఘ అనుభవంతో పని చేస్తాడు. అందువల్ల ఆయన పద్ధతులు వాళ్ళకు సులభంగా అర్థం కావు. అయితే ఆ విషయాల్ని గూర్చి ఆయన్ను అడిగితే, 'చెప్పిచ్చి నేర్చుకొనేకన్నా– మంచిదో, చెడ్డదో వాళ్ళే పడి లేయాలని నా అభిప్రాయం' అంటాడు.

అయితే మీ పద్ధతుల గురించి వాళ్ళతో చర్చించాలి కదా? కనీసం ప్రతి రోజూ రాత్రి, ఆ రోజు చేసిన పనుల గురించీ, వాళ్ళు ఏమి గమనించారో వాళ్ళతో చర్చించడం వల్ల వాళ్ళు మరింత బెటర్‌గా నేర్చుకో గలుగుతారు కదా? లేకుంటే మీ పద్ధతులు అర్థంకాక, వాళ్ళకు బోరుకొట్టి, మీ నుంచి వీలైనంత వరకు ఎస్కేప్ అవ్వాలనుకొంటారు కదా' అంటే ఆయన, 'ఒక యాంగిల్‌లో నువ్వు చెప్పేది కరెక్టే. నీ సజెషన్‌ను తీసుకొంటే మంచిదే. కానీ ఈ వయసులో అది చేస్తానా అని చూడాలి.' అని కాసేపాగి, 'ట్రై చేస్తాను. అట్‌లీస్ట్, మా మనవళ్ళకు చెప్పేందుకు ట్రై చేస్తాను' అన్నాడు.

ఆయన మా తాతయ్య కాదు

– కౌశిక్ (మనుమడు)

తాతయ్య అంటే ఎలా వుండాలి?

తాతయ్య అంటే 'పని' నుంచి రిటైర్ అయివుండాలి. ఉద్యోగాలు, వ్యాపారాలు చేయకూడదు.

తాతయ్య అంటే ఇంటి పట్టున కూర్చుని మనవలు, మనవరాళ్ళతో ఆడుకోవాలి. వాళ్ళకి కథలు చెప్పాలి. వాళ్ళతో కలిసి కేరింతలు కొడుతూ, పిల్లల్లో కలసిపోయే పిల్లవాడు అయిపోవాలి.

తాతయ్య అంటే అన్నిట్లో వేలు పెడుతూ, ఉచిత సలహాలు ఇస్తూ, కొడుకులూ, కూతుర్ల విసుగుకు గురవుతూ, వాళ్ళ చేత చివాట్లు తింటూ వుండాలి.

'ముసలోడా– మాట్లాడకుండా వొక మూల కూర్చో. వేళకింత పెడతాము. తిని నిద్రపో'– అంటే సణుక్కుంటూ వుండాలి కదా తాతయ్య అంటే.

తాతయ్య అంటే గతంలో కదా జీవించాలి.

కానీ మా బాబా– అదే మా తాతయ్య చిన్నస్వామిరాజులో మాత్రం పైన చెప్పిన తాతయ్య లక్షణాల్లో వొకటి కూడా లేదు.

ఆయన మా అందరికన్నా యాక్టివ్‌గా వర్క్ చేస్తారు. ఆయన ఎనర్జీలో 10వ వంతు కూడా లేదు మాలో.

ఆయన కథలు చెప్పరు మాకు. సలహాలు చెబుతారు. పని నేర్పుతారు.

ఆయన్ను ఎవరూ కంట్రోల్ చేయరు. ఆయనే అందర్నీ కంట్రోల్ చేస్తారు. ఆయన గతాన్ని తల్చుకుంటూ కూర్చోరు. వర్తమానంలో బతుకుతాడు.

ఆయన పిల్లవాళ్ళల్లో పిల్లవాడు– కానీ ఆటపాటల్లో కాదు, పనిలో. ఆయన రిటైర్డ్ తాతయ్య కాదు. రోజుకు 16 గంటలు పని చేసే 'వర్కింగ్ తాతయ్య'

ఆయన మా కుటుంబంలో 80 ఏళ్ళ యంగ్‌మ్యాన్. అవర్ ఆల్‌టైమ్ ఇన్‌స్పైరర్.

ఆయన దగ్గర మనువళ్ళు ఫేస్ చేసే ఇబ్బంది మరొకటి వుంది. పదిమందిలో వాళ్ళను తీసి పారేసేటట్లుగా మాట్లాడటం. 'వీళ్ళుత్త సోంబేరులు. కొంచెం పని చేయగానే అలసిపోతారు' వంటి మాటలతో వాళ్ళను ఎత్తి పొడిచినట్లుగా మాట్లాడే అలవాటు వుంది ఆయనకు. పిల్లలు చాలాసార్లు వాటిని పాజిటివ్ స్పిరిట్‌తో తీసుకోవడానికే ట్రై చేస్తారు.

అయితే కొన్నిసార్లు ఇబ్బంది పడుతారు. 'చాలా మందితో ఆయన నా మనవడు ఇలా– అలా అని చెబుతాడు. నేను టెన్నిస్ ఆడటం టైమ్ వేస్ట్ అంటాడు. నా బలహీనతలేవైనా వుంటే, వాటిని ఎత్తి

చూపడం మంచిదే. అయితే, వేరే వాళ్ళముందు అలా అనటం వల్ల కొన్నిసార్లు డీమోరలైజ్ అవుతాం కదా. మనం ఇంత బాగా ప్రయత్నిస్తున్నాం కదా? బాబా నా సిన్సియర్ ప్రయత్నాన్ని గుర్తించడేంటి? అనిపిస్తుంది' అంటాడు కౌశిక్.

ఇదే విషయాన్ని చిన్నస్వామిరాజును అడిగితే, 'నిజమే నేను అలా ప్రవర్తించినపుడు వాళ్ళు హర్ట్ అవుతారు. నాక్కూడా తర్వాత అనిపిస్తుంది' అని నిజాయితీగా ఒప్పుకొంటారాయన.

అయితే వీటన్నిటి వెనుకా పిల్లలపట్ల ఆయనకున్న అపారమైన ప్రేమాభిమానాలే కనిపిస్తాయి. వాళ్ళకు చిన్న ఇబ్బంది వచ్చినా ఆయన బాధపడుతాడు. 'కార్తిక్‌కి ఆరోగ్యం బాగాలేనపుడు ఆయన చాలా బాధపడ్డాడు. He really worried a lot' అంటాడు కౌశిక్.

పిల్లలు కూడా అంతే. ఆయనంటే చాలా కన్‌సర్న్ వుంది వాళ్ళకు. ఆయన పేరు ప్రతిష్టలకు తగినట్టుగా తాము జాగ్రత్తగా మెలగాలి అనుకుంటారు వాళ్ళు.

'మనం చిన్నస్వామిరాజుకు మనవలం– మనకున్న లిమిట్స్‌ను దాటకూడదు' అని పిల్లలు ఎప్పుడూ జాగ్రత్తగా వుంటారు. లేకుంటే, ఇంత మనీ, పవర్ వున్నదానికి, వాళ్ళు చెడిపోయేవాళ్ళు. ఆయన ప్రత్యక్షంగా, పరోక్షంగా వాళ్ళ జీవితాల్ని ప్రభావితం చేస్తున్నాడు.'– అంటుంది చిన్నస్వామిరాజు కూతురు రేవతి.

తన తదనంతరం తన వ్యాపార సామ్రాజ్యపు భవిష్యత్తు గూర్చి ఆయన్ను అడిగితే, 'రెండవ జనరేషన్ నాశనం చేసేది తక్కువ. ఎందుకంటే వాళ్ళకు ఎంతో కొంత మొదటి జనరేషన్ పడిన కష్టాలు తెలుసు. కాబట్టి కొంచెం జాగ్రత్తగా వుంటారు. అయితే ప్రమాదం అంతా మూడవ జనరేషన్ నుంచే వుంటుంది. వాళ్ళకు రూట్స్‌తో సంబంధం వుండదు. అనేక డీవియేషన్స్ వుంటాయి. అందుకే ఎక్కువ భాగం మూడవ జనరేషన్ వాళ్ళే నాశనం చేస్తారు' అంటాడు చిన్నస్వామిరాజు.

ఆ విధంగా ఆయన తన గ్రాండ్‌చిల్డ్రన్ పట్ల కొంత సందేహాస్పదంగా వున్నారు. అయినా వాళ్ళ మీద నమ్మకం కూడా వుంది. 'చూదాలి. ఇంకా పిల్లలే కదా' అంటాడు.

ఇవన్నీ పక్కన పెడితే ఆయన జీవితాన్ని పిల్లలు మరింత వెలుగుతో నింపారు. ఆయన అనేక విషయాల్లో సంతృప్తికరమైన వ్యక్తి (Contented Man). పిల్లల విషయంలో కూడా అంతే.

5. ఇంటర్వ్యూ
విత్
చిన్నస్వామిరాజు

హాబీలు

ప్ర. మీకు నచ్చే రంగులు? నచ్చనివి?

జ. తెలుపు నచ్చుతుంది. నలుపు, ఎరుపు నచ్చవు. నలుపు మాకు అచ్చిరాదని మా పెద్దలు చెప్పారు. నా సూట్స్ కూడా ఎక్కువ భాగం తెల్ల రంగువే.

ప్ర. ఎలాంటి ఆహారం ఇష్టం?

జ. చిన్నపుడు పులుసన్నం ఇష్టం. మా ఇంట్లో చేసే పప్పు పులుసు ఇష్టం. మా అమ్మ చేసే సంగటి బాగా తినేవాడ్ని. నాన్ వెజ్‌లో చికెన్ ఇష్టం. ఈ మధ్య ఫిష్ కూడా తింటున్నా. కరవాడు ఇష్టం. ఒకప్పుడు స్వీట్లు చాలా ఇష్టం.

ప్ర. సంగీతం అంటే ఇష్టమా?

జ. ఒకప్పుడు ట్రాన్సిస్టర్ పెట్టుకుని పాటలు వినేవాడ్ని. ఇప్పుడు అలవాటు లేదు.

ప్ర. పువ్వులు, ప్రకృతి వంటి వాటిని ఎంజాయ్ చేస్తారా?

జ. అట్లా ఏమీ లేదు. అంత టైమ్ లేదు.

ప్ర. పిల్లలంటే ఇష్టమా?

జ. అవును. చిన్నపుడు మా అన్న కూతురు పద్మ అంటే ఇష్టం. తర్వాత నా మనమలు – మనవరాళ్లు అంటే ఇష్టం. టైమున్నపుడు వాళ్ళతో ఆట్లాడుకోవడం కూడా కద్దు.

ప్ర. మీరు టీ.వి. చూస్తారా? ఏ ప్రోగ్రాంలు చూస్తారు?

జ. చూస్తాను. WWF అంటే ఇష్టం. సీరియల్స్ చూడను. బోరు. తెలుగు సినిమాలు చూస్తా.

ప్ర. ఈ మధ్యకాలంలో ఏయే సినిమాలు చూశారు?

జ. పేర్లు గుర్తు లేదు. లక్ష్మి, పోకిరి, స్టాలిన్, మాస్ సినిమాలు చూశాను.

ప్ర. సినిమాలు చూసి ఎప్పుడైనా ఏడ్చారా?

జ. లక్ష్మీ సినిమా చూసి కన్నీళ్ళు వచ్చాయి. కుటుంబం కోసం అతను పడిన బాధ చూసి కన్నీళ్ళు వచ్చాయి. స్టాలిన్ సినిమా చూసినపుడు కూడా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎవరైనా దుఃఖ పడితే కన్నీళ్ళు వస్తాయి.

ప్ర. ఏ సమయంలో ఎక్కువగా టీ.వి. చూస్తారు?

జ. రాత్రుళ్ళు. స్లీప్ టైమ్ పెట్టుకొని నిద్రపోతాను. టీ.వి. సౌండ్స్ వుంటేనే నిద్ర వస్తుంది. ఒక్కోసారి రాత్రుళ్ళో మెలకువ వస్తే, ఇంక నిద్ర రాదు. అటువంటప్పుడు కూడా టీ.వి. చూస్తుంటా.

ప్ర. మీకు సిగరెట్టు, మందు తాగే అలవాటుందా?

జ. ఒకప్పుడు సిగరెట్లు బాగా తాగేవాడ్ని. లారీ తోలేటపుడు నిద్ర మేలుకోవడానికి అలవాటు అయింది. పొగాకు కూడా వేసేవాడ్ని అప్పుడు. ఎప్పుడన్నా ఫ్రెండ్స్ చుట్ట యిచ్చినా తాగే వాడ్నే. మా మనవడు సిగరెట్ నోట్లో పెట్టుకొనేవాడు. అది చూసి నేను సిగరెట్ తాగడం ఆపేశాను. పదేళ్ళ ముందు వరకు ఎప్పుడైనా ఒకసారి స్మోక్ చేసే వాడ్ని. పదేళ్ళ నుంచి పూర్తిగా ఆపేశాను. మందు అలవాటు ఎప్పుడూ లేదు.

కలలు

ప్ర. మీకు కలలు వస్తాయా?

జ. విపరీతంగా వస్తాయి. కలలు రాని దినం లేదు. దాదాపు 50 ఏళ్ళ నుంచీ రోజూ కలలు వస్తాయి. రాత్రుళ్ళు ఎక్కువ వస్తాయి. ఎపుడో ఒకసారి మధ్యాహ్నం పడుకొన్నా వచ్చేస్తాయి కలలు.

ప్ర. ఎలాంటి కలలు వస్తాయి?

జ. సంబంధంలేనివి. Unconnected కలలు వస్తాయి. పాములు, ఏనుగులు, కుక్కలు, గొడవలు, భూకంపాలు, నేను హాజరయిన మీటింగులు– ఇలా అనేక రకాల కలలు వస్తాయి.

ప్ర. కలలకు సంబంధించి మీకు ఎలాంటి సెంటిమెంట్లు వున్నాయి?

జ. నాకు కలలో పెళ్ళి కనిపిస్తే, నిజ జీవితంలో చావు వార్త వింటాను. ముఖ్యంగా తెల్లవారుఝాము 3గం॥ సమయంలో వస్తే.

ప్ర. ఈ కలలకు కారణాలు తెలుసా మీకు?

జ. నేను కూడా యోచిస్తాను. కానీ కారణాలు తెలియవు.

ప్ర. కలల్లో రంగులు కనిపిస్తాయా?

జ. ఏమో గమనించలేదు.

భక్తి

ప్ర. దేవుడ్ని పూజిస్తారా? ఏం కోరుకుంటారు?

జ. ఒకటి రెండు నిమిషాలు పూజ చేస్తాను. 'పోయిన పని మంచిగ జరగనీయబ్బా– తొందరలేకుండా' అని కోరుకుంటాను.

ప్ర. దేవుడు ప్రత్యక్షమైతే ఏం వరం కోరుకుంటారు?

జ. మా వాళ్లందర్నీ బాగా చూసుకోమని అడుగుతాను.

ప్ర. దేవుడ్ని 3 ప్రశ్నలు వేసే అవకాశం వస్తే ఏ ప్రశ్నలు వేస్తారు?

జ. నేను ఏ ప్రశ్నల్నీ అడగను. ఆ అవసరం లేదు.

ప్ర. స్వాముల గురించి, బాబాల గురించీ మీ అభిప్రాయం ఏమిటి?

జ. వాళ్ళతో మాట్లాడుతాను. కానీ వాళ్ళ మీద అంత ఎక్కువ భక్తి లేదు. కర్మను ఎవరూ మార్చలేరు. ఈ స్వాములు కర్మను ఫేస్ చేసే శక్తిని ఇవ్వగలరు. మనశ్శాంతి వుంటుంది.

కర్మ సిద్ధాంతం

ప్ర. మీరు 'విధి'ని నమ్ముతారా?

జ. అవును. మనిషి చేతిలో ఏదీ లేదు. మన తలరాత ముందే రాసి పెట్టబడి వుంటుంది. ఒకసారి రాసేశాక, రాసిన ఆ దేవుడు కూడా మార్చలేడు. శాంతి చేయడాలు, స్వాముల దగ్గరికి వెళ్లడం– ఇవన్నీ కూడా మన తలరాతను మార్చలేవు. ఇవన్నీ కొంత ఉపశమనాన్ని ఇస్తాయి. మన కర్మను ఎదుర్కొనే శక్తిని ఇస్తాయి. అంతే.

ఒక సంఘటన చెబుతాను. మా బావమరిది కొడుకు ఉడిపి దగ్గర ఒక పెళ్ళికి వెళ్ళాడు. ఫ్రెండ్స్ కార్లో వెళ్ళారు. వీడు బస్సెక్కేందుకు బస్టాప్‌కు వెళ్ళాడు. ఫ్రెండ్స్ ఎక్కడెక్కడో తిరిగి, బస్సెక్కబోతున్న వీడి దగ్గరకొచ్చి వీడ్ని తమ కారులో ఎక్కించుకొని వెళ్ళారు. పోతా పోతా యాక్సిడెంట్ అయ్యి చనిపోయాడు. ఆ రోడ్లో చనిపోవాలని ముందే రాసిపెట్టి వుంది. దాన్ని ఎవరూ తప్పించుకోలేరు.

ప్ర. గత జన్మను నమ్ముతారా?

జ. నమ్ముతాను. గత జన్మలో నేను ఇంజనీరుగా పుట్టి వుంటాను. సగంలో చనిపోయి ఇప్పుడు పుట్టాను. ఆ నాలెడ్జ్ నాకు ట్రాన్స్‌ఫర్ అయింది. అందుకే ఏమీ చదువుకోకపోయినా, ఇంజనీర్లకే పాఠాలు చెప్పగల జ్ఞానం వచ్చింది నాకు.

ప్ర. వచ్చే జన్మలో ఎలా పుట్టాలనుకుంటున్నారు? మళ్ళీ చిన్నస్వామిరాజుగా పుట్టాలని లేదా మీకు?

జ. ఎందుకు మళ్ళీ అలా పుట్టడం? మంచి వాడుగా పుడితే చాలు.

స్త్రీలు

ప్ర. మీ జీవితంలో మీ విజయం వెనక ఏ స్త్రీ వుంది?

జ. ఏ స్త్రీ లేదు.

ప్ర. మీరు చూసిన గొప్ప స్త్రీలు ఎవరు?

జ. కనుమూరి బాపిరాజు భార్య అన్నపూర్ణమ్మ. ఆమె సమాజసేవ బాగా చేస్తుంది. ఆమె గురించి ముందుగా విన్నాను. తర్వాత ప్రత్యక్షంగా చూశాను. ఇంధిరాగాంధి, సోనియాగాంధీ గొప్ప లీడర్లు. ఇందిరాగాంధీ డిక్టేటర్‌షిప్‌తో పైకి వచ్చింది. స్ట్రాంగ్ లేడీ. ఏమీ లేకుండా సోనియా ఈ లెవెల్‌కు వచ్చింది.

ప్ర. మీరెప్పుడైనా ప్రేమించారా?

జ. పెళ్ళికాక ముందు ఒక అమ్మాయిని ఇష్టపడ్డాను. నా నక్షత్రం ప్రకారం స్త్రీలు లేరు నా జీవితంలో.

జీవితం – మృత్యువు

ప్ర. చావు గురించి మీకు భయం లేదా?

జ. లేదు. చావు ఎలా వస్తుందో, ఎప్పుడొస్తుందో తెలియదు. పడుకొంటే పోవచ్చు. నేను చావుకు ఎప్పుడైనా రడీ. కష్టపడకుండా పోవాలని మాత్రం కోరుకుంటాను.

ప్ర. 'త్వరలో చనిపోతానోమో' అనే ఫీలింగ్ ఎప్పుడైనా వచ్చిందా?

జ. కొన్నాళ్ళ క్రితం వచ్చింది. ఆరు నెళ్ళో, వన్ ఇయరో అంతే అనుకొన్నాను. కానీ అలా అనుకొని పదేళ్ళు దాటింది. ఇప్పుడా ఫీలింగ్ లేదు.

ప్ర. చనిపోయేలోగా మీరు తీర్చుకోవాల్సిన కోరికలు ఏవైనా వున్నాయా?

జ. ఏవీ లేవు. కోరికలూ లేవు, ఏ కొరతా లేదు. 'నా ఆస్తుల వివరాలు కొడుక్కి అప్పగించాలి' అనే టెన్షన్ కూడా లేదు. ఏది జరగాలనుంటే అది జరుగుతుంది.

ప్ర. మీరు జీవితంలో ఏం సాధించారు?

జ. సైకిల్‌తో మొదలై ఈ స్టేజికొచ్చాను. ఇంకా ఏం సాధించాలి?

ప్ర. మీరు జీవితంలో బాగా భయపడ్డ సందర్భాలు ఏవైనా వున్నాయా?

జ. నా భార్యకు మూడవ కాన్పు సిజేరియన్ ఆపరేషన్ అయింది. అప్పుడు ఆమెను హాస్పిటల్‌లో చేర్చాను. ఆ సమయంలో మా అన్న కూడా లేడు. కృష్ణప్ప అనే ఫ్రెండ్ తప్ప ఇంకెవరూ లేరు. చంద్రసాగర్ అనే ఆవిడ డాక్టర్. నా భార్యకు ఏమైనా అవుతుందేమో అని భయపడ్డాను 1963వ సం॥ అది. మొదటి భార్య కాన్పు సమయంలో కూడా హాస్పిటల్‌లో వున్నపుడు భయపడ్డాను.

ప్ర. బిజినెస్‌లో ఎప్పుడైనా భయపడ్డారా?

జ. లేదు.

ప్ర. బిజినెస్‌లో టెన్షన్ లేకుండా ఎలా వుంటుంది?

జ. టెన్షన్స్ వస్తాయి. వాటిని డీల్ చేస్తాను కానీ భయపడేది లేదు. నేను కూలిపని నుంచి ఇక్కడికొచ్చాను. అంతకన్నా ఇంక డౌన్ అవను కదా. ఎందుకు భయపడాలి? నిన్నకన్నా ఈ రోజు డౌన్ అయ్యానా అని చూస్తాను.
ఏదీ లేదన్నా నేను క్రింద పడుకునేందుకు కూడా వెనుకాడను.

మోసాలు – నష్టాలు

ప్ర. మీరెప్పుడైనా మోసపోయారా?

జ. మోసపోయాను. స్వంత బిడ్డకన్నా ఎక్కువగా నమ్మిన వాడే నన్ను మోసం చేశాడు.

ప్ర. అతనికి బుద్ధి చెప్పాలనుకోలేదా?

జ. అతనికి దేవుడే బుద్ధి చెప్పాడు. మాకు మోసం చేసిన వాడెవడూ సక్సెస్ కాలేదు.

ప్ర. మీరు సంపాదించింది పోతుందేమో అనే చింత లేదా?

జ. లేదు. నేను సంపాదించింది వున్నా, పోయినా నేను టెన్షన్ పడను. నేను తప్పు చేయడం వల్ల లాస్ అయితే మాత్రం బాధపడతాను. నా తప్పు లేకుండా పోతే 'పోవాలని వుంది పోయింది అనుకొంటాను.'

నన్ను మోసం చేసిన వాళ్ళని చూసినప్పుడు కూడా 'పూర్వజన్మలో వాళ్ళని నేను మోసం చేశానేమో' అనుకొంటాను.

ప్ర. మీ వల్ల ఎవరైనా నష్టపోయారా?

జ. నాకు తెలిసి ఎవరూ నష్టపోలేదు. ఎవరైనా నా దగ్గర ఎక్కువ ఆశించి, అది అందకపోతే నష్టపోయామని అనుకోవచ్చు.

ప్ర. మీకు ఎప్పుడైనా మీ జీవితం మీద విరక్తి కలిగిందా?

జ. నేను సహాయం చేసిన వాళ్ళందరూ నన్ను మోసం చేసిన వాళ్ళే. అలాంటప్పుడు బాధ కలుగుతుంది. అంతే తప్ప జీవితం మీద విరక్తి కలగలేదు.

విదేశాలు

ప్ర. ఏయే దేశాలు నచ్చాయి?

జ. చైనా. అక్కడ ప్రజలంతా హార్డ్ వర్క్ చేస్తారు. ఇక్కడ ఒక మగవాడు రోజుకు 6 షర్టులు కుడితే, చైనా స్త్రీ 26 షర్టులు కుడుతుంది. చైనా మనకన్నా 20 రెట్లు ఎక్కువ డెవలప్ అయింది. జపాన్ కూడా నచ్చింది. కొరియాలో 20 శాతమే ల్యాండ్ వుంది. అయినా ఫాస్ట్‌గా డెవలప్ అవుతూ వుంది. చాలా సింపుల్‌గా వుంటారు. వాళ్ళ ప్రెసిడెంట్ కూడా చాలా సింపుల్.

ప్ర. అమెరికా నచ్చిందా?

జ. నచ్చలేదు. డెవలప్‌మెంట్ బాగుంది. మనవాళ్ళకు మంచి అవకాశాలు వున్నాయి. కానీ ఏం లాభం? లైఫ్ ఏమీ లేదు. మనుషుల మధ్య సంబంధాలు లేవు.

రహస్యాలు

ప్ర. మీరు ఎవరికీ, ఎప్పటికీ చెప్పని రహస్యాలు ఏమైనా వున్నాయా?

జ. లేవు.

ప్ర. ఎవరికైనా మీరు చేయబోయే పనుల గురించి చెబుతారా?

జ. ఎవరికైనా ముందు చెబితే ఆ పని జరగదు. ఈ పని చేయబోతున్నా అని హ్యాపీగా ఎవరికైనా చెప్పాననుకో, ఆ పని ఫెయిలవుతుంది. అది నా అనుభవం.

విజయం – నేటి తరం

ప్ర. ఒక మనిషి జీవితంలో విజయం సాధించాలంటే ఏయే అంశాలుండాలి?

జ. హార్డ్ వర్క్ వుండాలి. అదొక్కటే చాలదు. స్టార్ వుండాలి. ఇది ఒక చక్రం. అప్స్ అండ్ డౌన్స్ వుంటాయి. డౌన్ దిగేటపుడు మనం దురహంకారంతో స్పీడ్‌గా పోయి మన ఎనర్జీని ఖర్చు పెట్టేస్తే మిట్ట ఎక్కేందుకు ఎనర్జీ వుండదు. అందుకే డౌన్ దిగే ప్రతి సారీ మిట్ట ఎక్కాల్సి వుంటుందని మర్చిపోకూడదు. దానికి ప్రిపేర్ కావాలి. బ్యాలెన్స్ చేసుకోవాలి.
ఎక్కువ మోసం, దగా చేయకూడదు. చేస్తే నడవచ్చు. కానీ లాంగ్ రన్‌లో నడవదు. హానెస్టీ అనేది వుండాలి. నీకు నువ్వు హానెస్టీగా వుండాలి. నీ ఆత్మే నీకు సాక్షి.

ప్ర. మీ జనరేషన్‌కీ, ఇవాళ్టి జనరేషన్‌కీ తేడా ఏమిటి?

జ. మాది డెవలప్‌మెంట్ జనరేషన్ కాదు. ఇప్పుడు డెవలప్‌మెంట్ జనరేషన్ వుంది. మాకు ఇన్ని అవకాశాలు లేవు. ఇప్పుడు చాలా అవకాశాలున్నాయి. బుద్ధి వుంటే ఎంత ఎత్తుకన్నా వెళ్ళచ్చు. మా జనరేషన్‌లో లైఫ్ సింపుల్. ఇప్పుడు చాలా కష్టం. మా జనరేషన్‌కు ఇన్ని టెన్షన్లు లేవు. ఇవాళ్టి జనరేషన్‌కు టెన్షన్లు ఎక్కువ.
మా జనరేషన్‌కు అది బెస్ట్. ఇప్పటి జనరేషన్‌కు ఇది బెస్ట్.

వృద్ధాప్యం

ప్ర. మీకు ఇంకా ఎక్కువ వయసయిపోయి లేవలేని పరిస్థితి వస్తే ఏం చేస్తారు?

జ. చివరి వరకు నేను ఎవరి మీద డిపెండ్ అవను. అది అవుట్ ఆఫ్ క్వశ్చన్. ఒక వేళ నా కొడుకు కోడలు తిండివెయ్యకపోతే వృద్ధాశ్రమంలో చేరిపోతాను.

ప్ర. ఎప్పుడైనా వృద్ధాశ్రమాలు చూశారా?

జ. హైదరాబాద్‌లో మా ఫ్రెండ్ పెట్టాడు. హరి వృద్ధాశ్రమం. ప్రతి సం॥ గాంధీ జయంతి రోజు 'ఆశ్రమం డే' జరుపుతారు. దానికి నేను హాజరవుతాను.

ప్ర. మీ చిన్నప్పుడు వృద్ధాశ్రమాలు వుండేవా?

జ. నాకు తెలిసి లేవు. అయితే అప్పుడు కూడా వృద్ధుల పరిస్థితి అంతే. అప్పుడొక కథ చెప్పేవాళ్ళు. ఒక ముసల్ది తన సంచిని ఎప్పుడూ దాచిపెట్టుకునేదట. ఎవరికీ అందులో ఏముందో చూపించేది కాదంట. చివరికి నిద్రపోయేటప్పుడు కూడా తల క్రింద పెట్టుకుని నిద్రపోయేదంట. ఆ సంచిలో నిజానికి ఏమీ లేదు. కానీ అందులో డబ్బు వుందనుకొని కోడలు తనకు తిండి పెడుతుందని ఆమె అలా చేసిందట.

ప్ర. మీకు తెలిసి వృద్ధులకు అనాదరణ జరిగిందా?

జ. లెక్కలేనంత మందికి. నాకు తెలిసిన చాలా మంది వి.ఐ.పి.లు కూడా వాళ్ళ చివరి రోజుల్లో

చాలా ఇబ్బంది పడ్డారు. కొడుకులు, కూతుర్లు పట్టించుకోరు. చిన్నస్వామి స్టేడియంకు పేరు పెట్టారు కదా– ఆ చిన్నస్వామి అయ్యంగార్ పరిస్థితి కూడా అంతే. చివరి రోజుల్లో చాలా మంది సఫర్ అవడం చూశాను.

ప్రభుత్వ సర్వీసులో, మంచి హోదా కలిగిన పదవిలో వుండి రిటైర్డ్ అయితే, అప్పటి వరకు వున్న పవర్‌పోతుంది. ఎవరూ అతన్ని పట్టించుకోరు. పిల్లలు నెగ్లెట్ చేస్తారు. భార్య కమాండ్ చేస్తుంది. అప్పుడతనికి డిప్రెషన్ వస్తుంది. అతనొక వేళ ఏదైనా సోషల్ సర్వీస్‌లో వుంటేనో, లేదా ఫ్రెండ్స్ వుంటేనో ఫర్వాలేదు. ఇవి లేని వాళ్ళకు ఒక్కసారిగా ప్రపంచం వుల్టా అయిపోతుంది.

యోగా

ప్ర. మీరు యోగా చేస్తారా?

జ. యోగాసనాలు వేస్తాను. ప్రాణాయామం చేస్తాను.

ప్ర. ధ్యానం చేస్తారా?

జ. లేదు. ధ్యానం చేస్తుంటే నేను చేసిన తప్పులన్నీ గుర్తుకొస్తాయి. సమస్యలన్నీ చుట్టుముడుతాయి. దేవుడి దగ్గర ఎక్కువ సేపు పూజ చేసినా అంతే.

ఇతరాలు

ప్ర. మీకు అహంకారం వుందా?

జ. లేదు. 'నాది', 'నా' అనే పదాల్ని నేనెప్పుడూ వుపయోగించను. 'మాది' అనే అంటాను. 'నాది' అని ఎవరైనా అంటే కూడా నాకు చిరాకు.

ప్ర. మీరు మళ్ళీ మీ గతంలోకి వెళ్ళగలిగారనుకోండి. అప్పుడు మీ గతంలో దేన్ని మారుస్తారు?

జ. నాకు అలా వెళ్ళే కోరిక కానీ, మార్చే కోరిక కానీ లేదు.

ప్ర. మీ మొత్తం 80 ఏళ్ళ జీవితంలో మీకు ఏ వయసు ఇష్టం?

జ. 20 నుంచి 30 యేళ్ళ మధ్యనున్న వయస్సు.

ప్ర. ఎందుకని?

జ. ఆ వయసులోనే బాగా కష్టపడేవాడ్ని. ఆ వయసు నాకు ఎప్పటికీ గుర్తుంటుంది. ఎవరికైనా ఆ వయసులో చేసే పనిని బట్టే వాళ్ళ ఫ్యూచర్ వుంటుంది.

ప్ర. మీకు పొగడ్తలంటే ఇష్టమా?

జ. పొగడ్తలకు పడే నైజం మా వంశంలోనే వుంది. ఈ విషయంలో మేము జాగ్రత్తగా వుండాలి. నన్ను ఎవరైనా praise చేస్తుంటే వాడు మనకు స్కెచ్ వేస్తున్నాడని తెలుస్తుంది నాకు.

ప్ర. మీ నుంచి ఏమీ ఆశించకుండా, మిమ్మల్ని అభిమానించేవాళ్ళు ఎవరైనా వున్నారా?

జ. ఇక్కడ వున్నారో లేదో కానీ, బయట మాత్రం చాలామంది వున్నారు. ఆంధ్రలో, రాజపాళ్యంలో, ఇతర చోట్ల. వాళ్ళే నా ఆస్తి.

ప్ర. జీవితానికి అర్థం ఏమిటి?

జ. అలాంటి ఆలోచన్లు చేయను.

ప్ర. మీకు 5 భాషలు వచ్చు కదా? ఏ భాషలో థింక్ చేస్తారు?

జ. తెలుగులోనే ఆలోచిస్తాను.

ప్ర. మీరు జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని సంఘటనలు ఏవి?

జ. నేను కష్టపడి పై కొచ్చిన సంఘటనలే నాకు గుర్తున్నాయి.

ప్ర. మీరు మీ జీవితంలో ఎప్పటికీ మరచిపోలేని ఇద్దరి పేర్లు చెప్పమంటే ఎవరిపేర్లు చెబుతారు?

జ. మా పెద్దన్న కుప్పరాజు. నాకు దారి చూపాడు. మా అత్త రామక్క. ఆమె లేకపోతే మా కుటుంబమే లేదు. వీళ్ళిద్దర్ని నేను ఎప్పటికీ మరచిపోలేను.

ప్ర. మీరు ఒక రూంలో వున్నారు. 10 రోజులు. మీకు టీ.వి. లేదు. పుస్తకం లేదు. ఫోన్ లేదు. మాట్లాడేందుకు మనుషులు లేరు. వేళకు ఆహారం వస్తుంది. టాయ్‌లెట్ వుంది. ఈ పదిరోజులు మీరు ఏం చేస్తారు?

జ. అలా వుంటే అకస్మాత్తుగా పిచ్చిపట్టిపోతుంది.

ప్ర. మీరు ఎడారిలో వున్నారు. మీతో ఒకరినే అనుమతిస్తారు. చనిపోయిన వాళ్ళని కూడా మీరు ఎంచుకోవచ్చు. ఎవరిని సెలెక్ట్ చేసుకుంటారు?

జ. నేను ఎవరినీ సెలెక్ట్ చేసుకోను. ఒకడినే వుంటాను.

ప్ర. రోజూ ఎన్ని గంటలకి నిద్ర లేస్తారు? ఎన్ని గంటలకు పడుకుంటారు?

జ. ఉదయం 3.50కి నిద్ర లేస్తాను. రాత్రి 9-10గం॥లకు పడుకొంటాను.

విమర్శ

ప్ర. మీరు మీకు కావాల్సిన దాన్ని నేరుగా అడగరు. కానీ ఎదుటి వాళ్ళు చేసేట్టుగా చేసుకొంటారు.

జ. అవును. నాకు అవసరమైన పనిని ఇతరుల దగ్గర చేయించుకోవడానికి ప్రయత్నం చేస్తాను.

ప్ర. మీరు వ్యాపారంలో లాభం తప్ప, ఇంకేమీ చూడరు. మనుషులకన్నా మీకు లాభమే ముఖ్యం.

జ. అవును. బిజినెస్‌లో నేను అలానే వుంటాను. అయితే ఏ విషయంలోనయినా మాట ఇస్తే మాత్రం, నష్టమొచ్చినా వెనకడుగు వేయను.

ప్ర. మీరు నియంత లాంటి వాళ్ళు. ఎదుటి వాళ్ళను డామినేట్ చేస్తారు.

జ. నిజమే. వ్యాపారంలో అలాగే వుంటాను.

ప్ర. ఎదుటి వాళ్ళను కించపరచే విధంగా మీ ప్రవర్తన వుంటుంది. మీ బాడీ లాంగ్వేజ్ ఎదుటి వాళ్ళను తీసిపారేసినట్టు వుంటుంది.

జ. నిజమే. వుండచ్చు. అది ఎదుటి వాళ్ళ ఫీలింగ్. నా లోపల అలా ఏమీ వుండదు.

ప్ర. మీరు ఎవరి దగ్గరా అప్పు తీసుకోరు. ఎవరికీ అప్పు ఇవ్వరు.

జ. అప్పు ఇవ్వను. ఎవరికైనా అవసరం వస్తే ఫ్రీగా ఇస్తాను. అప్పు తీసుకోవడం కూడా నాకు ఇష్టం లేదు.

ప్ర. మీరు వ్యాపారంలో రిస్క్ తీసుకోరు. మీ దగ్గర 100రూ॥లు వుంటే, 50రూ॥ల పనే చేస్తారు.

జ. అవును. రిస్క్ తీసుకొని ఫెయిలయితే ఇతరుల ముందు తల దించుకోవాలి. అది నాకు ఇష్టం లేదు.

ప్ర. మీకు కోపం ఎక్కువ. మీ దగ్గర పని చేసే వాళ్ళను తిట్టడం, ఒకప్పుడు కొట్టడం కూడా చేసే వాళ్ళు.

జ. నిజమే. సోమరిపోతుల్ని నేను సహించలేను.

ప్ర. మీ దగ్గర పని చేయాలంటే, సిద్ధ సమాధి యోగ చేస్తే తప్ప, మిమ్మల్ని తట్టు కోవడం కష్టం అని మీ దగ్గర చాలా సంవత్సరాలు పని చేసిన ఒక వ్యక్తి అన్నాడు. మీ కామెంట్ ఏమిటి?

జ. (గట్టిగా నవ్వి) ఎవడో పని చేయడం చేతకాని వాడు అలా అని వుండచ్చు.

ప్ర. తెలివైన వాళ్ళు మీ దగ్గర పనిచేయలేరు. అసమర్థులు మాత్రమే మీ దగ్గర పని చేయగలరు.

జ. కాదు. ఏమీ తెలియని వాళ్ళు పనిచేయగలరు. కానీ తెలిసీ తెలియని వాళ్ళు నా దగ్గర పని చేయలేరు. చాలా మంది ఇంజనీర్లు నా దగ్గర పనిచేయలేక పారిపోయారు.

ప్ర. భవిష్యత్తులో మీకు ఉపయోగపడతారు, మీ కంట్రోల్‌లో వుంటారు అనుకొనే వాళ్ళకు మాత్రమే మీరు సహాయం చేస్తారు.

జ. అవును. మా కంట్రోల్‌లో వుంటారు, పైకి వస్తారు అనుకొంటే, సహాయం చేస్తాను.

ప్ర. మీకు ఆస్తుల మీద వుండే ప్రేమ మనుషుల మీద లేదు.

జ. ఇది అబద్ధం. ఆస్తుల మీద ప్రేమ వుంటే నేను చాలా సంపాదించి వుండేవాడ్ని.

ప్ర. ఎంత గొప్ప పని చేసినా, ఎదుటి వాళ్ళను మీరు అభినందించరు. నోబుల్ ప్రైజ్ తెచ్చి మీకు చూపించినా, మీరు తీసిపారేస్తారు.

జ. పొగిడితే వాళ్ళు చెడిపోతారు. నేను ఎవరికైనా మేలు చేయాలంటే నేరుగా వాళ్ళను పొగడను. వాళ్ళ పరోక్షంలో పొగుడుతాను.

ప్ర. మీరు control freak. అంతా మీ అధీనంలోనే వుంచుకొంటారు.

జ. నిజమే. నేను నా కొడుక్కే చెక్ పవర్ ఇవ్వను. నా కొడుకైనా ఇదే విమర్శ పెడతాడు నా మీద.

ప్ర. మీ కమ్యూనిటీ వాళ్ళను మీరు ఉపయోగించుకొన్నారు. కానీ వాళ్ళకు మీరు సహాయ పడలేదు.

జ. 1956 నుంచి 1965 వరకు చిత్తూరు జిల్లాలో అనేక గ్రామాల నుంచి మా కమ్యూనిటీ వాళ్ళు బెంగుళూరు వచ్చి మా ఆశ్రయం పొందారు. ఆ తర్వాత వాళ్ళు అభివృద్ధి అయ్యారు. ఆ విమర్శలో నిజం లేదు.

ప్ర. మీ స్వంత వూరికి కూడా మీరు పెద్దగా సహాయం చేయలేదు. స్కూలుకు, గుడికి కేవలం 5 లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వుంటారు. అంతే.

జ. మా వూరికి త్రాగు నీరు అందిచ్చిన వాడ్ని నేనే. మా వూర్లో ప్రతి స్త్రీ నాకు చేతులెత్తి మొక్కుతుంది. ఎవడో తాగుబోతు పై విమర్శ చేసి వుంటాడు. నన్ను సహాయం అడగడానికి మా వూరి వాళ్ళకు నామోషీ. అడిగితే నేను కాదనను.

ప్ర. మీకు కులాభిమానం ఎక్కువ.

జ. ఇది తప్పుడు అభియోగం. నేను ఇతరులకే ఎక్కువ సహాయం చేస్తాను. అందుకే మా కాంట్రాక్టర్ల సంఘానికి గత 30 ఏళ్ళ నుంచి అధ్యక్షుడిగా వున్నాను.

ప్ర. మీరు డబ్బు ఖర్చు పెట్టరు అనే విమర్శ వుంది.

జ. అవును. అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టను. ఇవాళ్టి జనరేషన్ డబ్బును చాలా వృధాగా ఖర్చుపెడుతుంది. అనవసర ఆడంబరాలకు, మనకు అవసరం లేని వస్తువులకు డబ్బు ఖర్చుపెట్టడం చూస్తే బాధ వేస్తుంది. ఆ డబ్బు వుంటే ఎంతో మంది పేదలకు సహాయం చెయ్యవచ్చు కదా అనిపిస్తుంది.

ప్ర. మీ మీద విమర్శను మీరు భరించలేరు.

జ. అలా ఏం లేదు. విమర్శించే వాడ్ని పూజించాలి. అందరూ నన్ను మంచి వాడు అంటే నేను ఆకాశంలో కూర్చుంటాను. విమర్శించే వాడు వుంటే నేను జాగ్రత్తగా వుంటాను. దెబ్బ తింటేనే నొప్పి తెలుస్తుంది. లేకపోతే నొప్పి ఎలా వుంటుందో ఎప్పటికీ తెలియదు.

చిన్నస్వామిరాజు జీవితంలో ముఖ్య సంఘటనలు

1895 – అక్కలరాజు కుటుంబం తిరుమలరాజపురం నుంచి బెంగుళూరుకు వచ్చింది.

1898 – బెంగుళూరు పట్టణంలో ప్లేగు విరుచుకుపడింది.

1930 – చిన్నస్వామిరాజు జన్మించాడు.

1936 – చిన్నస్వామి స్కూల్లో చేరాడు.

1939 – కుప్పరాజు, వరదరాజ మొదలియార్ కాంట్రాక్టు వ్యాపారంలో భాగస్వామిగా చేరడం.

1940 – పాఠశాలకు శాశ్వతంగా నిలిచిపోయిన చిన్నస్వామి.

1942 – గ్లోబల్ హ్యాట్స్‌లో చిన్నస్వామి పనివాడుగా చేరటం.

1944 – చిన్నస్వామి, పెదనాన్న సుబ్బరాజుతో కలసి వాళ్ళ వూరు తిరుమలరాజపురం చేరటం.

1946 – తిరుమలరాజపురం నుంచి బెంగుళూరుకి వచ్చిన చిన్నస్వామిరాజు.

1947 – బిడదిలో మట్టి పనికి వెళ్ళిన చిన్నస్వామి.

1947 – కరువు. బిడది నుంచి బియ్యం, జొన్నలు అక్రమంగా బెంగుళూరుకు తీసుకు వచ్చిన చిన్నస్వామి, చామరాజు.

1948 – నుగు ప్రాజెక్టు నిర్మాణంలో పాల్గొన్న చిన్నస్వామి, నారాయణరాజు.

1949 – బెంగుళూరులో సిఐటిబి ఆధ్వర్యంలో నడచిన రోడ్డు నిర్మాణ పనులకు ఇన్‌ఛార్జ్‌గా చిన్నస్వామి.

1954 – బి.ఇ.ఎల్ క్వార్టర్ల నిర్మాణం.

1954 – చిన్నస్వామి – సుబ్బమ్మల పెళ్ళి.

1955 – చిన్నస్వామి భార్య సుబ్బమ్మ మరణం.

1956 – చిన్నస్వామి – ఇందిరల పెళ్ళి.

1956 – హెచ్.ఎ.ఎల్ లో రోడ్డు నిర్మాణం, క్వార్టర్ల నిర్మాణం.


1958 – హెబ్బాళ్‌లో వెటర్నరీ కాలేజీ నిర్మాణం.

1961 – రాజాజీనగర్‌లో ఇ.ఎస్.ఐ హాస్పిటల్ నిర్మాణం.

1962 – ఇండో – చైనా వార్‌లో పాల్గొనేందుకు కొత్తగా రిక్రూట్ అయిన సైనికులకు టాయ్‌లెట్ల నిర్మాణం.

1964 – కుణగల్‌లో అక్వాడక్ట్ నిర్మాణం.
1965 – దొమ్మలూరులో మిలిటరీ క్వార్టర్ల నిర్మాణం.
1966 – ఐరన్ ఓర్‌ను రవాణా చేసిన చిన్నస్వామిరాజు.
1967 – చిన్నస్వామి హైదరాబాద్‌కు వెళ్ళటం.
1967 – హైదరాబాద్‌లో డి.ఎమ్.ఆర్.ఎల్. భవనాల నిర్మాణం.
1969 – హైదరాబాద్‌లో ఇండో – నిప్పాన్ భవన నిర్మాణం.
1969 – దావణగెరె, బళ్ళారి, బీజాపూర్‌లలో ప్రభుత్వ ఆసుపత్రి భవనాల నిర్మాణం.
1970 – హైదరాబాద్ నుంచి తిరిగి బెంగుళూరుకు వచ్చేసిన చిన్నస్వామిరాజు.
1970 – చిన్నస్వామి స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభం.
1972 – బళ్ళారి, బెంగుళూరు, మైసూరు పట్టణాల్లో పైపుల ఫ్యాక్టరీల కొనుగోలు.
1974 – ఇందిరానగర్ బీడీఏ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం.
– నీలసంద్రలో బీడీఏ రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణం.
1977 – హోటల్ చాళుక్య ప్రారంభం.
1981 – కర్నాటక స్టేట్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్‌కు ప్రెసిడెంట్‌గా చిన్నస్వామిరాజు ఎన్నిక.
1982 – సన్‌రే కంప్యూటర్స్ ప్రారంభం.
1983 – హోటల్ కనిష్క ప్రారంభం.
– అఖిల భారత క్షత్రియ మహాసభల నిర్వహణ.
1986 – సర్ ఎమ్ విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభం.
1990 – చిన్నస్వామి రాజు షష్టిపూర్తి.
1996 – బిల్డర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియాకు జాతీయ అధ్యక్షుడిగా చిన్నస్వామిరాజు ఎన్నిక.
1997 – బిల్డర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ మహాసభలు.
1997 – బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరపున చిన్నస్వామిరాజు కొరియా టూరు.
2000 – షింషాలో ఏట్రియా హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రారంభం.
– ఏట్రియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభం.
2002 – శివసముద్రంలో ఏట్రియా హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రారంభం.
2004 – మండ్య జిల్లాలో ఏట్రియా బృందావన్ పవర్ ప్రాజెక్టు ప్రారంభం.
2007 – అఖిల భారత క్షత్రియ ఫెడరేషన్ జాతీయ ఛైర్మన్‌గా చిన్నస్వామిరాజు ఎన్నిక.
2008 – వైట్ ఫీల్డ్‌లో 'చాళుక్య రిసార్ట్స్' – ఫైవ్‌స్టార్ హోటల్ భవన నిర్మాణ పనులు ప్రారంభం.
2010–11 – చిన్నస్వామిరాజు జీవిత చరిత్ర 'బాబా' పుస్తకం విడుదల.
ఆయన మీద 'డాక్యుమెంటరీ ఫిలిం 'బాబా' విడుదల.

వంశవృక్షం


కుప్పరాజు - లక్ష్మమ్మ
అక్కలరాజు
(సుబ్బమ్మ)
సుబ్బరాజు
ఆడపిల్ల
(పేరు తెలీదు)
రామక్క
ఆడపిల్ల
(పేరు తెలీదు)
కుప్పరాజు
నారాయణరాజు
మంగమ్మ
చిన్నస్వామిరాజు
(ఇందిరమ్మ)
రుక్మిణమ్మ
సుందర్
(తేజోవతి)
రేవతి
(శ్రీనివాసరాజు)
కార్తిక్
కౌశిక్
సవిత్ర
గౌతమ్
శృతి
చైతన్య